సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 309
మంగళవారం 30-1-2024
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'



నంబర్‌వన్ బోపన్న
ఏటీపీ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో తొలిసారి టాప్‌లో భారత టెన్నిస్ స్టార్ - 14లో



బడ్జెట్ ముందు బుల్ దూకుడు
1,241 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్.. 21,700 స్థాయిపైకి నిఫ్టీ - 15లో



అర నిమిషంలో నిద్రపోతా
అధిక సమయం స్క్రీన్‌లకు అతుక్కుపోతే అది నిద్రపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని విద్యార్థులను ప్రధాని మోదీ హెచ్చరించారు.
వివరాలు 6లో ▸



సోరెన్ కోసం ఈడీ వెదుకులాట
భూకుంభకోణం కేసులో ప్రశ్నించేందుకు జార్ఖండ్ సీఎం హేమంత్ ఇంటికి వెళ్లిన ఈడీ అధికారులు అక్కడే పడిగాపులు కాస్తున్నారు.
వివరాలు 6లో ▸



డీప్‌ఫేక్ ఆందోళనకరం
ఏఐతో సృష్టిస్తున్న డీప్‌ఫేక్ ఫొటోలు, వీడియోల ధోరణి అత్యంత భయంకరమైనదని మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల అన్నారు.
వివరాలు 6లో ▸



మాల్దీవుల అధ్యక్షుడిపై అవిశ్వాసం
మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జుపై అవిశ్వాసం ప్రవేశపెట్టేందుకు మాల్దీవియన్ డెమోక్రాటిక్ పార్టీ సిద్ధమవుతోంది.
వివరాలు 6లో ▸



జనక్షేత్రంలో.. జేజేలు

ప్రజాదరణ మరింత పెరిగిందని తేల్చిన సీఎం జగన్ భీమిలి సభ

- చంద్రబాబు 15 సభలు ఒక ఎత్తు.. భీమిలి సభ ఒక్కటీ మరో ఎత్తు
- సంక్షేమ సారథిపై వెల్లువెత్తుతున్న ఆదరణ.. ఎన్నిక ఏదైనా ఏకపక్షమే
- గత ఎన్నికల్లో 50 శాతం ఓట్లతో 151 అసెంబ్లీ, 22 ఎంపీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం
- దేశ చరిత్రలో అత్యంత భారీ విజయం సాధించిన పార్టీగా రికార్డు
- మేనిఫెస్టో హామీల్లో 99.5 శాతం అమలు చేసి నిబద్ధత చాటుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- అర్హతే ప్రామాణికంగా పారదర్శకంగా సంతృప్త స్థాయిలో సంక్షేమ పథకాలు
- డీబీటీ, నాన్ డీబీటీ రూపంలో పేదలకు రూ.4.21 లక్షల కోట్ల మేర ప్రయోజనం
- పరిపాలన వికేంద్రీకరణ ద్వారా ఇంటి గుమ్మం వద్దకే సేవలన్నీ
- కేబినెట్ నుంచి నామినేటెడ్ వరకూ సామాజిక న్యాయానికి పెద్దపీట
- విప్లవాత్మక సంస్కరణలతో ప్రగతిపథంలో అగ్రభాగాన ఆంధ్రప్రదేశ్
- నాలుగున్నరేళ్లుగా సుపరిపాలనతో ప్రతి గ్రామం, ప్రతి ఇంట్లో మార్పు
- పంచాయతీ, మండల, జెడ్పీ, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయాలు
- తిరుపతి లోక్‌సభ, బద్వేలు, ఆత్మకూరు ఉప ఎన్నికల్లో వరుస విజయాలు
- 25కు 25 లోక్‌సభ స్థానాల్లోనూ 'ఫ్యాన్' సత్తా చాటడం తథ్యమన్న 'టైమ్స్ నౌ' సర్వే
- 2019కి మించి వైఎస్సార్‌సీపీ భారీ విజయం సాధించడం ఖాయమంటున్న విశ్లేషకులు

12లో

రాజ్యసభకు మోగిన నగారా

ఫిబ్రవరి 8న నోటిఫికేషన్
నామినేషన్ల దాఖలుకు తుది గడువు ఫిబ్రవరి 15
నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు ఫిబ్రవరి 20
ఫిబ్రవరి 27న పోలింగ్.. అదేరోజు ఓట్ల లెక్కింపు

- అసెంబ్లీలో సంఖ్యాబలాన్ని బట్టి చూస్తే ఈ మూడూ వైఎస్సార్‌సీపీకే
- దీంతో రాష్ట్ర కోటాలోని 11 స్థానాలు వైఎస్సార్‌సీపీ పరం
- రాజ్యసభలో ఉనికేలేకుండా పోనున్న టీడీపీ
- 41 ఏళ్ల ఆ పార్టీ చరిత్రలో రాజ్యసభలో టీడీపీకి సభ్యత్వం లేకుండా పోవడం ఇదే ప్రథమం

ఏప్రిల్ 2తో వేమిరెడ్డి, కనకమేడల, సీఎం రమేష్‌ల పదవీకాలం పూర్తి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వచ్చే ఏప్రిల్ 2న ఖాళీ కానున్న మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూలు జారీచేసింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 8న జారీచేయనుంది. నామినేషన్ల దాఖలుకు తుది గడువు ఫిబ్రవరి 15 కాగా.. ఫిబ్రవరి 16న నామినేషన్లను పరిశీలిస్తారు. వాటి ఉపసంహరణకు తుది గడువు ఫిబ్రవరి 20. పోలింగ్‌ను ఫిబ్రవరి 27న ఉ.9 గంటల నుంచి సా.4 గంటల వరకూ నిర్వహిస్తారు. ఓట్ల లెక్కింపును ఫిబ్రవరి 27న సా.5 గంటల నుంచి చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. గతంలో రాష్ట్ర కోటాలో రాజ్యసభకు ఎన్నికైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (వైఎస్సార్‌సీపీ), కనకమేడల రవీంద్రకుమార్ (టీడీపీ), సీఎం రమేష్ (బీజేపీ)ల పదవీకాలం ఏప్రిల్ 2తో పూర్తికానుంది. ఖాళీ కానున్న ఈ మూడు రాజ్యసభ స్థానాలకు ఈ ఎన్నికలు నిర్వహిస్తారు. ప్రస్తుతం శాసనసభలో ఉన్న సంఖ్యాబలాన్ని బట్టి చూస్తే ఈ మూడు రాజ్యసభ స్థానాలూ వైఎస్సార్‌సీపీ ఖాతాలోకి చేరడం ఖాయం. దీంతో రాష్ట్ర కోటాలో మొత్తం 11 స్థానాలూ వైఎస్సార్‌సీపీ పరమవుతాయి. అంటే.. ఏప్రిల్ 2 తర్వాత రాజ్యసభలో టీడీపీ ఉనికే లేకుండాపోతోంది. ఆ పార్టీ ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటివరకు

మిగతా 2వ పేజీలో ▶

ఫ్యాక్ట్‌చెక్

ఇంత వక్రీకరణా?

- మత్స్యకారుని మృతిపై 'ఈనాడు' వక్రభాష్యం
- మృతుడు మద్యం అక్రమ రవాణా కేసులో నిందితుడు
- పడవలో తెలంగాణ మద్యం తరలిస్తుండగా పట్టుకున్న సెబ్ పోలీసులు
- రోజూ పోలీసు స్టేషన్‌కు వెళ్లి సంతకాలు పెట్టాలని కోర్టు ఆదేశం
- ఆదివారం స్టేషన్‌కు వెళ్లని నిందితుడు.. చేపల వేటకు వెళ్లి అనుమానాస్పదంగా మృతి

10లో

రాష్ట్రంలో 30 మంది ఐపీఎస్‌ల బదిలీ



రాష్ట్రంలో 30 మంది ఐపీఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. అదనపు డీజీ(విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్)గా ఉన్న కుమార్ విశ్వజిత్‌ను అదనపు డీజీ (రైల్వేస్)గా నియమించింది. ప్రస్తుతం ఇంటెలిజెన్స్ సెల్(సీఐ) విభాగంలో ఐజీగా ఉన్న డాక్టర్ కొల్లి రఘురామిరెడ్డిని విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్ ఐజీగా బదిలీ చేసింది.

2లో

మళ్లీ 'పౌరసత్వ' రగడ!



సీఏఏను వారంలో అమలు చేస్తామని కేంద్ర మంత్రి శంతను ఠాకూర్ ప్రకటించడంతో తాజాగా ఈ అంశం దుమారం రేపుతోంది. 2019లోనే మోదీ సర్కారు సీఏఏ చట్టం చేసినా దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత, ఆందోళనలతో దాని అమలు వాయిదా పడుతూ వస్తోంది. కానీ సీఏఏ అమలుపై ఎన్డీఏ సర్కారు పట్టుదలగా ఉందని ఇటీవలి పరిణామాలు చెబుతున్నాయి.

6లో

కరెంటు చార్జీలు పెరగవు

ఈ ఏడాది కూడా విద్యుత్ వినియోగదారులకు ఊరట

- ఏపీఈఆర్సీకి డిస్కమ్‌ల ప్రతిపాదన
- సమానంగా రాబడి, వ్యయాలు
- గ్రీన్ పవర్, రైల్వే ట్రాక్షన్ సరఫరాపై స్వల్పంగా పెంపు
- విశాఖలో ప్రారంభమైన ఏపీఈఆర్సీ బహిరంగ విచారణ
- అభ్యంతరాలన్నీ పరిగణనలోకి తీసుకుంటామన్న చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి
- దేశంలో 7 డిస్కమ్‌లకు 'ఏ' గ్రేడ్.. అందులో 3 ఏపీవే



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో విద్యుత్తు వినియోగదారులకు వరుసగా రెండో ఏడాదీ శుభవార్త! 2024–25లో వినియోగదారులపై ఎలాంటి విద్యుత్తు భారం పడకుండా డిస్కమ్‌లు ప్రతిపాదనలు సిద్ధం చేశాయి. రాబడి, వ్యయాలు సమానంగా ఉన్నందున సాధారణ ప్రజలతో పాటు పారిశ్రామిక వర్గాలపై ఎలాంటి భారం లేకుండా పాత టారిఫ్‌లనే కొనసాగిస్తున్నట్లు మూడు డిస్కమ్‌లు తెలిపాయి. సోమవారం విశాఖపట్నంలోని ఏపీ ఈపీడీసీఎల్ కార్యాలయంలో ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, పీవీఆర్ రెడ్డి నేతృత్వంలో బహిరంగ వర్చువల్ విచారణ మొదలైంది. ప్రజాభిప్రాయ సేకరణలో ఏపీఈఆర్సీ అధికారులతో పాటు ఇంధనశాఖ, ట్రాన్స్‌కో, జెన్‌కో, ఈపీడీసీఎల్, సీపీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. విద్యుత్ సంస్థల ప్రతిపాదనలకు సంబంధించి

మిగతా 11వ పేజీలో ▶

విద్యార్థుల చేరికల్లో ఏపీ ఫస్ట్

సంస్కరణలతో స్కూళ్లలో పెరిగిన ఎన్‌రోల్‌మెంట్



- ఆ తర్వాత స్థానాల్లో ఉత్తరాఖండ్, పంజాబ్, యూపీ
- 2017తో పోలిస్తే 2021లో ప్రైమరీలో 18.4, అప్పర్ ప్రైమరీలో 13.4, ఎలిమెంటరీలో 16.5% పెరుగుదల
- 'అమ్మఒడి'తో పేదల పిల్లలందరూ స్కూళ్లలో చేరేలా ప్రోత్సాహం.. ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి

11లో

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు చుక్కెదురు

ఎమ్మెల్సీ రామచంద్రయ్యకు కూడా..



- అనర్హత పిటిషన్లలో తదుపరి చర్యలు నిలుపుదలకు హైకోర్టు నిరాకరణ
- వివరణకు గడువు పెంచేలా ఉత్తర్వులివ్వాలన్న అభ్యర్థనా తిరస్కృతి
- ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులివ్వడం సాధ్యంకాదు
- తేల్చిచెప్పిన న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్
- ప్రతివాదులకు నోటీసులు.. కౌంటర్ల దాఖలుకు ఆదేశం
- తదుపరి విచారణ ఫిబ్రవరి 26కి వాయిదా

- వివరాలు 12లో

టీడీపీ ముఠా ఎన్నికల దందాపై కేసు నమోదు



పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సహా పలువురిపై కేసు నమోదు

- మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు అనుమతితో ఎఫ్‌ఐఆర్
- నిందితుల్లో ఏ1గా ఏలూరి, నోవా అగ్రిటెక్ కంపెనీ ఉద్యోగులు
- సొంత కంపెనీ మాటున టీడీపీ ఎమ్మెల్యే అక్రమాలు
- దొంగఓట్లు, ఇతర అక్రమాలతో గెలిచారనే ఆరోపణలు.. ఏలూరిపై కేసును స్వాగతిస్తున్న ప్రజాస్వామిక వాదులు

10లో

డిజైన్లు ఆమోదిస్తే పనులు వేగవంతం

- పోలవరం ప్రాజెక్టు అథారిటీకి తేల్చిచెప్పిన రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు
- అంతర్జాతీయ నిపుణుల ఏజెన్సీని త్వరగా ఖరారు చేయాలని విజ్ఞప్తి
- యుద్ధప్రాతిపదికన ఖరారు చేస్తామన్న పీపీఏ సీఈవో

2లో



ఇదండీ జగత్



పారిపోతున్న వాళ్లను గేటు దగ్గర కాపుకాసి మరీ స్పీచ్‌లు ఇస్తున్నారు!!



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

యాచన మాని గౌరవంగా బతుకుతున్నా..



మాది పేద కుటుంబం. విజయనగరం జిల్లా బాడంగి మండలం వాడాడ దళితవాడలో నేను, మా ఆయన కూలి పనులు చేసుకుని జీవించేవాళ్లం. మాకు ఇద్దరు ఆడపిల్లలు. వాళ్లు చిన్న వయసులో ఉన్నప్పుడే మా ఆయన చనిపోయారు. ఆయన వారసత్వంగా వచ్చిన అరకొర ఆస్తితో వాళ్లను పెంచి, పెద్దచేసి పెళ్లిళ్లు చేశాను. వాళ్లకు భారం కాకూడదని తప్పనిసరి పరిస్థితుల్లో బతుకు తెరువుకోసం యాచన ప్రారంభించా. అప్పట్లో పింఛన్ వచ్చినా.. ఏ మూలకూ సరిపోయేదికాదు. దానికోసం కూడా ఎక్కడెక్కడికో వెళ్లాల్సి వచ్చేది. పడిగాపులు పడాల్సిన దుస్థితి. నాలుగేళ్ల కిందటి వరకు సిగ్గు విడిచి చుట్టుపక్కల గుడులు, గోపురాల ముంగిట యాచించేదాన్ని. వచ్చిన చిల్లరతో బతికేదాన్ని. జగన్‌బాబు వచ్చాక పింఛన్ పెంచారు. ఇంటికే వచ్చి తలుపు తట్టి ఇస్తున్నారు. ఇప్పుడు రూ.3 వేలకు పెంచారు. పొదుపు సంఘాల్లో ఉన్న మా కూతుళ్లు ఇద్దరూ వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాల ద్వారా అందుతున్న సొమ్ముతో కూరగాయలు అమ్ముకొని బతుకున్నారు. ప్రభుత్వం ఇస్తున్న అమ్మ ఒడి సాయంతో మనవరాళ్లు స్కూళ్లలో ఇంగ్లిష్ చదువులు చదువుతున్నారు. జగన్‌బాబు ఇచ్చిన పింఛన్‌తో యాచన మానుకొని గౌరవంగా బతుకుతున్నాను.

– బత్తిన అప్పమ్మ, వాడాడ
(గొట్టాపు త్రినాథరావు, విలేకరి, విజయనగరం అర్బన్)

నిలదొక్కుకుంటున్నాం..



రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు మావి. నేను, మా ఆయన ఏడేళ్ల క్రితం వరకు ఇతర ప్రాంతాల్లో వలస కూలీలుగా పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వాళ్లం. మాకు ఇద్దరు మగ పిల్లలు, ఒక ఆడపిల్ల. మా స్వగ్రామమైన శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం అరకబద్రకు వచ్చిన తర్వాత బతుకు భారంగా మారింది. ఏదైనా వ్యాపారం చేయాలని అనుకున్నాం. నేను స్వయం శక్తి సంఘంలో సభ్యురాలిగా ఉండటంతో మూడేళ్ల క్రితం బ్యాంకు లింకేజీ ద్వారా రూ.50 వేలు రుణం తీసుకున్నా. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా లభించిన రూ.36 వేలతో నేను, నా భర్త కలిసి హోటల్ ప్రారంభించాం. ఏడాదిన్నర క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో నా భర్తకు, నాకు తీవ్ర గాయాలు కావడంతో హోటల్ మూతబడింది. ఏడాది నుంచి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సమయంలో మరోమారు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.50 వేలు, వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.18,750 వంతున రెండు విడతలుగా అందిన సొమ్ముతో రెండు ఆవులను కొనుగోలు చేశాం. ఇప్పుడు వాటి పాలను రోజువారీ అమ్ముతూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాం. మా జీవితానికి ఢోకా లేదు. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాకే మా లాంటి పేదలంతా హాయిగా జీవనం సాగిస్తున్నారు.

– పొట్నూరు గీత, అరకబద్ర
(మద్దిలి కేశవరావు, విలేకరి, ఇచ్ఛాపురం రూరల్)

కొడుకులా ఆదుకున్నారు



పిల్లలు లేని మాకు వృద్ధాప్యంలో ఈ ప్రభుత్వమే అండగా నిలిచింది. మాది శ్రీకాకుళం. వయసు మీద పడడంతో ఏపనీ చేయలేని స్థితిలో నా భార్య లక్ష్మితో కలిసి ఆరేళ్ల క్రితం విశాఖ వచ్చాము. ఇక్కడ ఆరిలోవ ఆపరేషన్ కాలనీలో మా సమీప బంధువు కల్యాణి ఇంట్లో ఉంటున్నాం. ఆమె మమ్మల్ని ఆదరాభిమానంతో చూసుకుంటోంది. ఈ ప్రభుత్వం వచ్చాక వృద్ధాప్య పింఛన్ వస్తోంది. ఈ నెల నుంచి పింఛను డబ్బులు పెరిగాయని వలంటీరు లీలాకృష్ణ మా ఇంటికి వచ్చి రూ.3 వేలు అందించారు. మాకు అనారోగ్య సమస్యలు కూడా ఉన్నాయి. మా ఇద్దరికీ కంటి చూపు మందగించడంతో ఇబ్బంది పడేవాళ్లం. గత నెల 21న ఆరిలోవలో జగనన్న కంటి వెలుగు శిబిరం నిర్వహించారు. ఆ శిబిరానికి వెళ్లి మాకు పరీక్షలు చేసిన డాక్టరు ఆపరేషన్ చేయాలని చెప్పారు. అదే నెల 23న మా ఇద్దరికీ కంటి ఆపరేషన్ ఉచితంగా చేశారు. దీంతో పాటు నా భార్య లక్ష్మికి చేయూత కింద ఏటా రూ.18,750 వంతున వచ్చింది. మూడేళ్ల క్రితం ఆమెకు పొట్టలో భరించరాని నొప్పి రావడంతో కేజీహెచ్‌లో ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేశారు. అనేక విధాలుగా సహాయం అందిస్తూ పిల్లలులేని మమ్మల్ని సీఎం జగనే కొడుకులా ఆదుకుంటున్నారు.

– రోణంకి చిరంజీవులు, విశాఖ
(మీసాల కామేశ్వరరావు, విలేకరి, ఆరిలోవ)

బడుగుల 'విజయ గీతిక'

- చిలకలూరిపేట పట్టణంలో ఘనంగా సామాజిక సాధికార బస్సు యాత్ర
- వేలాదిగా తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు
- ముఖ్యమంత్రి జగన్ నేతృత్వంలో సాధించిన అభివృద్ధిని వివరిస్తూ సాగిన యాత్ర
- జై జగన్ నినాదాలతో మార్మోగిన పట్టణం
- జన సంద్రంలా సాధికార సభ



సామాజిక సాధికార బహిరంగ సభకు హాజరైన జన సందోహంలో ఓ భాగం

సాక్షి ప్రతినిధి, గుంటూరు/చిలకలూరిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన చేయూతతో తాము సాధించిన అభివృద్ధిని, సాధికారతను బడుగు, బలహీన వర్గాల ప్రజలు వేనోళ్ల వినిపించారు. సోమవారం పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రలో విజయగీతిక వినిపించారు. ఈ యాత్రకు నియోజకవర్గం నలుమూలల నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు వేలాదిగా తరలివచ్చారు. తాము సాధించిన అభివృద్ధిని వివరించారు. జై జగన్ అంటూ వారు చేసిన నినాదాలతో పట్టణం మార్మోగింది. వారికి పట్టణ ప్రజలు అడుగడుగునా స్వాగతం పలికారు. నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు నేతృత్వంలో నూతన వ్యవసాయ మార్కెట్ నుంచి కళామందిర్ సెంటర్ వరకు ఈ యాత్ర జరిగింది. పట్టణంతోపాటు గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలు, పార్టీ శ్రేణులతో కళా మందిర్ సెంటర్‌లో జరిగిన బహిరంగ సభ జనసంద్రాన్ని తలపించింది. ఈ భారీ బహిరంగ సభలో ప్రసంగించిన పలువురు నేతలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతున్న వైనాన్ని వివరించారు. ఆ సమయంలో సభకు హాజరైన ప్రజలు పెద్దపెట్టున హర్షధ్వానాలు చేశారు.

సామాజిక న్యాయ సారథి సీఎం వైఎస్ జగన్: మంత్రి విడదల రజిని

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సామాజిక న్యాయ సారథిగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అన్ని విధాలుగా అగ్రస్థానంలో నిలబెడుతున్నారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. అనేక సంక్షేమ పథకాలను ఈ వర్గాలకు అందిస్తూ సాధికారత దిశగా నడిపిస్తున్నారని తెలిపారు. రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో ఈ వర్గాలకే పెద్దపీట వేస్తున్నారన్నారు. చిలకలూరిపేటలో తొలిసారి బీసీ మహిళని నిలబెట్టి ఏ రాజకీయ పార్టీ ఎన్నడూ చేయని సాహసాన్ని జగనన్న చేశారన్నారు. ఈ స్థానాన్ని గెలుపొందడంతోపాటు బీసీ మహిళకు వైద్య, ఆరోగ్య శాఖను అప్పగించారని గుర్తు చేశారు. మున్సిపాలిటీ ఓసీకి రిజర్వు అయితే మైనారిటీకి చైర్మన్ ఇచ్చామని, మార్కెట్ యార్డును ఎస్సీలకు రెండుసార్లు కేటాయించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని తెలిపారు. అన్ని వెనుకబడిన వర్గాలకు న్యాయం జరిగిందని, దీనికి చిలకలూరిపేటే నిదర్శనమన్నారు. రూ. 2 వేల కోట్లతో చిలకలూరిపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రూ.900 కోట్లతో నిర్మిస్తున్న బైపాస్ త్వరలో పూర్తవుతుందన్నారు. పట్టణానికి మంచినీరందించేందుకు రూ.150 కోట్లతో అమృత్ పథకాన్ని తెచ్చామన్నారు. ఎస్సీ భవన్, బీసీ భవన్, కాపు కమ్యూనిటీ హాల్‌కు త్వరలో శంకుస్థాపన చేస్తున్నట్లు చెప్పారు. కోటి రూపాయలు సొంత నిధులతో షాదీఖానా కట్టించామన్నారు. కార్పొరేట్ స్థాయిలో 100 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఇంగ్లిష్ మీడియంతో బడుగుల ఉన్నతి: ఎమ్మెల్సీ కుంభా రవిబాబు

సమాజంలో అణచివేతకు గురైన వర్గాలను సీఎం వైఎస్ జగన్ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతి కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రాథమిక విద్యలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెట్టి బడుగుల ఉన్నతికి బాటలు వేశారని చెప్పారు. సీఎం జగన్ ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడం వల్ల ఈ సమాజంలో అణచివేతకు గురైన వారందరూ చదువుకుని పెట్టుబడులు పెట్టే స్థాయికి ఎదుగుతారని వివరించారు.



బస్సుయాత్రలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి, మంత్రి విడదల రజిని, నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లెల రాజేష్

అన్ని పదవుల్లో పెద్దపీట వేస్తున్నారు: ఎమ్మెల్యే ముస్తఫా

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి పాటుపడిన ముఖ్యమంత్రి స్వతంత్ర భారత చరిత్రలో సీఎం జగన్ ఒక్కరేనని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా చెప్పారు. ఈ వర్గాలను ఇంతలా అభివృద్ధి చేసిన సీఎంలు ఎవరూ లేరన్నారు. అన్ని పదవుల్లోనూ ఈ వర్గాలకు పెద్దపీట వేసిన ఘనత సీఎం జగన్‌దేనని అన్నారు.

బాబు కల్లబొల్లి మాటలు నమ్మొద్దు: ఎమ్మెల్సీ ఏసురత్నం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగమిస్తోందని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం తెలిపారు. ఈ రాష్ట్రానికి ఏ మేలూ చేయని చంద్రబాబునాయుడు కల్లబొల్లి మాటలు చెబుతూ మరోసారి ప్రజల్ని మోసం చేయడానికి వస్తున్నారని, ఆయన మాటలు నమ్మొద్దని చెప్పారు. 600 హామీలు ఇచ్చిన చంద్రబాబు ఒక్కటి అమలు చేయలేదన్నారు. బాబు 14 ఏళ్ల పాలనలో కేంద్రం 14 లక్షల గృహాలు మంజూరు చేస్తే, పది వందలు కూడా పేదలకు ఇవ్వలేదన్నారు. ఇప్పుడు జగన్ 31 లక్షల మందికి గృహ వసతి కల్పించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్త, ఎంపీ విజయసాయిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డిజైన్లు ఆమోదిస్తే పనులు వేగవంతం

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టును గడువులోగా పూర్తి చేయాలంటే డిజైన్లను వేగంగా ఆమోదించాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) సీఈవో శివ్‌నందన్‌కుమార్‌ను రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ కోరారు. అంతర్జాతీయ నిపుణుల ఏజెన్సీని తక్షణమే ఖరారు చేయాలంటూ చేసిన విజ్ఞప్తికి పీపీఏ సీఈవో సానుకూలంగా స్పందించారు. సోమవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో పీపీఏ సమావేశమైంది. రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ నారాయణరెడ్డి, పోలవరం సీఈ సుధాకర్‌బాబు తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ప్రాజెక్టు పనుల పురోగతిపై పీపీఏ సీఈవో సమీక్షించారు. ఎర్త్ కమ్ రాక్ ఫిల్(ఈసీఆర్‌ఎఫ్) డ్యామ్ గ్యాప్–1, గ్యాప్–2లలో వైబ్రో కాంపాక్షన్, స్టోన్ కాలమ్స్ డిజైన్ల రూపకల్పనకు కాంట్రాక్టు సంస్థ మేఘా యాఫ్రి అనే అంతర్జాతీయ నిపుణుల సంస్థను ఏర్పాటు చేసుకుందని అధికారులు వివరించారు. ఆగస్టులోగా ఆ డిజైన్లు ఇస్తామని.. వాటిని తక్షణమే ఆమోదించడానికి అంతర్జాతీయ నిపుణుల ఏజెన్సీని ఖరారు చేయాలంటూ చేసిన విజ్ఞప్తికి పీపీఏ సానుకూలత వ్యక్తం చేసింది. డయాఫ్రమ్ వాల్‌పై సీడబ్ల్యూసీ తీసుకునే నిర్ణయం ఆధారంగా చర్యలు తీసుకుందామని పీపీఏ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర అధికారులు అంగీకరించారు. కేంద్ర పర్యావరణ శాఖ పోలవరం పనుల ఆపివేత ఉత్తర్వులను అభయన్స్‌లో పెడుతూ ఇచ్చిన గడువు జూలై 2తో పూర్తవుతుందని.. దాన్ని మరో ఏడాది పొడిగించాలని కోరారు. ముంపు ప్రభావంపై సుప్రీం కోర్టులో ఒడిశా సర్కార్ దాఖలు చేసిన కేసులో.. స్పిల్ వే సామర్థ్యాన్ని 50 లక్షల క్యూసెక్కులకు పెంచినా ఎలాంటి ముంపు ఉండదని ఇప్పటికే కేంద్ర జల్ శక్తి శాఖ అఫిడవిట్ దాఖలు చేసిందని పీపీఏ సీఈఓ చెప్పారు. ఆ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చే తీర్పు ఆధారంగా ఒడిశాలో ముంపు ప్రాంతంపై చర్యలు తీసుకుంటామన్నారు. తమ రాష్ట్రంలో ముంపు ప్రాంతంపై సంయుక్త సర్వే చేయాలని తెలంగాణ సీఈ శ్రీనివాసరెడ్డి చేసిన ప్రతిపాదనను రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు తోసిపుచ్చారు. పీపీఏ కార్యాలయాన్ని రాజమండ్రికి మార్చడంపై కేంద్ర జల్ శక్తి శాఖకు ప్రతిపాదన పంపామని.. దానిపై ఆమోదముద్ర వేయగానే రాజమండ్రికి మారుతామని పీపీఏ సీఈవో చెప్పారు. పీపీఏ కార్యకలాపాల కోసం 18 మంది ప్రభుత్వ ఉద్యోగులు, 9 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అవసరమని పేర్కొన్నారు. సిబ్బంది జీతభత్యాలు, ఏజెన్సీలకు చెల్లించాల్సిన బిల్లులు, కార్యకలాపాల కోసం పరిపాలన ఖర్చుల కింద రూ.48.72 కోట్లు ఇవ్వాలని పీపీఏ సీఈవో చేసిన ప్రతిపాదనపై రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ సానుకూలంగా స్పందించారు.

ఏపీ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు భేష్

- మా దేశాల్లోనూ అవలంభిస్తాం
- అనంతపురం జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించిన విదేశీ బృందం



మామిడి తోటను పరిశీలిస్తున్న విదేశీ బృందం

రాప్తాడు: అనంతపురం జిల్లాలో అవలంభిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులు చాలా బాగున్నాయని విదేశీ వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం సభ్యులు కితాబిచ్చారు. ఈ మేరకు సోమవారం షార్జా రాజ కుటుంబానికి చెందిన షేక్ మజీద్, అలఖ్ అస్సీమి, ఇటలీకి చెందిన ఫ్యూచర్ ఎకనమిక్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు వాల్టర్ లింక్, షేక్ మజీద్ అసోసియేట్ యాజెన్ అల్‌కొద్మనితో పాటు అమెరికాకు చెందిన ప్రపంచ బ్యాంక్ సీనియర్ సలహాదారులు నళిన్ కిశోర్, అశోక్ వైష్, దేశ్‌దీప్ సహదేవ్ బృందం ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన పంటలను పరిశీలించింది. అనంతపురం జిల్లాలోని రాప్తాడు మండలం మరూరు, బొమ్మనహాళ్ మండలంలోని గోవిందవాడ, కల్లుదేవనహళ్లి గ్రామాల్లో ఈ బృందం పర్యటించింది. బృందం సభ్యులు మాట్లాడుతూ తమ దేశాల్లోనూ ఇలాంటి పద్ధతులు అవలంభించేలా కృషి చేస్తామని చెప్పారు. రైతు సాధికార సంస్థ ఆవిష్కరించిన సరికొత్త టెక్నాలజీ తమకు సంతోషం కలిగించింద న్నారు. మహిళా సాధికారత కూడా ఇక్కడ ప్రశంసనీయంగా ఉందని చెప్పారు. ఎడారి, ఇసుక ప్రాంతంలోనూ వ్యవసాయం చేసి సత్ఫలితాలను సాధించవచ్చుననేది ఇక్కడ చూశామని వాల్టర్ లింక్ అన్నారు. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ (డీపీఎం) లక్ష్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 4 వరకు కులగణన గడువు

ఇప్పటికే 87.04% వివరాల నమోదు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కుల గణన ప్రక్రియను ఫిబ్రవరి 4 వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి గిరిజా శంకర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఈ నెల 19న ప్రారంభించి, 29 నాటికి పూర్తిచేయాలని తొలుత నిర్ణయించారు. అయితే కులగణన వివరాల నమోదుకు ఉపయోగించే మొబైల్ యాప్‌లో వరుసగా మూడు రోజులు సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో ప్రక్రియ ఆలస్యమైనట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కలిపి మొత్తం 1.67 కోట్ల కుటుంబాలు ఉన్నట్లు అంచనా. ముందుగా అనుకున్న గడువు సోమవారం సాయంత్రానికి 87.04 శాతంతో 1.46 కోట్ల కుటుంబాల వివరాల నమోదు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన కుటుంబాల వివరాలను నమోదు చేసేందుకే ఈ ప్రక్రియను వచ్చే నెల 4 వరకు పొడిగించినట్లు వెల్లడించారు. గడువు తర్వాత కూడా వివరాలు నమోదుకాని కుటుంబాల వారుంటే నేరుగా గ్రామ/వార్డు సచివాలయాలకు వెళ్లి, 7వ తేదీలోగా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

రాష్ట్రంలో 30 మంది ఐపీఎస్ అధికారుల బదిలీ

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్ ఐజీగా రఘురామిరెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 30 మంది ఐపీఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. అదనపు డీజీ (విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్)గా ఉన్న కుమార్ విశ్వజిత్‌ను అదనపు డీజీ (రైల్వేస్)గా నియమించింది. ప్రస్తుతం ఇంటెలిజెన్స్ సెల్ (సీఐ) విభాగంలో ఐజీగా ఉన్న డాక్టర్ కొల్లి రఘురామిరెడ్డిని విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్ ఐజీగా బదిలీ చేసింది. డ్రగ్ కంట్రోలర్ డీజీగా కూడా ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించింది. వీరితో పాటు మరో 28 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్ జవహర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
కుమార్‌విశ్వజిత్	అదనపు డీజీ (విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్)	అదనపు డీజీ (రైల్వేస్)
అతుల్ సింగ్	చైర్మన్(ఎస్‌ఎల్‌పీఆర్‌బీ)	అదనపు డీజీ (ఏపీఎస్పీ)
సీహెచ్ శ్రీకాంత్	ఐజీ(సీఐడీ)	ఐజీ(ఆక్టోపస్), రోడ్ సేఫ్టీ అథారిటీ ఐజీపీ(ఎఫ్ఏసీ)
కొల్లి రఘురామిరెడ్డి	ఐజీ(ఇంటెలిజెన్స్ సెల్)	ఐజీ (విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్), డీజీ డ్రగ్, కాపీరైట్స్, డ్రగ్ కంట్రోలర్(ఎఫ్ఏసీ)
ఎస్‌వి రాజశేఖరబాబు	ఐజీ(ఆక్టోపస్)	చైర్మన్(ఎస్ఎల్‌పీఆర్‌బీ), ఐజీ, హోమ్‌గార్డ్(ఎఫ్ఏసీ)
సర్వశ్రేష్ట త్రిపాఠి	ఐజీ(అడ్మిన్)	ఐజీ(సీఐడీ)
ఎస్.హరికృష్ణ	డీఐజీ(విశాఖపట్నం)	ఐజీపీ(పర్సనల్), ఐజీ, టెక్నికల్ సర్వీసెస్(ఎఫ్ఏసీ)
కె.వి.మోహన్‌రావు	డీఐజీ(డీజీపీ కార్యాలయం)	ఐజీ(స్పోర్ట్స్)
ఎస్.సెంథిల్ కుమార్	డీఐజీ(కర్నూలు రేంజ్)	డీఐజీ(ఆక్టోపస్), డీఐజీ, డీజీపీ కార్యాలయం లా అండ్ ఆర్డర్(ఎఫ్ఏసీ)
రాహుల్‌దేవ్ శర్మ	కమాండెంట్, 5వ బెటాలియన్, ఏపీఎస్పీ(విజయనగరం)	డీఐజీ(ట్రైనింగ్) డీజీపీ కార్యాలయం
విశాల్‌గున్ని	డీసీపీ, లా అండ్ ఆర్డర్ (విజయవాడ)	డీఐజీ(విశాఖపట్నం రేంజ్)
విజయరావ్ చమటపల్లి	కమాండెంట్, 3వ బెటాలియన్, ఏపీఎస్పీ(కాకినాడ)	డీఐజీ(కర్నూలు)
కె.ఫక్కీరప్ప కగినెల్లి	ఎస్పీ(సీఐడీ)	జాయింట్ కమిషనర్(విశాఖపట్నం)
అద్నంనయీమ్ అస్మి	ఎస్పీ(ఏసీబీ)	ఎస్పీ(కృష్ణా జిల్లా)
అమిత్ బర్ధర్	ఎస్పీ(సీఐడీ)	కమాండెంట్, 6వ బెటాలియన్ (మంగళగిరి)
ఆరిఫ్ హఫీజ్	ఎస్పీ(గుంటూరు)	ఎస్పీ(ఇంటెలిజెన్స్)
అజిత్ వెజెండ్ల	డీసీపీ(జగ్గయ్యపేట)	ఎస్పీ(పశ్చిమ గోదావరి జిల్లా)
కెఎస్ఎస్‌వి సుబ్బారెడ్డి	కమాండెంట్, 6వ బెటాలియన్ (మంగళగిరి)	రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ (రాజమండ్రి)
వై.రిషాంత్‌రెడ్డి	ఎస్పీ(చిత్తూరు)	ఎస్పీ(సీఐ సెల్),ఎస్పీ, రెడ్ శాండర్స్ యాంటీ–స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్, తిరుపతి(ఎఫ్ఏసీ)
పి.జోషువా	ఎస్పీ(కృష్ణా జిల్లా)	ఎస్పీ(చిత్తూరు)
యు.రవిప్రకాష్	ఎస్పీ(పశ్చిమగోదావరి)	ఎస్పీ(ఏసీబీ)
మణికంఠ చందోలు	అదనపు ఎస్పీ,ఎస్ఈబీ (శ్రీకాకుళం)	డీసీపీ, లా అండ్ ఆర్డర్, విశాఖపట్నం
అధిరాజ్ సింగ్ రాణా	ఏఎస్పీ, గ్రేడ్–1(నర్సీపట్నం)	కమాండెంట్, 5వ బెటాలియన్, ఏపీఎస్పీ, విజయనగరం
కృష్ణకాంత్ పాటిల్	అదనపు ఎస్పీ(ఎస్ఈబీ),కర్నూలు	కమాండెంట్, 3వ బెటాలియన్, ఏపీఎస్పీ, కాకినాడ
తుషార్ డూడి	అదనపు ఎస్పీ(అడ్మిన్)	ఎస్పీ(గుంటూరు)
కె.శ్రీనివాసరావు	డీసీపీ, లా అండ్ ఆర్డర్–1 (విశాఖపట్నం)	డీసీపీ(జగ్గయ్యపేట)
ధీరజ్ కునుబిల్లి	ఏఎస్పీ(పాడేరు)	ఏఎస్పీ(రంపచోడవరం)
జగదీష్ అడహళ్లి	ఏఎస్పీ(రంపచోడవరం)	ఏఎస్పీ(పాడేరు)
ఆనంద్ రెడ్డి	డీసీపీ, లా అండ్ ఆర్డర్–2 (విశాఖపట్నం)	డీసీపీ, లా అండ్ ఆర్డర్ (విజయవాడ)
మొక్కా సత్యనారాయణ	డీసీపీ (విజయవాడ)	డీసీపీ, లా అండ్ ఆర్డర్, విశాఖపట్నం.

రాజ్యసభకు మోగిన నగారా

▶ మొదటి పేజీ తరువాయి

41 ఏళ్లలో రాజ్యసభలో టీడీపీకి ప్రాతినిధ్యం లేకుండా పోవడం ఇదే ప్రథమం అవుతుంది.

అప్పట్లో ఆ ఎనిమిదీ వైఎస్సార్‌సీపీకే..

రాజ్యసభలో మొత్తం సభ్యుల సంఖ్య 250 లోపు ఉండాలి. ప్రస్తుతం ఆ సభ్యుల సంఖ్య 245. ఇందులో 233 మందిని ఎమ్మెల్యేలు ఎన్నుకుంటారు. మిగతా 12 మందిని రాష్ట్రపతి నామినేట్ చేస్తారు. మన రాష్ట్ర కోటాలో రాజ్యసభ సభ్యుల సంఖ్య 11. 2019 ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీకి ఇద్దరు.. టీడీపీకి 9 మంది సభ్యులు ఉండేవారు. ఆ తర్వాత 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 50% ఓట్లతో 151 స్థానాల్లో ఘనవిజయం సాధించింది. టీడీపీ 23 స్థానాలకే పరిమితమైంది. దీంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో సత్సంబంధాలు నెరిపి.. అవినీతి కేసుల నుంచి బయటపడేందుకు టీడీపీ నుంచి రాజ్యసభకు ఎన్నికైన సుజనాచౌదరి, సీఎం రమేష్, గరికపాటి మోహన్‌రావు, టీజీ వెంకటేష్‌లను బీజేపీలోకి ఫిరాయించేలా చంద్రబాబు చక్రం తిప్పారు. రాష్ట్ర కోటాలో ఎన్నికైన రాజ్యసభ సభ్యుల్లో 2020లో నలుగురు (టీడీపీ), 2022లో నలుగురు (3 టీడీపీ, 1 వైఎస్సార్‌సీపీ) పదవీకాలం పూర్తవడంతో ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించింది. అసెంబ్లీలో వైఎస్సార్‌సీపీకి ఉన్న సంఖ్యాబలం ఆధారంగా ఈ 8 స్థానాలు వైఎస్సార్‌సీపీకే దక్కాయి. ఇందులో నలుగురు బీసీలను సీఎం జగన్ రాజ్యసభకు పంపించారు.

ఒక్కో స్థానం గెలవాలంటే 44 మంది ఎమ్మెల్యేల ఓట్లు..

రాష్ట్ర కోటాలో ఖాళీకానున్న 3 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహిస్తోంది. టీడీపీ సభ్యుడు గంటా శ్రీనివాసరావు రాజీనామాను స్పీకర్ తమ్మినేని సీతారాం ఆమోదించడంతో ప్రస్తుతం అసెంబ్లీలో మొత్తం సభ్యుల సంఖ్య 174కు తగ్గింది. ఇందులో సాంకేతికంగా చూస్తే వైఎస్సార్‌సీపీ బలం 151.. టీడీపీ బలం 22.. జనసేనకు ఒక ఎమ్మెల్యే ఉన్నారు. వీటిని పరిగణలోకి తీసుకుంటే.. రాజ్యసభకు ఒక స్థానం నుంచి ఎన్నిక కావాలంటే 44 మంది ఎమ్మెల్యేల ఓట్లు అవసరం. ప్రస్తుతం శాసనసభలో వైఎస్సార్‌సీపీ సంఖ్యాబలాన్ని బట్టి చూస్తే 3 స్థానాలు పార్టీ ఖాతాలో చేరడం ఖాయం.

క్లుప్తంగా...

బదిలీ చర్యల నివేదిక పంపండి

- అన్ని ప్రభుత్వ శాఖలకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశం
- నేడు ఒక్క రోజే గడువు

సాక్షి, అమరావతి: సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మూడేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన మార్గదర్శకాల మేరకు బదిలీ చర్యల నివేదికను పంపించాల్సిందిగా అన్ని శాఖల కార్యదర్శులతోపాటు శాఖాధిపతులు, కలెక్టర్లు, ఎస్పీలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సోమవారం ఆదేశించారు. బదిలీలకు సంబంధించిన సమగ్ర నివేదికను ఈ నెలాఖరులోగా తాము కేంద్ర ఎన్నికల సంఘానికి పంపాల్సి ఉందన్నారు. మంగళవారం (నేటి)లోగా బదిలీ చర్యలకు సంబంధించి నివేదికలను పంపిస్తేనే సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించడానికి వీలవుతుందని ఆదేశాల్లో పేర్కొన్నారు.

టీడీపీ పేదలకు అన్యాయం చేస్తోంది

అందుకే ఆ పార్టీకి దూరంగా ఉన్నానన్న ఎమ్మెల్యే గణేష్ కుమార్



సాక్షి,అమరావతి: పేదలకు టీడీపీ అన్యాయం చేస్తుందని అందుకే ఆ పార్టీకి తాను దూరంగా ఉన్నానని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. 2019లో తాను సైకిల్ గుర్తుపైనే పోటీచేసి గెలుపొందానన్నారు. పార్టీకి అన్యాయం చేస్తున్నట్లు నేతలు ఆరోపిస్తున్నారని, నాకు వ్యతిరేకంగా ఒక్క ఆధారం కూడా చూపించలేకపోయారన్నారు. తాను పార్టీ ఫిరాయించాననడం సరికాదని గణేష్ మండిపడ్డారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒక సోల్జర్‌గా, ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్‌గా సేవలందించానని, రెండు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించినట్లు గుర్తు చేశారు. 18 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న తనకు ఏ పార్టీ వల్ల ప్రజలకు మేలు జరుగుతుందో తెలుసన్నారు. ఈ విషయాలనే స్పీకర్‌కు కూడా వివరించినట్లు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా శాసనసభాపతి నిర్ణయం ఉంటే కోర్టును ఆశ్రయించి న్యాయనిపుణుల సూచనల మేరకు ముందుకు వెళ్తానని వాసుపల్లి స్పష్టం చేశారు.

సీఎం జగన్ ఆదేశాలే శిరోధార్యం: ఎమ్మెల్యే సింహాద్రి



అవనిగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ధిక్కారస్వరమంటూ తనపై ఈనాడులో తప్పుడు కథనాలు రాశారని, ఇలాంటి రోత రాతలు మానుకోకుంటే తగిన బుద్ధి చెబుతామని కృష్ణా జిల్లా అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రామోజీ రావుకు వయసుపెరుగుతున్నా దుర్మార్గపు రాతలు రాయడం మానుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటే తనకు శిరోధార్యమని, ఆయన ఏది చెప్పినా చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. మచిలీపట్నం ఎంపీగా పోటీ చేయమన్నా, అవనిగడ్డ ఎమ్మెల్యేగా పోటీ చేయమన్నా తాను సిద్ధమేనన్నారు. తనకంటే మెరుగైన అభ్యర్థిని నిలబెట్టినా అతనికి పూర్తిస్థాయిలో మద్దతిస్తానని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా చేయడమే మా అందరి లక్ష్యమన్నారు. చంద్రబాబుకి జాకీ ఎత్తడానికి రామోజీ ఎంత నీచపు రాతలకైనా ఒడిగడతారని చెప్పారు. ఇకనైనా తప్పుడు కథనాలు రాయడం మానుకోవాలని లేదంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, పార్టీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కోఆప్షన్ సభ్యులు షేక్‌నజీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

డోన్.. టీడీపీ వికెట్ డౌన్

తెలుగుదేశం పార్టీలో మూడు ముక్కలాట.. కేఈ, కోట్ల, బీసీ వర్గాలుగా విడిపోయిన నేతలు

- ధర్మవరం సుబ్బారెడ్డికి మద్దతుగా బీసీ జనార్దన్‌రెడ్డి
- జనార్దన్‌రెడ్డి పెత్తనంపై రగిలిపోతున్న కేఈ, కోట్ల వర్గాలు
- సుబ్బారెడ్డికి టికెట్ ఇస్తే సహకరించేది లేదంటూ అధినేతకు అల్టిమేటం
- కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డిని బరిలో దింపే అవకాశం



సాక్షి, నంద్యాల: డోన్ టీడీపీలో అసంతృప్తి జ్వాలలు ఎగసిపడుతున్నాయి. నాయకులు వర్గాలుగా విడిపోయి పరస్పరం విమర్శనాస్త్రాలు సంధించుకుంటున్నారు. ఎవరికి వారు తాము సూచించిన వారికే టికెట్ ఇవ్వాలని, లేని పక్షంలో అభ్యర్థిని ఓడిస్తామని పార్టీ అధినేత చంద్రబాబుకే స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ కంచుకోటగా ఉన్న డోన్ నియోజకవర్గంలో తమ పార్టీ ఉనికిని చాటుకునేందుకు టీడీపీ నాయకులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. నియోజకవర్గంలో కేఈ కృష్ణమూర్తి కుటుంబానికి కొంత పట్టు ఉంది. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి కృష్ణమూర్తి సోదరుడు ప్రతాప్ పోటీ చేసి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చేతిలో ఓడిపోయారు. అప్పటినుంచి ఆయన పార్టీకి అంటీముట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ఇన్‌చార్జిగా తప్పించి కేఈ ప్రభాకర్‌ను అధిష్టానం నియమించింది. కొంతకాలం తర్వాత ప్రభాకర్‌ను కూడా తప్పించి కేఈ వర్గానికి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ధర్మవరం సుబ్బారెడ్డిని ఇన్‌చార్జిగా నియమించింది. ఆయన నియామకాన్ని కేఈ వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అతడికి టికెట్ ఇస్తే సహకరించే ప్రసక్తే లేదని తేల్చి చెబుతోంది.

బీసీ ప్రోద్బలంతోనే గ్రూపు రాజకీయాలు

నంద్యాల జిల్లా టీడీపీకి బీసీ జనార్దన్‌రెడ్డి పెద్ద దిక్కుగా మారారు. ఆర్థికంగా బలంగా ఉండడంతో మిగిలిన నాయకులు బీసీ నిర్ణయాలకు అడ్డు చెప్పడానికి సాహసించడం లేదు. తమకు చెప్పకుండా నియోజకవర్గ ఇన్‌చార్జిగా సుబ్బారెడ్డిని ప్రకటించడం వెనక బీసీ జనార్దన్‌రెడ్డి ప్రమేయం ఉన్నట్లు కేఈ, కోట్ల వర్గాలు బాహాటంగానే విమర్శిస్తున్నాయి. బీసీ ప్రోద్బలంతోనే సుబ్బారెడ్డి గ్రూపు రాజకీయాలకు తెరతీశారని మండిపడుతున్నాయి.

నువ్వొస్తే మర్యాదగా ఉండదు

గత ఆదివారం పత్తికొండలో జరిగిన 'రా.. కదలిరా' సభకు బీసీ జనార్దన్‌రెడ్డి, ధర్మవరం సుబ్బారెడ్డికి మినహా మిగిలిన నంద్యాల జిల్లా నాయకులకు ఆహ్వానం అందింది. ఒకవేళ ఆహ్వానం లేకున్నా సభకు వస్తే మర్యాద దక్కదని పత్తికొండ టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు హెచ్చరించారు. దీంతో చేసేదిలేక ఇద్దరు నేతలు సభకు హాజరుకాలేదు. సభ ముగిశాక చంద్రబాబు అక్కడే సమీక్ష సమావేశం నిర్వహించారు. అసంతృప్తితో ఉన్న నాయకులను పిలిచి మాట్లాడారు. కానీ, డోన్ పంచాయితీని మాత్రం ఆయన పట్టించుకోలేదు. ఇన్‌చార్జిగా ఉన్న సుబ్బారెడ్డికి సహకరించాలని అటు కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డికి కానీ ఇటు కేఈ కుటుంబానికి కానీ చంద్రబాబు సూచించకపోవడంతో ఈ అంశంపై నియోజకవర్గ వ్యాప్తంగా చర్చ సాగుతోంది.

కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డికి ఇస్తేనే సహకరిస్తాం

డోన్ టికెట్ కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డికి ఇస్తేనే తాము సహకరిస్తామని కేఈ కుటుంబం చంద్రబాబుకు స్పష్టం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన ఈ నాలుగున్నరేళ్లలో డోన్ నియోజకవర్గ రూపురేఖలు మారిపోయాయి. దాదాపు రూ.2,500 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో డోన్ బరిలో టీడీపీ తరఫున ఎవరు పోటీ చేసినా ఓటమి ఖాయమనే నిర్ణయానికి ఆ పార్టీ నాయకులు వచ్చారు. ఎమ్మిగనూరు నుంచి తనకు అవకాశం ఇవ్వాలని కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి కోరినా చంద్రబాబు సానుకూలంగా స్పందించకపోవడంతో అసంతృప్తితో ఉన్నారు. అయినప్పటికీ చేసేదేమీ లేక ఓడిపోయే డోన్ నుంచి పోటీ చేయాలని ఆయన భావిస్తున్నట్లు తెలిసింది.

మూడేళ్లుగా భారీ ఖర్చు

నియోజకవర్గ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి మూడేళ్లుగా టీడీపీ కార్యక్రమాలను ధర్మవరం సుబ్బారెడ్డి చేపడుతూ వస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే రూ.నాలుగు కోట్ల వరకు ఖర్చు చేసినట్లు ఆయన తన అనుచరుల వద్దే ప్రస్తావిస్తున్నారు. చంద్రబాబు, లోకేశ్ ఇద్దరూ తనకే టికెట్ ఇస్తామని చెప్పడంతోనే తాను ఖర్చు చేశానని, ఇప్పుడు టికెట్ విషయంలో మీన మీషాలు లెక్కిస్తుండడంతో ఏంచేయాలో అర్థం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేయడం సుబ్బారెడ్డి వంతైంది. మరోవైపు చంద్రబాబు ఖాతాలో మరో వికెట్ పడిపోయిందని ఆ పార్టీ కార్యకర్తలే చర్చించుకోవడం గమనార్హం.

అబద్ధాలతో నీతిమాలిన రాతలు

ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మహిళలు

వెదురుకుప్పం(చిత్తూరు జిల్లా): పచ్చి అబద్ధాలతో నీతిమాలిన రాతలు రాస్తూ రాష్ట్ర ప్రజలను మరోసారి మోసగించేందుకు ఎల్లో మీడియా బాకాలు మోగిస్తోందని ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి మండిపడ్డారు. రామోజీ అక్రమ సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో పెకలించే దమ్మున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్ మాత్రమేనన్నారు. సోమవారం వెదురుకుప్పంలో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత కింద మంజూరైన రూ.9,70,38,000 చెక్కును ఆయన మహిళలకు అందజేశారు. నారాయణస్వామి మాట్లాడుతూ చంద్రబాబు డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని చెప్పి మోసం చేశారని గుర్తు చేశారు. తన సుదీర్ఘ పాదయాత్రలో మహిళల కష్టాలను దగ్గర నుంచి చూసిన సీఎం జగన్ దశల వారీగా డ్వాక్రా రుణమాఫీ చేసి అండగా నిలిచారన్నారు. సంక్షేమం కోసం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు.

సీమలో స్వీప్ చేస్తాం

- గత ఎన్నికల్లో కోల్పోయిన మూడు సీట్లూ గెలుచుకుంటాం
- వచ్చే నెలలో అనంతపురంలో ఎన్నికల సమాయత్త సమావేశం
- సీఎం వైఎస్ జగన్ కేడర్‌కు దిశానిర్దేశం చేస్తారు
- రాయలసీమ రీజియన్ నేతల సమన్వయ సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి, రోజా, ఉషశ్రీ

సాక్షి, తిరుపతి: రాయలసీమ జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ ఈసారి స్వీప్ చేస్తుందని, గత ఎన్నికల్లో కోల్పోయిన మూడు అసెంబ్లీ స్థానాలను కూడా ఈసారి గెలుచుకుంటామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధీమా వ్యక్తంచేశారు. తిరుపతిలోని పీఎల్ఆర్ కన్వెన్షన్‌లో సోమవారం మంత్రి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో రాయలసీమకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమాయత్తంపై వచ్చేనెల 10 లేదా 11 తేదీల్లో అనంతపురంలో వైఎస్సార్‌సీపీ భారీ బహిరంగసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ ఈ సభలో పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారన్నారు. బహిరంగసభకు సంబంధించిన పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే ఆదిమూలం చేసిన విమర్శలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. తనను లక్ష్యంగా చేసుకుని చంద్రబాబు చేసిన అవినీతి ఆరోపణలకు జవాబు చెప్పాల్సిన అవసరం లేదని, తాను ఎలాంటి వ్యక్తినో జిల్లా ప్రజలకు తెలుసునన్నారు. మంత్రులు ఆర్కే రోజా, ఉషశ్రీ చరణ్, అంజాద్ బాష, ఎంపీలు రెడ్డెప్ప, గురుమూర్తి, ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని రామిరెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, పెద్దారెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, రఘురామిరెడ్డి, బ్రిజేంద్రరెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, కె. శ్రీనివాసులు, శ్రీదేవి, సుధ, విశ్వేశ్వర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్లు శ్రీనివాసులు, అమరనాథ్‌రెడ్డి, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, కడప మేయర్ సురేష్, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, భరత్, ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

వేషం కాంగ్రెస్‌ది.. స్క్రిప్ట్ చంద్రబాబుది: ఆర్కే రోజా

షర్మిలమ్మ వేసుకున్న వేషం కాంగ్రెస్‌ది, చదువుతున్న స్క్రిప్ట్ చంద్రబాబుదని మంత్రి ఆర్కే రోజా విమర్శించారు. సీఎం వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీపై విమర్శలు చేసే వారంతా పొరుగు రాష్ట్రంలో ఓటు ఉన్న వారు.. కాపురం ఉంటున్న వారేనని రోజా మండిపడ్డారు. సంక్రాంతి పండుగకు గంగిరెద్దులు వచ్చి వెళ్తున్నట్లుగా వారూ వచ్చి వెళ్తున్నారని ఎద్దేవా చేశారు.

మాజీ మంత్రి నారాయణపై కేసు నమోదు చేయాలి

విద్యాలయాలను అపవిత్రం చేస్తున్నారు: ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

సాక్షి, అమరావతి: ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఓటర్ల చేర్పు–మార్పులకు సంబంధించిన ప్రక్రియలో మాల్‌ప్రాక్టీస్‌కి పాల్పడుతున్న నారాయణ విద్యాసంస్థల యాజమాని, మాజీ మంత్రి పి.నారాయణపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు చేసింది. నారాయణ మీద కేసు నమోదు చేయాలని కోరింది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి లేఖ రాశారు. టీడీపీ సానుభూతిపరులైన విద్యాలయాల యజమానులు విద్యార్థుల ద్వారా.. ఓటరు పేరు, ఊరు, చిరునామా, జెండర్, వయసు, కులంతో పాటు అతను సపోర్టు చేసే పొలిటికల్ పార్టీ, మొబైల్ నంబర్, వారి బంధువుల వివరాలు, వార్డు నంబర్, పోలింగ్ బూత్ నంబర్, ఐడీ నంబర్ వంటి వివరాలు సేకరిస్తున్నారని, ఇలాంటి అనైతిక చర్యలకు పాల్పడుతున్న విద్యాలయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా లేళ్ల అప్పిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ నారాయణ పాల్పడుతున్న ఈ రకమైన చర్యలు ఓటర్లను ఒత్తిడికి గురిచేయటం, ప్రలోభపెట్టడం లాంటివని, సెక్షన్ 123 ఆఫ్ ఆర్పీ యాక్ట్ (1951) కిందకు వస్తాయని చెప్పారు. పవిత్రమైన విద్యాలయాలను కూడా చంద్రబాబు అపవిత్రం చేస్తున్నారన్నారు.

స్కామ్‌ల సూత్రధారి, పాత్రధారి బాబు

1,219వ రోజు దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: ప్రపంచంలోనే అతిపెద్ద భూస్కామ్ ఏదైనా ఉందంటే.. అది చంద్రబాబు సూత్రధారి, పాత్రధారిగా వ్యవహరించిన 'అమరావతే'నని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం 1,219వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ కులవాదులు, పెత్తందారులు, ఆర్థిక ఉగ్రవాదులందరితో కలిసి చంద్రబాబు ఆడిన గేమ్‌లో భాగమే అమరావతి భూదోపిడీ అన్నారు. మూడు పంటలు పండించుకుంటున్న రైతులను మోసం చేసిన బాబు అండ్ కో గ్రాఫిక్స్ మాయాజాలంతో ఈ ప్రాంత రైతుల బలహీనతలను వాడుకుని నిట్టనిలువునా ముంచేశాడని ధ్వజమెత్తారు. అమరావతికి బ్రాండ్ అంబాసిడర్ అని బాబు ప్రచారం చేసిన సింగపూర్ మంత్రి ఈశ్వరన్ పదవీచ్యుతుడై ఇప్పటికే ఇంటికి వెళ్లాడని, త్వరలోనే బాబు కూడా శాశ్వతంగా జైల్లో ఉండక తప్పదన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి బిడ్డగా షర్మిల అంటే ఏపీ ప్రజలకు ఎనలేని గౌరవం ఉందని, కానీ ఆమె కులోన్మాదులు, బహుజన వ్యతిరేకులకు అనుకూలంగా మాట్లాడడం విస్మయపరుస్తోందని చెప్పారు. మూడు రాజధానులను వ్యతిరేకిస్తూ ఆమె చేస్తున్న వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. నాయకులు ఈపూరి ఆదాం, మాదిగాని గురునాథం, పల్లె బాబు, పులి దాసు, కారుమూరి పుష్పరాజు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

3న ఏలూరులో 'సిద్ధం'

- ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల వైఎస్సార్‌సీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్న సీఎం జగన్
- దెందులూరు సమీపంలోని సభా ప్రాంగణాన్ని పరిశీలించిన నేతలు



మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, కొఠారు అబ్బయ్యచౌదరి తదితరులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో 175కు 175 శాసనసభ, 25కు 25 లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడానికి 'సిద్ధం' పేరుతో ప్రాంతాల వారీగా సభలు నిర్వహిస్తున్న సీఎం జగన్.. ఫిబ్రవరి 3న ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సమావేశం కానున్నారు. ఏలూరు జిల్లా దెందులూరు సమీపంలోని సభా ప్రాంగణంలో జరుగుతున్న పనులను ఎంపీ మిథున్‌రెడ్డి, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే ఆళ్ల నాని పరిశీలించారు. అనంతరం మిథున్‌రెడ్డి, ఆళ్ల నాని మీడియాతో మాట్లాడుతూ.. ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే ఈ సభలో సీఎం జగన్ పాల్గొని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారని చెప్పారు. మూడు ఉమ్మడి జిల్లాల నుంచి లక్షలాది మంది కార్యకర్తలు తరలిరానున్నారని.. వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు చేతిలో కీలుబొమ్మగా మారి పవన్‌కళ్యాణ్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. పవన్‌ను అడ్డం పెట్టుకొని చంద్రబాబు కుల రాజకీయాలు చేస్తున్నారని.. పార్టీ కార్యకర్తలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ అండ్ కో కుట్రలను క్షేత్రస్థాయిలో సమర్థంగా తిప్పికొట్టాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయమన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కొఠారు అబ్బయ్యచౌదరి, పి.వాసుబాబు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు లోక్‌సభ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్, చింతలపూడి సమన్వయకర్త కంభం విజయరాజు, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలను నేనెప్పుడూ ప్రోత్సహించలేదు

- రాజకీయ లబ్ధి కోసం నాపై బురదజల్లడం సరికాదు
- టీడీపీ నేత కన్నా లక్ష్మీనారాయణకు మంత్రి అంబటి హితవు
- తొండపిలో టీడీపీ దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పరామర్శ



వైఎస్సార్‌సీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: తాను ఘర్షణలను ఎప్పుడూ ప్రోత్సహించలేదని.. రాజకీయ లబ్ధి కోసం తనపై బురద వేయడం సరికాదని టీడీపీ నేత కన్నా లక్ష్మీనారాయణకు మంత్రి అంబటి రాంబాబు హితవు పలికారు. పల్నాడు జిల్లా తొండపి గ్రామంలో టీడీపీ నాయకులు చేసిన దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పఠాన్ అలీఖాన్ తదితరులను మంత్రి అంబటి సోమవారం సత్తెనపల్లి ప్రభుత్వాస్పత్రిలో పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'మంత్రి అంబటి ఆధ్వర్యంలో తొండపి గ్రామంలో తనపై దాడి జరగ్గా అదృష్టవశాత్తూ బయటపడ్డానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించడం సరికాదు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే నాపై కన్నా లక్ష్మీనారాయణ బురదజల్లుతున్నారు. గత ఎన్నికల సమయంలో తాను, లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రచారానికి వెళ్లినప్పుడు కూడా ఇదే విధంగా రాళ్ల దాడి జరిగిందన్న సంగతి కన్నాకు తెలియదేమో. తొండపి గ్రామానికి వెళ్లేటప్పుడు కన్నా లక్ష్మీనారాయణ ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాల్సింది. టీడీపీ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తల మధ్య జరిగిన ఈ ఘటనను అదుపుచేసేందుకు.. పోలీసులు వెంటనే స్పందించారన్న విషయాన్ని కన్నా లక్ష్మీనారాయణ గ్రహించాలి. నియోజకవర్గంలో శాంతిభద్రతలకు ఆటంకం కలగకుండా చూస్తున్నాం' అని మంత్రి అంబటి చెప్పారు.

చంద్రబాబుకు మతిభ్రమించింది

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా





సాక్షి, రాజమహేంద్రవరం: చంద్రబాబుకు మతిభ్రమించడంతో నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు వ్యాఖ్యలు చూస్తే రాజమహేంద్రవరం రాగానే జైలు జీవితం గుర్తుకు వచ్చినట్లుందని ఎద్దేవా చేశారు. ఇతరులపై బురద జల్లడం మాని ముందు ఆయన పార్టీలోని అంతర్గత సమస్యలను చక్కదిద్దుకోవాలని హితవు పలికారు. ఉన్నవి, లేనివి కల్పించి, వైఎస్సార్‌సీపీ, నేతలపై ప్రజల్లో వ్యతిరేకత తీసుకువచ్చే ప్రయోగం చేస్తున్నారని, చంద్రబాబుకు ఏ విషయంలోనూ చిత్తశుద్ధి లేదని దుయ్యబట్టారు.

బాబు చిప్ అరిగిపోయింది: ఎంపీ మార్గాని

చంద్రబాబుకు చిప్ అరిగిపోయి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ విమర్శించారు. సోమవారం చంద్రబాబు వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. రాజమహేంద్రవరంలో జరుగుతున్న అభివృద్ధి గురించి చంద్రబాబుకు తెలుసా అని ప్రశ్నించారు. ఆయన హయాంలో ఏనాడైనా అభివృద్ధి జరిగిందా అని ప్రశ్నించారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న బాబు జైలు కిటికీల్లోనుంచైనా అభివృద్ధి చూడాలి కదా... అని వ్యంగ్యాస్త్రం సంధించారు. లోకేశ్‌ను రాజమహేంద్రవరంలో పోటీకి దింపితే ప్రజలు చిత్తుగా ఓడిస్తారని చెప్పారు. తాను చేసిన అభివృద్ధిలో బాబు తన హయాంలో సగం చేసినట్లు నిరూపించినా తాను రాజకీయాల్లోంచి తప్పుకుంటానని మార్గాని సవాల్ విసిరారు. నోరుంది కదా అని ఇష్టమొచ్చినట్టు మాట్లాడటం సరికాదని హితవు పలికారు.

'వ్యూహం'పై వాదనలు నేడు

దర్శకుడి పిటిషన్‌ను నిర్మాత పిటిషన్‌తో జత చేయాలన్న తెలంగాణ హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: వ్యూహం చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) జారీ చేసిన సర్టిఫికెట్‌ను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఈ నెల 22న ఇచ్చిన తీర్పును కొట్టేయాలంటూ దాఖలైన పిటిషన్లపై వాదనలను మంగళవారం వింటామని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం స్పష్టం చేసింది. దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ దాఖలు చేసిన పిటిషన్ సోమవారం సీజే ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. అయితే గతంలో నిర్మాత దాసరి కిరణ్‌కుమార్ వేసిన పిటిషన్‌ను ఈ నెల 30కి వాయిదా వేయడంతో తాజా పిటిషన్‌ను కూడా దానికి జత చేయాలని రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది.



మంచి వ్యక్తి ఎలా ఉండాలో చర్చలు జరుపుతూనే ఉండకు. మంచిగా ఉండు.
- మార్కస్ అరేలియస్

సాక్షి
మంగళవారం, 30 జనవరి 2024

పిల్లిమొగ్గల రాజకీయం

అనుకున్నదే అయింది. ఊహాగానాల్ని నితీశ్ కుమార్ నిజం చేశారు. 'ఇండియా' కూటమిలో నుంచి బయటకురావడం, కూటమిలోని ఆర్జేడీతో కలసి బిహార్‌లో నడుపుతున్న సర్కార్‌కు స్వస్తి చెప్పడం, 'ఎన్డీఏ'లో మళ్ళీ చేరుతున్నట్టు ప్రకటించడం, ముందుగా మాట్లాడిపెట్టుకున్న బీజేపీ మద్దతుతో ఆదివారం కొత్త ప్రభుత్వం ఏర్పాటు చకచకా జరిగిపోయాయి. దీంతో, రానున్న ఎన్నికల రాజకీయ నాటకంలో ఒక అంకం ముగిసింది. కొత్త చర్చ మొదలైంది. తొమ్మిదోసారి ముఖ్యమంత్రి పీఠం ఎక్కుతూ, ఎన్డీఏ నుంచి ఇక అటూ ఇటూ ఎక్కడికీ పోనంటూ నితీశ్ చేసిన వ్యాఖ్యల్ని ఎవరూ నమ్మడం లేదు కానీ, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఈ బిహారీ బాబు తాజా పిల్లిమొగ్గల పర్యవసానం ఏమిటి, మోదీపై యుద్ధానికి కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు – ఒక వర్గం ఓటర్లు ఆశపడ్డ 'ఇండియా' కూటమి భవితవ్యం ఏమిటి, ఎన్డీఏ కూటమికి ఎంతగా లాభిస్తుందన్న చర్చ ఆగడం లేదు.

తరచూ పొత్తులు మారుస్తూ, నోటికొచ్చిన వివరణతో నెట్టుకొస్తున్న నితీశ్ ఇప్పుడు అత్యంత చర్చనీయాంశమైన నేత. రెండేళ్ళలో రెండోసారి, దశాబ్ది పైచిలుకులో అయిదోసారి రంగులు మార్చి, తాజాగా తొమ్మిదోసారి పీఠమెక్కి, ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్న ఆయన తీరును పలువురు తప్పుబట్టడంలో ఆశ్చర్యం లేదు. అసలు 'ఇండియా' కూటమి కట్టడంలో సూత్రధారే నితీశ్. దశాబ్దాల రాష్ట్ర రాజకీయ అనుభవం అనంతరం జాతీయ స్థాయిలో చక్రం తిప్పాలని ఆయన మోజుపడ్డారు. కూటమికి సమన్వయకర్తగా వ్యవహరించాలనీ, కాలం కలిసొస్తే రాబోయే ప్రతిపక్ష సర్కారుకు ప్రధాన మంత్రి కావాలనీ కలలు కన్నారు. కానీ, ఛాన్స్ తన దాకా రాకపోవచ్చని గ్రహించారు. పీతలబుట్ట లాంటి ప్రతిపక్షాలు, బలం పెరుగుతున్న బీజేపీ లాంటివి చూసి నితీశ్ ప్లేటు తిప్పేశారు. గెలుపు గుర్రంపై పందెం కాస్తే, పీఎం కాకున్నా ప్రయోజనాలైనా నెరవేరతాయనుకున్నారు. 'చస్తే మళ్ళీ వెళ్ళన'ని ఏడాది క్రితం అన్న ఎన్డీఏ కూటమిలోకే నిస్సిగ్గుగా ఫిరాయించారు.

ఇందులో ప్రతిపక్ష కూటమి స్వయంకృతమూ ఉంది. ఆ మధ్య 5 రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికలు వచ్చినప్పుడు, వాటిపైనే దృష్టిపెట్టి కూటమి తన పనిని పక్కనపెట్టినట్టు కనిపిస్తోంది. అలా 3 నెలల పైనే వృథా అయింది. సార్వత్రిక ఎన్నికల సన్నాహం, ప్రతిపక్షాల్లో ఏకాభిప్రాయ సాధన వెనకపట్టు పట్టింది. కనీసం 300 లోక్‌సభా స్థానాల్లో పోటీ చేస్తానంటూ కాంగ్రెస్ పట్టుబట్టడమూ కూటమి పక్షాలకు మింగుడుపడలేదు. పోనీ ఆ డిమాండ్‌కు తగ్గట్టు కాంగ్రెస్ తన బలిమిని చూపగలిగిందా అంటే అదీ లేదు. ఇటీవలి 5 రాష్ట్రాల ఎన్నికల్లో నాలుగింటిలో హస్తం వీగిపోయింది. 'ఇండియా' కూటమిలో తనదే పైచేయిగా ఉండాలన్న ఆ పార్టీ ఆశ అడియాసే అయింది. మునుపటంత బలం లేని జాతీయ పార్టీని తమ భుజాలపై మోయడానికి బలమైన ప్రాంతీయ పార్టీలు సిద్ధంగా లేవు. పైగా, కన్వీనర్ అంటూ ఎవరినీ ఎంపిక చేయకపోవడం మరో తప్పిదం. కనీస ఉమ్మడి అజెండా మొదలు సీట్ల పంపిణీ దాకా అన్నిటినీ పేరబెట్టేసరికి చివరకు వ్యవహారం చేయి దాటింది.

ఎన్నికలు కొద్ది నెలల్లోనే ఉన్నా, 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'కు ఇచ్చినంత ప్రాధాన్యం వాటికి ఇవ్వట్లేదన్నది కాంగ్రెస్‌పై మరో విమర్శ. ఈ యాత్ర ద్వారా ప్రజా బాహుళ్యంలో బలం పుంజుకొని, తమకు మరిన్ని సీట్ల కోసం గట్టిగా బేరం చేయాలనేది ఆ పార్టీ భావననీ ఓ విశ్లేషణ. ఏమైనా, ప్రతిపక్షాలు అనైక్యతతో ఇలా కుమ్ములాడుకుంటూ ఉండగానే, బీజేపీ మాత్రం ఎన్నికలకు సిద్ధమైపోతోంది. ఇప్పటికే 23 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్నికల ఇన్‌ఛార్జ్‌లను సైతం నియమించేసింది. గత వారం బులంద్‌షహర్‌లో సభతో ప్రధాని మోదీ లోక్‌సభ ఎన్నికల సమరభేరి మోగించారు. జైపూర్ లాంటి చోట్ల ర్యాలీలతో ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు. కొద్ది నెలల క్రితమే 5 రాష్ట్రాల్లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో మూడింటిని గెలుచుకోవడం సైతం బీజేపీకి కొత్త ఊపునిచ్చింది. అయోధ్య ఆలయ ప్రారంభోత్సవానికి మీడియా, అలాగే కేంద్ర సర్కార్ హంగామాతో హిందూత్వకు మారుపేరుగా ఆ పార్టీ తన స్థానం సుస్థిరం చేసుకుంది.

అందుకే, దేశంలో, ముఖ్యంగా ఉత్తరాదిన ఈ హిందూత్వ ప్రభంజనానికి ఎదురొడ్డడం ప్రతిపక్షాలకు అగ్నిపరీక్షే. పైగా, మందిర్ ప్లస్ మండల్‌గా మారిన బీజేపీ వ్యూహం పదునైనది. మండల్ రాజకీయాల ఉద్ధృతిలో వచ్చిన కుల ఆధారిత పార్టీలకు సెగ తగులుతోంది. అయితే, మోదీ సర్కార్ విభజన రాజకీయాలు చేస్తోందనీ, ప్రజాస్వామ్యానికిది ప్రమాద భరితమనీ అన్న నోటితోనే నితీశ్ మళ్ళీ అదే పంచన చేరడం ఆయన ఇమేజ్‌ను పలచన చేసింది. కుల సమీకరణలు నిష్ఠురసత్యమైనప్పటికీ, బిహార్‌లో బలం తగ్గుతున్న నితీశ్‌కూ, ఆయన పార్టీకీ తాజా పిల్లిమొగ్గ అద్భుత భవితను అందించకపోవచ్చు. నితీశ్ నైజం తెలుసు గనక ఆయన్ని అడ్డం పెట్టుకొని, లోక్‌సభ ఎన్నికల్లో 40 స్థానాల బిహార్‌లో లబ్ధి పొందాలని బీజేపీ చూస్తోంది. అవసరం తీరాక ఆ దోస్తీ కొనసాగకపోవచ్చు. లోక్‌సభ తర్వాత, అసెంబ్లీ ఎన్నికల్లోపు ఏమవుతుందో, మన 'పల్టూ రామ్' ఏం చేస్తారో చెప్పలేం.

నెలల క్రితం ఆశ రేపిన ప్రతిపక్ష కూటమి ఇప్పుడు బలహీనమైందన్నది నిజం. కానీ, ఇంతటితో కూటమి కథ ముగిసిందనడం తొందరపాటే. తొమ్మిదేళ్ళ పైచిలుకు బీజేపీ పాలనపై దేశమంతా తృప్తిగా ఏమీ లేదు. ధరలు, నిరుద్యోగం, విభజన రాజకీయాలపై జనంలో అసహనం ఉన్నా, మోదీకి ప్రత్యామ్నాయం లేకపోవడం విషాదం. మోదీని దింపాలనే తప్ప పాజిటివ్ అజెండా చెప్పలేకుంటే ఈ అసంతృప్త, అనిశ్చిత ఓటర్ గణాన్ని ప్రతిపక్షాలు ఆకర్షించలేవు. ప్రతిపక్షాలంటే కుమ్ములాటల కూటమనే భావన తొలగించకపోతే, ఎన్ని ఎన్నికలొచ్చినా అది ఎడ్వాంటేజ్ బీజేపీయే. ఇది వికసిత, ఆత్మనిర్భర్ భారత్ అవునో కాదో కానీ, 'ఇండియా' మటుకు వెలిగిపోవడం లేదంటున్నది అందుకే!

నిబద్ధతతోనే కాలుష్య నియంత్రణ

విశ్లేషణ



ఆరతీ ఖోస్లా

దేశంలోని కొన్ని ప్రాంతాల్లో అరుదుగా మాత్రమే నీలి ఆకాశం కనబడుతోంది. గాలి నాణ్యత తీవ్రతకు ఇదొక సంకేతం. వాయు కాలుష్యం ఇప్పుడు జాతీయ సమస్య. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, గాల్లోని నలుసు పదార్థాల (పీఎం) సాంద్రత 2.5 పీఎం అయితే, ఒక క్యూబిక్ మీటరుకు 5 మైక్రో గ్రాములు మించకూడదు. ఇది ఢిల్లీ లాంటి నగరంలో 102. ఈ గాలిని పీల్చడం ప్రాణాంతకం. వాయు కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి తెచ్చిన 'జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం' కొంతమేరకు ఫలితమిస్తున్నా అది సరిపోదు. మానవ కణజాలంలోకి చొచ్చుకుపోయే కాలుష్య కారకాలతో మనం వ్యవహరిస్తున్నాం. ప్రజారోగ్య దృక్కోణం నుండి చూస్తే ఎంత ప్రగతి అయినా తక్కువే. నిరంతర రాజకీయ నిబద్ధత మాత్రమే మెరుగైన ఫలితాలను ఇస్తుంది.

శీతకాలపు నెలల్లో భారీ పొగమంచుతో కప్పబడి ఉండే ఉత్తర భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో నీలి ఆకాశం, ప్రకాశవంతమైన సూర్యబింబం అరుదుగా గోచరిస్తుంటాయి. అయితే పేలవమైన గాలి నాణ్యత అనేది ఇప్పుడు జాతీయ సమస్య అయింది. కాకపోతే గత ఐదేళ్లలో, వాయు కాలుష్యం ఒక విధానపరమైన సమస్యగా కూడా గుర్తింపు పొందింది. అయినప్పటికీ 'జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమ' (ఎన్‌సీఏపీ) అయిదేళ్ల అంచనాను పరిశీలిస్తే, అర్థవంతమైన, శాశ్వతమైన ప్రయోజనాలను అందించడానికి గట్టి ప్రయత్నాలు అవసరమని తెలుస్తుంది.

అపఖ్యాతి పాలైన భారతదేశ గాలి నాణ్యతను పరిష్కరించడానికి తెచ్చిన మొదటి విధానం – 2019లో ప్రారంభించిన ఎన్ సీఏపీ. కాలుష్య స్థాయిలను, గాలిలోని నలుసు పదార్థాల గాఢతలను ప్రధాన నగరాల్లో 30 నుంచి 20 శాతం తగ్గించాలనే స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించింది. దీనికి కేంద్రం నుండి రూ. 443 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నుండి రూ. 4,400 కోట్ల ప్రారంభ కేటాయింపులు జరిపారు.

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ)కి చెందిన నిరంతర పరిసర వాయు నాణ్యతా పర్యవేక్షణ కేంద్రాల విశ్లేషణ (భారతదేశ వాయు నాణ్యతా మానిటర్ల నెట్‌వర్క్) పురోగతి స్థిరంగా ఉన్నప్పటికీ, ఎన్‌సీఏపీని అమలు చేయడంలో వ్యూహాత్మకమైన, సైన్స్ ఆధారిత మార్పుల అవసరం ఉంది. ఉదాహరణకు, ప్రపంచ ఆరోగ్య సంస్థ గాల్లోని నలుసు పదార్థాల (పర్టిక్యులేట్ మ్యాటర్) సాంద్రతకు పరిమితులు నిర్దేశించింది. 2.5 పీఎం అయితే, ఒక క్యూబిక్ మీటరుకు 5 మైక్రోగ్రాములు, 10 పీఎం అయితే ఒక క్యూబిక్ మీటరుకు 15 మైక్రోగ్రాములు మించకూడదు. ఎన్‌సీఏపీ అమలయ్యాక, ప్రత్యేకించి 2.5 పీఎం వారణాసిలో 96 నుంచి 26.9 మైక్రోగ్రాములకు తగ్గింది. ఆగ్రాలో 73 నుంచి 33కు, జోధ్‌పూర్‌లో 81.8 నుంచి 40.6కు మెరుగ్గా తగ్గింది. కానీ ఢిల్లీలో మాత్రం 108 నుంచి 102కు మాత్రమే తగ్గింది. పీఎం 2.5 స్థాయుల డేటా 2019–2023 మధ్య 46 నగరాలకు మాత్రమే అందుబాటులో ఉంది. కేవలం 27 నగరాల్లో మాత్రమే తగ్గుదల మెరుగ్గా ఉంది. 10 పీఎం విషయంలో ఐదేళ్ల డేటా కేవలం 46 నగరాలకు అందుబాటులో ఉండగా, అందులో కేవలం 24 నగరాల్లో మాత్రమే మెరుగుదల కనబడింది.

50 శాతం నగరాలు గణనీయమైన అభివృద్ధిని చూపుతున్నాయనీ, ఇది ఎన్ సీఏపీ విజయవంతమైన ప్రగతిని సూచిస్తోందనీ ఎవరైనా వాదించవచ్చు. కానీ మనం మానవ కణజాలంలోకి చొచ్చుకుపోయే కాలుష్య కారకాలతో వ్యవహరిస్తున్నాము. పైగా రక్తపోటు, మధుమేహం వంటివాటిని ఇవి మరింత తీవ్రతరం చేయవచ్చు. 2.5 పీఎం రక్త–మెదడు అవరోధాన్ని కూడా దాటవచ్చు. దీర్ఘకాలం అలాంటి గాలిలో మసలితే ప్రాణాంతకం అవుతుంది.



కాబట్టి, ప్రజారోగ్య దృక్పథం నుండి చూస్తే మరింత కఠినమైన ప్రగతి అత్యవశ్యం.

మరో సమస్య ఏమిటంటే, ఎన్‌సీఏపీలో సమన్వయం కొరవడింది. ఢిల్లీ లాంటి నగరంలో సరి–బేసి ట్రాఫిక్‌ను అమలు చేయడం, 'జాతీయ రాజధాని ప్రాంతం' నుండి నిబంధనలు పాటించని వాహనాలను తొలగించడం, వ్యర్థాలను బహిరంగంగా కాల్చడాన్ని నిరోధించడం, దుమ్మును తగ్గించడానికి రోడ్లపై నీటిని చల్లడం వంటి చర్యలు అన్నీ అమలవుతున్నాయి. అయినప్పటికీ, కాలుష్యానికి సంబంధించిన ఇవే కారణాలు ఉన్న మిగిలిన ప్రాంతాలకు విస్తరించకుంటే ఈ చర్యలు సరిపోవు. పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్‌లలో పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల దట్టమైన పొగమంచుతో చలికాలం ప్రారంభం కావడం దీనికి స్పష్టమైన ఉదాహరణ. ఢిల్లీ నగరంలో నమోదైన సుమారు 80 లక్షల వాహనాలు పరిస్థితిని మరింత దిగజార్చాయి. ఉష్ణోగ్రతలో తగ్గుదల గాలిలో నిలిచివుండే అణువుల స్థాయులను ప్రమాదకరంగా పెంచుతుంది. ఈ కాక్‌టెయిల్‌ను ఢిల్లీ నివాసులు ప్రతి సంవత్సరం కొన్ని వారాల పాటు పీల్చుకుంటున్నారు. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్) ప్రతి శీతాకాలంలో ఢిల్లీ–జాతీయ రాజధాని ప్రాంతంలో ఊహించిన ప్రతిస్పందనగా అమలులోకి వస్తుంటుంది. అయితే దాని ఆధారాన్ని తగ్గించడమే లక్ష్యం కావాలి.

రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సజావుగా సమన్వయం లేకపోతే ఈ సమస్య ఇలాగే కొనసాగుతుంది. జాతీయ రాజధాని వెలుపల, సీపీసీబీ పర్యవేక్షణ నెట్‌వర్క్ అసమానంగా ఉందని మా విశ్లేషణ చూపుతోంది. ఇది మూల్యాంకనానికి వ్యత్యాసాల పొరను జోడిస్తుంది. ముజఫర్‌పూర్, బిహార్ లాంటి రద్దీ ప్రదేశాలలో కేవలం మూడు మానిటర్లు ఉన్నాయి. అదే ఢిల్లీ అంతటా 37 స్టేషన్‌లు, ముంబై అంతటా 22, హైదరాబాద్‌లో 14 స్టేషన్లు ఉన్నప్పుడు మనం తప్పుడు నిర్ధారణలకు వచ్చే ప్రమాదం ఉంది. ప్రామాణిక పర్యవేక్షణ విధానంలో, పోల్చదగిన జనాభా ఉన్న నగరాలు ఒకే విధమైన లేదా కనీసం సారూప్య సంఖ్యలో గాలి నాణ్యత మానిటర్లను కలిగి ఉంటాయి. స్థానిక కాలుష్య మూలాల శాస్త్రీయ అవగాహన ఆధారంగా ఆ స్థానాలు ఉంటాయి. నగరాల కాలుష్య సాంద్రతలు ఒకే పారామితుల సెట్‌లో ట్రాక్ చేయబడతాయి. ఇది వాటి గాలి నాణ్యత ధోరణులపై 'గ్రాన్యులర్'(కణికీయ) అవగాహనను పెంపొందించడంలో సహాయపడుతుంది.

వాయు కాలుష్య ప్రయత్నాలకు సంబంధించిన నిధుల కేటాయింపుల్లో కూడా సమస్యలున్నాయి. తీవ్ర సమస్యను ఎదుర్కొంటున్న ఢిల్లీకి కేవలం రూ.38 కోట్లు మాత్రమే అందాయి. అందులో అది 10 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. గాలి నాణ్యత చర్యల కోసం వర్తించే నిధులను క్రమబద్ధీకరించడంలో ఇదొక ప్రశ్నగానే ఉండిపోతుంది. గ్రేటర్ ముంబైకి రూ.938 కోట్లు అందగా, దానిలో రూ.660 కోట్లు వినియోగించుకుంది.

అయినప్పటికీ, జాతీయ స్వచ్ఛ వాయు పథకం(ఎన్‌సీఏపీ)లో సానుకూల అంశాలున్నాయి. వీటిలో మొదటిది 2026 నాటికి 10 పీఎం గాలి సాంద్రతలను 40 శాతానికి తగ్గించడం. ఇది ప్రతిష్ఠాత్మకమైన లక్ష్యాన్ని నిర్దేశిస్తోంది. అందుకే దీన్ని ఎన్‌సీఏపీ అమలు కాని నగరాలకు కూడా విస్తరించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే గ్రేటర్ నోయిడా (ఉత్తర ప్రదేశ్), భివాడీ (రాజస్థాన్) వంటివి తీవ్ర కాలుష్య స్థాయులను నివేదించాయి.

ఇంకా, రంగాల వారీగా వివరణాత్మక చర్యలు ఉండాలి. ఇటుక బట్టీలు, నిర్మాణాలు, కూల్చివేత ప్రాజెక్టుల వంటి అత్యంత కాలుష్య కారకాలకూ... సిమెంట్, ఉక్కు కర్మాగారాలకూ భిన్నమైన విధానం అవసరం. అదేవిధంగా, ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతం మాత్రమే నిర్దిష్ట వయస్సు దాటిన పెట్రోల్, డీజిల్ వాహనాలను నిషేధించింది. కానీ దేశవ్యాప్తంగా కఠినమైన, కాలుష్య నియంత్రణ వ్యవస్థ లేకపోతే... ప్రమాణాలను అందుకోని వాహనాలను ఇతర నగరాలకు తరలించే ప్రమాదం ఉంది. అప్పుడు కాలుష్య భారం మారదు. మరీ ముఖ్యంగా, ఎన్‌సీఏపీ ప్రధాన అంశంగా ప్రజారోగ్యం ఉండాలి. ప్రతి కొలమానాన్ని తప్పనిసరిగా ప్రతిపాదించాలి, చర్చించాలి. అంతే గాకుండా వాయు కాలుష్య కారకాలను తగ్గించడం పట్ల నిర్మాణాత్మకంగా ఉండాలి.

మనం ఎన్‌సీఏపీ రెండవ దశలోకి ప్రవేశించినప్పుడు చాలా ఆశించవచ్చు. ప్రభుత్వం అత్యున్నత స్థాయిలో సమస్యను అంగీకరించడం అనేది మాత్రం ఇప్పటికి సానుకూలాంశం. కానీ నిరంతర రాజకీయ నిబద్ధత మాత్రమే బలమైన ఫలితాలను ఇస్తుంది.

వ్యాసకర్త న్యూఢిల్లీలోని క్లైమేట్ ట్రెండ్స్ డైరెక్టర్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇదే ఆహ్వానం



కృత్రిమ మేధ(ఏఐ) వల్ల చాలా ఉద్యోగాలు పోతాయంటున్నారు. నిజంగా అదే భయమా? కానీ తాము చేస్తున్న పని ఎవరికైనా నచ్చుతున్నదేమో అడగండి. ఇంకే అవకాశం లేనందువల్లే చేస్తున్నామని 90 శాతం మంది చెబుతారు. జనానికి కొత్తవి అన్వేషించే అవకాశం ఏఐ ఇస్తుంది. సరదా, సృజనలతో పాటు ఉత్పాదకత పెరుగుతుంది. జనానికి ఎంపిక అవకాశం ఉంటుంది.

– శేఖర్ కపూర్, దర్శకుడు

ఈగో రోగం



పేషెంట్‌ను చూసిన తర్వాత శానిటైజర్‌తో శుభ్రం చేసుకున్నందుకు గురుగావ్‌లో ఒక డాక్టర్ మీద దాడి జరిగింది. డియర్ పేషెంట్స్... మేము మా చేతుల్ని కేవలం మాకోసమే శానిటైజ్ చేసుకోం, తర్వాతి పేషెంట్‌కు సూక్ష్మక్రిములను అంటించకుండా ఉండటం కోసం కూడా చేసుకుంటాం. దయచేసి హింసకు దూరంగా ఉండండి.

– జోయితా, ఫిజిషియన్

ఉదారంగా లేరు!



అభిప్రాయాల కోసం జనాలు తమ స్నేహాలు వదిలేసుకుంటున్నారు. అయితే, ఇది అందరికీ వర్తించదు. 'మరీ రైట్ వింగ్', 'మరీ ధార్మికం', 'మరీ జాతీయవాది', 'మోదీ అంటే ఎక్కువిష్టం' లాంటి కారణాలతో పాత స్నేహాలను వదిలేసుకునే వాళ్లలో 'లిబరల్స్' ఎక్కువ.

– మనూ జోసెఫ్, రచయిత

బహుపరాక్



ఇండియాలోని ఐటీ జనుల్లారా... తుఫాను రాబోతోంది. చాలా పెద్దది. 25–30 ఏళ్లుగా తక్కువ పనికి ఎక్కువ వేతనంలా సాగిన దశ ముగియనుంది. మీకూ, నాకూ కూడా! తుఫాను రాబోతోంది. మిమ్మల్ని మీరు బిగించి కట్టుకోండి.

– అమిత్ బెహెరె, సాఫ్ట్‌వేర్ డెవలపర్

ఎలా పడిపోయింది?



ఒక డాలర్ కొనుగోలుకు కావాల్సిన రూపాయలు: 2024లో 83. 2014లో 60. 1894లో 3. ఇది మనకు స్వామి వివేకానంద వల్ల తెలుసు. 1894 జూలై 11న ఆయన 'డెట్రాయిట్ ఉపన్యాసం వల్ల నేను 900 డాలర్లు సంపాదించాను, అనగా రూ. 2,700' అని రాశారు.

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

కోవిడ్ యోధులు చిరస్మరణీయులు

మానవ జీవితంలో ఆరోగ్యం ప్రధానమైంది. వైద్యులు, వైద్యసిబ్బంది సమాజాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు నిత్యం కృషిచేస్తుంటారు. ముఖ్యంగా కోవిడ్–19 మహమ్మారి కాలంలో జీవితాన్ని పణంగా పెట్టి అహర్నిశలూ కరోనా బాధితులకు వైద్యచికిత్సలను అందించి, వారి ప్రాణాలను కాపాడిన వైద్యులు, నర్సులు, ఇతర వైద్యసిబ్బంది సేవలు విలువ కట్టలేనివి. కోవిడ్–19 మహమ్మారి విలయతాండవం చేసిన రోజులవి. ఒక మనిషిని మరో మనిషి తాకడానికి భయపడిన కాలం. సొంత తల్లిదండ్రులు, తోబుట్టువులు మరణించినపుడు వారి అంత్యక్రియలను సహితం నిర్వర్తించలేని అశక్తులుగా దుఃఖాన్ని దిగమింగుకున్నారు.



మనిషి ఊహించలేని అలాంటి పరిస్థితులు ఎదురైనపుడు ప్రభుత్వం, డాక్టర్లు, వైద్యబృందం, పోలీసులు, పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక సంస్థలు, అగ్నిమాపక సిబ్బంది, మీడియా వంటి ప్రభుత్వ/స్వచ్ఛంద సేవా సంస్థల సాయం ఎనలేనిది. వేలాదిమంది తమ ముందే ప్రాణాలను కోల్పోతున్నా, ఆందోళనను అదుపులో ఉంచుకుని, ధైర్యంగా సాయం అందించారు పైన పేర్కొన్నవారందరూ.

కోవిడ్ వల్ల ప్రపంచ దేశాలన్నీ అస్తవ్యస్తమై అచేతనంగా ఉండిపోయిన కాలంలో వైద్యపరిశోధన సంస్థలు యుద్ధప్రాతిపదికన వివిధ రకాల ఔషధాలను తయారుచేయటం మరో అంశం. కోవిడ్–19ను ఎదుర్కోవటంలో ఫ్రంట్‌లైన్‌లో ఉండి పనిచేసిన వైద్యులు, సిబ్బందిలోనూ ఎందరో అమరులైన విషయం మనం మరువకూడదు. వీరి కారణంగా ఆయా కుటుంబాల్లోని వారూ కొందరు కోవిడ్ బాధితులయ్యారు.

కోవిడ్–19గా నామకరణం చేసిన మహమ్మారి వైరస్ చైనాలో తలెత్తి, ప్రపంచాన్ని అతలాకుతలం చేసింది. భారతదేశంలో 2020 జనవరి 30న చైనా నుంచి వచ్చిన కేరళ విద్యార్థి ద్వారా తొలి కరోనా కేసు నమోదైన విషయం తెలిసిందే. వైరస్ విస్తరణతో మార్చి 23న కేంద్ర ప్రభుత్వం లాక్‌డౌన్ ఆదేశాలు జారీ చేయాల్సి వచ్చింది. ఇలాంటి ఆత్యయిక పరిస్థితుల్లో ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించిన తీరు అద్భుతం. వందలాది పడకలతో క్వారంటైన్ కేంద్రాలు ఏర్పాటుచేసి ప్రతి కేంద్రంలో ఉచిత వైద్యం, ఆహారం అందిస్తూ కోవిడ్ నుంచి బాధితులు స్వస్థత పొందటానికి అహరహం కృషి చేశాయి.

కరోనా మహమ్మారిపై పోరాటంలో భాగంగా దేశవ్యాప్తంగా వేలాదిమంది డాక్టర్లు అమరులయ్యారు. వారిని స్మరిస్తూ 'ఇండియన్ మెడికల్ అసోసియేషన్' నివాళి అర్పించే కార్యక్రమాన్ని 2021 జనవరి 30వ తేదీన నిర్వహించింది. ఈ ఏడాది కూడా వారిని గుర్తుచేసుకుంటూ అనేక చోట్ల డాక్టర్లు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో వైరస్ బారినపడి అకాల మరణం చెందిన వైద్యులను, సిబ్బంది స్మరించుకోవటం, నివాళి అర్పించటం ఉత్తమ సంస్కారం. ప్రతి ఆసుపత్రి ప్రాంగణంలో జనవరి 30వ తేదీన మైనపు వత్తులు వెలిగించి, అమరులైన వైద్య సిబ్బందికి నమస్కరించటం మహా సంస్మరణ. అది మన కనీస కర్తవ్యం కూడా!

– డా॥ గుజ్జర్లమూడి హిమబిందు । మచిలీపట్నం

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

రచ్చ రేపిన కొత్త మరణ దండన

ప్రపంచదేశాల్లో ఇప్పటి వరకూ మరణ శిక్ష... ఉరి, విద్యుత్ కుర్చీ, విషపు ఇంజెక్షన్స్, తుపాకీ కాల్పులు వంటి పద్ధతుల ద్వారా ఎక్కువగా అమలవుతూ వస్తోంది. కానీ ప్రపంచంలోనే తొలిసారిగా అమెరికాలో ఓ 58 ఏళ్ల హంతకుడికి నైట్రోజన్ గ్యాస్ ద్వారా మరణ శిక్ష విధించారు. దీనిపై ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చ జరుగుతోంది. ఐక్యరాజ్య సమితి, ఐరోపా సమాఖ్య సహా పలు సంస్థలు, వ్యక్తుల నుంచి ఈ తరహా మరణశిక్ష అమలు అనాగరికమంటూ తీవ్రస్థాయిలో నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

అమెరికాలోని దక్షిణాది రాష్ట్రమైన అలబామాలో ఇటీవలే ప్రయోగాత్మకంగా స్మిత్ అనే ఖైదీకి మాస్క్ తగిలించి అందులో నైట్రోజన్ గ్యాస్ పంపడం ద్వారా అతన్ని అపస్మారక స్థితిలోకి తీసుకెళ్లి మరణశిక్షను విజయవంతంగా అమలు చేశారు. అంతే కాదు ఈ మరణశిక్ష అమలును వీక్షించేందుకు కెన్నెత్ స్మిత్ కుటుంబీకులు, బాధిత కుటుంబ సభ్యులు, లాయర్లను కూడా పరిమిత సంఖ్యలో అనుమతించారు. చాలా సులువుగా కేవలం 22 నిమిషాల వ్యవధిలో కెన్నెత్ స్మిత్ ప్రాణాలు కోల్పోయాడు. కానీ ఇప్పుడు దీన్ని అమలు చేసిన అమెరికా మాత్రం ప్రపంచం దృష్టిలో దోషిగా నిలబడింది. స్వదేశంలోనే ఈ మరణదండనపై తీవ్ర నిరస నలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు ఐక్యరాజ్య సమితి, ఐరోపా దేశాల సమాఖ్య (ఈయూ)లు అమెరికా తీరును ఖండించాయి. ఈ ఖండనలు, నిరసనలు ఏ స్థాయిలో ఉన్నా యంటే స్వయంగా వైట్ హౌస్ ఈ నైట్రోజన్ గ్యాస్ మరణ శిక్ష తమను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టిందనీ, ఇది క్రూరంగానే ఉందనీ అంగీకరించింది.

అమెరికాలో తాజాగా రెండు మరణశిక్షలు ఇంజెక్షన్ ద్వారా అమలు చేశారు. ప్రస్తుతం నైట్రోజన్ మరణశిక్షను అమలు చేసిన అలబామాతో పాటు మరో రెండు రాష్ట్రాలు ఓక్లహోమా, మిస్సిసిపీలు ఈ తరహా మరణ శిక్ష అమలును ఆమోదించాయి. తాజాగా జరిగిన నైట్రోజన్ మరణశిక్ష అమలును అలబామా అటార్నీ జనరల్ స్టీవ్ మార్షల్ సమర్థించుకున్నారు. ఇది పూర్తిగా ప్రొఫెషనల్ పద్ధతిలో జరిగిందన్నారు.

కెన్నెత్ యూజీన్ స్మిత్‌కు ప్రాణాంతకమైన మందులతో మరణశిక్ష అమలు చేయాలని 2022 నవంబర్‌లో నిర్ణయించారు. జైలు సిబ్బంది ఒక ఇంట్రావీనస్ లైన్‌ను చొప్పించారు. అయితే ప్రాణాంతక ఇంజెక్షన్‌ను ఇవ్వడానికి రెండు లైన్లు అవసరం. రెండవ లైను చొప్పించడానికి వారు ఒక గంట పాటు పోరాడిన తర్వాత, ఉరిశిక్ష రద్దు చేశారు. కానీ స్మిత్ 1988లో ఒక బోధకుని భార్యను కిరాయికి చంపిన కేసులో ఇటీవల దోషిగా తేలడంతో మరణ శిక్ష విధించింది కోర్టు. ఈ శిక్షను నైట్రోజన్ వాయువును ఉపయోగించి అమలు చేశారు.

అమెరికా రాష్ట్రాలు కొన్ని ఇప్పటికీ ఉరి, ఫైరింగ్ స్క్వాడ్ లేదా ఎలక్ట్రిక్ కుర్చీ ద్వారా మరణ దండన విధానాన్ని అమలు చేస్తున్నాయి. కొన్ని రాష్ట్ర న్యాయస్థానాలు మాత్రం పలు రకాల మరణశిక్ష పద్ధతులను నిషేధించాయి. అయితే, గత కొన్ని దశాబ్దాల కాలంలో చాలా రాష్ట్రాలు ప్రాణాంతకమైన ఇంజెక్షన్ ద్వారా మరణ శిక్షను అమలు చేయడానికి అంగీకరించాయి.

స్మిత్‌కు మునుపటి ఉరిశిక్ష అమలుకు చాలా నెలల ముందు, అలబామా అధికారులు మరో ఖైదీ అలాన్ మిల్లర్‌కు ఐవీ సూదిని చొప్పించడంలో ఇబ్బందుల కారణంగా మరణశిక్ష అమలు చేయడంలో విఫలమయ్యారు. అలాగే ఇతర ప్రాణాంతక ఇంజెక్షన్ ద్వారా కూడా మరణశిక్ష అమలు కాలేదు. అగ్రరాజ్యంలోని పలు రాష్ట్రాలు ఇటీవల ప్రాణాంతక ఇంజెక్షన్ మందులను పొందడంలో పెద్ద ఎత్తున ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఔషధ తయారీదారులు యునైటెడ్ కింగ్‌డమ్, యూరోపియన్ యూనియన్‌లు 2011లో ఇటువంటి ప్రాణాంతక ఇంజెక్షన్‌ల ఎగుమతులను నిషేధించాయి.



ప్రతీకాత్మక చిత్రం

దీంతో ఔషధ తయారీ కంపెనీలు వాటి తయారీని నిలిపివేశాయి. ఈ కారణంగా మరణ శిక్షను అమలు చేయడానికి రాష్ట్రాలుఇతర మార్గాల కోసం అన్వేషిస్తున్నాయి. అందులో ఒకటి నైట్రోజన్ వాయువును అందించి ప్రాణాలు తీయడం.

దోషి కెన్నెత్ స్మిత్ ముఖానికి మాస్క్ కట్టి, స్వచ్ఛమైన నైట్రోజన్ వాయువును జైలు అధికారులు అందించారు. వాయువు విషపూరితమైనది కాదు. భూ వాతావరణంలో మూడు వంతుల కంటే ఎక్కువ నైట్రోజన్ ఉంటుంది. కానీ స్వచ్ఛమైన సాంద్రీకృత రూపంలో ఉన్న ఈ గ్యాస్‌ను పీల్చడం వల్ల మెదడుకు ప్రసారం అయ్యే ఆక్సిజన్ ఉక్కిరిబిక్కిరి అవుతుంది. అలబామా స్టేట్ అటార్నీ జనరల్ స్టీవ్ మార్షల్ మాట్లాడుతూ... నైట్రోజన్ వాయువును ఉపయోగించి, మరణశిక్షను అమలు చేయడం అత్యంత మానవీయమైన పద్ధతి' అని పేర్కొనడం గమనార్హం.

– వి.వి. వెంకటేశ్వరరావు
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ । 63008 66637

ప్రేమ పాశం

మహాయోగులు కూడా ఏ పరమ పురుషుని పాద ధూళిని కొంచెం కూడా తాకలేరో, అటువంటి విష్ణువుని, కృష్ణావతారంలో చిన్ని కృష్ణుని పెంచిన భాగ్యం తల్లి యశోదమ్మది. జగత్తునంతా పాలించే ప్రభువైన దేవునికి పాలిచ్చి పెంచే తల్లిగా జన్మించిన యశోదమ్మదెంత పుణ్యమో!

చిన్ని కృష్ణయ్య ఈ క్షణం ఈ ఇంట్లో ఉంటే, మరో క్షణం మరో ఇంట్లో ప్రత్యక్షమయ్యేవాడు. ఒకరోజు పక్కింట్లో రోలు తిరగేసి ఎక్కి ఉట్టి మీద వెన్న తీస్తుండగా యశోదమ్మ చూసింది. బెత్తం పట్టుకుని నల్లనయ్యని 'నువ్వు ఇంతవరకు ఎవరికీ చిక్కలేదని, నిన్ను ఎవరూ శిక్షించలేరని అనుకుంటున్నావు. ఇవాళ ఎలా తప్పించుకుంటావో చూస్తాను' అంటూ బెదిరించింది. అంతలోనే పెల్లుబికిన మాతృ హృదయం! 'ఇతడిని పసివాడనుకుందామా అంటే ఒకోసారి ఇలాంటి నడవడిక పెద్దవాళ్లకు కూడా ఉండదు. తననెవరైనా చూస్తే పారిపోవాలని కూడా తెలియని అమాయకుడు. భయం అనేది తెలియని ఇతడిని ఎలా దారికి తేవాలి? అప్పుడప్పుడు దెబ్బలు తగలనిస్తూ ఉండాలి. దుండగులైన పిల్లలకు దండోపాయమే సరి' అనుకుంటూ 'ఆగు, ఆగు' అంటూ బెత్తం ఝళిపించింది.



కృష్ణుడు భయపడ్డట్లు ముఖం పెట్టి కాలి గజ్జెలు ఘల్లుఘల్లుమంటుంటే పారిపోసాగాడు. యశోదా దేవి బాలుని వెంట పరుగెత్తింది. 'ఈ ఒక్కసారికి క్షమించ'మని దొంగ కన్నీళ్ళతో ఏడుస్తున్న కృష్ణుని యశోద ఎలాగైతేనేం పట్టుకుంది. 'ఎక్కడ బడితే అక్కడ తిరుగుతూ ఉంటావు. ఒకచోట కుదురుగా ఉండవం'టూ మందలిస్తున్నట్లు అన్న మాటల్లో దేవదేవుని సర్వాంతర్యామిత్వాన్ని చెప్పకనే చెప్పింది. కృష్ణుని రోటికి కట్టడానికి యశోద ఎంత తాడు తెచ్చినా అది రెండంగుళాలు తక్కువవుతూ వచ్చింది. ఆ తాడు సాధారణమైనది కాదు. అది ప్రేమ పాశం. భగవంతుడు నిష్కల్మష ప్రేమకు వశుడవుతాడు. ఎవరికీ చిక్కని కన్నయ్య యశోదమ్మకు చిక్కాడు. మరొకటి లేదు.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** బ.పంచమి పూర్తి (24 గంటలు), **నక్షత్రం:** ఉత్తర రా.7.47 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** తె.5.03 నుండి 6.47 వరకు (తెల్లవారితే బుధవారం), **దుర్ముహూర్తం:** ఉ.8.49 నుండి 9.37 వరకు, తదుపరి రా.10.58 నుండి 11.46 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.45 నుండి 1.33 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.50.

వెయిట్ లిఫ్టింగ్‌లో స్వర్ణం, 2 రజత పతకాలు

- స్విమ్మింగ్‌లో మరో రజతం సొంతం
- ఖేలో ఇండియా పోటీల్లో ఏపీ క్రీడాకారుల ప్రతిభ


సిహెచ్.వంశీ, ఎ.అరుణేశ్‌బాబు


జె.దేవిశ్రీ, జి.సంపత్ కుమార్

సాక్షి, అమరావతి: చెన్నైలో జరుగుతున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నారు. సోమవారం వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో ప్రతిభ చూపి మూడు పతకాలు సొంతం చేసుకున్నారు. పురుషుల 102 కేజీల విభాగంలో సిహెచ్.వంశీ స్వర్ణం, 96 కేజీల విభాగంలో ఎ.అరుణేశ్‌బాబు రజతం, మహిళల 71 కేజీల విభాగంలో జె.దేవిశ్రీ రజత పతకాలు సాధించారు. స్విమ్మింగ్ 400 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో జి.సంపత్ కుమార్ యాదవ్ రజత పతకాన్ని ఒడిసిపట్టారు. ఇప్పటి వరకు ఏపీ 20 మెడల్స్‌తో పతకాల పట్టికలో 15వ స్థానంలో నిలిచింది.

రూ.50 లక్షలకు టీడీపీ నేత టోకరా

- మైదుకూరు టీడీపీ పార్లమెంటరీ జిల్లా అధికార ప్రతినిధి మల్లిఖార్జునయాదవ్‌పై చీటింగ్ కేసు
- బాధితుడు ఓ డీఎస్పీ కుమారుడు


చంద్రబాబుతో మల్లిఖార్జునయాదవ్ (ఫైల్)

బొమ్మలసత్రం (నంద్యాల): తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్ట్ పనులు చేద్దామని చెప్పి ఓ డీఎస్పీ కుమారుడ్ని నిండా ముంచేసిన ఘటనలో మైదుకూరు టీడీపీ పార్లమెంటరీ జిల్లా అధికార ప్రతినిధి మల్లిఖార్జునయాదవ్‌పై చీటింగ్ కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వైఎస్సార్ జిల్లా మైదుకూరు టీడీపీ ఇన్‌ఛార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్ సన్నిహితుడు, కాంట్రాక్టర్ మల్లిఖార్జునయాదవ్ హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో నివాసముంటున్నాడు. తెలంగాణ రాష్ట్రంలోని వనపర్తి, కొల్లాపూర్ మధ్య కేతిపల్లి గ్రామంలో వంతెన నిర్మాణ పనులకు కాంట్రాక్ట్ దక్కించుకున్నాడు. ఈ నేపథ్యంలో నంద్యాలలో నివశిస్తున్న కర్నూలు, నంద్యాల జిల్లాల ఇంటెలిజెన్స్ విభాగం ఇన్‌ఛార్జ్ డీఎస్పీ యుగంధర్ కుమారుడు చిరంజీవిని భాగస్తుడిగా చేసుకుని కాంట్రాక్ట్ పనులు పూర్తి చేశారు. మల్లిఖార్జునయాదవ్ తప్పుడు లెక్కలు చూపిస్తున్నాడనే అనుమానంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో చిరంజీవికి రూ.80 లక్షలు చెల్లించేలా మల్లిఖార్జునయాదవ్ ఒప్పందం చేసుకున్నాడు. అయితే రూ.30 లక్షలు చెల్లించి.. మిగతా రూ.50 లక్షలు చెల్లించకుండా మొండికేశాడు. దీంతో చిరంజీవి నంద్యాల తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మల్లిఖార్జునయాదవ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ దస్తగిరిబాబు తెలిపారు.

'సిద్ధార్థ'కు ఉత్తమ దిగుమతిదారు అవార్డు


అవార్డు స్వీకరిస్తున్న నవీన్ కుమార్

శ్రీసిటీ(సత్యవేడు, తిరుపతి జిల్లా): శ్రీసిటీకి చెందిన సిద్ధార్థ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఉత్తమ దిగుమతిదారు అవార్డు లభించింది. అంతర్జాతీయ కస్టమ్స్ డే- 2024 సందర్భంగా 2022- 23 ఆర్థిక సంవత్సరంలో పనితీరు ఆధారంగా విజయవాడలోని కస్టమ్ ప్రివెంటివ్ కమిషనరేట్ కార్యాలయం వారు ఈ అవార్డు ప్రకటించారు. ఈ నెల 27న కాకినాడలో జరిగిన కార్యక్రమంలో కస్టమ్స్ అండ్ సెంట్రల్ పన్నుల చీఫ్ కమిషనర్ నుంచి సిద్ధార్థ కంపెనీ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్ ఈ అవార్డును అందుకున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీ సాధించిన విజయాల గణాంకాలు పరిశీలిస్తే రూ.96,133.29 కోట్ల దిగుమతులు, రూ.13,294.51 కోట్లు దిగుమతి సుంకాలుగా నమోదయ్యాయి. సిద్ధార్థ లాజిస్టిక్స్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకోవడం ఇది వరుసగా రెండవ సంవత్సరం కావడం విశేషం. తమ సిబ్బంది అత్యుత్తమ పనితీరు, సమష్టి కృషికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందని సిద్ధార్థ లాజిస్టిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ నిశ్చల్ పాధ్య తెలిపారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, సిద్ధార్థ లాజిస్టిక్స్ బృందాన్ని అభినందించారు.

రూ.2 కోట్ల బీమా పరిహారం చెల్లించాల్సిందే

- ఎల్ఐసీని ఆదేశించిన జిల్లా వినియోగదారుల కమిషన్
- నగదు చెల్లింపునకు 60 రోజుల సమయమిస్తూ తీర్పు

అనంతపురం: బాధిత కుటుంబానికి ఏకంగా రూ.2 కోట్ల బీమా పరిహారం చెల్లించాలని జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)ను అనంతపురం జిల్లా వినియోగదారుల కమిషన్ ఆదేశించింది. ఈ మేరకు సోమవారం తీర్పు వెలువరించింది. అనంతపురం నగరానికి చెందిన శ్రీనివాసులు 2018 జూలై 17న అన్నమయ్య జిల్లా పీలేరు ఎల్ఐసీ బ్రాంచ్‌లో 'జీవన్ లాభ్' బీమా పాలసీ తీసుకున్నారు. రూ.5 లక్షలకు పైగా ప్రీమియం చెల్లించారు. ప్రీమియం చెల్లింపునకు తన ఆర్థిక స్థితికి తోడుగా ఉన్న భార్య లక్ష్మీదేవి ఆదాయాన్ని కూడా కనబరిచారు. ఏజెంట్ సూచనల మేరకు ప్యానెల్ వైద్యాధికారి నుంచి మెడికల్ సర్టిఫికెట్ కూడా పొందారు. సాధారణ మరణానికి రూ.కోటి, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 కోట్ల బీమా పరిహారం వర్తిస్తుంది. ఇదే కాకుండా మరికొన్ని పాలసీలు కూడా తీసుకున్నారు. కాగా.. 2020 ఫిబ్రవరి 16న శ్రీనివాసులు రైలు పట్టాలు దాటుతూ ప్రమాదవశాత్తు రైలు కింద పడి మరణించాడు. ఈ మేరకు రైల్వే పోలీసులు కూడా నిర్ధారించారు. కానీ మిగిలిన పాలసీలకు చెల్లింపులు చేసి..'జీవన్ లాభ్' కింద రూ.2 కోట్ల బీమా పరిహారం చెల్లింపునకు ఎల్ఐసీ నిరాకరించడంతో శ్రీనివాసులు భార్య లక్ష్మీదేవి జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. పాలసీదారునికి ప్రీమియం చెల్లించే ఆర్థిక స్తోమత లేదని, ఏజెంట్‌తో కుమ్మక్కై బీమా సంస్థ నుంచి దురుద్దేశపూర్వకంగా పాలసీ పొందారని, మరొక భారీ రుణం ఉందని తెలియపరచలేదని, రైలు కింద పడి మరణించడం కూడా అనుమానాస్పదంగా ఉన్నందున బీమా వర్తింపు చేయడం కుదరదని ఎల్ఐసీ తరఫు న్యాయవాది వాదించారు. ఈ వాదనలను కమిషన్ పరిగణనలోకి తీసుకోలేదు. పాలసీదారుడు ప్రమాదవశాత్తు మరణించినట్లు అన్ని ఆధారాలు చూపినందున రూ.2 కోట్ల బీమా పరిహారాన్ని 60 రోజుల్లోగా చెల్లించాల్సిందేనని కమిషన్ ఆదేశించింది. అలాగే సేవా లోపానికి, మనోవేదనకు అదనంగా రూ.50 వేలు, ఖర్చుల కింద రూ.5 వేలు చెల్లించాలని కమిషన్ అధ్యక్షురాలు ఎం.శ్రీలత, సభ్యులు డి.గ్రేస్‌మేరీ, బి.గోపీనాథ్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది.

20 శాతం సొమ్ములు ఇచ్చేస్తాం



డిపాజిటర్లకు జయలక్ష్మి సొసైటీ చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు హామీ

కాకినాడ రూరల్: నష్టపోయిన జయలక్ష్మి సొసైటీ డిపాజిటర్లకు 20 శాతం సొమ్ము లిచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు స్పష్టం చేశారు. ఈ సొసైటీ గత పాలకవర్గం పలు జిల్లాల్లోని డిపాజిటర్లకు సుమారు రూ.500 కోట్ల మేర శఠగోపం పెట్టడం.. దీనిపై సీఐడీ విచారణ జరుగుతున్న విషయం తెలిసిందే. కాకినాడ సర్పవరం జంక్షన్ వద్ద ఉన్న సొసైటీ మెయిన్ బ్రాంచిలో సోమవారం త్రినాథరావు విలేకరులతో మాట్లాడారు. జయలక్ష్మి సొసైటీ నుంచి రుణాలు తీసుకున్న వారికి సంబంధించిన రూ.500 కోట్ల విలువైన ఆస్తులను ఏపీ సీఐడీ అధికారులు సీజ్ చేశారన్నారు. మొదటి చార్జిషీట్‌లోని 64 ఆస్తులకు సంబంధించిన జీఓ తాలూకు సేల్ ఆర్డర్ కోర్టు నుంచి రావాల్సి ఉందని, దీనికోసం ఎదురు చూస్తున్నామని చెప్పారు. ఆ ఆస్తుల అమ్మకం ద్వారా సుమారు రూ.150 కోట్లు వచ్చే అవకాశం ఉందన్నారు. రెండు, మూడు చార్జిషీట్ల దాఖలుకూ సీఐడీ సిద్ధమవుతున్నదని తెలిపారు.

భారవికి వేటూరి కవితా పురస్కారం ప్రదానం



తుని: కాకినాడ జిల్లా తుని పట్టణంలోని చిట్టూరి మెట్రోలో వేటూరి సాహితీ పీఠం, శ్రీప్రకాష్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేటూరి సుందరరామ్మూర్తి జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు సినీ రచయిత, దర్శకుడు జేకే భారవికి వేటూరి కవితా పురస్కారం ప్రదానం చేశారు. ప్రతిష్టాత్మక వేటూరి కవితా పురస్కారం అందుకోవడం తన పూర్వజన్మ సుకృతమని భారవి చెప్పారు. అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి కలగా రామజోగేశ్వరశర్మ పాల్గొన్నారు.

మళ్లీ పౌరసత్వ రగడ!

వారంలో సీఏఏ అమలు ఖాయం ● పౌరసత్వ (సవరణ) చట్టంపై కేంద్రం

నాలుగేళ్ల కిందే రూపొందిన చట్టం ● వ్యతిరేకిస్తున్న పలు రాష్ట్రాలు, విపక్షాలు ● తీవ్ర ఆందోళనలు, నిరసనలు, కేసులు

వివాదాస్పద పౌరసత్వ (సవరణ) చట్టం (సీఏఏ) అంశం మరోసారి దుమారం రేపుతోంది. సీఏఏను వారం రోజుల్లో దేశమంతటా అమలు చేస్తామని కేంద్ర మంత్రి శంతను ఠాకూర్ ప్రకటించడంతో ఈ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఇది లోక్‌సభ ఎన్నికల లబ్ధి కోసం చేసిన ఉత్తుత్తి ప్రకటన అంటూ తృణమూల్ కాంగ్రెస్ కొట్టిపారేసింది. 2019లోనే మోదీ సర్కారు సీఏఏ చట్టం చేసినా దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత, ఆందోళనలతో దాని అమలు వాయిదా పడుతూ వస్తోంది. కానీ సీఏఏ అమలుపై బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ సర్కారు పట్టుదలగా ఉందని ఇటీవలి వరుస పరిణామాలు చెబుతున్నాయి. ఎవరేమనుకున్నా దేశమంతటా దాని అమలు తప్పదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా గత నెలలోనే స్పష్టం చేశారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



ఏమిటీ చట్టం...

పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌లకు చెందిన ముస్లిమేతర వలసదారులకు భారత పౌరసత్వం కల్పించడం సీఏఏ ఉద్దేశం. 2014 డిసెంబర్ 31కి ముందు భారత్‌కు వలస వచ్చిన వారు ఇందుకు అర్హులు. హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్శీలు, క్రైస్తవులకు సీఏఏ వర్తిస్తుంది. వీరికి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకపోయినా, వాటి గడువు ముగిసినా పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులే. ఈ మేరకు 1955 నాటి పౌరసత్వ చట్టానికి ఎన్డీఏ సర్కారు సవరణలు చేసింది. సీఏఏ బిల్లును తొలుత 2016లో పార్లమెంటులో ప్రవేశపెట్టగా అప్పటి ఎన్డీఏ మిత్రపక్షమైన అసోం గణపరిషత్ తదితర పార్టీలు వ్యతిరేకించాయి. అనంతరం 2019లో సీఏఏ బిల్లును పార్లమెంటు ఉభయసభలు ఆమోదించాయి. తర్వాత రాష్ట్రపతి ఆమోదముద్రతో ఇది చట్టంగా మారింది.

- గడువులోపు భారత్‌కు వలస వచ్చిన మతపరమైన మైనారిటీలకు ఆరేళ్లలోపు పౌరసత్వం కల్పిస్తారు.
- వాళ్లు భారత్‌లో కనీసం 11 ఏళ్లుగా నివసిస్తూ ఉండాలన్న నిబంధనను కూడా ఐదేళ్లకు తగ్గించారు.
- పౌరసత్వమిచ్చేందుకు ఇలా మతాన్ని ప్రాతిపదికగా తీసుకోనుండటం భారత్‌లో ఇదే తొలిసారి.
- అయితే సీఏఏ పరిధిలో ముస్లిం మైనారిటీలను చేర్చకపోవడం వివాదాస్పదంగా మారింది.

ఎందుకు వ్యతిరేకత...

ఈశాన్య రాష్ట్రాలు, పశ్చిమబెంగాల్‌తో పాటు దేశ రాజధాని ప్రాంతంలోనూ పాక్, బంగ్లా, అఫ్గాన్‌ల నుంచి వలస వచ్చిన ముస్లిమేతర మైనారిటీలు అధిక సంఖ్యలో ఉన్నారు. ముఖ్యంగా బెంగాల్లో మతువా సామాజిక వర్గంలో అత్యధికులు బంగ్లాదేశ్‌లో తమపై ముస్లింల అణచివేత, తీవ్ర హింసాకాండను తట్టుకోలేక 1950ల నుంచీ వలస వచ్చిన వారే. వీరంతా 1990ల నాటికే బెంగాల్లో ప్రబలమైన ఓటు బ్యాంకుగా స్థిరపడ్డారు. దాంతో వీరి మద్దతు కోసం పార్టీలన్నీ ప్రయత్నించడం పరిపాటిగా మారింది. నిజానికి సీఏఏ అమలుతో అత్యధికంగా లబ్ధి పొందేది మతువాలేనంటారు. ఈశాన్య రాష్ట్రాల్లోనూ బంగ్లాదేశ్ నుంచి ఎంతోమంది అక్రమంగా ప్రవేశించారు. సీఏఏ అమల్లోకి వస్తే వీరంతా ఎలాంటి ధ్రువీకరణలతోనూ నిమిత్తం లేకుండా నేరుగా భారత పౌరసత్వం పొందుతారు. అలా చేస్తే వీరంతా మెజారిటీ పౌరులుగా మారతారని స్థానికులంటున్నారు. దాంతో హక్కులు, సంస్కృతీ సంప్రదాయాలకు భంగం కలగడమే గాక ఉపాధి అవకాశాలకూ దెబ్బ పడుతుందన్నది వారి వాదన. పైగా బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి మరింత భారీగా వలసలకు ఇది బాటలు వేస్తుందని వారంటున్నారు. దాంతో 2019లో సీఏఏ బిల్లుకు చట్టబద్ధత రాగానే దాని అమలును వ్యతిరేకిస్తూ ఆయా రాష్ట్రాల్లో తీవ్ర ఆందోళనలు చెలరేగాయి. అసోం తదితర రాష్ట్రాల్లో సీఏఏ వ్యతిరేక ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. సీఏఏ అనుకూల, వ్యతిరేక వర్గాల మధ్య తరచూ ఘర్షణలు చెలరేగుతున్నాయి.

ముస్లింలలోనూ ఆందోళన...

ముస్లింల నుంచి కూడా సీఏఏపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇది ప్రధానంగా తమనే లక్ష్యం చేసుకుని తెచ్చిన చట్టమన్నది వారి అభ్యంతరం. ''ఏ ధ్రువీకరణ పత్రాలూ లేని ముస్లింలపై అక్రమ వలసదారులుగా సీఏఏ సాయంతో ముద్ర వేస్తారు. ఈ కారణంగానే ఇతర దేశాల నుంచి వలస వచ్చిన ముస్లిం మైనారిటీలకు సీఏఏను వర్తింపజేయడం లేదు'' అన్నది వారి వాదన. పాకిస్తాన్‌లో షియా తదితర ముస్లింలు కూడా తీవ్రమైన అణచివేతకు గురై భారత్ వలస వచ్చారని, సీఏఏ అమలుతో వారి పరిస్థితి అగమ్య గోచరంగా మారుతుందని వారంటున్నారు. సీఏఏను వ్యతిరేకిస్తూ పలు ముస్లిం వర్సిటీల్లో కూడా విద్యార్థులు తీవ్ర స్థాయిలో నిరసనలకు దిగారు. వాటిని అణచివేసే క్రమంలో జరిగిన ఘర్షణలు ప్రాణ నష్టానికీ దారి తీశాయి. కేంద్రం మాత్రం పాక్, బంగ్లా, అఫ్గాన్ వంటి దేశాల్లో ముస్లింలపై అకృత్యాల వాదనను తోసిపుచ్చుతోంది. మరోవైపు టిబెట్, మయన్మార్, శ్రీలంకల నుంచి వలస వచ్చిన మతపరమైన మైనారిటీలకు సీఏఏను వర్తింపజేయకపోవడం అన్యాయమన్న విమర్శలూ ఉన్నాయి.

సుప్రీంలో వివాదం: ఈ నేపథ్యంలో మొత్తంగా సీఏఏ చట్టం రాజ్యాంగబద్ధతనే సవాలు చేస్తూ తృణమూల్‌తో పాటు కాంగ్రెస్, ఆర్జేడీ, మజ్లిస్ తదితర పక్షాలు ఇప్పటికే సుప్రీంకోర్టులో కేసులు వేశాయి. జమాయిత్ ఉలేమా ఇ హింద్‌తో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు కూడా ఇంప్లీడయ్యాయి. వీటిపై విచారణ తుది దశకు చేరుతోంది.

ఎన్ఆర్సీ రగడ...

సీఏఏలో భాగంగా తెరపైకి వచ్చిన జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్ఆర్సీ) కూడా వివాదానికి మరింతగా ఆజ్యం పోసింది. అక్రమ వలసదారులను గుర్తించి వెనక్కు పంపడం దీని ప్రధానోద్దేశం. ఇందులో భాగంగా వలసదారుల నివాస తదితర ధ్రువీకరణ పత్రాలను నమోదు చేయడం తప్పనిసరి. తద్వారా పౌరసత్వానికి చట్టపరంగా అర్హులైన జాబితాను రూపొందిస్తారు. సరైన పత్రాలు లేనివారిని అక్రమ వలసదారులుగా నిర్ధారిస్తారు. 2020లో అసోంలో మాత్రమే అమలు చేసిన ఎన్ఆర్సీని దేశవ్యాప్తం చేస్తామని మోదీ సర్కారు ప్రకటించింది. దీనిపైనా రగడ కొనసాగుతోంది.

సోరెన్ కోసం ఈడీ వెదుకులాట

జార్ఖండ్ సీఎం జాడ తెలియడం లేదంటున్న అధికారులు



న్యూఢిల్లీ/రాంచీ: భూ కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌ను ప్రశ్నించేందుకు సోమవారం ఉదయం ఢిల్లీలోని ఆయన నివాసానికి వెళ్లిన ఈడీ అధికారులకు చేదు అనుభవం ఎదురైంది. ఆయన ఇంట్లో లేరని, ఎక్కడున్నారో జాడ తెలియడం లేదని, సంప్రదించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయిందని అధికారులు చెప్పారు. జనవరి 27 రాత్రి రాంచీ నుంచి ఢిల్లీ బయల్దేరిన సోరెన్ ఎక్కడున్నారో తెలియడం లేదన్నారు. జనవరి 31 మధ్యాహ్నం రాంచీలోని నివాసంలో అందుబాటులో ఉంటానని ఆయన నుంచి మెయిల్ అందినట్లు తెలిపారు. ఈడీ అధికారులు రాత్రి దాకా ఢిల్లీ నివాసంలోనే పడిగాపులు కాశారు. సోరెన్ ఆచూకీ దొరికే దాకా అక్కడే ఉంటామని స్పష్టం చేశారు. ఆయన గురించి ఢిల్లీ విమానాశ్రయాన్ని కూడా అప్రమత్తం చేసినట్టు తెలిపారు. తనకందిన తాజా సమన్లను కక్షసాధింపు చర్యగా మెయిల్‌లో సోరెన్ అభివర్ణించారు.

56 రాజ్యసభ స్థానాలకు 27న ఎన్నికలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల్లో 56 రాజ్యసభ స్థానాలు ఏప్రిల్లో ఖాళీ అవుతున్నాయి. వాటికి ఫిబ్రవరి 27వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించింది. షెడ్యూల్ విడుదల చేసింది. ఫిబ్రవరి 8న నోటిఫికేషన్ రానుంది. 15 వరకు నామినేషన్ల స్వీకరణ, 16న పరిశీలన, 20 వరకు ఉపసంహరణ ఉంటాయి. ఫిబ్రవరి 27న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరుగుతుంది. ఐదింటికి గంటలకు కౌంటింగ్ ముగించి ఫలితాలను ప్రకటిస్తారు. పదవీకాలం ముగుస్తున్న ఎంపీల్లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా, పలువురు కేంద్ర మంత్రులు తదితరులున్నారు.

యూపీలో అత్యధికంగా 10 ఖాళీలు

ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాల్లో ఉత్తర్‌ప్రదేశ్ నుంచి అత్యధికంగా 10 ఉన్నాయి. బిహార్, మహారాష్ట్రల్లో చెరో 6, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో చెరో 5, కర్ణాటక, గుజరాత్‌లో చెరో 4, ఏపీ, తెలంగాణ, ఒడిశా, రాజస్థాన్ రాష్ట్రాల్లో మూడేసి, ఛత్తీస్‌గఢ్, హరియాణా, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఒక్కోటి ఖాళీ అవుతున్నాయి.

బీజేపీ పరం కానున్న 28 సీట్లు

ఎన్నికలు జరిగే 56 రాజ్యసభ స్థానాల్లో 28 సీట్లను బీజేపీ గెలుచుకోనుంది. ప్రస్తుతం రాజ్యసభలో 93 మంది బీజేపీ సభ్యులతో కలిసి ఎన్డీఏ కూటమి బలం 114గా ఉంది. కాంగ్రెస్‌కు 30 సీట్లున్నాయి. హిమాచల్ అసెంబ్లీలో కాంగ్రెస్ సంఖ్యా బలం దృష్ట్యా అక్కడి ఒక్క రాజ్యసభ స్థానం ఆ పార్టీకే దక్కనుంది. దాన్ని ప్రియాంక గాంధీకి కేటాయించవచ్చని సమాచారం. ప్రస్తుతం అక్కడి నుంచి ఎంపీగా ఉన్న వహిస్తున్న బీజేపీ చీఫ్ జేపీ నడ్డాను మరో రాష్ట్రం నుంచి అధిష్టానం సర్దుబాటు చేయనుంది.

అర నిమిషంలో నిద్రపోతా



స్క్రీన్ టైమ్‌పై నియంత్రణ ముఖ్యం
- పరీక్షా పే చర్చాలో విద్యార్థులకు మోదీ సూచనలు
- పిల్లల ప్రొగ్రెస్ కార్డ్ మీకు విజిటింగ్ కార్డ్ కాదని తల్లిదండ్రులకు హితవు

న్యూఢిల్లీ: అధిక సమయం స్క్రీన్‌లకు అతుక్కుపోతే అది మీ నిద్రపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని విద్యార్థులను ప్రధాని మోదీ సున్నితంగా హెచ్చరించారు. దేశవ్యాప్తంగా పరీక్షల వేళ విద్యార్థుల ఒత్తిడిని పోగొట్టే ప్రయత్నంలో భాగంగా కేంద్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ నిర్వహిస్తున్న ఏడో విడత 'పరీక్షా పే చర్చా' కార్యక్రమం సోమవారం ఢిల్లీలోని భారత మండపంలో జరిగింది. వర్చువల్‌గా పాల్గొన్న కోట్లాది మంది విద్యార్థులనుద్దేశించి ప్రధాని ప్రసంగించారు. మోదీ విద్యార్థులకు చేసిన పలు సూచనలు, సలహాలు ఆయన మాటల్లోనే..

అవసరం మేరకే ఫోన్ వాడతా

' జీవనశైలి సక్రమంగా ఉండాలంటే ఏదీ అతిగా ఉండొద్దు. అతి స్క్రీన్ టైమ్, రీల్స్ చూడటం మీ నిద్రాకాలాన్ని మింగేస్తుంది. ఆధునిక వైద్యశాస్త్రం ప్రకారం నిద్ర అనేది అత్యంత కీలకం. అలాంటి నిద్ర తక్కువకాకుండా చూసుకోండి. నేనైతే అవసరమైన మేరకే ఫోన్ వాడతా. నిద్రకు ఉపక్రమించిన కేవలం 30 సెకన్లలోనే గాఢ నిద్రలోకి జారుకుంటా. రోజూ కొద్దిసేపు ఎండలో గడపండి. ఫోన్‌కు చార్జింగ్ లాగే పిల్లలకు పౌష్టికాహారం ముఖ్యం. ఎక్సర్‌సైజ్ చేసి ఫిట్‌గా ఉండండి. అప్పుడే చక్కగా చదవగలరు'' అని అన్నారు.

అలాంటి వారితో స్నేహం చేయండి

'' చదువుల్లో బాగా కష్టపడుతూ, తెలివితేటలు ఉన్న తోటి విద్యార్థులతో స్నేహం చేయండి. అప్పుడే వారి నుంచి స్ఫూర్తి పొందగలరు. పేరెంట్స్‌కు నాదో సూచన. పిల్లల ప్రోగ్రెస్ కార్డ్ మీకు విజిటింగ్ కార్డ్ కాదు. మీరు వెళ్లినచోట మీ పిల్లల చదువుసంధ్యల గురించి అతిగా మాట్లాడకండి. ఎప్పుడూ ఇతర పిల్లలతో పోల్చి చూపకండి. ఇది మంచి పద్ధతి కాదు. పూజ చేసి కొత్త యూనిఫాం, స్టేషనరీ కొని పరీక్ష రోజును ప్రత్యేకమైన దినంగా మార్చేయకండి'' అని చెప్పారు.

చిన్న లక్ష్యాలతో మొదలెట్టండి


''పిల్లలను మూడు ఒత్తిళ్లు ఇబ్బందిపెడతాయి. ఏకాగ్రత, తల్లిదండ్రుల ఒత్తిడి, ఆత్మవిశ్వాస లేమి. పరీక్షలకు ముందు చిన్న చిన్న లక్ష్యాలు పెట్టుకుని వాటిని సాధిస్తూ మీ లక్ష్యాలను పెంచుకుంటూ పొండి. పరీక్షలు వచ్చేటప్పటికి సంసిద్ధమౌపోతారు. టీచర్-స్టూడెంట్ బంధం సిలబస్ పాఠాలకు అతీతమైనది. సిలబస్ చెబుతూనే సబ్జెక్ట్ పట్ల వారిలో భయాన్ని పోగొట్టండి. పిల్లలు బెరుకులేకుండా సందేహాలు అడిగేలా సౌమ్యంగా మెలగండి. బోధనను ఒక వృత్తిగా కాకుండా విద్యార్థుల భవితను తీర్చిదిద్దే యజ్ఞంగా భావించండి'' అని అన్నారు.

నాక్కూడా పరీక్ష లాంటిది

''పరీక్ష పే చర్చా నాకూ ఓ పరీక్ష. ఎందుకంటే నేటితరం విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలు ఎక్కువయ్యాయి. వినూత్నంగా ప్రధాని ఈసారి ఏం చెప్తారా? అనుకునే విద్యార్థులకు తగ్గట్లు నేనూ ఈ కార్యక్రమానికి సిద్ధమయ్యే రావాలికదా'' అన్నారు.

ఇంట్లో నో గాడ్జెట్ జోన్

'' తల్లిదండ్రులకు నాదో సలహా. టెక్నాలజీ నుంచి దూరం జరగలేం. అలాగని అతుక్కుపోవడమూ సబబు కాదు. భోజనం చేసేటపుడు గాడ్జెట్ వాడొద్దనే నియమం పెట్టండి. ఏ యాప్ వాడినా స్క్రీన్ టైమ్ పెట్టుకోండి'' అని సలహా ఇచ్చారు. ఈ ఏడాది 2.26 కోట్ల మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి రిజిస్టర్ చేసుకోవడం విశేషం.



సారీ, నేను ఓడిపోయాను..!

అమ్మానాన్నలకు లేఖ రాసి కోటాలో విద్యార్థిని ఆత్మహత్య

కోటా: పరీక్షల ఒత్తిడికి మరో నిండు ప్రాణం బలైంది. రాజస్తాన్‌లోని కోటాలో జేఈఈకి ప్రిపేర్ అవుతున్న నిహారిక సింగ్(18) అనే విద్యార్థిని ఉరేసుకుని తనువు చాలించింది. ''మమ్మీ, పాపా! నేను జేఈఈ సాధించలేను. నేను ఓడిపోయాను. నేను మంచి కూతుర్ని కాను. అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నాను. సారీ, నాకిక వేరే దారి లేదు'' అని పేర్కొన్న సూసైడ్ నోట్ ఆమె గదిలో పోలీసులకు లభించింది. స్థానిక శివ విహార్ కాలనీలో కుటుంబంతో ఉంటున్న నిహారిక ఈ నెల 30, 31వ తేదీల్లో జేఈఈ పరీక్ష రాయాల్సి ఉందని పోలీసులు తెలిపారు. చదువుల్లో ఒత్తిడిని తట్టుకుని, పరీక్ష రాయలేకనే ఉరివేసుకున్నట్లు సూసైట్ నోట్‌ను బట్టి అర్థమవుతోందని వారన్నారు. ఉదయం 10 గంటలైనా నిహారిక బయటికి రాకపోవడంతో అమ్మమ్మ గది తలుపు తట్టింది. ఎంతకూ లోపలి నుంచి స్పందన లేకపోవడంతో కుటుంబసభ్యులు తలుపులు పగులగొట్టి చూడగా, వెంటిలేటర్‌కు వేసుకున్న ఉరికి వేలాడుతూ నిహారిక విగతజీవిగా కనిపించింది. ఈ పరిణామంతో వారు హతాశులయ్యారు. చదువులో ముందుండే నిహారిక జేఈఈ పరీక్షపై ఒత్తిడికి గురవుతోందని ఆమె కుటుంబసభ్యుడొకరు చెప్పారు. జేఈఈతోపాటు ఎక్కువ స్కోరు కోసం 12వ తరగతి పరీక్షను సైతం ఆమె రాయాల్సి ఉందన్నారు. నిహారిక తండ్రి స్థానిక బ్యాంకులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. ఝులావర్ జిల్లా అకొడాఖుర్ద్‌కు చెందిన ఈ కుటుంబం మూడేళ్లుగా కోటాలో ఉంటోంది. కోటాలో వారం వ్యవధిలో చోటుచేసుకున్న విద్యార్థుల ఆత్మహత్యల్లో ఇది రెండోదని పోలీసులు పేర్కొన్నారు. నీట్‌కు ప్రిపేరవుతున్న యూపీకి చెందిన మహ్మద్ జయిద్ జనవరి 13న హాస్టల్ గదిలో ఉరేసుకున్నాడు. కోటాలో గత ఏడాది 26 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారు.

డీప్‌ఫేక్ ఆందోళనకరం

మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల

వాషింగ్టన్: ప్రముఖుల ఫొటోలు, వీడియోలను దుర్వినియోగం చేస్తూ కృత్రిమ మేధ(ఏఐ)తో సృష్టిస్తున్న డీప్ ఫేక్ నకిలీ ఫొటోలు, వీడియోల ధోరణి అత్యంత భయంకరమైనదని మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల వ్యాఖ్యానించారు. ప్రఖ్యాత పాప్ గాయని టైలర్ స్విఫ్ట్ నకిలీ అసభ్య ఫొటోలు తాజాగా సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. దీనిపై ఒక ఇంటర్వ్యూలో సత్య నాదెళ్ల ఆవేదన వెలిబుచ్చారు. ''ప్రముఖుల డీప్ ఫేక్ ఫొటోలు, వీడియోల సృష్టి, వ్యాప్తికి అడ్డుకట్ట పడాల్సిందే. ప్రభుత్వాల, సోషల్‌మీడియా సంస్థల తక్షణ స్పందన అవసరం. సురక్షితమైన, వాస్తవిక సమాచారం మాత్రమే ఆన్‌లైన్‌లో లభించేలా సాంకేతికతను, రక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలి. ప్రభుత్వాలు నిబంధనలను సవరించి కట్టుదిట్టంచేయాలి. ఇది మనందరి బాధ్యత'' అని అన్నారు.

'హీ నితీష్డ్ మీ'

బిహార్ సీఎంపై వెల్లువెత్తుతున్న మీమ్స్, జోక్స్



న్యూఢిల్లీ: బిహార్ సీఎం నితీశ్ కుమార్ పదేపదే కూటములు మార్చడంపై సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా మీమ్స్, జోకులు పేలుతున్నాయి. మోసానికి సిసలైన పేరు నితీశ్ అంటూ కొత్త విశేషణాన్ని ఖరారు చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కొన్ని మీమ్స్‌లో కొన్ని...

'అతను నన్ను మోసం చేశాడు' అనడానికి 'హీ నితీష్డ్ మీ' అంటూ పలువురు ట్యాగ్ చేస్తున్నారు. ''బీసీసీఐ కొత్త తరహా క్రికెట్ టోర్నమెంట్ ఫార్మాట్ తేనుంది. అదేంటంటే మ్యాచ్ మధ్యలో కెప్టెన్లు మారిపోతారు. ప్రేక్షకుల్లో ఉత్కంఠ. ఆదాయానికి ఆదాయం. వరల్డ్ కప్ లాగా అది 'నితీశ్ కప్' అని ఒక పాత్రికేయుడు 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు. కార్పొరేట్ ప్రపంచంలో సీఈవోలకు నితీశ్ కుమార్ ఒక ఆదర్శనీయుడు. తొమ్మిదిసార్లు 'కంపెనీ'ల విలీనాలు, టేకోవర్‌ల తర్వాత కూడా ఈయనే సీఈవోగా కొనసాగడం అద్భుతం' అని మరో యూజర్ ట్వీట్‌చేశారు.

కూటముల మధ్య తెగ 'పల్టీలు కొట్టే పుత్రుడు'ని కన్నందుకు 'పాటలీపుత్ర'కు ఆ పేరు వచ్చిందని మరొకరు కొత్త భాష్యమిచ్చారు.

''జాతీయ రహదారులపై యూటర్న్ గుర్తు తీసేసి అక్కడ నితీశ్ ఫొటో పెట్టాలని కేంద్ర రహదారుల మంత్రి ఆదేశించారు'' అని మరొకరు ట్వీట్‌చేశారు.

బిహార్‌లో మహాఘట్‌బంధన్ కూటమికి చరమగీతం పాడి బీజేపీతో నితీశ్ జట్టు కట్టిన విధానాన్ని ఐదు అంశాల్లో నెటిజన్లు సరికొత్తగా నిర్వచించారు.

1. ఎటంటే అటు మారేలా అనువుగా ఉండాలి.
2. సరిగ్గా సరైన సమయం చూసి అటువైపు దూకేయాలి.
3. అదే సమయంలో పాత మిత్రులతో సత్సంబంధాలు కొనసాగించాలి.
4. చెడిపోయిన స్నేహాన్ని చిగురింపజేయాలి.
5. కొత్త అవకాశం చేతికొచ్చాకే పాత మిత్రుల చేయి వదిలేయాలి.

గవర్నర్ బిత్తరపోయిన వేళ!

ఆదివారం సాయంత్రం రాజ్‌భవన్‌లో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసి వెళ్లిన నితీశ్, 15 నిమిషాల్లోపే తిరిగి రాజ్‌భవన్‌కు రావడం చూసి గవర్నర్ షాకయ్యారంటూ సరదా వీడియో ఒకటి తెగ వైరల్ అవుతోంది. అదేమంటే, రాజ్‌భవన్‌లో మర్చిపోయిన తన మఫ్లర్(స్కార్ఫ్)ను తీసుకోవడం కోసం నితీశ్ వెనుదిరిగి వస్తారు. అది చూసి గవర్నర్ బిత్తరపోతారు. 'ఈసారి కూటమికి గుడ్‌బై చెప్పడానికి నితీశ్‌కు 18 నెలలు టైమ్ పట్టింది. ఇప్పుడేమిటి మరీ 15 నిమిషాల్లోపే మళ్లీ వచ్చారా?' అని గవర్నర్ షాక్‌కు గురయ్యారంటూ కాంగ్రెస్ వ్యంగ్యంగా ట్వీట్‌చేసింది. ''వెంటవెంటనే రాజీనామాలు, ప్రమాణాలతో నితీశ్ రాజకీయ రంగు మారుస్తున్నారు. ఈయనను చూసి ఊసరవెల్లి కూడా కొత్త రంగును వెతుక్కోవాల్సి వస్తోంది. ఆయారామ్ గయారామ్ బదులు ఇక ఆయా నితీశ్ గయా నితీశ్ అనుకోవాలి'' అని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ ఎద్దేవాచేశారు.

రేపట్నుంచి బడ్జెట్ సమావేశాలు

నేడు అఖిలపక్ష సమావేశం

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం మంగళవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. ఉభయ సభల్లోని పార్టీల ఫ్లోర్ లీడర్లతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి భేటీ అవుతారు. సమావేశాలు ఫిబ్రవరి 9 దాకా కొనసాగుతాయి. తొలిరోజు ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించనున్నారు. ఫిబ్రవరి ఒకటిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెడతారు.

పింఛనుకు సంతానాన్నీ నామినేట్ చేయొచ్చు

మహిళా ఉద్యోగులకు కేంద్రం వెసులుబాటు

న్యూఢిల్లీ: మహిళా ఉద్యోగుల కుటుంబ పింఛను విషయంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగినులు పెన్షన్ నామినీగా భర్తకు బదులుగా కుమార్తె లేదా కుమారుడి పేరును సైతం సూచించవచ్చంటూ సోమవారం ప్రకటన విడుదల చేసింది. ఇప్పటి వరకు మృతి చెందిన ఉద్యోగి లేదా పింఛనుదారు జీవిత భాగస్వామికి మాత్రమే కుటుంబ పింఛను అందించేవారు. భాగస్వామి అనర్హులైన, మరణించిన సందర్భాల్లో మాత్రమే ఇతర కుటుంబసభ్యులకు పింఛను అర్హత ఉండేది.

2023లో భారతీయులకు 14 లక్షల వీసాలు

సాక్షి, న్యూఢిల్లీ: 2023లో భారతీయులకు 14 లక్షల వీసాలను జారీ చేసినట్లు ఢిల్లీలోని అమెరికా దౌత్య కార్యాలయం తెలిపింది. 2022తో పోలిస్తే ఇది 60 శాతం ఎక్కువని వివరించింది. ఏ దేశానికీ ఇన్ని వీసాలు జారీ కాలేదని పేర్కొంది. విజిటింగ్ వీసా అపాయింట్‌మెంట్ వెయిటింగ్ సమయం 1,000 రోజుల నుంచి 250 రోజులకు (75 శాతం) తగ్గిందని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా అమెరికా వీసా కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి 10 మందిలో ఒకరు భారతీయులేనని ప్రకటించింది. బీ1, బీ2 కేటగిరీల విజిటర్ వీసాల కోసం మునుపెన్నడూ లేనంతగా 7 లక్షల దరఖాస్తులు అందాయని తెలిపింది. స్టూడెంట్ వీసాల జారీలో దేశంలో ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై టాప్‌లో ఉన్నాయంది. అమెరికాలో చదివే 10 లక్షల పైచిలుకు అంతర్జాతీయ విద్యార్థుల్లో 2.5 లక్షల మంది భారతీయులేనని ఢిల్లీ ఎంబసీ తెలిపింది.

అమెరికాలో భారతీయ విద్యార్థి దారుణ హత్య

న్యూయార్క్: అమెరికాలో భారతీయ విద్యార్థి ఒకరు దారుణ హత్యకు గురయ్యారు. డ్రగ్స్‌కు బానిసైన ఒకడు ఆయన్ను సుత్తితో దారుణంగా కొట్టి ప్రాణాలు తీశాడు. హరియాణాకు చెందిన వివేక్ సైనీ బీటెక్ పూర్తి చేసుకుని రెండేళ్ల క్రితం అమెరికా వెళ్లాడు. ఇటీవలే బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో ఎంబీయే పూర్తి చేసిన అతడు..జార్జియా రాష్ట్రం లిథోనియా నగరంలో ఉంటూ ఓ స్టోర్‌లో పార్ట్-టైం క్లర్కుగా పనిచేస్తున్నాడు. అదే స్టోర్ వద్ద నిలువ నీడ లేని జులియన్ ఫాల్క్‌నర్ అనే డ్రగ్ అడిక్ట్ ఉంటున్నాడు. వివేక్ అతడికి రెండు రోజులుగా నీళ్లు, చిప్స్, కోక్ ఇస్తున్నాడు. చలి నుంచి కాపాడుకునేందుకు జాకెట్ సైతం అతడికి ఇచ్చాడు. ఈ నెల 16వ తేదీన ఫాల్క్‌నర్ ఇంటికి వెళ్తున్న వివేక్‌కు అడ్డుగా నిలిచాడు. అడ్డు తొలగకుంటే పోలీసులకు చెబుతానంటూ హెచ్చరించాడు. అతడు లక్ష్యపెట్టక సుత్తితో వివేక్‌పై దాడికి దిగాడు. వివేక్ తలపై 50సార్లు సుత్తితో మోదాడు. సమాచారం అందుకుని పోలీసులు వచ్చే సరికి వివేక్ మృతదేహం వద్దే ఆ ఉన్మాది ఉండటం గమనార్హం.

సిమిపై మరో ఐదేళ్ల నిషేధం

న్యూఢిల్లీ: దేశంలో ఉగ్రవాదాన్ని రెచ్చగొడుతూ శాంతి, మత సామరస్యానికి భంగం కలిగిస్తున్న స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా(సిమి)పై నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం మరో అయిదేళ్లు పొడిగించింది. ఈ విషయాన్ని హోం శాఖ మంత్రి అమిత్ షా సోమవారం 'ఎక్స్'లో ప్రకటించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా)కింద సిమిని చట్టవ్యతిరేక సంస్థగా ప్రకటిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సహా సుమారు 10 రాష్ట్రాల వినతి మేరకు.. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఉండగా మొదటిసారిగా కేంద్రం 2001లో సిమిని నిషేధించింది. ఆ తర్వాత పొడిగిస్తూ వస్తోంది. ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌లో 1977లో సిమి ఏర్పాటైంది. భారత్‌ను ముస్లిం దేశంగా మార్చాలన్న అజెండాతో పనిచేస్తున్నట్లు ఈ సంస్థపై ఆరోపణలొచ్చాయి. గత కొన్నేళ్లలో సిమి కార్యకర్తలపై ఉగ్రవాద సంబంధ 17 కేసులు నమోదు కాగా, 27 మంది సభ్యులను అరెస్ట్ చేసినట్లు హోం శాఖ తెలిపింది.

అధ్యక్షుడు ముయిజ్జుపై అవిశ్వాసం

సిద్ధమవుతున్న మాల్దీవుల ప్రతిపక్షం

మాలె: మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు ప్రధాన ప్రతిపక్షం మాల్దీవియన్ డెమొక్రాటిక్ పార్టీ (ఎండీపీ) సిద్ధమవుతోంది. ఎండీపీకి పార్లమెంట్‌లో మెజారిటీ ఉంది. చైనా అనుకూల అధ్యక్షుడు ముయిజ్జు కేబినెట్‌లోకి నలుగురు మంత్రులను చేర్చుకునే అంశంపై ఆదివారం పార్లమెంట్‌లో ఓటింగ్ జరిగింది. నలుగురిలో ఒక్కరికి మాత్రమే పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ముగ్గురిని తిరస్కరించింది. ఇందుకు ఆగ్రహిస్తూ అధికార పక్షం ఎండీపీకి చెందిన స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌లపై అవిశ్వాసం ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రతిపక్ష ఎంపీలు బాహాబాహీకి దిగారు. ఇద్దరు గాయపడ్డారు. ఈ పరిణామాలతో ఎండీపీ, మిత్రపక్షం డెమొక్రాట్లతో కలిసి ముయిజ్జుపై అవిశ్వాసం పెట్టాలని సోమవారం నిర్ణయించింది. పార్లమెంట్‌లో మొత్తం 80 మంది సభ్యులకు గాను ఎండీపీకి 45 మంది, డెమొక్రాట్లకు 13 మంది ఉన్నారు.

ఆర్ఎస్ఎస్, బీజేపీలతో హింస, విద్వేషం

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

కిషన్‌గంజ్/అరారియా: ఆర్ఎస్ఎస్, బీజేపీల సిద్ధాంతాలు దేశంలో హింస, విద్వేషాలను వ్యాప్తి చేస్తున్నాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా సోమవారం ఆయన బిహార్‌లోని కిషన్‌గంజ్‌లో మాట్లాడారు. ఎన్డీఏ పాలనలో ప్రజలు మతాలు, కులాల పేరుతో కొట్లాడుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన యాత్ర సోమవారం ఉదయం పశ్చిమబెంగాల్ నుంచి బిహార్‌లోకి ప్రవేశించింది. మంగళవారం యాత్ర మళ్లీ బెంగాల్లో అడుగు పెట్టనుంది.

ఈడీ ఎదుట హాజరైన లాలూ

పట్నా: ల్యాండ్ ఫర్ జాబ్స్ కుంభకోణంలో మనీలాండరింగ్ ఆరోపణలను ఎదుర్కొంటున్న ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు సోమవారం 9 గంటలకు పైగా ప్రశ్నించారు. నడవలేని పరిస్థితుల్లో ఉన్న తండ్రితోపాటు తన సోదరి మిసా భారతిని లోపలికి అనుమతించకపోవడం సిగ్గుచేటని లాలూ కుమార్తె రోహిణీ ఆచార్య ఆరోపించారు. విచారణకు రావాలంటూ ఈ నెల 19న ఈడీ అధికారులు లాలూతోపాటు ఆయన కుమారుడు తేజస్వీ యాదవ్‌కు సమన్లు ఇచ్చారు. ఆ మేరకు తేజస్వీ యాదవ్ మంగళవారం ఈడీ ఎదుట హాజరుకావాల్సి ఉంది.

కక్షిదారుల కులమతాల ఊసొద్దు: సుప్రీం


న్యూఢిల్లీ: కేసుల విచారణ సందర్భంగా కక్షిదారుల కులం, మతం ప్రస్తావన తేవడం మానేయాలని హైకోర్టు సహా దిగువ కోర్టులను సుప్రీంకోర్టు కోరింది. ''ఈ సంప్రదాయానికి తక్షణమే ముగింపు పలకాలి. మా ఆదేశాలను తక్షణమే తప్పనిసరిగా అమలు చేయాల్సిందిగా అన్ని కోర్టులకు సూచనలు పంపండి'' అని జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాల ధర్మాసనం రిజిస్ట్రీని ఆదేశించింది.

జపాన్ ల్యాండర్ పనిచేస్తోంది!

టోక్యో: చంద్రుని ఉపరితలంపై జనవరి 20న తలకిందులుగా దిగి మనుగడే ప్రశ్నార్థకమైన జపాన్ ల్యాండర్‌కు సూర్యకాంతి కొత్త జీవం పోసింది. ఎండ ప్రభావానికి సాంకేతిక సమస్య తొలగి ల్యాండర్‌తో కమ్యూనికేషన్ మొదలైందని జపాన్ ఏరోస్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీ సోమవారం తెలిపింది. మల్టీ-బ్యాండ్ స్పెక్ట్రమ్ కెమెరా అక్కడి సమీప శిలలను లాండర్ ఫొటోలు తీసింది. ఒక శిలకు 'టోయ్ పోడెల్' అని పేరు పెట్టింది. మొత్తం ఆరు శిలలకు శునకం జాతి పేర్లు పెట్టి వాటిని అధ్యయనం చేస్తోంది. చంద్రుడి ఉపరితల వాతావరణాన్ని పరీక్షిస్తోంది.



ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్
విజయవాడ సమీపంలోని పోరంకిలో నదరన్ సైన్స్ ఫెయిర్ ప్రారంభమైంది. మన రాష్ట్రంతో పాటు ఐదు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శించారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 520.20 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 822.80 అడుగుల వద్ద ఉంది.

ట్రై సైకిళ్లు, ల్యాప్‌టాప్‌లు పంపిణీ


గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ ఢిల్లీరావు విభిన్న ప్రతిభావంతులకు ట్రై సైకిళ్లు, ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు.

న్యూస్‌రీల్

డీసీపీలు బదిలీ


విశాల్ గున్ని


వి.అజిత


మోకా సత్తిబాబు


ఆనంద్ రెడ్డి

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లోని ముగ్గురు డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ)లను బదిలీ చేస్తూ రాష్ట్ర హోం శాఖ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. లా అండ్ ఆర్డర్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న విశాల్‌గున్ని విశాఖపట్నం రేంజ్ డీఐజీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విశాఖపట్నం లా అండ్ ఆర్డర్ డీసీపీ ఆనంద్‌రెడ్డి నియమితులయ్యారు. జిల్లా రూరల్ డీసీపీ వి.అజిత పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీగా బదిలీ కాగా, ఆమె స్థానంలో కె.శ్రీనివాసరావును భర్తీ చేశారు. అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు విశాఖపట్నం లా అండ్ ఆర్డర్-2 డీసీపీగా బదిలీ అయ్యారు.

పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం



లబ్బీపేట(విజయవాడతూర్పు): జాతీయ వ్యాక్సినేషన్ డే సందర్భంగా మార్చి 3 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత అన్నారు. జిల్లాలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులు, పర్యవేక్షకులు, కమ్యూనిటీ ఆర్గనైజర్లకు పల్స్‌పోలియోపై రెండు రోజుల పాటు కార్యక్రమం అమలుపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రణాళిక, పునశ్చరణ శిక్షణ జరిగింది. అలాగే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లాలో కార్యక్రమం అమలుపై ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ మాధవి పలు సూచనలు చేశారు. ఫిబ్రవరి 9న ఏడాది నిండిన పిల్లల నుంచి 19 ఏళ్ల పిల్లలు అందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తామన్నారు. రాష్ట్ర పల్స్‌పోలియో నోడల్ అధికారి డాక్టర్ రోహిత్ పాల్గొన్నారు.

దుర్గమ్మకు కానుకగా బంగారు గాజులు





ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపైన కొలువైఉన్న దుర్గమ్మకు తాడేపల్లిగూడెంకు చెందిన భక్తులు సోమవారం బంగారు గాజులను కానుకగా సమర్పించారు. తాడేపల్లిగూడెంకు చెందిన నాగ రాకేష్ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ ఈవో కర్నాటి రాంబాబును కలిసి సుమారు 19.5 గ్రాముల బంగారంతో తయారు చేయించిన రెండు గాజులను సమర్పించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు, శేషవస్త్రాలు, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

మరణంలేని మహాకవి వేటూరి



విజయవాడ కల్చరల్: మరణంలేని మహాకవి వేటూరి సుందరరామమూర్తి అని సినీ మాటల రచయిత బుర్రా సాయి మాధవ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, గీతాంజలి మ్యూజిక్స్, దామోదరం జానపదం, సుశీల్ మీడియా ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం వేటూరి 89వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బుర్రా సాయి మాధవ్ మాట్లాడుతూ తెలుగు వారున్నంత వరకు వేటూరి పాట ఉంటుందన్నారు. డాక్టర్ జయంతి చక్రవర్తి, జానపద గాయకుడు దామోదర గణపతిరావు ప్రసంగించారు. అనంతరం సుప్రీం కోర్టు న్యాయవాది వరప్రసాద్ చేతుల మీదుగా సాయి మాధవ్‌ను ఆత్మీయంగా సత్కరించారు. గాయనీ గాయకులు సుశీల్, డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణ, రవికుమార్, భారతి, రూపశ్రీ,రాధానాయుడు వేటూరి రచించిన చిత్రగీతాలను ఆలపించారు.

కొమ్మ కొమ్మకూ..
కూ..కూ..!




మోడైనా మలయమారుతమే.. పక్షులు వాలక ముందు వృక్షం

'వాడు ఎక్కడున్నా రాజేరా'! ఇది ఓ సినిమాలోని ఫేమస్ డైలాగ్.. ఈ చెట్టును చూస్తే ఇదే గుర్తుకొస్తుంది. ఇది మోడువారినా వికసించింది.. ఎండిపోయినా కొత్త 'చిగురు'నిచ్చింది.. కొమ్మకొమ్మకూ కూ..కూ రాగం ధ్వనించేలా చేసింది. కళావిహీనమైనా కిలకిలలతో కళకళలాడుతూ దర్శనమిచ్చింది. పచ్చగా ఉన్నప్పుడూ మనిషి కోసం ప్రాణవాయువును అందించిన ఈ మహా వృక్షం.. ఇప్పుడు ఆకులన్నీ రాలిపోయినా కొన్ని వందల పక్షులకు మలయమారుతమైంది. విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ సమీపంలో సోమవారం సాయంత్రం ఓ ఎండిపోయిన చెట్టుపై నిండుగా వాలిన రోజ్ పీటర్స్ పక్షుల గుంపును చిత్రంలో చూడొచ్చు. - కందుల చక్రపాణి, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సామాన్య భక్తులకు పెద్ద పీట

- వీఐపీలు, వృద్ధులు నిర్ణీత సమయాల్లోనే రావాలి
- దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు


మాట్లాడుతున్న చైర్మన్ రాంబాబు, ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వీఐపీలు, వృద్ధులు, దివ్యాంగులు మధ్యాహ్నం 12 గంటల లోపు, 2 గంటల తర్వాతే అమ్మవారి దర్శనం చేసుకునేలా షెడ్యూలు చేసుకుని దేవస్థానానికి విచ్చేయాలని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు సూచించారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన పాలక మండలి సమావేశం సోమవారం బ్రాహ్మణ వీధి, జమ్మిదొడ్డి ఆవరణలోని బోర్డు మీటింగ్‌హాల్‌లో నిర్వహించారు. చైర్మన్ కర్నాటి రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆలయ ఈవో కేఎస్ రామారావు, పాలక మండలి సభ్యులు, ఆలయానికి చెందిన పలువురు ఏఈవోలు, ఈఈలు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు. తొలుత చైర్మన్ దేవస్థానానికి చెందిన పలు అంశాలపై పాలక మండలి సమావేశంలో చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చైర్మన్ రాంబాబు మాట్లాడారు. ఏడాది కాలంలో పాలక మండలి 8వ సమావేశం ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఏడాది కాలంలో భక్తుల సౌకర్యార్థం అనేక సదుపాయాలను కల్పించామన్నారు.

సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా..

గత కొద్ది రోజులుగా మధ్యాహ్నం అమ్మవారి మహానివేదన సమయంలో వీఐపీలు, వృద్ధులు, వికలాంగులు అధికంగా విచ్చేస్తున్నారని, దీని కారణంగా సామాన్య భక్తులు కొంత ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వీఐపీలు మధ్యాహ్నం 12 గంటల లోపు, 2 గంటల తర్వాతే ఆలయానికి విచ్చేసేలా ప్రణాళికలు చేసుకోవాలన్నారు. భక్తుల సౌకర్యార్థం రైల్వే స్టేషన్, బస్టాండ్‌లలో దేవస్థాన ప్రసాదం కౌంటర్లు రెండు షిఫ్టులలో పని చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇంద్రకీలాద్రి కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ మార్గంలో దేవస్థానం బస్సును త్వరలోనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇక పాలక మండలి సమావేశంలో ఘాట్ రోడ్డు మరమ్మతు పనులకు, శివాలయం విద్యుత్ పనులతో పాటు పాలనా పరమైన అంశాలకు ఆమోదం తెలపాలన్నారు. సమావేశంలో పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, బుద్దా రాంబాబు, చింతా సింహాచలం, దేవిశెట్టి బాలకృష్ణ, బచ్చు మాధవీకృష్ణ, తొత్తడి వేదకుమారి, అనుమోలు ఉదయలక్ష్మి, కొలుకులూరి రామసీత, ప్రత్యేక ఆహ్వానితులు జక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, చెన్నా జనార్దనరావు, కోసూరి వెంకటరాజు మార్నెడి రాఘవరాగిణి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

త్యాగరాజ సంకీర్తనా వైభవం


ప్రసంగిస్తున్న యనమండ్ర శ్రీనివాస శర్మ

విజయవాడ కల్చరల్: శాస్త్రీయ సంగీత సంప్రదాయాలు విశిష్టమైనవని వేద పండితులు, సంగీత ప్రయోక్త యనమండ్ర శ్రీనివాస శర్మ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంలో సంగీత సన్మండలి ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించే సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనా సంగీతోత్సవాలను విజయవాడ నగరంలోని ఘంటసాల సంగీత కళాశాలలో సోమవారం ఆయన ప్రారంభించారు. శ్రీనివాస శర్మ మాట్లాడుతూ సంగీతం ద్వారా మనో వికాసం కలుగుతుందని, వాటి విలువలను కాపాడుకోవడానికి యువత కృషి చేయాలని సూచించారు. త్యాగయ్య కృతులు తెలుగు భాషా వీచికలని, సమాజ చిత్రీకరణ కనిపిస్తుందని మనిషి తన జీవన ప్రగతికి సంబంధించిన అంశాలు ఆయన కీర్తనలలో కనిపిస్తాయన్నారు. సన్మండలి సంగీత సంస్థ అధ్యక్షుడు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ 1995లో ప్రారంభించిన సభ నేటి దాకా సంగీత జ్యోతులను వెలిగిస్తూనే ఉందన్నారు. సంగీత కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుభొట్ల కృష్ణవేణి జ్యోతిని వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. సంగీత ఉత్సవాలు టి.ప్రకాష్, టి.బాలమురళీ కృష్ణ స్వరంతో ప్రారంభమయ్యాయి, హైదరాబాద్‌కు చెందిన ధూళిపాళ శ్రీరంజని, మల్లాది కార్తిక త్రివేణి, మల్లాది సూరిబాబు త్యాగరాజ స్వామి రచించిన కీర్తనలను మధురంగా ఆలపించారు.

కుష్ఠు వ్యాధి రహిత జిల్లా లక్ష్యం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు


స్పర్శ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరిని గుర్తించి వైద్య సహాయం అందించడం ద్వారా కుష్ఠు వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చేయి చేయి కలుపుదామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. కుష్ఠు వ్యాధి నివారణ అవగాహనకు నిర్వహించే 'స్పర్శ' కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ రూపొందించిన పోస్టర్లను, కరపత్రాలను సోమవారం స్థానిక శ్రీ పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో కలెక్టర్ ఢిల్లీరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించేందుకు జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు జిల్లాలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ టీబీ అధికారి జె. ఉషారాణి, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ జి. వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ ఎం. రజనీ కుమారి పాల్గొన్నారు.

స్వీయ నియంత్రణే అస్త్రం



మాట్లాడుతున్న డీసీపీ సత్తిబాబు, చిత్రంలో ఎస్పీ సరిత తదితరులు

సైబర్ సెక్యూరిటీ వర్క్‌షాపులో డీసీపీ మోకా సత్తిబాబు

విజయవాడస్పోర్ట్స్: మొబైల్, కంప్యూటర్ వినియోగంలో వ్యక్తిగత జాగ్రత్తలు పాటిస్తే సైబర్ నేరాల బారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయని డెప్యూటీ పోలీస్ కమిషనర్(డీసీపీ) మోకా సత్తిబాబు సూచించారు. మొబైల్, ల్యాప్‌ట్యాప్, కంప్యూటర్లను ఆధారంగా చేసుకుని సైబరాసురులు విసిరే పంజా నుంచి మనల్ని మనమే కాపాడుకోవాలని హితవు పలికారు. ఏపీ సీఐడీ ఆధ్వర్యాన విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపంలోని కన్వెన్షన్ హాలులో 'సైబర్ సెక్యూరిటీ' అనే అంశంపై సోమవారం జరిగిన వర్క్ షాప్‌నకు డీసీపీ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. నేరగాళ్లు మొబైల్, ల్యాప్‌టాప్, కంప్యూటర్‌లను హ్యాక్ చేసి ఆర్థిక నేరాలకు, లైంగిక వేధింపులకు తెగబడుతున్నారన్నారు. మొబైల్‌కే ఎక్కువ సమయం కేటాయిస్తున్న వారే ఈ నేరాల బారిన పడుతున్నారని స్పష్టం చేశారు. పూర్తి అవగాహనతోనే ఫేస్‌బుక్, వాట్సాప్, టెలిగ్రాం, ఇన్‌స్టా, యూట్యూబ్, గూగుల్‌ను వినియోగించాలని, వీటిలోని ప్రైవసీ(వ్యక్తిగత) సెట్టింగ్స్‌ను జాగ్రత్తగా ఉంచుకుంటే నేరాల బారిన పడే అవకాశం తక్కువగా ఉంటుందని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి..

సైబర్ నేరాల పట్ల మహిళలు అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని సీఐడీ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ కె.జి.వి.సరిత సూచించారు. విద్యార్థినులు, గృహిణులు, చిన్నారులను లక్ష్యంగా చేసుకుని పలు రకాలైన సైబర్ నేరాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. స్మార్ట్ ఫోన్ వినియోగంలో విచ్చలవిడితనం వల్లే అత్యధికులు ఈ నేరాల బారిన పడుతున్నారని స్పష్టం చేశారు. సోషల్ ఇంజినీరింగ్‌లోని మెలకువలు తెలుసుకోకుండా అనాలోచితంగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాలలో లైక్‌లు, షేర్లకు ఆశపడి బాధలు కొనితెచ్చుకోవద్దని హితవు పలికారు. సైబర్ నేరాల బారిన పడిన 3-4 గంటల లోపు (గోల్డెన్ అవర్) 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేసి రక్షణ పొందాలని సూచించారు.

రూ.10 వేల కోట్ల దోపిడీ..

గత ఏడాది జరిగిన సైబర్ నేరాల్లో రూ.10 వేల కోట్లు నష్టపోయారని సైబర్ నిపుణులు(హైదరాబాద్) బూసరపు శ్రీనివాస్ అన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, జీమెయిల్, యాహూ మెయిల్ నుంచి వ్యక్తిగత వివరాలను సైబర్ నేరగాళ్లు కాజేస్తున్నారని అప్రమత్తం చేశారు. అపరిచిత వ్యక్తులు పంపే లింక్‌లను గుడ్డిగా క్లిక్ చేయకుండా వాటి వివరాలను ముందుగా virustotal.com వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవాలని, కంప్యూటర్, ల్యాప్‌ట్యాప్‌లలో ఎక్స్‌పీ(xp) సాఫ్ట్‌వేర్‌ను వినియోగించవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ లైసెన్స్ ఉన్న యాంటీ వైరస్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు.

పనుల్లో పురోగతి

దుర్గగుడి మాస్టర్ అభివృద్ధి పనులు వేగవంతం

- ఎలివేటెడ్ క్యూలైన్లకు మార్కింగ్
- పూర్తయిన యాగశాల పునాదులు
- చురుగ్గా ప్రసాదాల పోటు నిర్మాణం
- 18 నుంచి మల్లేశ్వర స్వామి వారి దర్శనం


యాగశాల నిర్మాణానికి పూర్తయిన పునాదులు


ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి అభివృద్ధి నిమిత్తం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన మాస్టర్ ప్లాన్ పనులు వేగం పుంజుకున్నాయి. దేవస్థానంలో రూ. 215 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు గత నెల 7వ తేదీన సీఎం శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. వీటిలో భాగంగా తొలి ప్రాతిపదికన రూ. 13 కోట్లతో చేపట్టిన ఎలివేటెడ్ క్యూలైన్ల నిర్మాణం, మహా మండపం ఎదుట రూ. 27 కోట్లతో చేపట్టిన ప్రసాదాల పోటు నిర్మాణానికి పనులు వేగవంతం చేశారు.

- కనకదుర్గనగర్ నుంచి మహామండపానికి అనుసంధానం చేస్తూ ఎలివేటెడ్ క్యూలైన్ల నిర్మాణం జరుగుతోంది. గోశాల రోడ్డులో తూర్పు వైపున ఇప్పటికే రాతి కట్టడాలను తొలగించారు. వాటి స్థానంలో ఎలివేటెడ్ క్యూలైన్లను నిర్మిస్తున్నారు. క్యూలైన్ల నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో ఇప్పటికే గ్రౌండ్ లెవల్ మార్కింగ్ పనులు పూర్తయ్యాయి.
- మహా మండపం ఎదుట ప్రసాదాల పోటు కోసం ప్రతిపాదించిన స్థలాన్ని భవన నిర్మాణానికి అనువుగా తీర్చిదిద్దుతున్నారు. ప్రసాదం పోటు భవన నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని దేవదాయ శాఖ ఇంజినీరింగ్ విభాగం అధికారులు గత రెండు రోజులుగా పరిశీలించిన దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులకు సూచనలు చేస్తున్నారు. ఈ ఏడాది దసరా నాటికి ప్రసాదం పోటు భవన నిర్మాణం శ్లాబ్‌లు పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

ఆరు నెలల్లో యాగశాల పూర్తి..

అమ్మవారి ఆలయం సమీపంలోని దేవస్థానం రూ. 5 కోట్ల అంచనాలతో యాగశాల నిర్మాణం చేపట్టింది. దాతల సహకారంతో చేపట్టిన యాగశాల ఇప్పటికే పునాదులు పూర్తయ్యాయి. కాగా ఇతర నిర్మాణానికి అవసరమైన రాతి స్తంభాలు, ఇతర సామగ్రి ఆలయానికి తరలించేందుకు రంగం సిద్ధం చేశారు. రాతి స్తంభాలు, ఇతర సామగ్రిని యాగశాల వద్దకు చేర్చేందుకు అవసరమైన క్రేన్‌ను ఏర్పాటు చేసేందుకు భారీ కాంక్రీట్ దిమ్మను సిద్ధం చేశారు. మహా మండపానికి ఉత్తరం వైపున భారీ వాహనాలను వచ్చేందుకు అనువుగా ర్యాంప్‌ను సైతం సిద్ధం చేశారు. మరో ఆరు నెలలో యాగశాల పూర్తి చేసేలా పనులు వేగంగా జరుగుతున్నాయి.

18 నుంచి మల్లేశ్వరుని దర్శనం


మల్లేశ్వర స్వామి వారి ఆలయం

దుర్గగుడి అభివృద్ధి నిమిత్తం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం కేటాయించిన రూ. 72 కోట్ల నుంచి రూ. 5.60 కోట్లతో మల్లేశ్వర స్వామి వారి ఆలయాన్ని అభివృద్ధి చేశారు. అభివృద్ధి పనులు పూర్తి కావడంతో ఫిబ్రవరి 18వ తేదీ నుంచి భక్తులను స్వామి వారి దర్శనానికి అనుమతించనున్నారు. 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు 5 రోజుల పాటు స్వామి వారికి పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహిస్తారు. 18వ తేదీ స్వామి వారికి కళాపకర్షణ, ఆలయ గోపురంపై కలశస్థాపన, అభిషేకాల అనంతరం స్వామి వారి దర్శనానికి భక్తులను అనుమతించనున్నారు.

అర్జీదారుల సమస్యలకు తక్షణ పరిష్కారం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్పందన ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను అధికారులు తమ వ్యక్తిగత సమస్యలుగా భావించి సత్వరమే పరిష్కరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. ప్రతి అర్జీని పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా కలెక్టర్ ఢిల్లీరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్నింటిని అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన ద్వారా ప్రజలు సమర్పించే అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్కడా అర్జీలు పునరావృతం కాకుండా చూస్తున్నామన్నారు. నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. సమస్యల పరిష్కారానికి అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపినట్లు తెలిపారు.

స్పందనలో 151 అర్జీలు..

స్పందనలో 151 అర్జీలు నమోదైనట్లు కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. వీటిలో అత్యధికంగా రెవెన్యూ విభాగానికి సంబంధించి 84 అర్జీలు ఉన్నాయన్నారు. పోలీస్ శాఖ 17, డీఆర్డీఏ 11, మున్సిపల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ 9, ఆరోగ్యం 6, విద్యా 4, బీసీ వెల్ఫేర్ 3, విభిన్న ప్రతిభావంతులు 3, సోషల్ వెల్ఫేర్ 2, పంచాయతీరాజ్ 2, మార్కెటింగ్ 2, సర్వే సెటిల్‌మెంట్, కో-ఆపరేటివ్, హౌసింగ్, ఇరిగేషన్, ఏపీసీపీడీసీఎల్, పశుసంవర్ధక శాఖ, పౌర సరఫరాల శాఖ, కాలుష్య నివారణ శాఖలకు ఒక్కోటి చొప్పున అర్జీలు అందాయన్నారు. పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జి. వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ ఎం. రజిని కుమారి, డీఆర్‌డీఏ పీడీ కే. శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ జి. ఉమాదేవి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె. విద్యాసాగర్, ఎల్డీఎం కె. ప్రియాంక, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ జె. సుమన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథాన పేట

- విజయవాడ ఎంపీ కేశినేని నాని
- జగ్గయ్యపేటలో ప్రభుత్వ విప్ ఉదయభానుతో కలిసి పలు ప్రారంభోత్సవాలు


సెంట్రల్ లైట్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ కేశినేని నాని, విప్ ఉదయభాను తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: గత అసెంబ్లీ ఎన్నికల్లో జగ్గయ్యపేట నియోజకవర్గంలో సామినేని ఉదయభానును 5 వేల ఓట్ల మెజార్టీతో గెలవగా, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 25 వేల బంపర్ మెజార్టీతో గెలిపించాలని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాసరావు(నాని) అన్నారు. సోమవారం జగ్గయ్యపేట నియోజకవర్గంలో పర్యటించిన ఎంపీ కేశినేని నాని సాయంత్రం బీ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన పార్టీ ఆత్మీయ సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుతో కలసి పాల్గొన్నారు. అనంతరం జగ్గయ్యపేట పట్టణంలో ఏర్పాటుచేసిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఉదయభానుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేట అభివృద్ధి పథాన పయనిస్తోందని, అందుకు ఎమ్మెల్యే ఉదయభాను ఎంతో కృషి చేశారన్నారు. ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మాట్లాడుతూ ఈ నాలుగేళ్ల పది నెలల జగనన్న పాలనలో జగ్గయ్యపేట నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని, అభివృద్ధి, సంక్షేమం కోసం ఇప్పటికి సుమారు రూ. 1200 కోట్లు నిధులు కేటాయించినట్లు తెలిపారు.

అభివృద్ధి పనులు ఇవే..

- జగ్గయ్యపేట-చిల్లకల్లు మధ్య రూ. 14 కోట్లతో 5 కి.మీ. మేర నిర్మించిన ఫోర్‌లేన్ రోడ్డు డివైడర్‌పై రూ. కోటి వ్యయంతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైట్లను ఎమ్మెల్యే ఉదయభానుతో కలసి ఎంపీ ప్రారంభించారు.
- పేట మునిసిపాలిటీకి ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ. 23 లక్షలతో నిర్మించిన నాలుగు వాటర్ ట్యాంకులతో పాటు రెండు ట్రాక్టర్లను ఎంపీ కేశినేని నాని, ఉదయభాను ప్రారంభించారు.
- స్థానిక 7వ వార్డు, ఆర్టీసీ కాలనీలో ఎంపీ ల్యాడ్స్ రూ. 80 లక్షలతో నిర్మించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవనాన్ని ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభించారు.

కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా ఫిరోజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కరాటే జాతీయ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారుల సత్తా



విజయవాడస్పోర్ట్స్: జపాన్ కరాటే అసోసియేషన్(జేకేఏ) ఇండియా గత నాలుగు రోజులుగా గోవాలో నిర్వహిస్తున్న కరాటే జాతీయ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు సత్తా చాటారు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహించిన సురసాని అక్షిత అండర్–12 కుమితే(ఫైట్) విభాగంలో సిల్వర్ మెడల్‌ను కైవసం చేసుకుంది. అండర్–12 కటా విభాగంలో స్నేహిత, స్నిగ్ధ, గోవర్ధన్‌రెడ్డి నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. ప్రతిష్టాత్మకమైన జాతీయ పోటీల్లో రాణించిన క్రీడాకారులను, కోచ్ సాగరికను జేకేఏ సౌత్ ఇండియా ఇన్‌స్ట్రక్టర్ సుదర్శన్, రాష్ట్ర చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కొడాలి రవిబాబు, తదితరులు అభినందించారు.

నిధులు సద్వినియోగం చేసుకోవాలి

డీఈఓ తాహెరా సుల్తానా



కంకిపాడు: పాఠశాలల అభివృద్ధికి కేటాయించే నిధులను సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ తాహెరా సుల్తానా సూచించారు. జిల్లాలో పీఎం శ్రీ కి ఎంపికైన 27 పాఠశాలల హెచ్‌ఎంలతో సోమవారం ఆమె ఈడుపుగల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పీఎం శ్రీ కింద ఎంపికైన పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి చర్యలకు త్వరలో నిధులు కేటాయిస్తున్నారని, ఆ నిధులతో పీఎం శ్రీ నిబంధనలకు అనుగుణంగా పూర్తి స్థాయిలో పాఠశాలలను అభివృద్ధి పర్చుకోవాలన్నారు. విద్యార్థుల విద్యా ప్రగతికి వసతులు దోహదపడాలన్నారు. లోటుపాట్లకు ఆస్కారం లేకుండా నిరంతరం అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో ఏఎంఓ శ్యాం, మండల విద్యాశాఖ అధికారులు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఆరు సబ్జెక్టులు.. ఏడు పరీక్షలు

- ఈ ఏడాది పది పరీక్షా విధానంలో స్వల్ప మార్పులు
- సైన్సు సబ్జెక్టులో రెండు పరీక్షలు
- మార్చి 18 నుంచి పరీక్షలు ప్రారంభం



పటమట(విజయవాడతూర్పు): రానున్న 50 రోజుల్లో ఉమ్మడి కృష్ణాజిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మార్చి 18 నుంచి ఈ పరీక్షలకు విద్యాశాఖ శ్రీకారం చుట్టనుంది. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వం పరీక్షల విధానంలో పలు మార్పులు చేపట్టింది. గత విద్యా సంవత్సరంలోనే భారీ మార్పులకు శ్రీకారం చుట్టగా, ఈ ఏడాది పది పరీక్షల విధానంలో స్వల్ప మార్పులు చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాశాఖలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. నాడు–నేడు, జగనన్న అమ్మఒడి, ఒకటో తరగతి నుంచే ఇంగ్లిషు మీడియం, సీబీఎస్‌ఈ పాఠశాలల్లోనే జూనియర్ కళాశాలల ఏర్పాటు ఇలా పలు నూతన సంస్కరణలకు నాంది పలికారు. వీటిలో భాగంగానే ఈ ఏడాది పది పబ్లిక్ పరీక్షల్లో ఆరు సబ్జెక్టులను ఏడు పరీక్షలుగా నిర్వహిస్తున్నారు.

గత ఏడాది వరకూ ఇలా...

పదో తరగతిలో గత కొన్నేళ్లుగా 11 పరీక్షలను నిర్వహించేవారు. హిందీ మినహా తెలుగు, ఇంగ్లిష్, గణితం, సోషల్ సబ్జెక్టుల్లో ప్రతి సబ్జెక్టుకు 50 మార్కుల వంతున రెండు పేపర్లు నిర్వహించేవారు. సైన్సులో ఫిజికల్ సైన్స్, బయాలజీ సబ్జెక్టుకు 50 మార్కుల వంతున రెండు పేపర్లు ఉండేవి. ఒక్కో పరీక్షను ఒక్కో రోజు వంతున 11 రోజుల పాటు పరీక్షలు నిర్వహించేవారు. కరోనా ప్రభావంతో 2019–20, 2020–21 విద్యా సంవత్సరాల్లో పబ్లిక్ పరీక్షలను రద్దు చేశారు. కరోనా తీవ్రత తగ్గడంతో 2021–22 విద్యా సంవత్సరంలో పబ్లిక్ పరీక్షలు నిర్వహించగా, 11 పేపర్లను ఏడు పేపర్లకు కుదించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిషు, గణితం, సోషల్ సబ్జెక్టులకు ఒక్కో పేపరుకు 100 మార్కులకు వంతున పరీక్ష నిర్వహించగా, ఫిజికల్ సైన్స్, బయాలజీ పేపర్లను ఒక్కో పేపరుకు 50 మార్కుల వంతున నిర్వహించారు. 2022–23 విద్యా సంవత్సరంలో పది పబ్లిక్ పరీక్షలను ఆరు పేపర్లకు కుదించారు.

2023–24 విద్యా సంవత్సరంలో...

ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆరు సబ్జెక్టులకు ఏడు పరీక్షలు నిర్వహిస్తున్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిషు, గణితం, సోషల్ సబ్జెక్టులను వంద మార్కుల వంతున నిర్వహిస్తున్నారు. సైన్స్ పేపరును మాత్రం రెండు పరీక్షలుగా నిర్వహిస్తున్నారు. ఫిజికల్ సైన్స్ 50 మార్కులకు, బయలాజికల్ సైన్స్ పేపరు 50 మార్కులకు నిర్వహిస్తున్నారు. పరీక్ష సమయాన్ని కూడా ప్రభుత్వం మార్పు చేసింది. గతంలో ఈ సమయం మూడు గంటలు ఉండగా, ఇప్పుడు 15 నిమిషాలు పెంచారు. ఈ 15 నిమిషాల నిడివిలో ప్రశ్నపత్రం చదవడానికి, రాసిన సమాధానాలు సరిచూసుకోవడానికి కేటాయించాలనే ఉద్దేశంతో ఈ మార్పు చేశారు. గత ఏడాది పరీక్షకు పరీక్షకు మధ్య ఒక రోజు గడువు ఉండగా, ఈ ఏడాది వరుసగా రోజుకొక పరీక్షను నిర్వహిస్తున్నారు.

అవగాహన కల్పించాం



పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఈ ఏడాది మారిన విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించాం. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఏడు పేపర్ల విధానాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆరు సబ్జెక్టులకు ఏడు పేపర్లు నిర్వహిస్తున్నారు. 2024–25లో సీబీఎస్‌ఈ విధానంలో పది పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులు సైన్స్ పరీక్ష విషయంలో గందరగోళానికి గురవకూడదని, సైన్స్ పరీక్షను వేర్వేరు రోజుల్లో ప్రభుత్వం నిర్వహిస్తోంది.

–కేవీఎన్ కుమార్, డీవైఈవో, ఎన్టీఆర్ జిల్లా

తప్పిపోయిన బాలుడు తండ్రి చెంతకు...



ఢిల్లేశ్వరరావు

రామవరప్పాడు: ఇంటి నుంచి ఆడుకుంటూ బయటకు వచ్చి తప్పిపోయిన బాలుడు ఓ వ్యక్తి చొరవతో క్షేమంగా తన తండ్రి చెంతకు చేరిన ఘటన సోమవారం రామవరప్పాడులో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం సమీపంలోని ఎంపీయూపీ స్కూల్‌లో బాలుడు ఢిల్లేశ్వరరావు 3వ తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం స్కూల్‌కు వెళ్లకుండా హైస్కూల్ రోడ్డులోని పిన్నమనేని హైట్స్ అపార్టుమెంట్ వద్ద ఏడుస్తూ అటూ ఇటూ తిరుగుతూ కనిపించాడు. ఈ అపార్టుమెంట్‌లో నివాసం ఉండే కందిమళ్ల ఆంజనేయులు అనే వ్యక్తి బాలుడిని గమనించి వివరాలు అడగ్గా సరిగ్గా చెప్పలేకపోయాడు. దీంతో ముందుగా బాలుడికు అల్పాహారం పెట్టించి సెక్యూరిటీ గార్డు వద్ద ఉంచాడు. ఆంజనేయులు బాలుడు ఫొటో తీసి సోషల్ మీడియా గ్రూపుల్లో పోస్టు చేయడమే కాకుండా జెడ్పీ పాఠశాల హెచ్‌ఎంకు ఫొటో పంపి అప్రమత్తం చేశారు. చివరకు ఈ బాలుడు ఎంపీయూపీ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడని తెలుసుకుని ఆ పాఠశాల టీచర్ ద్వారా బాలుడి తండ్రి పూర్ణచంద్రరావుకు సమాచారం అందించారు. దీంతో సెక్యూరిటీ గార్డు వద్ద క్షేమంగా ఉన్న బాలుడిని అతని తండ్రి పూర్ణచంద్రరావు వచ్చి ఇంటికి తీసుకెళ్లాడు.

తాజా ఉత్పత్తులు అందించటమే లక్ష్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మత్స్య సంపదకు మార్కెట్ సౌకర్యం కల్పించడంతో పాటు వినియోగదారులకు తాజా ఉత్పత్తులను అందించి మత్స్యకారులకు ఆర్థిక భరోసా కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో సింగ్‌నగర్‌కు చెందిన యు.కమలేష్‌కు రూ.27 లక్షల విలువైన వాహనాన్ని, ఇబ్రహీంపట్నంకు చెందిన ఎన్.మాధవ వర్మకు రూ.13.50 లక్షల విలువైన ఫిష్ ట్రాన్స్ పోర్ట్ వాహనాలను నగరంలోని కలెక్టరేట్ ఆవరణలో కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డీడీ వి.పెద్దిబాబు, అసిస్టెంట్ డైరెక్టర్ చక్రాణీ, ఫిషరీస్ డీఓ పి.అఖిల ఉన్నారు.

ఇంద్రకీలాద్రిపై అదనపు ప్రసాదం కౌంటర్లు

- అందుబాటులో ప్రసాదం, దర్శన టికెట్లు
- మిగిలిన సేవలు అందించేలా ప్రణాళికలు



తులాభారం వద్ద దర్శన టికెట్ల కౌంటర్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం దేవస్థాన ఘాట్‌రోడ్డుతో పాటు మహా మండపం 7వ అంతస్తు తులాభారం వద్ద అదనపు కౌంటర్లను ఏర్పాటు చేసింది. ఘాట్‌రోడ్డులోని కౌంటర్ వద్ద ప్రసాదాలను విక్రయిస్తుండగా, తులాభారం వద్ద రూ.500, రూ.300, రూ.100 టికెట్లను విక్రయిస్తున్నారు. రద్దీ సమయంలో కొండపైన, మహా మండపం దిగువన ఉన్న కౌంటర్ల వద్ద భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న దేవస్థాన చైర్మన్ రాంబాబు, ఈవో రామారావు అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం కౌంటర్లను భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. త్వరలోనే ఆయా కౌంటర్లలో ఆర్జిత సేవా టికెట్లతో పాటు డొనేషన్లు స్వీకరించేలా ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు దుర్మరణం

పెనమలూరు: కానూరు 100 అడుగుల రోడ్డులో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు మృతి చెందిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం...పటమట రామలింగేశ్వర నగర్‌కు చెందిన పాప శివ (60) ఎనికేపాడు వద్ద గల అపార్టుమెంట్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అతను ఆదివారం డ్యూటీకి హాజరయ్యాడు. సోమవారం తెల్లవారుజామున బైక్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా కానూరు 100 అడుగుల రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో అతను తీవ్ర గాయాలతో మృతి చెందాడు. ఘటనపై మృతుడి కుమారుడు అజయ్ బాబు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ షాక్‌తో టిప్పర్ డ్రైవర్ మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): టిప్పర్ ఐరన్ బాడీ కరెంటు తీగలకు తగిలి షాక్‌తో డ్రైవర్ మృతి చెందిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం పొట్టిపాడు గ్రామానికి చెందిన వి.శ్రీను టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. సోమవారం ఉదయం షాబాద్ వెళ్లి టిప్పర్ తీసుకుని మట్టిని లోడ్ చేసుకునేందుకు వెళ్లుతుండగా టైర్ పంక్చర్ అయింది. దీంతో శ్రీను టిప్పర్‌ను పాముల కాల్వ వద్ద ఉన్న శ్రీను మెకానిక్ షాపు వద్దకు తీసుకెళ్లాడు. టిప్పర్ బాడీని పైకి లేపేందుకు ప్రయత్నించిన క్రమంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో షాక్‌కు గురైన శ్రీను అక్కడే పడిపోవడంతో స్నేహితుడైన మాచర్ల రాజేంద్రప్రసాద్ వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే శ్రీను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై సమాచారం అందుకున్న శ్రీను కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. శ్రీను తమ్ముడు ప్రసాద్ ఫిర్యాదుమేరకు అనుమానాస్పద మృతి కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

పెనమలూరు: కుటుంబ కలహాల కారణంగా యనమలకుదురు గ్రామంలో సోమవారం ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం...యనమలకుదురు డొంకరోడ్డుకు చెందిన ధనకొండ లక్ష్మీనర్సింహమూర్తి పెద్దకుమారుడు సంతోష్ (32) హైదరాబాద్‌లో మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. సంక్రాంతి సెలవులకు తన భార్య కనకదుర్గ మహతి, ఇద్దరు పిల్లలతో కలిసి యనమలకుదురు వచ్చాడు. సెలవుల అనంతరం కనకదుర్గ మహతి హైదరాబాద్ వెళ్లింది. వేరు కాపురం విషయమై భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 28వ తేదీ రాత్రి ఇంటికి వచ్చిన సంతోష్ తన కుమారుడు తనుష్‌కృష్ణను తీసుకుని తన గదిలోకి వెళ్లి పడుకున్నాడు. ఉదయం ఎంతకూ తలుపులు తీయకపోవటంతో లక్ష్మీ నరసింహమూర్తి, ఆయన చిన్న కుమారుడు కిటికీలో నుంచి చూడగా చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య కాపురానికి రాకపోవటంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి లక్ష్మీ నరసింహమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బొమ్ములూరు చెక్‌పోస్టు వద్ద రూ.4.25 లక్షల నగదు పట్టివేత

హనుమాన్‌జంక్షన్ రూరల్: చెన్నై–కోల్‌కత్తా జాతీయ రహదారిపై బాపులపాడు మండలం బొమ్ములూరులో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో రూ.4.25 లక్షల నగదు పట్టుబడింది. హనుమాన్ జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి, ఎస్ఐ ఏడీఎల్ జనార్ధన్ ఆధ్వర్యంలో సోమవారం వాహన తనిఖీలు నిర్వహించగా అక్రమంగా తరలిస్తున్న ఈ నగదును పట్టుకున్నారు. ఏలూరు వైపు నుంచి విజయవాడలోని పంజా సెంటర్‌కు కారులో వెళుతున్న షేక్ బాజీ ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.4.25 లక్షల సొమ్మును తరలిస్తుండటంతో పోలీసులకు చిక్కాడు. ఈ నగదును సీజ్ చేయటంతో పాటుగా, అతనిపై కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీపీటీవో

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు మెరుగైన సేవలు కల్పించి వారి భద్రత ప్రమాణాలు పాటించే దిశగా ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు, ఫిర్యాదులు స్వీకరించేందుకు డయల్ యువర్ డీపీటీవో (జిల్లా ప్రజారవాణా అధికారి) కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.ఏసుదానం తెలిపారు. ప్రయాణికులు మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల మధ్య ఫోన్ నంబర్ 9959225446 కు చేసి తమ సలహాలు, సూచనలు, ఫిర్యాదులు తెలియచేయాలని కోరారు.

క్రికెట్‌లో సత్తా చాటిన ఎస్తేర్‌కు అభినందనలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈ నెల 24, 25 తేదీల్లో నగరంలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో జరిగిన ఆడుదాం ఆంధ్రా రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన జట్టులో శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని ఎ.ఎస్తేరు రాణి సత్తా చాటింది. అత్యుత్తమ ప్రతిభ చూపడంతో ఎస్తేరు రాణి బెస్ట్ ప్లేయర్ మెడల్‌ను సొంతం చేసుకుంది. దీంతో ఆమెకు సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ పద్మజ, అధ్యాపకులు, సహచర విద్యార్థినులు అభినందనలు తెలిపారు.

చిత్రలేఖనంలో మనోజ్‌కు ప్రథమ స్థానం



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): చిత్రకళా తపస్వి మేముల కామేశ్వరరావు శత వసంతాల సందర్భంగా ఫోరం ఫర్ ఆర్టిస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన చిత్రలేఖనం పోటీల్లో తమ కళాశాలలో జూనియర్ ఎంపీసీ చదువుతున్న ఎస్.గోపి మనోజ్ సూపర్ సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి పొందాడని పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చుండీ వెంకటేశ్వర్లు చెప్పారు. రోడ్డు సేఫ్టీకై తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై గోపి మనోజ్ గీసిన చిత్రానికి మొదటి బహుమతి పొందాడన్నారు. కళాశాల ఆవరణలో అధ్యాపకులు, విద్యార్థులు గోపిమనోజ్‌ను సోమవారం అభినందించారు.

మేరీమాత స్వరూపం ఊరేగింపు



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): గుణదల కొండపై మేరీ మాత కొలువుదీరి ఈ ఏడాదికి వంద సంవత్సరాలు పూర్తి అవ్వడం చాలా సంతోషంగా ఉందని ఫాదర్ ప్రకాష్ అన్నారు. గుణదల కొండపై మేరీమాత కొలువుదీరి వంద సంవత్సరాలు అవుతున్న సందర్భంగా విజయవాడ మేత్రాసన బిషప్ తెలగతోటి జోసప్ రాజారావు ఆధ్వర్యంలో జరుగుతున్న గుణదల కొండ శత వసంతల వేడుకల్లో భాగంగా మేరీమాత స్వరూపాన్ని (విగ్రహాన్ని) మొగల్రాజపురం పరిసర ప్రాంతాల్లో సోమవారం ఊరేగింపు చేశారు. మొగల్రాజపురంలోని ఆర్‌సీఎం చర్చి, ఫాతిమా మాత దేవాలయం ఆవరణలో స్వరూపాన్ని ఉంచి క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ ప్రకాష్ మాట్లాడుతూ ఆత్మరూపంలో ఉన్న ఏసు ప్రభువును ఈ లోకంలోకి తీసుకొచ్చేందుకు మేరీమాత ఎంతో శ్రమించారని కొనియాడారు. మేరిమాతను తామంతా తల్లిగా గౌరవిస్తామని చెప్పారు. బందులదొడ్డి సెంటర్, సున్నపుబట్టీల సెంటర్, క్రీస్తు రాజపురం ప్రాంతాల్లో మేరీమాత ఊరేగింపు జరిగింది. సిస్టర్ టెక్లా, ఉపదేశులు పలిపే ఫ్రాన్సిస్, పి.రాజకుమార్‌తో పాటుగా అధిక సంఖ్యలో క్రైస్తవులు ఊరేగింపులో పాల్గొని కీర్తనలు ఆలపించారు.

5 నుంచి భారతీతీర్థ మహాస్వామి జన్మదిన వేడుకలు

విజయవాడ కల్చరల్: శృంగేరీ పీఠపాలితులు, జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి జన్మదిన వేడుకలను ఫిబ్రవరి 5 నుంచి ఏప్రియల్ 14 వరకు శివరామకృష్ణ క్షేత్రంలోని శ్రవణ సదనంలో నిర్వహిస్తునట్లు క్షేత్రధర్మాధికారి హనుమత్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 74 రోజులపాటు దేవాలయంలో ప్రతి రోజూ ఉదయం మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, చక్రనవావరణ, ఆది దంపతులకు త్రిశతి, మహామంగళ హారతి పండిత ఆశీర్వచనం ఉంటుందన్నారు.

నగరంలో నందన వనాలు!

- కాలనీల్లో అధునాతనంగా పార్కుల అభివృద్ధి
- ఆహ్లాదం, ఆరోగ్యం కోసం పార్కుకు వస్తున్న నగరవాసులు
- సుందరంగా తీర్చిదిద్దిన వైనం
- మానసికోల్లాసంపై దృష్టి పెడుతున్న నగర ప్రజలు
- ఒత్తిళ్లను అధిగమించేందుకు దోహదం



రెవెన్యూ కాలనీలో అభివృద్ధి చేసిన పార్కు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉరుకులు పరుగుల జీవన విధానంలో సిటీ లైఫ్ గజిబిజి గందరగోళంగా మారింది. విధి నిర్వహణలో, నగరంలోని ట్రాఫిక్‌లో ప్రయాణం ఇలా ప్రతి ఒక్కరూ తీవ్రమైన ఒత్తిళ్లకు గురవుతున్నారు. గతంలో అలాంటి జీవనం నుంచి బయట పడేందుకు ప్రకృతి ఒడిలో సేదతీరేందుకు వీకెండ్స్‌లో దూర ప్రాంతాల్లోని ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చని ప్రదేశాల్లో గడిపేవారు. ఇప్పుడు అలాంటి అవసరం లేకుండా, నగరంలోనే నందనవనాల్లా ప్రభుత్వం పార్కులను తీర్చిదిద్దింది. ఆయా పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్‌జిమ్, పిల్లల కోసం ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. ఒకప్పుడు రాజీవ్‌గాంధీ పార్కు, అంబేడ్కర్ పార్కు వంటి వాటికి మాత్రమే వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటి అవసరం లేకుండా కాలనీల్లోనే అన్ని సౌకర్యాలతో పార్కులను అభివృద్ధి చేశారు.

అందుబాటులోనే పచ్చదనం....

ప్రకృతి ఒడిలో సేదతీరేందుకు ఇంటి సమీపంలోనే పార్కులు అందుబాటులోకి వచ్చాయి. వాటిలో రకరకాల మొక్కలను పెంచుతున్నారు. ఉద్యానవనశాఖ ద్వారా నగర పాలక సంస్థ అరుదైన మొక్కలను అక్కడ ఏర్పాటు చేసింది. పార్కును సందర్శించిన వారికి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేలా వాటిని తీర్చిదిద్దుతున్నారు. వాటిని సందర్శించి మానసికోల్లాసం పొందేలా రూపొందించారు. నగరంలోని ప్రధాన పార్కులైన రాజీవ్‌గాంధీ పార్కు, అంబేడ్కర్ పార్కు వంటి వాటిని రూ. కోట్లు వెచ్చించి అభివృద్ధి చేయడంతో పాటు, కాలనీల్లోనూ పార్కులు ఏర్పాటు చేశారు.

ఇంటి సమీపంలోనే...

సమీపంలోని కాలనీల్లోనే పార్కులు ఏర్పాటు చేయడం, వాటిలో వాకింగ్ ట్రాక్‌లు ఉండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కుల్లో వాకింగ్ చేసేందుకు మహిళలే ఎక్కువగా వస్తున్నారు. పిల్లలకు ఆట పరికరాలను ఏర్పాటు చేయడంతో కొందరు మహిళల తమ పిల్లలను తీసుకుని పార్కుకు వచ్చి, వాళ్లు ఆడుకుంటుంటే, తల్లులు వాకింగ్ చేస్తున్నారు.



అనేక పార్కులు అభివృద్ధి

గత ప్రభుత్వం కాలనీల్లో పార్కులను విస్మరించింది. ఒక్క పార్కును కూడా అభివృద్ధి చేయలేదు. ప్రస్తుత ప్రభుత్వం కాలనీల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు పార్కులను అభివృద్ధి చేశారు. అందులో భాగంగా అనేక కాలనీలో పార్కులు. వాటిలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. ఇండోర్ జిమ్‌లను అందుబాటులోకి తేవడంతో వ్యాయామంపై దృష్టి సారిస్తున్నారు. ప్రజలకు మంచి చేసే ప్రభుత్వం ఇది. –గల్లా రవి, భారతీనగర్



మానసికంగా చాలా ఉపయోగం

బిజీలైఫ్ నుంచి బయటపడేందుకు వాకింగ్ చాలా అవసరం. పచ్చని మొక్కలు చూస్తూ వాకింగ్ చేయడం వలన మానసిక ఉల్లాసంతో పాటు, మెమొరీ పెరుగుతుంది. ఉదయం సాయంత్రం వేళ్లలో పచ్చని మొక్కల మధ్య వాకింగ్‌తో స్వచ్ఛమైన ఆక్సిజన్ బ్రెయిన్‌కు అందుతుంది. వృద్ధుల్లో జ్ఞాపకశక్తి తగ్గకుండా దోహదపడుతుంది. ఉదయం వేళ వాకింగ్‌తో విటమిన్ డి లభిస్తుంది. దీంతో ఎముకల పటుత్వంతో పాటు, హ్యాపీ హార్మోన్ రిలేజ్ అవుతుంది. తద్వారా మానసిక ఒత్తిళ్లు తగ్గుతాయి. –డాక్టర్ గర్రే శంకరరావు, మానసిక విశ్లేషకులు



ఎన్టీఆర్ కాలనీ పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్



పార్కులో పిల్లల కోసం ఏర్పాటు చేసిన పరికరాలు

కుటుంబ సమేతంగా...

నగర జీవికి శారీరక శ్రమ లేక పోవడంతో ఎక్కువగా జీవనశైలి వ్యాధులకు గురవుతున్నారు. వాటి నుంచి బయట పడేందుకు వ్యాయామంపై దృష్టి సారిస్తున్నారు. ఒకప్పుడు వ్యాయామం చేయాలంటే జిమ్‌కు వెళ్లాల్సి వచ్చేది. లేదంటే దూరం ప్రాంతంలో వాకింగ్ ట్రాక్ ఉన్న గ్రౌండ్‌కు వెళ్లేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇంటి సమీపంలో తమ కాలనీల్లోనే పార్కులు అందుబాటులోకి వచ్చాయి. వాటిలో వాకింగ్ ట్రాక్‌లతో పాటు, ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో భార్యాభర్తలతో పాటు, తమ పిల్లలను తీసుకుని పార్కులకు వచ్చి వ్యాయామం చేస్తున్న వారు ఎక్కువగా ఉంటున్నారు. మరోవైపు వృద్ధులు సైతం మానసికోల్లాసం కోసం పార్కులకు వస్తున్నారు. ఇలా అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా ప్రభుత్వం పార్కులను అభివృద్ధి చేసింది.

లబ్ధిదారులే వైఎస్సార్ సీపీ స్టార్ క్యాంపెయినర్లు

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్



సంక్షేమ కరపత్రాలను అందచేస్తున్న దేవినేని అవినాష్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారులే తమ పార్టీకి స్టార్ క్యాంపెయినర్లు అని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. ఎన్నికల ప్రచారానికి తెలుగుదేశం, జనసేన పార్టీల మాదిరిగా వైఎస్సార్ సీపీకి సినిమా హీరోలు అవసరం లేదని చెప్పారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని 7వ డివిజన్‌లో బందులదొడ్డి, గుమ్మడితోట ప్రాంతాల్లో దేవినేని అవినాష్ సోమవారం పర్యటించారు. నాలుగున్నర సంవత్సరాలుగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి గురించి డివిజన్ వాసులకు కరపత్రాలను అందచేసి వివరించారు. వచ్చే ఎన్నికల్లో గెలిచిన తర్వాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల గురించి అవినాష్ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ ఏ నమ్మకంతో అయితే ప్రజలు వైఎస్సార్ సీపీని గెలిపించారో ఆ నమ్మకం నిలబెట్టుకునే విధంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జనరంజకంగా పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. తమపార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్ ఎం.మాధురితో పాటుగా వైఎస్సార్ సీపీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వీఎంసీ కౌన్సిల్ సమావేశం

- 100 ప్రతిపాదనలతో ఎజెండా
- 12 అంశాలపై ప్రశ్నోత్తరాలు
- ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ ప్రారంభం



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రణాళికాబద్ధంగా తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం వీఎంసీ సర్వసభ్య సమావేశం జరగనుంది. మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశంలో మొత్తం 100 అంశాలు ఎజెండాలో ప్రతిపాదనకు రాగా 12 ప్రశ్నలు ప్రశ్నోత్తరాల్లో సభ్యులు అధికారులను ప్రశ్నించనున్నారు.

ప్రధానాంశాలు....

- వీఎంసీ సర్కిల్–3 పరిధిలోని 22వ డివిజన్‌లో ఉన్న దోబీ ఘాట్ డీపీ స్టేషన్ నుంచి సీవర్‌లైన్ వరకు ఉన్న యూజీడీ లైన్ లీకులు కారణంగా తాగునీరు కలుషితమవుతున్న నేపథ్యంలో స్థానికంగా మినీ ఎస్టీపీ నిర్మించాలని, ఇందుకు అయ్యే రూ. 98.62 లక్షలు వ్యయాన్ని కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ నుంచి నిధులు కేటాయించాలని వచ్చిన ప్రతిపాదనపై కౌన్సిల్ సభ్యులు నిర్ణయం తీసుకోనున్నారు.
- నగరంలో వీధి కుక్కల బెడద అధికంగా ఉన్నందున వాటికి యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) నిర్వహించేందుకు హైదరాబాద్‌కు చెందిన నవోదయ వెట్ సొసైటీకి మూడేళ్ల పాటు ఏబీసీ ఆపరేషన్స్ నిర్వహించేందుకు, ఇందుకు ఒక్కో కుక్కకు రూ. 1500 చెల్లింపులు కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయాలని వచ్చిన ప్రతిపాదనపై కౌన్సిల్ సభ్యులు నిర్ణయం తీసుకోనున్నారు.
- విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 24వ డివిజన్ పరిధిలోని 7, 92వ సచివాలయం ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం కాంప్లెక్స్‌పైన ఉండటంతో స్థానికులు అవస్థలు పడుతున్నారని, ఇందుకు ప్రత్యామ్నాయంగా ఇదే డివిజన్‌లోని ఆర్సీఎం చర్చిరోడ్డులో ఉన్న ఖాళీ స్థలంలో సచివాలయాలకు భవనం నిర్మించాలని స్థానిక కార్పొరేటర్ కుక్కల అనిత ప్రతిపాదించారు.
- విజయవాడ నగరపాలక సంస్థ తరఫున యువజనోత్సవాలు నిర్వహించాలని ట్రాఫిక్ అండ్ స్పోర్ట్స్ స్పెషల్ కమిటీ చైర్‌పర్సన్, 21వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల నర్సకుమారి కౌన్సిల్‌కు ప్రతిపాదించారు.

ప్రశ్నోత్తరాలు....

- నగరంలోని ఒకే డోర్ నంబరుతో రెండు తాగునీటి పన్నులు ఉన్నాయని, అలాంటి నగర వ్యాప్తంగా ఎన్ని ఉన్నాయని కౌన్సిల్ సభ్యులు ప్రశ్నోత్తరాల్లో ప్రస్తావించనున్నారు.
- వీఎంసీకి రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఎస్టేట్స్, ప్రజారోగ్య విభాగంకు రావాల్సిన ఆదాయం, ఆస్తులు, ఉన్న కేసులు, తీసుకున్న చర్యలపై సభ్యులు ప్రశ్నించనున్నారు.
- నగరంలో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకున్న ఆయా సంస్థల యజమానులు భూగర్భ జలాలను వినియోగించుకుంటున్నందున కార్పొరేషన్‌కు పన్నులు చెల్లిస్తున్నారా?, నగరంలో అధికారిక, అనధికారిక వాటర్ ప్లాంట్లు ఉన్ని ఉన్నాయని సభ్యులు ప్రశించనున్నారు.

స్పందన వినతులకు శాశ్వత పరిష్కారం



అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడ తూర్పు): ప్రజల నుంచి అర్జీ అందుకోవటంతో పాటు సమస్యకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని, అధికారులు ఈ మేరకు ప్రణాళికలు అమలు చేయాలని విజయవాడ నగర పాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కార్పొరేషన్‌లో సోమవారం నిర్వహించిన స్పందనలో వినతులు స్వీకరించారు. అధికారులు ప్రజల సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని వాటిని క్షుణ్ణంగా చదివి అంతిమ పరిష్కారం అందించాలని సూచించారు. సమస్య పరిష్కారం కాకపోతే అందుకు గల కారణాలను అర్జీదారులకు తెలియజేయాలని స్పష్టం చేశారు. అభివృద్ధి లక్ష్యాల సాధనకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను సక్రమంగా వినియోగించుకొని స్పందన వినతులపై ప్రతి రోజు సమీక్ష నిర్వహించి త్వరితగతిన పరిష్కారం చూపాలని తెలిపారు. మొత్తం 19 వినతులు రాగా ఇంజినీరింగ్ విభాగంపై 10, పట్టణ ప్రణాళిక - 6, పట్టణ సామాజికాభివృద్ధి - 1, ఉద్యానవన–1, ఎస్టేట్స్–1 ఉన్నాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (జనరల్) కె. శకుంతల, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం. ప్రభాకర్ రావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ పి రత్నావళి, డెప్యూటీ కమిషనర్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనలో 116 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న డీసీపీ అజిత

విజయవాడస్పోర్ట్స్: జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం జరిగిన స్పందనలో 116 ఫిర్యాదు అందినట్లు డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) వి.అజిత తెలిపారు. కమిషనరేట్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె ఫిర్యాదులు స్వీకరించారు. నగదు లావాదేవీలపై 29, కుటుంబ కలహాలపై 18, ఆస్తి వివాదాలపై 14, మోసాలపై 16, ఇతర అంశాలపై 39 మంది తనకు ఫిర్యాదులు ఇచ్చినట్లు చెప్పారు. ఈ ఫిర్యాదులను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని ఆయా స్టేషన్‌ల అధికారులకు ఆమె ఆదేశాలిచ్చారు.

ఆలోచనశక్తితో నూతన ఆవిష్కరణలు

ఇస్రో రిటైర్డ్ అసోసియేట్ డైరెక్టర్ శేషగిరిరావు



దాసరి రామకృష్ణను సత్కరిస్తున్న కళాశాల డీన్ రాజేష్, ప్రిన్సిపాల్ ఎం.రమేష్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): యువత తమలోని ఆలోచనా శక్తిని పెంపొందించుకోవడంతో పాటుగా కొత్త ఆవిష్కరణలు చేయాలనే కుతూహలాన్ని పెంపొందించుకోవాలని 'ఇస్రో' అసోసియేట్ డైరెక్టర్ (రిటైర్డ్) డాక్టర్ వి.శేషగిరిరావు చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలోని వెబినార్ హాలులో రీసెంట్ ఇన్నోవేషన్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ–2024 పేరుతో సోమవారం సదస్సు నిర్వహించారు. ఆన్‌లైన్ ద్వారా శేషగిరిరావు విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. కృత్రిమ మేధస్సు ద్వారా సాంకేతిక పరిజ్ఞాన రంగం కొత్త ఆవిష్కరణలు జరుగుతాయని చెప్పారు. యువత తమలోని ఆలోచనా శక్తిని పెంపొందించుకోవడం ద్వారానే నూతన ఆవిష్కరణలు సాధ్యమని తెలిపారు. సదస్సుకు మరో అతిథిగా హాజరైన ఎఫ్ ట్రానిక్స్ సీఈవో దాసరి రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునేటప్పుడు బేసిక్ ప్రోగ్రామింగ్స్, ల్యాంగ్వేజస్‌తో పాటుగా అల్గారిథమ్స్‌లో పట్టు సాధించాలని సూచించారు. సదస్సు కన్వీనర్, సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టీఎస్ రవికిరణ్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఏ విధమైన నూతన ఆవిష్కరణలు చేయవచ్చుననే అంశాలపై విద్యార్థులకు అవగాహనకు ఈ సదస్సు ఎంతగానో దోహదం చేస్తుందని పేర్కొన్నారు. వివిధ ప్రదేశాలను నుంచి ప్రముఖ కంపెనీలకు చెందిన వారు ఆన్‌లైన్ ద్వారా హాజరయ్యారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, అధ్యాపకులు జి.సామ్రాట్‌కృష్ణ, కె.సుధీర్, కె.ఉదయశ్రీతో పాటుగా విద్యార్థులు పాల్గొన్నారు.

ఫార్మా రంగంలో ఉద్యోగ అవకాశాలు



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి, వేదికపై రమణ, సునీత తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): కొత్తగా ఫార్మసీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు ఆహ్వానిస్తూ సీనియర్ విద్యార్థులు నియోఫెస్టా 2కే 24 పేరుతో నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకలు సోమవారం సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో ఉత్సాహంగా ఉల్లాసంగా జరిగాయి. ఈ వేడుకల్లో డార్విన్ ఫార్ములేషన్స్ అధినేత డాక్టర్ డి.లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మారంగం ఇప్పటికే అభివృద్ధి చెందిందని, దేశ విదేశాల్లోనూ మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులందరూ కోర్సులోని మెలకువలపై మంచి పట్టు సాధించి భవిష్యత్తులో ముందుకు సాగాలన్నారు. ప్రిన్సిపాల్ ఎ.సునీత మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో వినూత్న పద్ధతులతో వేడుకలు నిర్వహించిన సీనియర్ విద్యార్థులను అభినందించారు. అలాగే మంచి ర్యాంకులు సాధించి కళాశాలలో సీటు పొందిన వారు నైపుణ్యం గల అధ్యాపకుల, సీనియర్ విద్యార్థుల సలహాలు తీసుకుంటూ చక్కగా చదువుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో డాక్టర్ జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): రామలింగేశ్వరనగర్, పోలీస్ కాలనీలోని విద్యుత్ ఫీడర్‌తో పాటు 11 కేవీ రామాలయం ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు కరెంట్‌తీగల మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ తెలిపారు. చినరామాలయం, పెదరామాలయం ప్రాంతం, గరికపాటివారివీధి, కాలువకట్ట, జాస్తివారివీధి, ఆశ్రమంవీధి, గంగానమ్మగుడి, జీకెటవర్, వెంకట్ హైట్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

ప్రభుత్వ విద్యా సంస్థల్లో నాణ్యమైన విద్య



విద్యార్థినులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఆర్ఐవో రవికుమార్

మేయర్ రాయన భాగ్యలక్ష్మి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రభుత్వ రంగంలోని విద్యాసంస్థల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి చెప్పారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా సిద్ధార్థ ఆడిటోరియంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు ఉపకార వేతనాల పంపిణీ సోమవారం నిర్వహించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి అతిథిగా హాజరై మాట్లాడారు. విద్య ద్వారానే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరగలమని తెలిపారు. అందువల్లనే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన ఇంగ్లీషు విద్యను అందిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో పాటుగా ఇలాంటి సంస్థలు విద్యను ప్రోత్సహించడానికి సహాయం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ రీజనల్ అధికారి (ఆర్ఐవో) పి.రవికుమార్ మాట్లాడుతూ ఇలాంటి సంస్థలు చేస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవాలని కోరారు. సిద్ధార్థ జూనియర్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. పద్మజ మాట్లాడారు. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న 353 మంది విద్యార్థులకు 32 లక్షల రూపాయలను ఉపకార వేతనాలుగా అందచేశారు. కృష్ణా జిల్లా డీఐఈవో బీఎస్ఆర్‌వీ ప్రసాద్‌తో పాటుగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభిరుచికి తగ్గట్టుగా బోధించాలి



పటమట(విజయవాడతూర్పు): విద్యార్థుల అభిరుచికి తగ్గట్టుగా బోధించాలని ప్రముఖ పిల్లల వైద్యులు డాక్టర్ జి. శరత్ చంద్ర అన్నారు. పటమటలోని ఎన్ఎస్ఎం స్కూల్లో పాఠశాల కిండర్‌గార్డెన్ స్వర్ణోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శరత్‌చంద్ర మాట్లాడుతూ విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా బోధించే విద్య సర్వతోముఖాభివృద్ధిగా వారి భవిష్యత్తుకు తోడ్పడుతుందని చెప్పారు. విద్యార్థులందరూ సంగీతం, నృత్యం, క్రీడలు తదితర అంశాల్లో ప్రావీణ్యం సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన హార్మోనీ ఆఫ్‌ది సాంగ్, రిథమ్ ఆఫ్ జాయ్ నృత్యాలు ఆకట్టుకున్నాయి. మై కంట్రీ.. మై ప్రైడ్ నత్యంతో పాటు వెస్టెన్ వండర్స్, సంక్రాంతి ఫెస్టివిటీస్ పేరుతో సాగిన సంక్రాంతి సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆయా అంశాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందిచారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాయప్పరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ బాలారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నలుగురు విద్యార్థులు దుర్మరణం

- ట్రాక్టర్‌ను ఢీకొన్న స్కూల్ బస్సు
- కర్ణాటకలోని బాగల్‌కోటె జిల్లాలో ఘటన

సాక్షి, బళ్లారి: స్కూల్ బస్సు ట్రాక్టర్‌ను ఢీకొని నలుగురు విద్యార్థులు దుర్మరణం చెందిన ఘటన కర్ణాటకలోని బాగల్‌కోటె జిల్లా జమఖండి తాలూకాలో జరిగింది. వివరాల్లోకి వెళితే... అలగూరులోని వర్ధమాన మహావీర ప్రైవేటు పాఠశాలలో ఆదివారం రాత్రి వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు తిరిగి అర్ధరాత్రి ఇళ్లకు స్కూలు బస్సులో బయలుదేరారు. అలగూరు వద్ద బస్సు డ్రైవర్ వేగంగా నడుపుతూ లారీని ఓవర్ టేక్ చేయబోయి ఎదురుగా వచ్చిన ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. దీంతో రెండు వాహనాలు పల్టీలు కొట్టాయి. ఈ ప్రమాదంలో విద్యార్థులు గోవింద (11), శ్వేత (11), బసవరాజ్ (15), సాగర్ (16) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మరో 8 మంది విద్యార్థులను స్థానికులు, పోలీసులు ఆస్పత్రులకు తరలించారు.

1న ఏపీ జెన్‌కో ప్రతిపాదనలపై బహిరంగ విచారణ

ఏపీజెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధర్ బాబు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్(ఏపీ జెన్‌కో) ప్రతిపాదనలపై ఫిబ్రవరి 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) బహిరంగ విచారణ చేపట్టనున్నట్లు ఏపీజెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధర్ బాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. 2024–25 నుంచి 2028–2029 వరకూ 5వ నియంత్రణ కాలానికి(కంట్రోల్ పీరియడ్) సంబంధించి నెట్వర్క్ ఆదాయ అవసరాల నివేదికలను మండలికి జెన్‌కో సమర్పించినట్లు వెల్లడించారు. గతేడాది నవంబర్‌లో ఇచ్చిన ఈ ప్రతిపాదనలపై విశాఖలోని క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏపీఈఆర్‌సీ అభిప్రాయాలు స్వీకరించనుందని చెప్పారు. ఆ రోజు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, తిరిగి మధ్యాహ్నం రెండు గంటల నుంచి 4.30 గంటల వరకూ నేరుగానూ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బహిరంగ విచారణ జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వినియోగదారులు, ప్రజలు, పలు రంగాలకు చెందిన ప్రతినిధులు విచారణలో పాల్గొని తమ అభ్యంతరాలను, సూచనలను తెలియజేసేందుకు తగిన ఏర్పాట్లు చేశామని వివరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు https://www.apeasternpower.com/apercpublichearing వెబ్‌లింక్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించవచ్చని చక్రధర్‌బాబు తెలిపారు.

ఇంత వక్రీకరణా?

మత్స్యకారుని మృతికి ఈనాడు వక్రభాష్యం ● మృతుడు మద్యం అక్రమ రవాణా కేసులో నిందితుడు

- పడవలో తెలంగాణ మద్యం తరలిస్తుండగా పట్టుకున్న సెబ్ పోలీసులు
- రోజూ పోలీసు స్టేషన్‌కు వెళ్లి సంతకాలు పెట్టాలని కోర్టు ఆదేశం
- ఆదివారం స్టేషన్‌కు వెళ్లని నిందితుడు ● చేపల వేటకు వెళ్లి అనుమానాస్పదంగా మృతి
- మృతిపై పరస్పర విరుద్ధ వాదనలు వినిపిస్తున్న ప్రత్యక్ష సాక్షులు
- ఎస్సైపై ఆరోపణలు చేయిస్తున్న ఇద్దరిపైనా పెండింగ్‌లో క్రిమినల్ కేసులు
- అనుమానాస్పద మృతిపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు
- ప్రభుత్వంపై బురద జల్లేందుకే టీడీపీ నేతల కుట్ర
- ఎస్సైకు మెమో జారీ.. శాఖాపరమైన విచారణకు ఆదేశం

వైకాపాలో చేరతావా.. చస్తావా?



దుర్గారావు మృతదేహాన్ని ఆయన బావమరిది బ్రహ్మాజీ తీసుకువచ్చారు.

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారమే అజెండాగా పెట్టుకున్న ఈనాడు రామోజీరావు తన మార్కు దిగజారుడు పాత్రికేయాన్ని మరోసారి చూపించారు. పల్నాడు జిల్లాలో ఓ మత్స్యకారుని అనుమానాస్పద మృతికి కూడా వక్రభాష్యం చెబుతూ పోలీసు శాఖపై విష ప్రచారం చేశారు. పోలీసుల వేధింపులతోనే మత్స్యకారుడు ఆత్మహత్య చేసుకున్నారని నిరాధార కథనాన్ని ప్రచురించి పాఠకులను తప్పుదారి పట్టించేందుకు యత్నించారు. అసలు ఆదివారంనాడు పోలీసు స్టేషన్‌కే వెళ్లని వ్యక్తిని ఎస్సై ఎలా వేధింపులకు గురిచేస్తాడని, వేధింపులకు గురైన వ్యక్తి చేపల వేటకు వెళ్తాడా అన్న కనీస జ్ఞానం కూడా ఈనాడుకు లేదు. అందుకే ఓ తప్పుడు కథనాన్ని అచ్చేసింది.

పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తికి చెందిన మత్స్యకారుడు చౌడిపల్లి దుర్గారావు గతంలో అక్రమ మద్యం కేసులో నిందితుడు. ఆయన తన నాటు పడవలో మరికొందరితో కలిసి తెలంగాణ నుంచి పడవలో మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అధికారులు దాడి చేశారు. ఆ సమయంలో ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దుర్గారావు, మరో నిందితుడు పరారయ్యారు. అక్రమ మద్యం కేసులో దుర్గారావును ఐదో నిందితుడు (ఏ5)గా పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం దుర్గారావు హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ పొందారు. ఆదివారంతో సహా ప్రతి రోజూ పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంతకం చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. కానీ, గత 3 ఆదివారాలు ఆయన పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంతకం పెట్టలేదు. గత ఆదివారంనాడు (జనవరి 28న) కూడా పోలీస్ స్టేషన్‌కు రాకుండా చేపల వేట కోసం కృష్ణా నదిలోకి వెళ్లాడు. అనుమానాస్పదంగా మృతి చెందాడు.

మృతిపై భిన్న వాదనలు

దుర్గారావు మృతి పట్ల ప్రత్యక్ష సాక్షులు భిన్నమైన వాదనలు వినిపించడం గమనార్హం. మొదట కృష్ణా నది ఒడ్డున దుర్గారావు మృతదేహాన్ని చూశామని కొందరు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కాసేపటికే దుర్గారావు మృతదేహాన్ని కృష్ణా నది నుంచి తీసుకువచ్చినట్టు చెప్పారు. ఆయన మెడకు ఉరివేసుకుని నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. కాగా నది నుంచి మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్నప్పుడు సెల్ ఫోన్ కెమెరాలతో తీసిన వీడియోలో ఆయన మెడకు ఎలాంటి తాడూ లేదు. కానీ కాసేపటికి దుర్గారావు మెడ చుట్టూ తాడు బిగించి ఉన్నట్టు ఫొటోలు బయటకు వచ్చాయి. దీనిపైనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దుర్గారావు మెడకు మొదట పసుపు రంగు తాడు లేదని, తరువాతే చూశామని కొందరు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. నేర చరిత్ర ఉన్న టీడీపీ నేతలు రెడ్యా నాయక్, వజ్ర నాయక్ మృతుడి కుటుంబ సభ్యులను ప్రభావితం చేసి వెల్దుర్తి ఎస్సై శ్రీహరి వేధింపుల వల్లే దుర్గారావు ఆత్మహత్య చేసుకున్నారని ఫిర్యాదు చేయించారు. సోదరులైన వారిద్దరిపై పలు క్రిమినల్ కేసులు ఉండటం గమనార్హం. వారిద్దరే దుర్గారావు కుటుంబ సభ్యులతో జాతీయ రహదారిపై ధర్నా చేయించారు. వాస్తవాలు ఇలా ఉంటే దీన్ని వక్రీకరిస్తూ ఈనాడు పోలీసులపై దుష్ప్రచారం చేసేందుకు యత్నించడం గమనార్హం. ఇవి వాస్తవాలు కాగా, ఎస్సై వేధింపుల వల్లే దుర్గారావు మృతి చెందాడని వక్రీకరిస్తూ ఈనాడు కథనాన్ని ప్రచురించడం రామోజీ దిగజారుడుతనానికి నిదర్శనమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే.. దుర్గారావు అసలు ఆదివారంనాడు పోలీసు స్టేషన్‌కే వెళ్లలేదు. అతన్ని పోలీసులు వేధింపులకు గురిచేస్తే మానసిక వ్యథతో ఉన్న వ్యక్తి పడవలో చేపల వేటకు వెళ్లగలడా? ఈ కనీస జ్ఞానం తప్పుడు కథనం రాసే వారికి ఉండదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

కేసు నమోదు... దర్యాప్తు

దుర్గారావు మృతిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆయన ఎలా మృతి చెందారనే విషయంపై ప్రత్యక్ష సాక్షులే పరస్పర భిన్నమైన కారణాలు చెప్పడంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు వేగవంతం చేశారు. మృతదేహానికి పంచనామా చేసిన అనంతరం పోస్టుమార్టంకు తరలించారు. పోస్టుమార్టం నివేదిక రావల్సి ఉంది. మృతుని కుటుంబ సభ్యుల ఆరోపణల నేపథ్యంలో పోలీసులు శాఖాపరమైన దర్యాప్తు కూడా చేపట్టారు. వెల్దుర్తి ఎస్సై శ్రీహరికి మెమో జారీ చేశారు. ఈ ఉదంతంపై సమగ్రంగా విచారించి నివేదిక సమర్పించాలని మాచర్ల సీఐ షమీముల్లాను ఆదేశించారు.

దొంగ ఓట్లు చేర్పించండి.. దామచర్లను గెలిపించండి

- మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ భార్య సమక్షంలో టీడీపీ నాయకురాలు పిలుపు

ఒంగోలు సబర్బన్: 'ప్రతి ఒక్కరూ దొంగ ఓట్లు చేర్పించాలి. అటు అధికారులకు కానీ.. ఇటు వైఎస్సార్‌సీపీ నాయకులకు కానీ ఎవరూ భయపడవద్దు. వచ్చే ఎన్నికల్లో దామచర్ల జనార్దన్‌ను గెలిపించటమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలి. పక్క నియోజకవర్గాల్లో ఉన్న ఓటర్లను సైతం ఒంగోలులో చేర్పించాలి...' అని ఒంగోలు నగరంలో టీడీపీ మహిళా నేత ఒకరు తమ సామాజికవర్గ మహిళలకు పిలుపునిచ్చారు. ఒంగోలు 36వ డివిజన్‌లో టీడీపీకి చెందిన ఓ సామాజికవర్గ మహిళలతో సోమవారం మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సతీమణి నాగ సత్యలత ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఒక మహిళా నేత మాట్లాడుతూ 'గత ఎన్నికల్లోనే పోలీసులకు భయపడలేదు. ఈ ఎన్నికల్లో అసలు భయపడకుండా ప్రతి ఒక్కరూ తెగించి పనిచేయాలి. స్థానిక ముంగమూరు రోడ్డులోని మర్రిచెట్టు పరిసర ప్రాంతాల ఇళ్లలో అద్దెకు ఉండి వెళ్లినవారి ఓట్లు మళ్లీ చేర్పించాలి. సంతనూతలపాడు నియోజకవర్గంతోపాటు జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లో ఉన్న ఓటర్లను ఏదో ఒక ఇంటి నంబరుతో ఒంగోలులో కూడా దొంగ ఓట్లుగా చేర్పించాలి. అంతిమంగా దామచర్ల జనార్దన్‌ను గెలిపించాలి...' అని చెప్పారు. ఆమె మాటలను ఖండించాల్సిన దామచర్ల నాగ సత్యలత అందుకు విరుద్ధంగా చిరునవ్వులు నవ్వుతూ ఆమెను ప్రోత్సహించడం విశేషం.

రాష్ట్రాన్ని పాలకులు దోచుకుంటున్నారు

- వైఎస్సార్ ఆశయాలను జగన్ కొనసాగించకపోవడం వల్లే పుట్టింటికి వచ్చా
- ప్రత్యేక హోదా వచ్చే వరకు ఇక్కడి నుంచి కదలను
- ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల



కడప వైఎస్సార్ సర్కిల్/వేంపల్లె/కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలో ఇష్టానుసారంగా పాలన కొనసాగుతోందని.. పాలకులు కావాల్సినంత దోచుకుంటున్నారని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపించారు. షర్మిల సోమవారం కడప, కర్నూలులో పర్యటించి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైఎస్సార్ పాలనకు, జగన్ పాలనకు నక్కకు నాకలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. వైఎస్సార్ పాలన స్వర్ణయుగమని.. ఆయన ఆశయాలను జగన్ కొనసాగించకపోవడం వల్లే తాను తెలంగాణ నుంచి పుట్టింటికి వచ్చినట్లు చెప్పారు. ప్రత్యేక హోదా వచ్చే వరకు రాష్ట్రం నుంచి కదలనన్నారు. జగన్, చంద్రబాబు బీజేపీకి బానిసలుగా మారిపోయి ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. జగన్ పాలనలో రైతులు, నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీ రాజధాని లేకుండా చేశాయని విమర్శించారు. రాష్ట్రంలో మద్యం అమ్మకాలపై సీబీఐ, విజిలెన్స్, కాగ్‌తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విభజన చట్టంలోని హామీలు నెరవేరాలంటే అది ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల మీద తాను మాట్లాడుతుంటే.. తనపై దిగజారి ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. కాగా, ఖాజీపేటలో మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డితో షర్మిల సమావేశమయ్యారు. అంతకు ముందు నర్రెడ్డి సునీతతో కలిసి ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌లో ప్రార్థనలు చేశారు.

భోజనాల దగ్గర కొట్లాట

కడపలో కార్యకర్తల సమావేశం ముగిసిన తర్వాత.. కడప సిటీ కాంగ్రెస్ నాయకులు తన్నుకున్నారు. మధ్యాహ్నం భోజనాల దగ్గర గొడవ మొదలవ్వగా.. ఆ తర్వాత రెండు వర్గాలుగా విడిపోయి కుర్చీలతో పరస్పరం దాడి చేసుకున్నారు. పోలీసులు వచ్చి.. ఇరువర్గాలను వారించి అక్కడి నుంచి పంపించారు.

టీడీపీ ముఠా ఎన్నికల దందాపై కేసు నమోదు

సొంత కంపెనీ మాటున టీడీపీ ఎమ్మెల్యే 'పర్చూరు' అక్రమాలు

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, బాపట్ల: టీడీపీ ఎన్నికల అక్రమాలపై పోలీసు శాఖ కొరడా ఝుళిపించింది. 2019 ఎన్నికల్లో పర్చూరు నియోజకవర్గంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, దొంగ ఓట్లు వేయించడం తదితర అక్రమాలు ఆధారాలతో సహా బట్టబయలు కావడంతో కేసు నమోదు చేసింది. ఏ1గా పర్చూరు టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో పాటు ఆయన చైర్మన్‌గా ఉన్న నోవా అగ్రిటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన పలువురు ఉద్యోగులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. రాష్ట్ర డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు ఈ నెల 24న గుంటూరులోని నోవా అగ్రిటెక్ కంపెనీలో నిర్వహించిన సోదాల్లో గుర్తించిన అక్రమాల ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు అనుమతించాలని పోలీసులు పర్చూరు మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించారు. పోలీసుల వినతిని పరిశీలించిన కోర్టు సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేసి విచారించేందుకు సోమవారం అనుమతి ఇచ్చింది. దాంతో బాపట్ల జిల్లా ఇంకొల్లు పోలీసులు ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని 123 (1), ఐపీసీ సెక్షన్ 171(ఇ) రెడ్ విత్ 120(బి), సీఆర్‌పీసీ 155(2)ల ప్రకారం కేసు నమోదు చేశారు. టీడీపీ ఎమ్మెల్యే ఏలూరితోపాటు పరారీలో ఉన్న నోవా అగ్రిటెక్ కంపెనీ ఉద్యోగి పుల్లెల అజయ్‌బాబు, ఆ కంపెనీకి చెందిన మరో ముగ్గురు ఉద్యోగులు, మరికొందరిని నిందితులుగా చేర్చారు.

డీఆర్ఐ సోదాల్లో బయటపడిన అక్రమాలు

జీఎస్టీ ఎగవేతను గుర్తించేందుకు గుంటూరులో ఉన్న ఏలూరి సాంబశివరావుకు చెందిన నోవా అగ్రిటెక్ కంపెనీ కార్యాలయంలో డీఆర్ఐ అధికారులు ఈనెల 24న సోదాలు నిర్వహించడంతో ఆయన పాల్పడ్డ ఎన్నికల అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఆ కార్యాలయంలో లభించిన ఓ డైరీలో కీలక విషయాలు ఉన్నాయి. 2019 ఎన్నికల్లో ఇతర ప్రాంతాల నుంచి దొంగ ఓటర్లను తెప్పించడం.. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసి ఓట్లు వేయించడం.. అందుకోసం ఓటుకు రూ. వెయ్యి చొప్పున పంపిణీ చేసిన నగదు వివరాలు అన్నీ పోలింగ్ బూత్‌లవారీగా నమోదు చేసి ఉన్నాయి. ఆ మేరకు ఖర్చు చేసిన నగదు ఎక్కడ నుంచి తీసుకువచ్చారనే వివరాలు ఏవీ కంపెనీ రికార్డుల్లో లేవు. అంటే షెల్ కంపెనీల ద్వారా అక్రమంగా నిధులు తరలించి ఎన్నికల అక్రమాలకు పాల్పడ్డారని స్పష్టమైంది. దాంతో డీఆర్ఐ అధికారులు ఈ అంశాన్ని ఆదాయపన్ను శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సెబీ ప్రధాన కార్యాలయాలకు నివేదించారు. ఎన్నికల అక్రమాలపై బాపట్ల పోలీసులకు సమాచారమిచ్చారు. దాంతో టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి, తదితరులపై కేసు నమోదు చేసేందుకు పోలీసులు బాపట్ల న్యాయస్థానాన్ని అనుమతి కోరుతూ పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌ను న్యాయస్థానం ఆమోదించడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.

ప్రజాస్వామ్యవాదుల హర్షం

గత రెండు ఎన్నికల్లో గెలిచిన ఏలూరిపై కేసు నమోదు కావడం పర్చూరు నియోజకవర్గంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అక్రమాలకు పాల్పడిన ఎమ్మెల్యేపై కేసు నమోదుకావడం పట్ల ప్రజాస్వామికవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏలూరిని పోలీసులు విచారించే క్రమంలో అవసరమైతే ఆయనను అరెస్ట్‌చేసే అవకాశం కూడా ఉందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ కేసులో పోలీసుల దర్యాప్తు ఎలా ఉండనుందన్నది ఆసక్తికరంగా మారింది.

తొలి నుంచీ అక్రమాలే..

నోవా అగ్రిటెక్ స్థాపించినప్పటి నుంచి ఏలూరి సాంబశివరావు అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. ఆ కంపెనీ తయారు చేసే నాసిరకం బయో మందులతో రైతులకు నష్టాలు మిగిలాయన్న ఆరోపణలున్నాయి. టీడీపీ హయాంలో ఆ మందులను పెద్ద ఎత్తున విక్రయించి ఎమ్మెల్యే సొమ్ము చేసుకున్నారు. గతంలో టీడీపీ హయాంలో నీరు–చెట్టు పనుల్లో కోట్లాది రూపాయలు ఏలూరి దోచుకున్నట్లు ఆరోపణలున్నాయి. పర్చూరు మండలం దేవరపల్లిలో దళితులకు ఇచ్చిన భూముల్లో నీరు–చెట్టు కింద చెరువులు తవ్వాలని ఏలూరి పట్టుబట్టారు. దీనిని దళితులు వ్యతిరేకించారు. దళితులు– ఏలూరికి మధ్య గొడవ అప్పట్లో పత్రికల్లో పతాక శీర్షికలకు ఎక్కింది. మార్టూరు మండలంలో 250కి పైగా గ్రానైట్ పరిశ్రమలు ఉండగా ఇందులో 90 శాతం మంది యజమానులు ఒకే సామాజికవర్గం వారే ఉన్నారు. ఇక్కడి నుంచి 80 శాతం గ్రానైట్ రాయల్టీ లేకుండానే బయటకు తరలిపోతుంది. ఇందుకు ఎమ్మెల్యే ఏలూరి సహకరిస్తుండటంతో ఆయనకు పెద్ద మొత్తంలో ముడుపులు ముట్ట చెబుతున్నారని తెలుస్తోంది. మరోపక్క ఎన్ఆర్ఐలు పంపించే నల్లధనాన్ని సైతం ఏలూరి ఎన్నికల అక్రమాలకు వినియోగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. పర్చూరు నియోజకవర్గంలో ఏలూరి 15 వేలకుపైగా దొంగ ఓట్లు చేర్పించారు. ఇటీవల సదరు దొంగ ఓట్లపై ఫిర్యాదులు రావడంతో అధికారులు విచారణ జరిపి సుమారు 12 వేల ఓట్లను తొలగించారు.

డైరీ వెల్లడించిన ఎన్నికల అక్రమాలు..

- పవులూరు అనే గ్రామంలో పోలింగ్ కేంద్రాలు 223 నుంచి 226 పరిధిలో 239 మంది ఓటర్లకు రూ. వెయ్యి చొప్పున మొత్తం రూ. 2.39 లక్షలు పంపిణీ చేసినట్టు ఆ డైరీలో ఉంది.
- మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకట్రావు ద్వారా రూ. 3.60 లక్షలు ఓటర్లకు పంపిణీ.
- నోవా అగ్రిటెక్ కంపెనీకి చెందిన ఉద్యోగి ద్వారా ఓటర్లకు డబ్బులు పంపిణీ.
- ఆ కంపెనీకి చెందిన అప్పారావు, బుజ్జిబాబు, సాయి గణేశ్ అనే ఉద్యోగుల ద్వారా దుద్దుకూరు గ్రామంలో ఓటర్లకు రూ. 15 లక్షలు పంపిణీ.
- పర్చూరు నియోజకవర్గంలోని దుద్దుకూరు, ఇంకొల్లు, తాటిపర్తివారిపాలెం, గంగవరం తదితర గ్రామాల్లో ఓటర్లకు డబ్బులు ఎలా పంపిణీ చేసి ఓట్లను కొనుగోలు చేశారో డైరీలో వివరంగా ఉంది.
- ఇతర ప్రాంతాల నుంచి ఓటర్లను తరలించేందుకు రవాణా వ్యయం, పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల పేర్లు, వారికి పంపిణీ చేసిన మొత్తం తదితర వివరాలను ఆ డైరీలో సవివరంగా పేర్కొనడం గమనార్హం.

పర్చూరు ఎన్నికల అక్రమాల నిందితులు..

- ఏ1: ఏలూరి సాంబశివరావు, పర్చూరు టీడీపీ ఎమ్మెల్యే
- ఏ2: పుల్లెల అజయ్ బాబు, నోవా అగ్రిటెక్ కంపెనీ ఉద్యోగి
- ఏ3: అప్పారావు, నోవా అగ్రిటెక్ కంపెనీ ఉద్యోగి
- ఏ4: బాజి బాబు, నోవా అగ్రిటెక్ కంపెనీ ఉద్యోగి
- ఏ5: సాయి గణేశ్, నోవా అగ్రిటెక్ కంపెనీ ఉద్యోగి
- ఏ6: ఇతరులు

అక్రమాలపై లోతుగా విచారిస్తాం



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నోవా అగ్రిటెక్ అక్రమాల వ్యవహారాన్ని లోతుగా విచారించాలని నిర్ణయించాం. దీనికి సంబంధించి పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో పాటు కంపెనీ ఉద్యోగులను విచారించాలి. ఇందుకోసం వారిపై కేసులు నమోదు చేశాం. ఈ మేరకు పర్చూరు మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు అనుమతి తీసుకొని సోమవారం ఎమ్మెల్యేతో పాటు మరికొందరిపై కేసులు నమోదు చేశాం.

– వకుల్ జిందాల్, ఎస్పీ, బాపట్ల జిల్లా.

టీటీడీ వార్షిక బడ్జెట్ రూ.5,141.74 కోట్లు

ఆమోదం తెలిపిన టీటీడీ ధర్మకర్తల మండలి ● కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాల పెంపు

ఉద్యోగులకు ఇళ్లస్థలాలు ఇచ్చిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు ● టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు భూమన వెల్లడి



టీటీడీ పాలకమండలి సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానములకు సంబంధించి 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.5,141.74 కోట్లతో వార్షిక బడ్జెట్‌ను ఆమోదించినట్లు టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. చైర్మన్ అధ్యక్షతన సోమవారం తిరుమల అన్నమయ్య భవనంలో ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. వార్షిక బడ్జెట్‌తోపాటు పలు కీలక నిర్ణయాలకు ధర్మకర్తల మండలి ఆమోదం తెలిపినట్లు భూమన వెల్లడించారు. దాదాపు 30ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న టీటీడీ ఉద్యోగుల కలను సాకారం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి టీటీడీ పాలకమండలి కృతజ్ఞతలు తెలియజేస్తూ తీర్మానం చేసిందని చెప్పారు. టీటీడీలోని వివిధ విభాగాల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్నవారికి, శిల్పులకు వేతనాలు, వేదపారాయణదారులకు పెన్షన్, కాంట్రాక్టు అర్చకులు, సంభావన అర్చకులు, వేద పాఠశాలల్లోని సంభావన అధ్యాపకుల వేతనాలను, క్రమాపాఠీలు, ఘనాపాఠీలకు సంభావనలు పెంచినట్లు వివరించారు. టీటీడీ నిర్వహిస్తున్న 26 స్థానిక ఆలయాలు, విలీనం చేసుకున్న 34 ఆలయాల్లో 515 పోస్టులు సృష్టించేందుకు ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపాలని నిర్ణయించినట్లు తెలిపారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో టీటీడీ వివిధ బ్యాంకుల్లో డిపాజిట్ చేసిన నగదు, బంగారం ద్వారా వడ్డీ రూ.1,167 కోట్లు వస్తుందని భావిస్తున్నట్లు వివరించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో శ్రీవారి హుండీ ద్వారా సుమారు రూ.1,611 కోట్లు, ప్రసాదాల ద్వారా రూ.600 కోట్లు, దర్శనం ద్వారా రూ.338 కోట్లు వస్తాయని అంచనా వేసినట్లు చెప్పారు. అదేవిధంగా పరికరాల కొనుగోలు కోసం రూ.751కోట్లు, కార్పస్, ఇతర పెట్టుబడుల కోసం రూ.750 కోట్లను బడ్జెట్‌లో కేటాయించామని, మానవ వనరుల ఖర్చు రూ.1,733 కోట్లు ఉంటుందని అంచనా వేసినట్లు తెలిపారు. హిందూ ధర్మ ప్రచారానికి రూ.108.50కోట్లు కేటాయించినట్లు భూమన వివరించారు. టీటీడీ ఉద్యోగుల ఇళ్లస్థలాల కోసం వడమాలపేట మండలం పాదిరేడు అరణ్యం వద్ద అదనంగా కేటాయించిన 132.05 ఎకరాల స్థలంలో గ్రావెల్ రోడ్డు ఏర్పాటు టెండరుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ఈ సమావేశంలో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం, పలువురు పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు శ్రీవారి ఆశీస్సులు అందించిన మంగళ సూత్రాలు

సనాతన హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా హిందువుల ఆరాధ్యదైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు అందించిన మంగళసూత్రాల(తాళిబొట్లు)ను మహిళలకు అందించాలని టీడీపీ ధర్మకర్తల మండలి నిర్ణయించింది. స్వామి వారికి భక్తులు సమర్పించిన బంగారంతో వివిధ ఆచారాలు అనుసరించి మంగళ సూత్రాలు తయారు చేయిస్తారు. ఆ మంగళసూత్రాలను శ్రీవారి పాదాల చెంత ఉంచి పూజలు చేసి లాభ, నష్టాలు లేని ధర నిర్ణయించి విక్రయిస్తారు. నాలుగైదు డిజైన్లలో తయారు చేసే ఈ మంగళ సూత్రాలు 5 గ్రాములు, 10 గ్రాముల బరువుతో ఉంటాయి. ఇప్పటికే వివాహం అయినవారు, వివాహం చేసుకోబోయే వధువులు ఈ తాళిబొట్లను ధరించడం వల్ల దీర్ఘసుమంగళిగా ఉంటారని భక్తుల విశ్వాసం. భూమన కరుణాకరరెడ్డి గతంలో టీటీడీ చైర్మన్‌గా ఉన్న సమయంలో నిర్వహించిన కల్యాణమస్తు (సామూహిక వివాహాలు) ద్వారా సుమారు 32వేల మంది వధువులకు స్వామివారి ఆశీస్సులు అందించిన మంగళసూత్రాలు ఉచితంగా అందించారు.

టెక్నికల్ టెక్స్‌టైల్స్ ప్రోత్సాహానికి ప్రభుత్వం సిద్ధం

- రాష్ట్రంలో సమృద్ధిగా సహజ వనరులు
- పత్తి ఉత్పత్తిలో దేశంలోనే ముందు వరుసలో ఏపీ
- సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధతో పారిశ్రామికాభివృద్ధి
- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్ స్పష్టీకరణ
- విజయవాడలో ఒకరోజు జాతీయ సదస్సు



సాక్షి, అమరావతి: జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో విస్తృత పరిధి ఉన్న టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. 'టెక్నికల్ టెక్స్‌టైల్స్ అభివృద్ధి కోసం విధాన మార్గాల రూపకల్పన' అనే అంశంపై విజయవాడలో సోమవారం రాష్ట్ర చేనేత జౌళి శాఖ జాతీయ సదస్సును నిర్వహించింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన అమర్‌నాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సమృద్ధిగా సహజ వనరులు ఉన్నాయన్నారు. దేశంలోనే పత్తి ఉత్పత్తిలో రాష్ట్రం ముందు వరుసలో ఉందని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధతో పారిశ్రామిక రంగ అభివృద్ధికి అనేక చర్యలు చేపట్టారన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో 99 భారీ పరిశ్రమల ఏర్పాటుతో రూ.3,33,054 కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. అలాగే 2,29,256 మందికి ఉపాధి లభించిందన్నారు. రాష్ట్రంలో నూతన పారిశ్రామిక విధానం తేవడంతోపాటు పరిశ్రమలకు రాయితీలు అందిస్తున్నామని వెల్లడించారు. సింగిల్ విండో విధానంలో పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు భూమి కొరత లేదని వెల్లడించారు. గతేడాది విశాఖపట్నంలో నిర్వహించిన ప్రపంచ స్థాయి పెట్టుబడుల సదస్సులో 386 ఒప్పందాలు కుదిరాయని తెలిపారు. వీటి ద్వారా రూ.13.11 లక్షల కోట్లు పెట్టుబడులు రావడంతోపాటు 6.7 లక్షల ఉద్యోగాలు కల్పించగలిగామన్నారు. దేశంలో 11 ఇండస్ట్రియల్ కారిడార్లు ఉంటే అందులో మూడు మన రాష్ట్రంలోనే ఉండటం గర్వకారణమని చెప్పారు. పారిశ్రామికాభివృద్ధికి విదేశీ పెట్టుబడులు అత్యావశ్యకమన్నారు. ఈ విషయంలో కేంద్రం మరింత సరళీకృతంగా వ్యవహరించాలని కోరారు. ఎగుమతుల విధానాల్లోనూ మార్పులు అవసరమన్నారు.

టెక్నికల్ టెక్స్‌టైల్స్ పరిశోధనకు రూ.వెయ్యి కోట్లు

కేంద్ర జౌళి శాఖ సంయుక్త కార్యదర్శి రాజీవ్ సక్సేనా మాట్లాడుతూ రానున్న కాలంలో దేశాభివృద్ధిలో టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగం కీలక భూమిక పోషించనుందన్నారు. ఈ రంగంపై మరింత అవగాహన కల్పించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. టెక్నికల్ టెక్స్‌టైల్స్ పరిశ్రమ అభివృద్ధికి నిధుల కొరత లేదని, కేవలం పరిశోధన కోసమే రూ.వెయ్యి కోట్లు కేటాయించినట్టు చెప్పారు. అతి తక్కువ వ్యయంతోనే యంత్ర సామాగ్రి అభివృద్ధిపై దృష్టి పెట్టామన్నారు. మార్కెట్ అభివృద్ధి, ఎగుమతుల ప్రోత్సాహం, స్టార్టప్‌ల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ రంగంలోకి యువతను ఆకర్షించేలా టెక్నికల్ టెక్స్‌టైల్స్‌పై యూజీ, పీజీ కోర్సులకు రూపకల్పన చేస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత, ఆప్కో ఎండీ ఎంఎం నాయక్, ఇండియన్ టెక్స్‌టైల్ అసోసియేషన్(ఐటీటీఏ) అధ్యక్షుడు అవినాష్ మైసర్, ప్రముఖ పారిశ్రామికవేత్త అజయ్ సింగ్ శిరోషి తదితరులు మాట్లాడారు.

క్లుప్తంగా...

ప్రైవేటు ఆస్పత్రుల్లో యథావిధిగా ఆరోగ్యశ్రీ సేవలు

సాక్షి, అమరావతి: ప్రైవేటు ఆస్పత్రుల్లో యథావిధిగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలను అందిస్తున్నామని ఏపీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్(ఆశ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌తో తమకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి సక్రమంగా నిధులు విడుదల చేస్తున్నప్పటికీ కొన్ని సాంకేతిక కారణాలతో ఆస్పత్రుల్లో నగదు జమ కావడంలేదని, ఈ లోపాలను చక్కబెడతామని వైద్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హామీ ఇచ్చారని తెలిపారు. 300 ప్రొసీజర్ ప్యాకేజీలను సమీక్షించడానికి కమిటీని నియమిస్తామని చెప్పినట్టు పేర్కొన్నారు.

మన 'విద్య' పతాక రెపరెప

గణతంత్ర వేడుకల్లో ఆంధ్రా శకటం సత్తా



సాక్షి, అమరావతి: 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన పరేడ్‌లో ఆంధ్రప్రదేశ్ విజయ పతాక రెపరెపలాడింది. డిజిటల్ క్లాస్ రూమ్ థీమ్‌తో రూపొందించిన రాష్ట్ర విద్యాశాఖ శకటానికి పీపుల్స్ చాయిస్ విభాగంలో తృతీయ బహుమతి లభించింది. సీఎం వైఎస్ జగన్ విద్యారంగంలో చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలకు అద్దం పట్టిన ఈ శకటం గణతంత్ర వేడుకల్లో ఆద్యంతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 28 రాష్ట్రాల శకటాలు పరేడ్‌లో పాల్గొనగా తొలి రెండు బహుమతులను గుజరాత్, ఉత్తరప్రదేశ్ దక్కించుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ సాధించిన ఘనతను వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఓ ప్రకటనలో సంతోషం వ్యక్తం చేసింది. రాష్ట్రంలో విద్యారంగం ప్రగతికి సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో రూ.73,417 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించింది.

భవిష్యత్ తరాలకు జగన్ దిక్సూచి: ధర్మాన



శ్రీకాకుళం రూరల్: భవిష్యత్ తరాలు బాగుండాలంటే సీఎం జగన్‌తోనే సాధ్యమని, నవరత్నాలతో లబ్ధి పొందిన కుటుంబాలన్నీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం చుట్టుపక్కల గ్రామాల్లో సోమవారం నిర్వహించిన ఆసరా సంబరాల్లో ఆయన మాట్లాడారు. కరోనా కష్టకాలంలో పేదల కన్నీరు తుడిచింది వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. 2014లో చంద్రబాబు మహిళలను మోసం చేశారని, ఎన్నికలు సమీపిస్తున్నాయనగా పసుపు కుంకుమ పేరిట మహిళలకు నగదు బదిలీ అంటూ మోసగించారని గుర్తు చేశారు. తమది మాటకు కట్టుబడిన ప్రభుత్వమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పథకాలను పంచిపెట్టేస్తున్నారు అంటున్నారే తప్ప, తినేస్తున్నారు అని ఎవరైనా అన్నారా అంటూ మంత్రి ప్రశ్నించారు.

సామాజిక న్యాయానికి అర్థం తెలుసా బాబూ?



సాక్షి, రాజమహేంద్రవరం: 'నువ్వు ఏ ఎన్నికల్లో ఎవరితో పొత్తు పెట్టుకుంటావో తెలియదు, సామాజిక న్యాయం అనే మాటకు నీకు అర్థమే తెలియదు. అలాంటి నువ్వు నన్ను విమర్శిస్తావా?' అని టీడీపీ అధినేత చంద్రబాబుపై రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మండిపడ్డారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు మానసిక పరిస్థితి దెబ్బతినడంతో ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. ప్రజలను బానిసలుగా చూడాలనేది బాబు తత్వమని దుయ్యబట్టారు. సైకో లక్షణాలన్నీ చంద్రబాబులో కనిపిస్తున్నాయన్నారు. "నీ దృష్టిలో సంక్షేమం అంటే 'సన్' క్షేమమే అనుకుంటున్నావు. ప్యాకేజీ కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టిన విషయం మరిచావా?" అని ప్రశ్నించారు.

లోక్‌సభ నియోజకవర్గాల్లో బీజేపీ కార్యాలయాలు

సాక్షి, అమరావతి: వచ్చే ఎన్నికల్లో పొత్తులతో సంబంధం లేకుండా రాష్ట్రంలో ఒంటరి పోరుకు బీజేపీ సన్నద్ధమవుతోంది. 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసేందుకు ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించింది. ఇందులో భాగంగా ఫిబ్రవరి 1న రాష్ట్ర వ్యాప్తంగా 25 పార్లమెంట్ స్థానాల పరిధిలో పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, బిట్రా శివన్నారాయణ సోమవారం వెల్లడించారు. విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో పార్టీ జాతీయ సంస్థాగత సహ సంఘటన కార్యదర్శి శివ ప్రకాష్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు ఆది, సోమవారాలలో సమావేశమయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సహా ఇతర ముఖ్య నేతలతో సుదీర్ఘ చర్చలు జరిపారు. అనంతరం పార్టీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు గారపాటి, బిట్రా తెలిపారు.

విద్యార్థుల చేరికల్లో ఏపీ ఫస్ట్

2017తో పోలిస్తే 2021లో ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, ఎలిమెంటరీ స్కూళ్ల స్థాయిలో భారీ పెరుగుదల

- టాప్–4 రాష్ట్రాల్లో ఏపీకి తొలిస్థానం
- ఆ తరువాత ఉత్తరాఖండ్, పంజాబ్, యూపీ
- జాతీయ స్థాయిని మించి ఏపీలో స్థూల నమోదు నిష్పత్తి పెరుగుదల
- ఇది 2021లో ప్రైమరీలో 18.4, అప్పర్ ప్రైమరీలో 13.4, ఎలిమెంటరీలో 16.5 శాతం పెరుగుదల
- కానీ, ఛత్తీస్‌గఢ్, గోవా, జార్ఖండ్, బీహార్‌లలో తగ్గుదల
- 'అమ్మఒడి'తో పేదల పిల్లలందరూ స్కూళ్లలో చేరేలా ప్రోత్సాహం
- ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి : విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. 2021 విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో స్థూల నమోదు నిష్పత్తి (పిల్లలు చేరికలు)లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉండడమే ఇందుకు నిదర్శనం. ఈ విషయాన్ని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. 2017తో పోలిస్తే 2021లో దేశంలోని స్థూల నమోదు నిష్పత్తి పెరిగిన టాప్–రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ తొలిస్థానంలో ఉందని ఆ నివేదిక తెలిపింది. అలాగే, 2021లో జాతీయ స్థూల నమోదును మించి ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధిక స్థూల నమోదు ఉందని కూడా పేర్కొంది. 2017తో పోలిస్తే.. 2021లో రాష్ట్రంలో ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, ఎలిమెంటరీ స్థాయిలో స్థూల నమోదు నిష్పత్తి భారీగా పెరిగిందని కూడా నివేదిక తెలిపింది.

'అమ్మఒడి' ప్రోత్సాహంతోనే..

అలాగే, స్థూల నమోదు నిష్పత్తిలో టాప్ నాలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ తరువాత ఉత్తరాఖండ్, పంజాబ్, ఉత్తరప్రదేశ్ ఉండగా.. స్థూల నమోదు 2017తో పోలిస్తే 2021లో తగ్గిన నాలుగు రాష్ట్రాల్లో ఛత్తీస్‌గఢ్, గోవా, జార్ఖండ్, బీహార్ ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 2017తో పోలిస్తే 2021లో ప్రైమరీలో 18.4 శాతం, అప్పర్ ప్రైమరీలో 13.4 శాతం, ఎలిమెంటరీలో 16.5 శాతం స్థూల నమోదు పెరిగినట్లు నివేదిక తెలిపింది. ఇందుకు ప్రధాన కారణం బడి ఈడు పిల్లలందరూ బడుల్లోనే ఉంచేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా.. అన్ని వర్గాల్లోని పేదల తల్లిదండ్రులకు తమ పిల్లల చదువులు భారం కాకూడదనే దూరదృష్టితో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న అమ్మఒడి పథకం అమలుచేస్తోంది. ఈ పథకం అమలు ద్వారా పేద వర్గాల పిల్లలందరూ స్కూళ్లలో చేరేలా ప్రోత్సాహం అందిస్తోంది. నిజానికి.. పేదలు పిల్లలను బడికి పంపకుండా పనికి పంపిస్తే తమకు ఆర్థికంగా చేదోడు వాదోడుగా నిలుస్తారనే ఆలోచనలో వారుండే వారు. అయితే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న అమ్మఒడి ద్వారా పిల్లలను స్కూళ్లకు పంపితే ఏడాదికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. దీంతో అన్ని వర్గాల్లోని పేదలు తమ పిల్లలను స్కూళ్లకు పంపుతున్నారు.

దేశంలో టాప్-4 రాష్ట్రాల్లో స్థూల నమోదు నిష్పత్తి 2017తో పోల్చితే 2021లో పెరుగుదల, తగ్గుదల ఇలా..

రాష్ట్రం	ప్రైమరీ	అప్పర్ ప్రైమరీ	ఎలిమెంటరీ
ఆంధ్రప్రదేశ్	18.4	13.4	16.5
ఉత్తరాఖండ్	17.1	13.3	15.4
పంజాబ్	9.9	12.3	10.8
ఉత్తరప్రదేశ్	11.1	9.9	10.5
నమోదు నిష్పత్తి తగ్గుదల :			
ఛత్తీస్‌గఢ్	- 3.7	- 9.4	- 5.9
గోవా	- 8.3	- 9.1	- 8.6
జార్ఖండ్	- 7.0	- 16.5	- 11.2
బీహార్	- 9.0	- 24.7	- 14.9
దేశవ్యాప్తంగా	4.1	- 0.6	2.22

2019 జూన్ నుంచి ఇప్పటివరకు జగనన్న అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, విద్యాకానుక ద్వారా పేద వర్గాలకు అందిన ఆర్థిక సాయం.. (రూ.కోట్లలో)

వర్గాలు	జగనన్న అమ్మఒడి	జగనన్న గోరుముద్ద	జగనన్న విద్యా కానుక
బీసీ	11,817.39	2,020.98	1538.37
ఎస్సీ	5,335.70	1,041.45	702.80
ఎస్టీ	1,714.76	398.36	242.34
మైనారిటీలు	1,806.28	152.87	225.47
కాపులు	2,248.36	388.99	198.99
ఇతర పేదలు	3,144.81	441.56	459.56

స్థూల నమోదు వృద్ధికి దోహదపడిన సంస్కరణలు..

- మనబడి నాడు–నేడు ద్వారా తొలిదశలో.. 15 వేలకు పైగా ప్రభుత్వ స్కూళ్లలో అన్ని మౌలిక సదుపాయాలను కల్పించారు.
- రెండో దశలో మరో 22,221 స్కూళ్ల రూపురేఖలను మార్చే పనులు చేపట్టారు.
- దీంతోపాటు.. పిల్లలు మధ్యలో చదువు మానేయకుండా గ్రామ, వార్డు వలంటీర్ల ద్వారా చర్యలను తీసుకుంటోంది. ఇందులో భాగంగా.. పిల్లలు ఎవరైనా స్కూళ్లకు వెళ్లకపోతే వలంటీర్లు ఆ పిల్లల తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లి కారణాలు తెలుసుకుని తిరిగి స్కూళ్లకు వచ్చేలా ప్రభుత్వం చర్యలను తీసుకుంది.
- అంతేకాక.. స్కూళ్లకు వచ్చే పిల్లలకు జగనన్న గోరుముద్ద ద్వారా నాణ్యమైన ఆహారాన్ని అందిస్తోంది.
- పేద పిల్లల చదువులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు యూనిఫాం, బూట్లు తల్లిదండ్రులపై భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే జగనన్న విద్యా కానుక ద్వారా ఉచితంగా కిట్‌ను అందిస్తోంది.
- ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిషు మీడియంను కూడా అమలుచేస్తోంది.
- పిల్లలకు ట్యాబులను కూడా అందిస్తోంది. ఈ చర్యలన్నీ కూడా పాఠశాలల్లో స్థూల నమోదు నిష్పత్తి పెరగడానికి దోహదం చేశాయి.

విచారణకు సహకరించకుంటే చంద్రబాబు బెయిలు రద్దు కోరండి

ఏపీ ప్రభుత్వ పిటిషన్‌పై సుప్రీం కోర్టు

సాక్షి, న్యూఢిల్లీ : అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ కుంభకోణంలో దర్యాప్తు సంస్థ విచారణకు టీడీపీ అధినేత చంద్రబాబు సహకరించకుంటే బెయిలు రద్దు కోరవచ్చని ఏపీ ప్రభుత్వానికి సుప్రీం కోర్టు సూచించింది. ఈ విషయంలో కింది కోర్టులకు వెళ్లడానికి ఏపీ ప్రభుత్వానికి స్వేచ్ఛనిస్తున్నామని తెలిపింది. ఈ కేసులో కోర్టు పరిశీలనలు దర్యాప్తు సంస్థల విచారణకు అడ్డంకి కాబోవని, స్వేచ్ఛగా దర్యాప్తు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. అమరావతి మాస్టర్ ప్లాన్‌లో భాగంగా సంస్థలు, వ్యక్తులకు ప్రయోజనం చేకూర్చేలా ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ రూపొందించి భారీ కుంభకోణానికి పాల్పడ్డారంటూ దాఖలైన కేసులో టీడీపీ అధినేత చంద్రబాబుకు హైకోర్టు ముందస్తు బెయిలు మంజూరు చేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. ఈ సందర్భంగా జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పందిస్తూ.. ఇటీవల సుప్రీం కోర్టు భిన్నాభిప్రాయాలు వెలువరించిన తీర్పునకు సంబంధించిన అంశమా అని ప్రశ్నించారు. 'ఆరోపణలు 2014 కాలం నాటివి. విచారణ 2018 తర్వాత జరిగింది. ఒకవేళ సెక్షన్ 17ఏ వర్తిస్తే ముందస్తు అనుమతి అనేది ఒక సమస్యగా మారుతుంది కదా' అని సంజీవ్‌ఖన్నా అభిప్రాయపడ్డారు. అయితే, ఈ కేసులో ఐపీసీ సెక్షన్లు కూడా ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ తెలిపారు. సెక్షన్ 420 కూడా నమోదైందని తెలిపారు. ఇతర కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న ఇతర అంశాలేమిటని ధర్మాసనం ప్రశ్నించగా.. చంద్రబాబుకు సంబంధించి సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను రంజిత్‌కుమార్, చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వివరించారు. అనంతరం ధర్మాసనం చంద్రబాబుకు నోటీసులు జారీ చేయడానికి మొగ్గు చూపింది. ఈ కేసులో సహ నిందితుల ముందస్తు బెయిలుకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసిందని బాబు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం ఈ పిటిషన్‌లో జోక్యం చేసుకోబోమని పేర్కొంది.

పేదలు, పెత్తందారులకు మధ్యే పోటీ

- సీఎం జగన్‌తోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు న్యాయం
- మరోసారి వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచి సంక్షేమాభివృద్ధి పాలనను కొనసాగించుకుందాం
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి



చిలకలూరిపేట: త్వరలో జరగనున్న ఎన్నికలను పేదలు, పెత్తందారుల మధ్య జరిగే పోటీగా చూడాలని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి సూచించారు. సీఎం జగన్‌తోనే బడుగు, బలహీనవర్గాలకు న్యాయం జరుగుతోందన్నారు. సోమవారం చిలకలూరిపేటలో సామాజిక సాధికార యాత్రకు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా.. సీఎం జగన్ పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందుతున్నాయన్నారు. సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని చెప్పారు. బడుగు, బలహీనవర్గాలకు రాజకీయంగానూ సముచిత స్థానం లభించిందన్నారు. అట్టడుగు వర్గాలకు వైఎస్సార్‌సీపీ ఎంతటి ప్రాధాన్యం ఇస్తుందో చెప్పడానికి బీసీ మహిళ, మంత్రి విడదల రజినీయే ప్రత్యక్ష నిదర్శనమని చెప్పారు. అనేక ఏళ్లుగా సమాజంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై నెలకొన్న సాంఘిక, ఆర్థిక అసమానతలను రూపుమాపేందుకు సీఎం జగన్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. చిలకలూరిపేట నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మల్లెల రాజేష్‌నాయుడును గెలిపించాలని కోరారు. మంత్రి విడదల రజిని మాట్లాడుతూ సీఎం జగన్ వల్ల చిలకలూరిపేట నియోజకవర్గంలో రూ.2వేల కోట్ల అభివృద్ధి పనులు చేసుకోగలిగామన్నారు. సంక్షేమ పథకాల ద్వారా నియోజకవర్గ ప్రజలు రూ.వెయ్యి కోట్లకు పైగా లబ్ధి పొందారన్నారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల రీజియన్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ సీఎం జగన్ ఆదేశాలతో చేపట్టిన సామాజిక సాధికార యాత్ర రాష్ట్రవ్యాప్తంగా దిగ్విజయంగా కొనసాగుతుందన్నారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలకు అధికారంలో భాగస్వామ్యం కల్పించడం, పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అందించడం ద్వారా వారి అభివృద్ధికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుంభా రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

గంటా రాజీనామా వ్యవహారంలో కౌంటర్లు దాఖలు చేయండి

- న్యాయ శాసన వ్యవహారాల కార్యదర్శి, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ తదితరులకు హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ ఫిబ్రవరి 19కి వాయిదా



సాక్షి, అమరావతి: విశాఖ తూర్పు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రాజీనామాను ఆమోదిస్తూ శాసనసభ స్పీకర్ జారీ చేసిన ఉత్తర్వులు, ఆ ఉత్తర్వులను నోటిఫై చేస్తూ జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌కు సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు సోమవారం న్యాయ, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శి, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని ఆదేశించింది. ఇందులో భాగంగా వారికి నోటీసులు జారీ చేసింది. కౌంటర్లతో పాటు గంటా శ్రీనివాసరావు రాజీనామా లేఖను, ఇతర ఆధారాలను తమ ముందుంచాలని ప్రతివాదులను ఆదేశించింది. ఈ వ్యాజ్యంలో శాసనసభ సెక్రటరీ జనరల్‌ను ప్రతివాదిగా చేర్చాలని గంటా శ్రీనివాసరావును ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 19కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. తన రాజీనామాను ఆమోదిస్తూ శాసనసభ స్పీకర్ ఈనెల 23న జారీ చేసిన ఉత్తర్వులు, ఆ ఉత్తర్వులను నోటిఫై చేస్తూ శాసనసభ సెక్రటరీ జనరల్ అదే రోజు జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ గంటా శ్రీనివాసరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై జస్టిస్ కృష్ణమోహన్ సోమవారం విచారణ జరిపారు.

గంటా వ్యాజ్యానికి విచారణార్హతే లేదు..

గంటా తరఫు న్యాయవాది ఎస్.అశ్వనీ కుమార్ వాదనలు వినిపిస్తూ, 2021లో సమర్పించిన రాజీనామాను స్పీకర్ మూడేళ్ల తరువాత ఆమోదించారన్నారు. రాజీనామా ఉపసంహరణకు గంటా ఎలాంటి లేఖ ఇవ్వలేదని అంగీకరించారు. రాజీనామాను ఆమోదించడం వెనుక దురుద్దేశాలున్నాయి కాబట్టే, స్పీకర్ ఉత్తర్వులను సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశామన్నారు. త్వరలో జరగబోయే రాజ్యసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే రాజీనామా ఆమోదించారని, ఆ ఎన్నికల్లో గంటా ఓటు కీలకమని ఆయన వివరించారు. న్యాయ, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శి తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) వేలూరి మహేశ్వరరెడ్డి వాదనలు వినిపిస్తూ, గెజిట్ నోటిఫికేషన్‌ను సవాలు చేసినప్పుడు, దానిని జారీ చేసిన సెక్రటరీ జనరల్‌ను ప్రతివాదిగా చేర్చాలని, అయితే ఈ పిటిషన్‌లో సెక్రటరీ జనరల్‌ను ప్రతివాదిగా చేర్చలేదన్నారు. సాధారణంగా ఇలాంటి వ్యాజ్యాలు ధర్మాసనం ముందుకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. విధి విధానాల ప్రకారమే గంటా రాజీనామాను స్పీకర్ ఆమోదించారని తెలిపారు. తరువాత అసెంబ్లీ తరఫు న్యాయవాది మెట్టా చంద్రశేఖరరావు వాదనలు వినిపిస్తూ, అసలు ఈ వ్యాజ్యానికి విచారణార్హతే లేదన్నారు. ఈ వ్యాజ్యం ధర్మాసనం ముందుకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. స్పీకర్ అన్నీ అంశాలను పరిగణనలోకి తీసుకునే రాజీనామాను ఆమోదించారన్నారు. శాసనసభ్యుడిగా కొనసాగాలన్న ఉద్దేశం గంటాకు ఉంటే, ఈ మూడేళ్లలో తన రాజీనామాను వెనక్కి తీసుకుని ఉండాల్సిందని, ఈ పని చేయకుండా ఆయనను ఎవరూ ఆపలేదని వివరించారు. రాజీనామాను ఆమోదించే విషయంలో నిర్దిష్టంగా ఎలాంటి నిబంధనలు లేవన్నారు. స్పీకర్ నిర్ణయాన్ని రిట్ ద్వారా ప్రశ్నించడానికి వీల్లేదని తెలిపారు.

కరెంట్ చార్జీలు పెరగవు

▶ మొదటి పేజీ తరువాయి

తొలిరోజు 17 మంది అభిప్రాయాలు తెలియచేశారు. కార్యక్రమంలో ఏపీఈఆర్సీ సెక్రటరీ డి.రమణయ్యశెట్టి, విద్యుత్ పంపిణీ సంస్థల డైరెక్టర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రూ.15,729 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు

ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ మూడు డిస్కమ్‌ల పరిధిలో ఏపీ ట్రాన్స్‌కో నాలుగో నియంత్రణ కాలంలో మంచి విజయాలను నమోదు చేసింది. 2018–19లో 3.10 శాతం సరఫరా నష్టాలుండగా 2023–24 నాటికి 2.75 శాతానికి తగ్గింది. వచ్చే ఐదేళ్లలో ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ లభ్యత 99.70 శాతంగా నిర్దేశించుకున్నాం. ఈ ఐదేళ్ల కాలంలో ఉత్తమ ట్రాన్స్‌మిషన్ యుటిలిటీ అవార్డు, ఫాల్కన్ మీడియా, ఎనర్జియా ఫౌండేషన్ నేషనల్ అవార్డు 2023 ద్వారా టాప్ స్టేట్ యుటిలిటీ అవార్డు సొంతం చేసుకున్నాం. రాబోయే ఐదేళ్లలో మూడు డిస్కమ్‌ల పరిధిలో 400 కేవీ సబ్‌స్టేషన్లు 7, 220 కేవీ సబ్‌స్టేషన్లు 23, 132 కేవీ సబ్‌స్టేషన్లు 41 నిర్మించాలని నిర్ణయించాం. దశలవారీగా ట్రాన్స్‌మిషన్ నష్టాలను తగ్గించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. రానున్న ఐదేళ్లకు గాను రూ.15,729.4 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు తయారు చేశాం.

కేవీఎన్ చక్రధర్‌బాబు, ఏపీ జెన్‌కో ఎండీ

మన డిస్కమ్‌లకు 'ఏ' గ్రేడ్




మాట్లాడుతున్న ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి. సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, పీవీఆర్ రెడ్డి

వినియోగదారులకు మేలు చేసేలా కమిషన్ పారదర్శకంగా వ్యవహరిస్తోంది. ప్రతి డిస్కమ్‌లో వినియోగదారుల సేవలకు సంబంధించి ప్రత్యేక అధికారులను నియమించాం. దేశవ్యాప్తంగా 2022–23 వినియోగదారుల సేవల్లో ఏడు డిస్కమ్‌లకు ఏ గ్రేడ్ రేటింగ్ రాగా అందులో మూడు ఏపీకి చెందిన డిస్కమ్‌లే కావడం గర్వకారణం. రాష్ట్రంలో దాదాపు 1.8 కోట్ల వినియోగదారులకు సంబంధించి కేవలం 220 ఫిర్యాదులు మాత్రమే పరిశీలనలో ఉన్నాయి. డిస్కమ్‌లకు 50 శాతం పునరుత్పాదక శక్తి సామర్థ్యం ఉండగా అధిక భాగం సౌర, పవన విద్యుత్ ప్లాంట్ల ద్వారా సమకూరుతోంది. కోవిడ్ తర్వాత మార్కెట్ ధరలు అసాధారణంగా పెరిగాయి. కొన్నిసార్లు యూనిట్ రూ.10 సీలింగ్ రేట్‌కు కూడా విద్యుత్ లభ్యత లేకపోవడం ఆందోళన కలిగించే అంశం. గతేడాది యూనిట్ రూ.16 సీలింగ్ రేటుగా విక్రయించిన సందర్భాలున్నాయి. డిస్కమ్‌లకు చెల్లింపులను హేతుబద్ధం చేస్తూ మూతపడిన పరిశ్రమల పునరుద్ధరణ పాలసీని ఆమోదించాం. ప్రతి అభ్యంతరాన్ని పరిగణలోకి తీసుకుంటూ వినియోగదారులకు పూర్తి పారదర్శకంగా సేవలందించేందుకు ఈఆర్సీ నిరంతరం శ్రమిస్తోంది.

జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, ఏపీఈఆర్సీ చైర్మన్

పాత టారిఫ్‌లే



ఎస్‌పీడీసీఎల్ పరిధిలో పంపిణీ నష్టాలను 26.84 శాతం నుంచి గతేడాది నవంబర్ నాటికి 8.21 శాతం తగ్గించాం. ప్రభుత్వం అందిస్తున్న టారిఫ్ సబ్సిడీ 2004–05లో రూ.334 కోట్లు నుంచి 2023–24లో రూ.5195.98 కోట్లకు పెరిగింది. నవరత్నాల పథకంలో భాగంగా వ్యవసాయ, ఆక్వా రైతులు, బడుగు బలహీనవర్గాలకు చెందిన 19,26,467 మంది వినియోగదారులకు రూ.4,605.31 కోట్లను రాయితీ రూపంలో రాష్ట్ర ప్రభుత్వం అందించింది. ప్రస్తుతం ఉన్న రిటైల్ టారిఫ్ షెడ్యూల్‌ని 2024–25లోనూ కొనసాగిస్తాం. రెండు మూడు స్వల్ప మార్పులున్నా అవి గృహ, వాణిజ్య, పారిశ్రామిక, ఇతర వినియోగదారులపై ఎలాంటి ప్రభావం చూపే అవకాశం లేదు.

కె.సంతోషరావు, ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ

2024-25 ఏపీఎస్‌పీడీసీఎల్ ఆదాయ అంతరాల అంచనా

ప్రస్తుత ధరల నుంచి ఆదాయం	- రూ.15,175.75 కోట్లు
ప్రతిపాదిత ధరల నుంచి ఆదాయం	- రూ.7521.03 కోట్లు
క్రాస్ సబ్సిడీ సర్‌చార్జ్ నుంచి రాబడి	- రూ.142.46 కోట్లు
ఆర్‌ఈసీ నుంచి ఆదాయం	- రూ.20 కోట్లు
మొత్తం ఆదాయం	- రూ.22,859.24 కోట్లు
సమగ్ర ఆదాయ ఆవశ్యకత	- రూ.22859.24 కోట్లు
ప్రస్తుత ధరల వద్ద లోటు, మిగులు	- సున్నా

వినియోగదారులపై భారం లేదు



ఈపీడీసీఎల్ పరిధిలో 2017–18లో 18,351 మిలియన్ యూనిట్లు విద్యుత్ అమ్మకాలు జరగగా ప్రస్తుతం 27,864 మిలియన్ యూనిట్లకు చేరుకుంది. 2017–18లో పంపిణీ నష్టాలు 6.70 శాతం ఉండగా ప్రస్తుతం 5.31 శాతానికి తగ్గాయి. సమగ్ర ఆదాయ ఆవశ్యకత రూ.21,161.86 కోట్లుగా అంచనా వేశాం. గృహ, వాణిజ్య, పరిశ్రమలు, వ్యవసాయ, ఇతర వినియోగదారులపై భారం మోపకుండా ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఎలక్ట్రిక్ వాహనాలు, చార్జింగ్ స్టేషన్లకు ప్రస్తుతం ఉన్న స్టేషన్ల నిర్వహణ రాయితీని ఎత్తివేయాలని, రైల్వేకు అందిస్తున్న విద్యుత్ చార్జీలపై యూనిట్‌కు రూ.1 చొప్పున పెంచాలని నిర్ణయించాం. గ్రీన్ పవర్ టారిఫ్ ప్రీమియం అన్ని కేటగిరీల వినియోగదారులకు 75 పైసల నుంచి రూపాయికి పెంచేందుకు అనుమతివ్వాలని ప్రతిపాదించాం. దీని ద్వారా రూ.వంద కోట్ల ఆదాయం సమకూరనుంది. మొత్తంగా 2023–24లో ఆమోదించిన టారిఫ్ ధరలనే వచ్చే ఏడాదీ అమలు చేస్తాం.

పృథ్వీతేజ్ ఇమ్మడి, ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ

2024-25లో ఏపీఈపీడీసీఎల్ ఆదాయ అంతరాల అంచనా

ప్రస్తుత ధరల నుంచి ఆదాయం	రూ.17,854.16 కోట్లు
ప్రతిపాదిత ధరల నుంచి ఆదాయం	రూ.100.44 కోట్లు
ప్రతిపాదిత ఫుల్ కాస్ట్ రికవరీ నుంచి ఆదాయం	రూ.3207.27 కోట్లు
మొత్తం ఆదాయం	రూ.21,161.86 కోట్లు
సమగ్ర అంచనా వ్యయం	రూ.21,161.86 కోట్లు
ప్రస్తుత ధరల వద్ద లోటు	సున్నా.

భారం లేకుండా ప్రతిపాదనలు

నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం డిస్కమ్ పరిధిలో కొత్తగా రూ.172 కోట్లతో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు 54 వరకూ నిర్మాణ పనులు చేపట్టగా 43 సబ్‌స్టేషన్లు అందుబాటులోకి వచ్చాయి. హెచ్‌వీడీఎస్ పథకం ద్వారా డిస్కమ్ పరిధిలోని మూడు జిల్లాల్లో రూ.1696.59 కోట్లతో విద్యుత్ వ్యవస్థను పటిష్టం చేస్తున్నాం. గృహ, వాణిజ్య, పరిశ్రమలు, వ్యవసాయ, ఇతర వినియోగదారులపై భారం లేకుండా ప్రతిపాదనలు రూపొందించాం.

కె.సంతోషరావు, పీసీపీడీసీఎల్ సీఎండీ

2024-25 ఏపీసీపీడీసీఎల్ ఆదాయ అంతరాల అంచనా

ప్రస్తుత ధరల నుంచి ఆదాయం	రూ.9090.61 కోట్లు
టారిఫ్ కాని ఆదాయం	రూ.392.52 కోట్లు
క్రాస్ సబ్సిడీ సర్‌చార్జ్ నుంచి రాబడి	రూ.21.53 కోట్లు
ప్రతిపాదిత టారిఫ్ ద్వారా ఆదాయం అంచనా	రూ.50.73 కోట్లు
ఫుల్‌కాస్ట్ రికవరీ టారిఫ్ నుంచి ఆదాయం	రూ.2996.53 కోట్లు
ప్రస్తుత టారిఫ్ వద్ద రెవిన్యూ లోటు	రూ.3047.26 కోట్లు
సమగ్ర ఆదాయ ఆవశ్యకత	రూ.12,551.92 కోట్లు
ప్రస్తుత ధరల వద్ద లోటు, మిగులు	సున్నా

క్లుప్తంగా...

సంక్షేమ పథకాలకు చంద్రబాబు మోకాలడ్డు

మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



మందస: ప్రజలకు సంక్షేమ పథకాలను అందకుండా చేయడానికి చంద్రబాబు తీవ్ర ప్రయత్నాలు చేశారని రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆగ్రహం వ్యక్తంచేశారు. కొన్ని సంక్షేమ పథకాలను అడ్డుకోవడానికి కేంద్రానికి ఫిర్యాదు చేశారని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా మందసలో సోమవారం జరిగిన వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం అనుభవజ్ఞుడని చంద్రబాబుకు ప్రజలు అధికారం కట్టబెడితే... ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి స్వలాభం చూసుకున్నారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలే కాకుండా, ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట నిలబెట్టుకుని రాష్ట్రాన్ని సంక్షేమ, అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు మాయమాటలు నమ్మితే ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్న వలంటీర్ వ్యవస్థను రద్దు చేసి, మళ్లీ జన్మభూమి కమిటీలను తీసుకువస్తారని తెలిపారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

నిరుపేద మహిళల ద్రోహి చంద్రబాబు

మాజీ ఎంపీ డాక్టర్ చింతామోహన్

తిరుపతి(అలిపిరి): మాజీ సీఎం చంద్రబాబు నాయుడు నిరుపేద మహిళల ద్రోహి అని తిరుపతి మాజీ ఎంపీ, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ చింతా మోహన్ విమర్శించారు. ఆయన సోమవారం తిరుపతిలోని టీకే స్ట్రీట్ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా చింతా మోహన్ మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో తిరుపతిలోని పేద మహిళలు 7,008 మందికి రెండు బెడ్ రూం ఇళ్లు కట్టుకోవాలని రూ.4 లక్షలు చొప్పున ఇచ్చినట్టు తెలిపారు. పేదల ఇళ్లకు పునాదిరాయి వేసి రూ.292 కోట్లను నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ మంజూరు చేస్తూ సంతకం పెట్టినా, తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఆ డబ్బులను మాయం చేశాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. చంద్రబాబు తీరువల్ల 41 కాలనీల్లో పేదలు ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దుగరాజపట్నాన్ని చంద్రబాబు దుఃఖరాజపట్నంగా తయారు చేశాడని చెప్పారు.

'ఆదిమూలం' కులాన్ని వాడడం హాస్యాస్పదం

ఐక్య దళిత మహానాడు అధ్యక్షుడు కల్లూరి చెంగయ్య

సాక్షి,అమరావతి: వ్యక్తిగత రాజకీయాల కోసం దళిత ఎమ్మెల్యేలు కులాన్ని వాడుకోకూడదని ఐక్య దళిత మహానాడు జాతీయ అధ్యక్షుడు కల్లూరి చెంగయ్య హితవు పలికారు. ఈ మేరకు సోమవారం తాడేపల్లిలో ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తాము ఆశించిన స్థాయిలో రాజకీయ పార్టీల్లో పదవులు రానప్పుడు.. తాము దళితులమయినందువల్లే తమకు పదవులు రాకుండా చేశారని నిందలు వేయడం మంచిది కాదని పేర్కొన్నారు. ఇదే దళిత నేతలు కుల ప్రయోజనాల కోసం ఏనాడైనా ప్రభుత్వాలను అడిగారా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీకి చెందిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తదితరులు ఇలా మాట్లాడడం సమంజసం కాదని తెలిపారు. ఆదిమూలం గత ఐదేళ్లలో ఏనాడు కుల ప్రయోజనాల కోసం అసెంబ్లీలో కానీ, బయట కానీ మాట్లాడలేదని, ఇప్పుడు సొంత ప్రయోజనాల కోసం మాట్లాడుతున్నాడని పేర్కొన్నారు. మంత్రి పెద్దిరెడ్డి ఆస్తులపై చర్చిద్దామన్న ఆదిమూలం.. ఎమ్మెల్యే కాక ముందు ఆయన ఆస్తులు.. ఇప్పటి ఆస్తులపై చర్చకు రావాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ తో కలిసివెళ్లేది లేదు

- జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల స్పష్టం
- పవన్ ఢిల్లీ పర్యటన తనకు తెలియదని వెల్లడి



సాక్షి, అమరావతి: ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న తాము కాంగ్రెస్‌తో ఎలా జతకడతామని జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీతో కలిసే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. సోమవారం విజయవాడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నాదెండ్ల మాట్లాడారు. తమ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ పదేపదే చెప్పినట్లే ఎన్డీయే మిత్రపక్షంగా ఉన్నామని, ఇకపై కూడా ఉంటామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా పవన్‌కళ్యాణ్ పొత్తులపై నిర్ణయం తీసుకున్నారని, త్వరలోనే ఆయన రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తారన్నారు. పొత్తులపై బీజేపీ పెద్దలతో చర్చించేందుకు పవన్ ఢిల్లీ వెళ్లనున్నారన్న ప్రచారంపై మనోహర్ స్పందిస్తూ ఆ అంశం తన దృష్టికి రాలేదన్నారు. వైఎస్సార్‌సీపీ భీమిలి సభలో విపక్ష నాయకుల బొమ్మలను ఏర్పాటుచేసి వాటికి పంచ్ బ్యాగులను పెట్టి, కార్యకర్తలతో కొట్టించడాన్ని తమ పార్టీ ఖండిస్తుందన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన అప్పుల్లో రూ.91,253.29 కోట్లకు లెక్కతేలని పరిస్థితి కనిపిస్తోందని ఆరోపించారు. మనోహర్ విలేకరుల సమావేశంలో తన సీటు పక్కనే సీఎం జగన్ ఫొటోను ఉంచారు. నాలుగున్నరేళ్లలో ఏం చేశారో మీడియా ముఖంగా చెప్పుకోలేని దౌర్భాగ్యస్థితిలో సీఎం ఉన్నారని అందుకే ఈ సమావేశానికి ఆయనను ముఖ్యఅతిథిగా ఆహ్వానించి ఆయన చిత్రాన్ని తమపక్కన కూర్చోబెట్టామని తెలిపారు.

జనక్షేత్రంలో జేజేలు

ప్రజాదరణ మరింత పెరిగిందని తేల్చిన సీఎం జగన్ భీమిలి సభ

సాక్షి, అమరావతి: నాలుగున్నరేళ్లలో దాదాపు రూ.4.21 లక్షల కోట్లను డీబీటీ, నాన్ డీబీటీ రూపంలో రాష్ట్ర ప్రజలకు అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి ఇంటి తలుపు తట్టి సంక్షేమంతో పలుకరించింది. సుపరిపాలనతో ఎన్నికల హామీలను నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదిస్తూ ప్రజలు ప్రతి అడుగులోనూ వెన్నంటే నిలుస్తున్నారు. తాజాగా నిర్వహించిన భీమిలి సభ సీఎం జగన్‌కు జనామోదం ఏ స్థాయిలో ఉందో మరోసారి నిరూపించింది. సముద్రంలా ఉప్పొంగిన జన వాహిని సంక్షేమ ప్రభుత్వానికి మద్దతు పలికింది. మరోవైపు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సభలు నిర్వహిస్తున్న చంద్రబాబు లక్షల మందిని సమీకరించాలని ఆదేశించినా ఏ సభ చూసినా పట్టుమని 10 - 15 వేల మంది కూడా రాకపోవడంతో బేజారెత్తుతున్నారు. నియోజకవర్గాల ఇన్‌చార్జీలపై కన్నెర్ర చేస్తున్నారు. ప్రజాభీష్టం అలా ఉన్నప్పుడు తామేం చేయగలమని పార్టీ నేతలు నిస్పృహ వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు 15 సభలకు వచ్చిన జనం మొత్తం అంతా కలిపినా కూడా సీఎం జగన్ తాజాగా పాల్గొన్న ఒక్క భీమిలి సభతో పోలిస్తే సగం మంది కూడా లేకపోవడం గమనార్హం. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అధికార పార్టీలపై ప్రజల్లో అసంతృప్తి కలగడం సాధారణం! కానీ రాష్ట్రంలో మాత్రం ఎన్నిక ఏదైనా సరే ఏకపక్షంగానే ఫలితాలు వెలువడటం ప్రజాభీష్టానికి తార్కాణంగా నిలుస్తోంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రోజురోజుకూ ప్రజాదరణ వెల్లువెత్తుతోంది. పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు, తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నిక.. బద్వేలు, ఆత్మకూరు శాసనసభ స్థానాల ఉప ఎన్నికల్లో ఇది స్పష్టమైంది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 25కు 25 లోక్‌సభ స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని ఇటీవల టైమ్స్ నౌ లాంటి ప్రముఖ జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన సర్వేల్లో వెల్లడైంది. గత 56 నెలలుగా ముఖ్యమంత్రి జగన్ అందిస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో ప్రతి ఇంటా.. ప్రతి గ్రామం.. ప్రతి నియోజకవర్గంలో వచ్చిన విప్లవాత్మక మార్పే వైఎస్సార్‌సీపీకి రోజురోజుకూ ప్రజాదరణ పెరగడానికి దారి తీస్తోందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఒకవైపు సీఎం జగన్‌కు జనం నీరాజనాలు పలుకుతుండటం, వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్రకు ప్రతి నియోజకవర్గంలోనూ జనం పోటెత్తుతుండటం.. మరోవైపు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సభలకు జనం మొహం చాటేస్తుండటాన్ని బట్టి చూస్తే 2019కి మించి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అత్యంత భారీ విజయాన్ని సాధించడం ఖాయమని పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు.


నిబద్ధతతో పెరుగుతున్న విశ్వసనీయత..

సుదీర్ఘ పాదయాత్రలో ప్రజలు తన దృష్టికి తెచ్చిన వాటితోపాటు తాను స్వయంగా గుర్తించిన సమస్యలను క్రోడీకరించి వాటి పరిష్కారమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండే రెండు పేజీలతో మేనిఫెస్టోను రూపొందించి 2019 ఎన్నికల్లో పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో 50 శాతం ఓట్లతో 151 శాసనసభ స్థానాలు (86.28 శాతం), 22 లోక్‌సభ (88 శాతం) స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధించింది. దేశ చరిత్రలో ఇంత ఘనవిజయం సాధించిన పార్టీ మరొకటి లేదు. టీడీపీ 39.17 శాతం ఓట్లతో 23 శాసనసభ, మూడు లోక్‌సభ స్థానాలకే పరిమితమైంది. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 95 శాతం హామీలను అమలు చేసిన సీఎం జగన్ నిబద్ధత చాటుకుంటూ ఇప్పటికే 99.5 శాతం హామీలను నెరవేర్చారు. కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపలేదు. ఇప్పటిదాకా డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) రూపంలో రూ.2.53 లక్షల కోట్లు, నాన్ డీబీటీ రూపంలో రూ.1.68 లక్షల కోట్లు వెరసి మొత్తం రూ.4.21 లక్షల కోట్ల మేర పేదలకు ప్రయోజనాన్ని చేకూర్చారు. దేశ చరిత్రలో ఈ స్థాయిలో డీబీటీ, నాన్ డీబీటీ రూపంలో ప్రజలకు మరెవరూ మేలు చేసిన దాఖలాలు లేవు. కేబినెట్ నుంచి నామినేటెడ్ వరకూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సింహభాగం పదవులు ఇచ్చి పరిపాలనలో భాగస్వామ్యం కల్పించడం ద్వారా సామాజిక న్యాయం అంటే ఇదీ అని దేశానికి సీఎం జగన్ చాటి చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ, 26 జిల్లాలుగా పునర్‌వ్యవస్థీకరించడం ద్వారా పరిపాలనను వికేంద్రీకరించారు. వలంటీర్ల ద్వారా ఇంటి గుమ్మం వద్దకే ప్రభుత్వ సేవలను చేరువ చేశారు. విద్య, వ్యవసాయ, వైద్య రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు తెచ్చి రాష్ట్రాన్ని ప్రగతిపథంలో అగ్రభాగాన నిలిపారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం జగన్‌పై ప్రజల్లో విశ్వసనీయత రోజురోజుకు పెరుగుతోంది. ఎన్నడూ ఇచ్చిన మాటకు కట్టుబడని నైజం కలిగిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వైఖరి పట్ల నానాటికీ వ్యతిరేకత పెరుగుతోంది.

విశ్వసనీయతకు పట్టం..

టీడీపీ చరిత్రలో 2019 ఎన్నికల్లో అత్యంత దారుణంగా ఓడిపోవడంతో ఆ పార్టీ శ్రేణులు చెల్లాచెదరయ్యాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆపార్టీకి అభ్యర్థులు సైతం దొరకని దుస్థితి ఏర్పడింది. పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారడంతో ఆందోళన చెందిన చంద్రబాబు నాటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌ను అడ్డుపెట్టుకుని స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు కుట్ర చేశారు. 2021 ఫిబ్రవరిలో 13,094 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు 10,299 పంచాయతీల్లో (80 శాతం) గెలుపొందారు. టీడీపీని 2,166, జనసేనను 157 పంచాయతీలకు ప్రజలు పరిమితం చేశారు.

- ▲ ఆ తర్వాత మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులతో నామినేషన్లు వేయించిన చంద్రబాబు పంచాయతీ ఎన్నికల కంటే మరింత ఘోర పరాభవం తప్పదని పసిగట్టి ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. అయితే క్షేత్ర స్థాయిలో పార్టీ నేతలకు భారీ ఎత్తున ఇం'ధనం' సమకూర్చి నిమ్మగడ్డ రమేష్‌తో కలిసి కుట్రలకు పాల్పడినా మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించింది.
- ▲ మండల, జిల్లా పరిషత్ ఎన్నికల తరహాలోనే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లోనూ నిమ్మగడ్డ రమేష్‌తో కలిసి చంద్రబాబు పన్నిన కుట్రలను ప్రజలు చిత్తు చేశారు. వైఎస్సార్‌సీపీకి చారిత్రక విజయాన్ని అందించారు.
- ▲ స్థానిక సంస్థల ఎన్నికల్లో (పంచాయతీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్, కార్పొరేషన్) టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో సైకిల్ నామరూపాలు లేకుండా పోయింది. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీ గెలుస్తూ వస్తున్న, ప్రస్తుతం బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం నియోజకవర్గంలోనూ చిత్తుగా ఓడిపోయింది. 2019 ఎన్నికల్లో టీడీపీ నెగ్గిన 23 నియోజకవర్గాల్లోనూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోవడం గమనార్హం.
- ▲ తిరుపతి లోక్‌సభ, బద్వేలు శాసనసభ స్థానాలకు 2021లో, ఆత్మకూరు శాసనసభ స్థానానికి 2022లో జరిగిన ఉప ఎన్నికల్లో 2019 ఎన్నికల్లో కంటే అత్యధిక మెజార్టీతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించారు.
- ▲ సీఎం జగన్ విశ్వసనీయతకు ప్రజలు పట్టం కట్టారనేందుకు అధికారం చేపట్టిన నాటి నుంచి వైఎస్సార్‌సీపీ సాధించిన వరుస ఘనవిజయాలే తార్కాణమని రాజకీయ పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు.
- ▲ ఇటీవల జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ప్రజా తీర్పు పేరుతో నిర్వహించిన సర్వేలో 1.16 కోట్ల కుటుంబాలు (80 శాతం కుటుంబాల ప్రజలు) మా నమ్మకం నువ్వే జగన్ అంటూ నినదించారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే రాష్ట్రంలో 25కు 25 లోక్‌సభ స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయమని తాజాగా టైమ్స్ నౌ లాంటి ప్రముఖ జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన సర్వేల్లోనూ వెల్లడైంది.



2021 మండల పరిషత్ ఎన్నికలు

పార్టీ	వచ్చిన ఓట్ల(శాతం)	గెలిచిన ఎంపీటీసీలు (ఏకగ్రీవంతో కలిపి)	గెలిచిన మండల పరిషత్‌లు
వైఎస్సార్‌సీపీ	65.22	8,216	637
టీడీపీ	24.91	929	21(టీడీపీ-జనసేన కూటమి)
జనసేన	4.34	183	-

2021 జిల్లా పరిషత్ ఎన్నికలు

పార్టీ	వచ్చిన ఓట్ల శాతం	గెలిచిన జెడ్పీటీసీలు	గెలిచిన జడ్పీ చైర్‌పర్సన్‌లు
వైఎస్సార్‌సీపీ	69.25	630	13
టీడీపీ	22.48	06	0
జనసేన	3.92	2	0

2021, మున్సిపల్, నగరపంచాయతీలు, కార్పొరేషన్‌ల ఎన్నికలు

పార్టీ	వచ్చిన ఓట్ల శాతం	గెలిచిన మున్సిపాల్టీలు	గెలిచిన కార్పొరేషన్‌లు
వైఎస్సార్‌సీపీ	52.63	84	14
టీడీపీ	30.73	03	0
జనసేన	4.67	0	0

2021 పంచాయతీ ఎన్నికల ఫలితాలు

పార్టీ	గెలిచిన పంచాయతీలు
వైఎస్సార్‌సీపీ	10,299
టీడీపీ	2,166
బీజేపీ	45
జనసేన	157
ఇతరులు	414

తిరుపతి లోక్‌సభ స్థానం

2019 ఎన్నికల ఫలితాలు

పార్టీ	వచ్చిన ఓట్ల శాతం
వైఎస్సార్‌సీపీ	55.03
టీడీపీ	37.65

2021 ఉప ఎన్నికల ఫలితాలు

వైఎస్సార్‌సీపీ	56.67
టీడీపీ	32.09

బద్వేలు శాసనసభ స్థానం

2019 ఎన్నికల ఫలితాలు

పార్టీ	వచ్చిన ఓట్లు శాతం
వైఎస్సార్‌సీపీ	60.19
టీడీపీ	32.36

2021 ఉప ఎన్నికల ఫలితాలు

వైఎస్సార్‌సీపీ	76.25
బీజేపీ	14.73

(జనసేన అధికారికంగా, టీడీపీ లోపాయికారి మద్దతు)

ఆత్మకూరు శాసనసభ స్థానం

2019 ఎన్నికల ఫలితాలు:

పార్టీ	వచ్చిన ఓట్ల శాతం
వైఎస్సార్‌సీపీ	53.32
టీడీపీ	40.44

2022 ఎన్నికల ఫలితాలు:

వైఎస్సార్‌సీపీ	74.47
బీజేపీ	14.1

(జనసేన అధికారికంగా, టీడీపీ లోపాయికారి మద్దతు)

జనం కరువు.. ఖాళీ కుర్చీలకు ఏకరువు

చంద్రబాబు సభలు అట్టర్‌ఫ్లాప్

- రాజమహేంద్రవరం రూరల్, పొన్నూరుల్లో 'రా కదలి రా' విఫలం
- బాబు ప్రసంగిస్తుండగానే జారుకున్న జనం
- రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వర్గం నిరసన సెగ
- తోపులాటలో కింద పడబోయిన బాబు
- రక్షించిన భద్రతా సిబ్బంది



బాబు ప్రసంగిస్తుండగా ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

సాక్షి, రాజమహేంద్రవరం/రాజమహేంద్రవరం రూరల్/సాక్షి ప్రతినిధి, గుంటూరు, పొన్నూరు/చేబ్రోలు: టీడీపీ అధినేత చంద్రబాబు చేపట్టిన రా.. కదలి రా.. సభలకు జనం ముఖం చాటేస్తున్నారు. భారీగా జనాన్ని సమీకరించాలని పార్టీ అధిష్టానం నుంచి వస్తున్న ఒత్తిడితో పార్టీ నాయకులు శ్రమిస్తున్నా.. ప్రజల నుంచి స్పందన ఉండడం లేదు. ఫలితంగా సోమవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ కాతేరు, గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గం చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామంలో జరిగిన సభలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. ఈ రెండు సభలకు కలిపి మూడు లక్షల మంది జనాన్ని సమీకరించాలని పార్టీ నాయకులు యత్నించినా వారి ఆశలు ఫలించలేదు. 30 వేలమందికి మించి జనం రాలేదని పార్టీ శ్రేణులే చెవులు కొరుక్కున్నాయి. ఫలితంగా ఖాళీ కుర్చీలకే చంద్రబాబు ప్రసంగం పరిమితమైంది. వచ్చిన వారూ బాబు ప్రసంగిస్తుండగానే సభ నుంచి జారుకోవడం గమనార్హం.

బొడ్డు వర్గం నిరసన.. కింద పడబోయిన చంద్రబాబు

రాజమహేంద్రవరం రూరల్ కాతేరులో జరిగిన సభలో రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి వర్గీయులు నిరసనకు దిగారు. ఈ స్థానాన్ని జనసేనకు కేటాయించడం తగదని బాబు ప్రసంగిస్తున్నంత సేపూ నినాదాలు చేశారు. అనంతరం సభా వేదికపైకి చేరుకుని నిరసనకు దిగారు. ఈ సమయంలో జరిగిన తోపులాటలో చంద్రబాబు కిందకు పడబోయారు. భద్రతా సిబ్బంది అప్రమత్తమై ఆయనను పట్టుకున్నారు. బాబు తిరిగి వెళ్తుండగానూ బొడ్డు వర్గం కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు యత్నించింది. దీంతో ఆగ్రహించిన బాబు అసమ్మతి నేతలను, బొడ్డు వెంకట రమణ చౌదరిని బస్సులోకి పిలిపించి మాట్లాడారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ భర్త వాసుతోనూ మంతనాలు జరిపినట్టు తెలిసింది.

వేషాలు మార్చే మారీచుడు జగన్ : చంద్రబాబు

రాజమహేంద్రవరం రూరల్, పొన్నూరు సభల్లో మాట్లాడిన చంద్రబాబు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. జగన్ వేషాలు మార్చే మారీచుడని విమర్శించారు. వైఎస్సార్ సీపీలో తిరుగుబాటు మొదలైందని, టీడీపీ గేట్లు తెరిస్తే ఆ పార్టీ ఖాళీ అవుతుందని పేర్కొన్నారు. తాను ఐటీని ప్రోత్సహిస్తే, జగన్ ఐదువేలకు వలంటీర్ ఉద్యోగాలిచ్చారని విమర్శించారు. అమరావతిపై కులం ముద్ర వేసి నాశనం చేశారని పేర్కొన్నారు. ఇది దేవతల రాజధాని అని, దీనిని జగన్ ఏమీ చేయలేరని పేర్కొన్నారు. జగన్ సిద్ధం అంటుంటే ప్రజలు ఆయనను గద్దె దించేందుకు సిద్ధంగా ఉన్నారని చంద్రబాబు ఎద్దేవా చేశారు. మంగళగిరి ఎమ్మెల్యే తనపై అమరావతి, రింగ్‌రోడ్డు లాంటి ఎన్నో కేసులు వేశారని, జగన్‌కు ఎంతో నమ్మకస్తుడైన ఆయనే ఇప్పుడు తిరగబడ్డారని చంద్రబాబు విమర్శించారు.

మద్యం, డబ్బు, పలావ్ పంపిణీ

సభలకు వచ్చిన కార్యకర్తలకు నిర్వాహకులు మద్యం, డబ్బు, పలావ్ పంపిణీ చేశారు. బాబు ప్రసంగం జరుగుతుండగానే పొన్నూరు సభా ప్రాంగణంలో కొందరు మద్యం సేవించడంతో మహిళా నేతలు, కార్యకర్తలు ఇబ్బంది పడ్డారు. సభకు వాహనాల్లో తీసుకువచ్చి ముగిసిన తర్వాత వదిలేశారని, డబ్బులిస్తామని ఇవ్వలేదని కొందరు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమర్థతగల నేత జగన్ : ఆలపాటి రాజా

పొన్నూరు సభలో టీడీపీ నేత ఆలపాటి రాజా చంద్రబాబును పొగడబోయి సమర్థత, సత్తా ఉన్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత నాలుక కరుచుకున్నారు.

బత్తులపై బాబు ఆగ్రహం

చంద్రబాబు జనసేన రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం రూరల్ సభ వద్దకు వచ్చిన బత్తుల వర్గీయులు జై జనసేన నినాదాలు చేశారు. దీంతో బాబు అసహనం వ్యక్తం చేశారు. బత్తులను పక్కకు తోసేయమని తన సిబ్బందిని ఆదేశించారు. పిచ్చివేషాలు వెయ్యొద్దంటూ హెచ్చరించారు. దీంతో బత్తుల చంద్రబాబు ప్రయాణిస్తున్న వాహనానికి అడ్డంగా వెళ్లి మరీ అనుచరులతో నినాదాలు చేయించారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు చుక్కెదురు

అనర్హత పిటిషన్లలో తదుపరి చర్యలు నిలుపుదలకు హైకోర్టు నిరాకరణ

సాక్షి, అమరావతి : అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవీలతో పాటు ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్యలకు హైకోర్టులో చుక్కెదురైంది. ఫిరాయింపుదారులపై అనర్హత వేటు వేయాలంటూ అసెంబ్లీలో చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, మండలిలో చీఫ్‌విప్ మేరిగ మురళీధర్ ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా అనర్హత పిటిషన్లపై అసెంబ్లీ స్పీకర్, మండలి చైర్మన్‌లు జరుపుతున్న విచారణకు సంబంధించిన తదుపరి చర్యలన్నీ నిలుపుదల చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. అలాగే.. స్పీకర్, చైర్మన్ ఇచ్చిన నోటీసులకు వివరణ ఇచ్చేందుకు తమకు నాలుగు వారాల గడువునిచ్చేలా ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వాలన్న వారు చేసిన అభ్యర్థనను సైతం హైకోర్టు తోసిపుచ్చింది. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం సాధ్యంకాదని తేల్చిచెప్పింది. ఈ మొత్తం వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని అసెంబ్లీ సెక్రటరీ జనరల్, అసెంబ్లీ స్పీకర్‌లతో పాటు ఫిర్యాదుదారు అయిన ముదునూరి ప్రసాదరాజును ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 26కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

ఇదీ నేపథ్యం..

2019 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీచేసి గెలుపొందిన మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఆనం రాంనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విప్‌ను ధిక్కరించి తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఓటు వేశారు. దీంతో వైఎస్సార్‌సీపీ వారిని పార్టీ నుంచి బహిష్కరించింది. ఆ తరువాత వారు టీడీపీలోకి ఫిరాయించారు. ఈ నేపథ్యంలో.. వీరిపై ఫిరాయింపుల చట్టం కింద అనర్హత వేటు వేయాలంటూ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఇదే రీతిలో ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్యపై కూడా శాసన మండలిలో చీఫ్‌విప్ అయిన మేరిగ మురళీధర్ మండలి చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. వీటిపై అసెంబ్లీ స్పీకర్, మండలి చైర్మన్ విచారణ చేపట్టారు. అనర్హత వేటు ఎందుకు వేయకూడదో వివరణ ఇవ్వాలంటూ ఫిరాయింపుదారులకు ఇటీవల నోటీసులిచ్చారు. ఈనెల 29న విచారణ జరుపుతానని అందులో పేర్కొన్నారు. కానీ, ఈ



నోటీసులను రద్దుచేయాలని కోరుతూ ఫిరాయింపు ఎమ్మెల్యేలు నలుగురు, ఎమ్మెల్సీ సోమవారం అత్యవసరంగా హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్లు వేర్వేరుగా దాఖలు చేశారు. నోటీసులకు వివరణ ఇచ్చేందుకు తమకు మరింత గడువునిచ్చేలా స్పీకర్, చైర్మన్లను ఆదేశించాలని, అలాగే విచారణకు సంబంధించి తదుపరి చర్యలన్నీ నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలని వారు తమ పిటిషన్లలో కోర్టును కోరారు.

సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం..

ఈ వ్యాజ్యాలపై జస్టిస్ కృష్ణమోహన్ విచారణ జరిపారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. ప్రసాదరావు ఫిర్యాదుపై స్పీకర్ తమకు నోటీసులిచ్చి, వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఈ నెల 8న ఆదేశించారన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్నందున ఆ నోటీసులకు వివరణ ఇచ్చేందుకు మరింత గడువు కావాలని ఆ నలుగురు కోరడంతో ఈ నెల 26 వరకు స్పీకర్ గడువునిచ్చారన్నారు. తిరిగి ఈనెల 24న స్పీకర్‌కు లేఖ రాసి, వివరణకు నాలుగు వారాల గడువునివ్వాలని కోరామన్నారు. అయితే, స్పీకర్ తమ అభ్యర్థనను తిరస్కరించి, ఈ నెల 29న విచారణ జరుపుతామని చెప్పారన్నారు. స్పీకర్ నిర్ణయం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమన్నారు. అనర్హత పిటిషన్లపై స్పీకర్ ఏ నిమిషంలోనైనా ఉత్తర్వులు జారీచేసే అవకాశం ఉందని, అందువల్ల అనర్హత పిటిషన్లలో తదుపరి చర్యలన్నీ నిలుపుదల చేయాలని ఆయనతో పాటు ఎమ్మెల్సీ న్యాయవాది కోర్టును కోరారు.

ఫిరాయింపుదారులను విచారించిన స్పీకర్

మరోవైపు.. వెలగపూడిలోని తాత్కాలిక శాసనసభలోని తన కార్యాలయంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు నలుగురిని స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం విచారించారు. ఫిరాయింపు నిరోధక చట్టం కింద ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని స్పీకర్ వారిని కోరారు. వివరణ ఇవ్వడానికి తమకు నాలుగు వారాల సమయం ఇవ్వాలని వారు చేసిన విజ్ఞప్తిని స్పీకర్ సున్నితంగా తోసిపుచ్చినట్లు తెలిసింది. ఇప్పటికే మూడుసార్లు సమయం ఇచ్చామని గుర్తుచేస్తూ వారిని విచారించారు. అలాగే, స్పీకర్‌కు టీడీపీ ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేల్లో వాసుపల్లి గణేష్ కూడా విచారణకు హాజరయ్యారు. వల్లభనేని వంశీ, మద్దాల గిరి, కరణం బలరాం హాజరుకాలేదు.

నోటీసులివ్వడం సహజ న్యాయ సూత్రాలకు ఎలా విరుద్ధం?

అనంతరం.. అసెంబ్లీ తరఫున న్యాయవాది మెట్టా చంద్రశేఖరరావు వాదనలు వినిపిస్తూ.. అనర్హత పిటిషన్ల విషయంలో స్పీకర్ గానీ, మండలి చైర్మన్‌గానీ ఓ ట్రిబ్యునల్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. అందువల్ల వారి నిర్ణయాలను అధికరణ 226 కింద కోర్టుల్లో సవాలు చేయడానికి వీల్లేదన్నారు. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపే పరిధి హైకోర్టుకు లేదన్నారు. కాలయాపన చేయాలన్న ఉద్దేశంతోనే వివరణ ఇచ్చేందుకు పిటిషనర్లు గడువు కోరుతున్నారని తెలిపారు. న్యాయవ్యవస్థ, శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థలకు వారి వారి విధులు, బాధ్యతలున్నాయని, ఒక వ్యవస్థలోకి మరొకరు చొరబడటానికి వీల్లేదన్నారు. చట్టం నిర్దేశించిన మేరకే స్పీకర్, చైర్మన్ నోటీసులిచ్చి వివరణ కోరారన్నారు. వివరణ కోరకుండా ఉత్తర్వులిస్తే అది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమవుతుందే తప్ప, నోటీసులు ఇచ్చి వివరణ కోరడం ఎలా విరుద్ధమవుతుందని ప్రశ్నించారు. స్పీకర్, మండలి చైర్మన్ తుది ఉత్తర్వులు జారీచేయడానికి ముందే దాఖలు చేసిన ఈ వ్యాజ్యాలు అపరిపక్వమైనవని మెట్టా చంద్రశేఖర్‌రావు వివరించారు. ఇలా ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్.. పిటిషనర్లు కోరిన విధంగా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించారు. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీచేయలేమని తేల్చిచెప్పారు. ప్రతివాదులకు నోటీసులు జారీచేశారు. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఫిబ్రవరి 26కి వాయిదా వేశారు.



నిఖిల

'సాయం చేయాలన్న ఆలోచన ఉండగానే సరిపోదు
ఆ ఆలోచనను ఆచరణలో కూడా పెట్టాలి' అంటారు వెంగళ నిఖిల.
హైదరాబాద్ వాసి అయిన నిఖిల కిందటేడాది
మిసెస్ హైదరాబాద్, మిసెస్ తెలంగాణ,
మిసెస్ ఇండియా టైటిల్స్‌ను గెలుచుకుంది.
బ్యూటీ ఇండస్ట్రీలో తనదైన ముద్ర వేయడమే కాదు
బ్యూటీ కాంటెస్ట్‌లలో పాల్గొనేవారిని ట్రైన్ చేస్తుంది.
ఫార్మసిస్ట్‌గా కార్పొరేట్ హాస్పిటల్స్‌లో వర్క్ చేస్తుంది.
ఒక బిడ్డకు తల్లిగా, కుటుంబ బాధ్యతలూ నిర్వర్తిస్తుంది.
'సమయమే కాదు దానిని సద్వినియోగం చేసుకోవడం కూడా
మన చేతుల్లోనే ఉంది'
అని చెబుతున్న నిఖిల జర్నీ నేటి మహిళలకు స్ఫూర్తిని కలిగిస్తుంది.

బ్యూటీ కాంటెస్ట్‌లో 'నువ్వు ఫిట్ కావు' అన్నారు..

''యాక్టర్స్, మోడల్స్ కే కాదు ఇటీవల జరిగిన మిస్టర్ ఇండియా కాంటెస్ట్‌కు మెంటార్‌గా ఉన్నాను. ఈ కాంటెస్ట్‌లో పాల్గొనే ఫైనల్స్‌కి 51 మంది ఎంపికయ్యారు. వారిని ట్రైన్, గ్రూమ్ చేయడానికి టీమ్‌లో నేనొక మెంబర్‌గా పనిచేశాను. యాసిడ్ బాధితులకు మద్దతుగా నిలిచే లక్ష్మీ ఫౌండేషన్ గురించి అవగాహన కలిగించడానికి చేసిన కాంటెస్ట్ అది. కంటెస్టెంట్స్ అందరినీ పక్కన పెడితే టీమ్‌లో ఉండి ఆ ఫౌండేషన్‌కు సపోర్ట్ చేయాలనే ఆలోచనతో అందరికన్నా ఎక్కువ నిధులు సమకూర్చగలిగాను. దీనికి మిసెస్ గోల్డెన్ ఆఫ్ హార్ట్ సౌత్ ఇండియా క్రౌన్ వచ్చింది.

కష్టమైనా .. సులువే..

ఎమ్‌ఫార్మసీ చేశాను. నా రీసెర్చ్ వర్క్‌పై చాలా ఆర్టికల్స్ కూడా పబ్లిష్ అయ్యాయి. డయాబెటిస్, ఒబేసిటీ పైన ఎక్కువ వర్క్ చేశాను. కార్పొరేట్ హాస్పిటల్స్‌కి, క్యాన్సర్ హాస్పిటల్‌కి మెడికల్ రైటర్‌గా ఉన్నాను. వృత్తినీ, కుటుంబాన్నీ బ్యాలెన్స్ చేసుకుంటూనే నా కలలనూ నెరవేర్చుకుంటున్నాను. బ్యూటీ కాంటెస్ట్‌లలో పాల్గొనడం నాకో ప్యాషన్. అందరిలాగే మా అమ్మానాన్నలు కూడా 'ఏం చేయాలనుకున్నా పెళ్లి తర్వాత నీ ఇష్టం' అన్నారు. దీంతో పెళ్లివైపే మొగ్గు చూపాను. బాబు పుట్టాక, ఇంటి పనులతో క్షణం తీరిక లేకుండా ఉండేది. కానీ కొన్ని రోజుల్లోనే నా గురించి నేను ఆలోచించుకోవడం మొదలుపెట్టాను. మావారి సపోర్ట్‌తో ఇలాంటి కాంటెస్ట్‌లో పాల్గొనడం మొదలుపెట్టాను.

టైమ్ ప్రకారం ప్లానింగ్..

నా పెళ్లికి ముందు యోగా, జిమ్ చేసేదాన్ని. క్లాసికల్ డ్యాన్సర్‌ని కూడా. ప్రెగ్నెన్సీ తర్వాత అన్ని యాక్టివిటీస్‌కి దూరమయ్యాను. రెండేళ్ల గ్యాప్ తర్వాత తిరిగి నన్ను నేను మార్చుకోవాలి అనే ప్రయత్నంలో చాలా ఒత్తిడికి లోనయ్యాను. టైమ్‌కి తినాలి, టైమ్ ప్రకారం వ్యాయామాలు, టైమ్‌కి నిద్ర.. అన్నీ ప్లాన్ చేసుకోవాలి. వీటితోపాటు ఇంటినీ, బాబునూ చూసుకోవాలి, అలాగే ఆఫీస్ వర్క్ కూడా చూసుకోవాలి. వీటన్నింటికీ నన్ను నేను సిద్ధం చేసుకోవడం మొదలుపెట్టాను. కష్టమనిపించినా ప్రతి రోజూ ప్రయత్నించడమే. ఒక్కరోజు కూడా నా రొటీన్ వర్క్‌ని బ్రేక్ చేయకూడదు అనుకున్నాను. మా బాబుకు ఏడాదిన్నర వయసు ఉన్నప్పటి నుంచీ మిస్ కాకుండా చూసుకోవచ్చు అనే ఆలోచనతో వాడినీ బ్యూటీ కాంటెస్ట్ దగ్గరకు తీసుకెళుతుంటాను . నా ప్యాషన్‌ని, డ్రీమ్‌ను నెరవేర్చుకోవడానికి కృషి చేస్తూనే ఉంటాను.

నువ్వు ఫిట్ కావు అన్నారు...

బ్యూటీ కాంటెస్ట్‌లో పాల్గొనడానికి ముందు నేను అమ్మను. బ్యూటీ ఇండస్ట్రీలో ఉండాలంటే అందంగా కనిపించాలి. బాహ్య సౌందర్యమే కాదు, అంతఃసౌందర్యం కూడా బాగుండాలి. నిజానికి అప్పుడు నేనంత సిద్ధంగా లేను. బరువు, ఫేస్ గ్లో .. సమస్యలు ఉన్నాయి. దాంతో 'నువ్వు ఈ బ్యూటీ కాంటెస్ట్‌కు ఫిట్ కావు' అన్నారు నన్ను చాలా మంది. కానీ, నేను అవేమీ పట్టించుకోలేదు. నన్ను నేను మోటివేట్ చేసుకున్నాను. నా జర్నీని నేను మళ్లీ మొదలుపెట్టాలి అని నన్ను నేను పూర్తిగా ట్రాన్స్‌ఫార్మ్ చేసుకున్నాను. ఫిజికల్‌గా, ఎమోషనల్‌గా ఫిట్‌గా మార్చుకున్నాను. ఈ విషయంలో మావారు తప్ప ఎవరూ నాకు సపోర్ట్ చేయలేదు. నేనూ అవేమీ పట్టించుకోలేదు.

'మానసికంగా నేను స్ట్రాంగ్‌గా ఉన్నాను' అనే ఆలోచనతో టైటిల్స్ సాధించాను. దీంతో నా చుట్టూ ఉన్న అందరిలోనూ ఒక మంచి గుర్తింపు లభించింది. అదే నన్ను మంచి పొజిషన్‌కి తీసుకు వచ్చింది.

యాసిడ్ దాడి బాధితులకు..

కొన్నేళ్ల క్రితం రాష్ట్రంలో ఇద్దరు అమ్మాయిలపై యాసిడ్ దాడి జరిగింది. ఆ కాలేజీకి, మా కాలేజీ దగ్గర. ఆ ఇన్సిడెంట్ నేను చూశాను. చాలా బాధనిపించింది. ఇప్పుడు యాసిడ్ దాడి బాధితులకు సాయం చేసే అవకాశం వచ్చింది. వదులుకోవద్దు అనుకున్నాను. ఏదీ నేను ఆశించలేదు. ఒక మంచి పని కోసం కృషి చేస్తున్నాం. ఎంత వచ్చినా అవసరమైన వారికి చేరుతుంది అనే ఆలోచనతోనే పని చేశాను.

అవగాహన కలిగిస్తూ...

చిన్నపిల్లలకు గుండె ఆపరేషన్ల కోసం ఒక బ్యూటీ కాంటెస్ట్ ఏర్పాటు చేశాం. అప్పుడు మంచి స్పందన వచ్చింది. చిన్నారుల ఆపరేషన్లకు ఆ డబ్బును డొనేట్ చేశాం. ఇప్పుడు కూడా ఇలాగే ఈ బ్యూటీ కాంటెస్ట్‌ను ఏర్పాటు చేశాం. ఎవరినీ ఒత్తిడి చేయం. మా బంధుమిత్రులకు, తెలిసినవారికి మా ఆలోచనను తెలియజేశాం. ఈ కాంటెస్ట్ ద్వారా చర్మదానం పట్ల ఒక అవగాహన కల్పించాం. మంచి గుర్తింపు లభించింది. ఇక ముందు కూడా లక్ష్మీ ఫౌండేషన్‌కి జాతీయస్థాయి, అంతర్జాతీయ స్థాయి కాంటెస్ట్‌లు చేయాలని, వాటిలో పాల్గొని యాసిడ్ దాడి బాధితులకు ఆసరాగా ఉండాలనుకుంటున్నాను'' అని చెప్పారు నిఖిల వెంగళ.

– నిర్మలారెడ్డి

న్యూస్‌మేకర్

ఆర్మీలో మొదటిసారి ఒక మహిళ 'సుబేదార్' ర్యాంక్‌కు ప్రమోట్ అయ్యింది. రెండేళ్ల క్రితం ఆర్మీలో హవల్దార్‌గా చేరిన ప్రీతి రజక్ తన క్రీడాప్రావీణ్యంతో ఆసియన్ గేమ్స్‌లో ట్రాప్ షూటర్‌గా సిల్వర్ మెడల్ సాధించింది. దేశవ్యాప్తంగా యువతులను ఆర్మీలో చేరేలా ఆమె స్ఫూర్తినిచ్చిందని ఆమెకు ఈ గౌరవం కల్పించారు.





ప్రీతి రజక్

సుబేదార్ ప్రీతి

మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రీతి రజక్ ఆర్మీలో 'సుబేదార్' ర్యాంక్‌కు ప్రమోట్ అయ్యింది. ఆర్మీలో 'సుబేదార్' అనిపించుకోవడం చిన్న విషయం కాదు. 'సిపాయి' నుంచి మొదలయ్యి 'లాన్స్ నాయక్', 'నాయక్', 'హవల్దార్', 'నాయబ్ సుబేదార్'... ఇన్ని దశలు దాటి 'సుబేదార్' అవుతారు. ఆర్మీలో మహిళల రిక్రూట్‌మెంట్ 1992లో మొదలయ్యాక సంప్రదాయ అంచెలలో ఒక మహిళ సుబేదార్‌గా పదవి పొందటం ఇదే మొదటిసారి. ఆ మేరకు ప్రీతి రజక్ రికార్డును నమోదు చేసింది. ట్రాప్ షూటర్‌గా ఆసియన్ గేమ్స్‌లో ఆమె చూపిన ప్రతిభను గుర్తించిన ఉన్నత అధికారులు ఆమెను ఈ విధంగా ప్రోత్సహించి గౌరవించారు.

లాండ్రీ ఓనరు కూతురు

ఇరవై రెండేళ్ల ప్రీతి రజక్‌ది మధ్యప్రదేశ్‌లోని ఇటార్సీ సమీపంలో ఉన్న నర్మదాపురం. దిగువ మధ్యతరగతి కుటుంబం. తండ్రి లాండ్రీషాపు నడుపుతాడు. తల్లి సామాజిక సేవలో ఉంది. ముగ్గురు అక్కచెల్లెళ్లలో రెండవ సంతానమైన ప్రీతి చిన్నప్పటి నుంచీ ఆటల్లో చురుగ్గా ఉండేది. క్రీడలంటే ఆసక్తి ఉన్న తండ్రి తన కూతుళ్లను శక్తిమేరకు క్రీడాకారులు చేయదలిచి ప్రోత్సహించాడు. అలా ప్రీతి షూటింగ్‌లోకి వచ్చింది. భోపాల్‌లోని స్పోర్ట్స్ అకాడెమీలో శిక్షణ పొందుతున్న సమయంలోనే ప్రీతి జాతీయ స్థాయిలో ప్రతిభ చూపింది. పతకాలు సాధించింది. దాంతో ఆర్మీలో స్పోర్ట్స్ కోటాలో మిలటరీ పోలీస్ డివిజన్‌లో నేరుగా 2022లో హవల్దార్ ఉద్యోగం వచ్చింది.



ఏ సాహసానికైనా సిద్ధమే

ఆర్మీలో చేరినప్పటి నుంచి ప్రీతి ఏ సాహసానికైనా సిద్ధమే అన్నట్టుగా పనిచేస్తూ పై అధికారుల మెప్పు పొందింది ప్రీతి. షూటింగ్‌ను ప్రాక్టీస్ చేయాలంటే ఖర్చుతో కూడిన పని. కాని ఆర్మీలో చేరాక ఆమెకు శిక్షణ మరింత సులువైంది. అందుకు కావలసిన గన్స్ ఆమెకు మరిన్ని అందుబాటులోకి వచ్చాయి. ఇక చైనాలో జరిగిన 2023 ఆసియన్ గేమ్స్‌లో షార్ట్ పిస్టల్ విభాగంలో ప్రీతి రజత పతకం సాధించడంతో ఆర్మీ గౌరవంతో పాటు దేశ గౌరవమూ ఇనుమడించింది. 'నేటి యువతులు ఇళ్లల్లో కూచుని ప్రతిభను వృథా చేయొద్దు. ఇంటినుంచి బయటకు రండి' అని ప్రీతి ఈ సందర్భంగా పిలుపునిచ్చింది. దాంతో చాలామంది అమ్మాయిలు ఆర్మీలో చేరడానికి ఉత్సాహం చూపారు. ఇది పై అధికారులకు మరింతగా సంతోషం కలిగించడంతో జనవరి 28, 2024న ఆమెకు సుబేదార్‌గా ప్రమోషన్ ఇచ్చారు.

పారిస్ ఒలింపిక్స్‌కు

ఈ సంవత్సరం జూలైలో పారిస్‌లో జరగనున్న ఒలింపిక్స్‌లో ఎలాగైనా పతకం తేవడానికి ప్రీతికి ఆర్మీ వారే శిక్షణ ఇస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని మహౌలోని 'ఆర్మీ మార్క్స్‌మెన్‌షిప్ యూనిట్' (ఏ.ఎం.యు.)లో ప్రీతికి ప్రస్తుతం శిక్షణ కొనసాగుతూ ఉంది. జాతీయ స్థాయిలో మహిళా ట్రాప్ షూటింగ్‌లో విభాగంలో ఆరవ ర్యాంక్‌లో ఉంది ప్రీతి. ఆమె గనక ఒలింపిక్ మెడల్ సాధిస్తే ఆర్మీలో ఆమెకు దొరకబోయే ప్రమోషన్ మరింత ఘనంగా గర్వపడే విధంగా ఉంటుంది.

సాగుబడి

శ్రవణ కార్తె: ఫిబ్రవరి 5 వరకు

బియ్యం, గోధుమల్లో బలం సగమే!

- గత ఏభయ్యేళ్లలో 45% మేరకు పోషకాలు కోల్పోయిన వరి, గోధుమలు.. 2040 నాటికి పూర్తిగా తగ్గే ప్రమాదం..
- అధిక దిగుబడినిచ్చే వరి, గోధుమ వంగడాల్లో దశాబ్దానికి ఒకటి, రెండు ప్రాచుర్యం పొందిన రకాలపై ఐసిఏఆర్, ఐసిఎంఆర్ సంయుక్త అధ్యయనం
- సాంబ మసూరి, స్వర్ణ సబ్ 1 తదితర 16 రకాల వరి, 18 రకాల గోధుమ అధిక దిగుబడి వంగడాలపై అధ్యయనం
- భారఖనిజాల శాతం పెరగటంతో ప్రజారోగ్యానికి ముప్పు
- బయోఫోర్టిఫైడ్ వంగడాలు మేలంటున్న శాస్త్రవేత్తలు

తిండికి కటకటలాడుతూ ఓడలో ధాన్యం వస్తేనే దేశం ఆకలి తీరే పరిస్థితుల్లో హరిత విప్లవ సాంకేతికత (జిఆర్‌టి)ల అమలు మన దేశంలో 1960వ దశకంలో ప్రారంభమైంది. అధిక దిగుబడినిచ్చే వరి/గోధుమ ఆధునిక వంగడాలు తయారుచేసుకొని వాడుతున్నాం.. నీటి పారుదల, రసాయనిక ఎరువులు, పురుగుమందులతో పంటలు పండిస్తున్నాం.. పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు తెల్ల బియ్యం, గోధుమలు అందిస్తున్నది. ఏభయ్యేళ్లు గడచిపోయాక.. వెనక్కి చూస్తే జనం కడుపు నిండుతోంది. కానీ, పోషకలోపం వెంటాడుతోంది. ముందెన్నడూ లేనట్లుగా రోగాలు ముసురుకుంటున్నాయి. దీనికి మూలకారణం ఏమిటో ఓ తాజా అధ్యయనం విడమర్చి చెబుతోంది.

సాగు భూమిలో పోషకాలు తగ్గిపోయాయి కాబట్టి ఆహారంలో పోషకాలు తగ్గిపోతున్నాయని ఇన్నాళ్లూ అనుకున్నాం. అయితే, వరి, గోధుమ మొక్కలకు నేలలో ఉన్న పోషకాలను తీసుకునే శక్తి కూడా తగ్గిపోయిందని ఇప్పుడు రూఢి అయ్యింది. ఇంతకన్నా ఆందోళన కలిగించే మరో విషయాన్ని కూడా ఈ అధ్యయనం తేటతెల్లం చేసింది. నేలలో భార ఖనిజాలు వంటి విషతుల్య పదార్థాలను కంకుల్లోని ధాన్యాలకు చేరకుండా ఆపి వేసే సహజసిద్ధమైన విచక్షణా జ్ఞానం మొక్కలకు ఉంటుంది. అయితే, అధిక దిగుబడుల కోసం తయారు చేసిన ఆధునిక వరి, గోధుమ విత్తనాల బ్రీడింగ్ ప్రక్రియల్లో గత ఏభయ్యేళ్లలో చేసిన కీలక మార్పుల వల్ల ఈ పంటల్లో ఆ తెలివి లోపించింది. అందువల్లే ఇప్పుడు వరి బియ్యం, గోధుమల్లోకి ప్రాణాంతక భార ఖనిజాలు అధిక పాళ్లలో చేరుతున్నాయి. వీటిని తిన్న మనుషులకు పోషకాలు లోపించటం వల్ల మాత్రమే కాదు, భార ఖనిజాల వల్ల కూడా రకరకాల జబ్బులొస్తున్నాయని తేలింది. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, భారతీయ వైద్య పరిశోధనా మండలి సమన్వయంతో అత్యంత కీలకమైన ఈ అధ్యయనం చేయటం విశేషం. గత నవంబర్‌లో 'నేచర్' లో ఈ అధ్యయన పత్రం అచ్చయ్యింది.

ప్రసిద్ధ వంగడాలపైనే అధ్యయనం

వరి, గోధుమల్లో పోషకాల స్థాయిని తెలుసుకునేందుకు ఐసిఏఆర్, ఐసిఎంఆర్ పరిశోధన సంస్థల్లో పనిచేస్తున్న నేలల నిపుణుడు డా. సోవన్ దేబనాథ్, మరో 11 మంది శాస్త్రవేత్తలతో కలసి విస్తృత పరిశోధనలు చేశారు. డా. సోవన్ ఉత్తరప్రదేశ్ ఝాన్సీలోని ఐసిఏఆర్– సెంట్రల్ ఆగ్రోఫారెస్ట్రీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో సాయిల్ సైన్స్ సీనియర్ శాస్త్రవేత్త. పశ్చిమబెంగాల్‌లోని ఐసిఏఆర్– బిధాన్ చంద్ర కృషి విశ్వవిద్యాలయ, హైదరాబాద్‌లోని ఐసిఎంఆర్– నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్‌కు చెందిన మరో 11 మంది శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

1960వ దశకం నుంచి ఐసిఏఆర్ శాస్త్రవేత్తలు 1,199 వరి, 448 గోధుమ, 417 మొక్కజొన్న, 223 జొన్న అధిక దిగుబడినిచ్చే వంగడాలను అభివృద్ధి చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చారు. వీటిల్లో అత్యంత ప్రాచుర్యం పొందిన (50 లక్షల హెక్టార్ల కన్నా ఎక్కువగా సాగైన) వంగడాల్లో నుంచి ఒక్కో దశాబ్దానికి 2–4 రకాలను ఎంపిక చేసి ప్రత్యేకంగా పండించి మరీ అధ్యయనం చేశారు.

జయ నుంచి స్వర్ణ సబ్ 1 వరకు..

ఈ విధంగా ఎంపికచేసిన 16 వరి, 18 గోధుమ రకాలను 2018–2020 మధ్యకాలంలో మూడేళ్ల పాటు సాగు చేశారు. ఎంపికైన వరి రకాల్లో 1960ల నాటి జయ, పంకజ్, 1970ల నాటి ఐఆర్8, స్వర్ణ, రాశి, 1980ల నాటి ఐఆర్ 36, క్షితిశ్, సాంబ మసూరి, లలత్, 1990ల నాటి ఐఆర్ 64, ఖందగిరి, రంజిత్, త్రిగుణ, 2000ల నాటి నవీన్, ప్రతిక్ష్య, స్వర్ణ సబ్ 1 వున్నాయి. గోధుమ రకాల్లో 1960ల నాటి సొనాలిక నుంచి 2010లలో విడుదలైన హెచ్‌డి–3059 రకాలను ఎంపిక చేశారు. 2009లో విడుదలైన స్వర్ణ సబ్ 1 తర్వాత 5 లక్షల హెక్టార్లకు పైగా సాగైన లాండ్ మార్క్ వరి వంగడాలు లేకపోవటం వల్ల 2010లలో విడుదలైన ఏ వరి వంగడాన్నీ అధ్యయనం చేయలేదని డా. సోవన్ తెలిపారు. వరి విత్తనాలను కటక్‌లోని ఎన్‌ఆర్‌ఆర్‌ఐ నుంచి, గోధుమ విత్తనాలను కర్నల్‌లోని ఐఐడబ్ల్యుబిఆర్‌ల నుంచి సేకరించారు. వీటన్నిటినీ ఒకే రకమైన మట్టి మిశ్రమంతో కూడిన ప్రత్యేక కుండీల్లో సాగు చేశారు. అలా పండించిన తెల్ల బియ్యం, గోధుమ పిండిలో పోషకాలు ఏ స్థాయిలో ఉన్నాయో సరిపోల్చి విశ్లేషించటం ఈ అధ్యయనం లక్ష్యం.

భార ఖనిజాలు ఎలా..?

అధిక దిగుబడినిచ్చే వంగడాలతో పండించిన వరి, గోధుమల్లో గత 50 ఏళ్లలో క్రమంగా పోషకాలు 45% తగ్గిపోవటంతో పాటు వాటిల్లో అనేక భార ఖనిజాలు వంటి విషతుల్య పదార్థాల శాతం భారీగా పెరిగినట్లు ఈ అధ్యయనంలో వెల్లడైంది. బియ్యంలో ఆర్సెనిక్ (పాషాణం) వంటి భార ఖనిజం ఏకంగా 1.493 శాతం ఎలా పెరిగాయి? 'మనం అధిక దిగుబడి సాధించాం. అయితే, నాణ్యతను పోగొట్టుకున్నాం' అన్నారు కటక్‌లోని జాతీయ వరి పరిశోధనా సంస్థకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ రుబినా ఖానమ్. హానికరమైన భార ఖనిజాలను గుర్తించి వాటిని తీసుకోకుండా జాగ్రత్తపడే ప్రజ్ఞ వరి మొక్కకు సహజంగా ఉంటుంది. హానిచేసే ఆర్సెనిక్ వంటి విషపదార్థం మట్టిలో ఉన్నప్పటికీ దాన్ని గుర్తించి, ఆ పదార్థాన్ని మొక్క శిఖర భాగంలోని ధాన్యానికి చేరవేసే రవాణా యంత్రాంగం స్విచ్ఛాఫ్ అయిపోతుంది. ఇది వరి మొక్కల సహజ లక్షణం. అయితే, విషతుల్యమైన పదార్థాలను వేర్ల ద్వారా గ్రహించకుండా ఉండే సహజ రక్షక యంత్రాంగాలను అధిక దిగుబడి వంగడాలు కోల్పోయాయి. అందువల్లనే మంచి ఖనిజాలతో పాటు విషతుల్యమైన భార ఖనిజాలు కూడా ఆధునిక వంగడాలతో పండించే ధాన్యంలోకి ఇవి యథేచ్ఛగా చేరుతున్నాయన్నారు ఖానమ్. ఈ సమస్యను అధిగమించడానికి అడవుల్లో పెరిగే ధాన్యాలను కొత్త వంగడాల బ్రీడింగ్‌కు వాడుతున్నామని కటక్‌లోని జాతీయ వరి పరిశోధనా సంస్థ పంట అభివృద్ధి విభాగం అధిపతి డాక్టర్ సంఘమిత్ర సమంతరే చెబుతున్నారు.



డా. సంఘమిత్ర సమంతరే



డా. రుబీనా ఖానమ్

45% తగ్గిపోయిన పోషకాలు

మన దేశంలో ప్రజలు రోజువారీ ప్రధాన ఆహారంగా తినే వరి బియ్యం లేదా గోధుమల ద్వారానే రోజుకు అవసరమైన శక్తిలో 50%కి పైగా సమకూరుతుంది. ఈ రెండు ధాన్యాలు గత 50 ఏళ్లలో 45% పోషక విలువలను కోల్పోయినట్లు ఈ అధ్యయనంలో తేలింది. ఉదాహరణకు.. గత 50 ఏళ్లలో, వరి బియ్యంలో అత్యవసరమైన పోషకాలైన జింక్ 33%, ఇనుము 27% తగ్గిపోయాయి. గోధుమలో జింక్ 30%, ఇనుము 19% తగ్గిపోయాయి. ఈ సమస్యను ఇప్పటికైనా సరిచేయకపోతే 2040 నాటికి వరి బియ్యం, గోధుమలు తినటానికి పనికిరానంతగా పోషకాలన్నిటినీ కోల్పోతాయని డా. సోవన్ ఆందోళన వ్యక్తం చేశారు. పోషకాలు బాగా తగ్గిపోవటంతో పాటు మరింత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే.. ఈ ధాన్యాల్లో విషతుల్య పదార్థాలు చాలా పెద్ద ఎత్తున పోగుపడటం. ఆర్సెనిక్ (పాషాణం) ఏకంగా 1,493 శాతం మేరకు పెరిగిపోయింది.



డా. సోవన్ దేబ్‌నాథ్

భార ఖనిజాలతో జబ్బులు

ఈ అధ్యయనం మనకు తెలియజెప్తున్నదేమిటంటే.. రోజువారీగా ప్రధాన ఆహారంగా మనం తింటున్న తెల్ల అన్నం, గోధుమ రొట్టెల్లో పోషకాలు సగానికి తగ్గటంతో పాటు ఆరోగ్యానికి హాని చేసే భార ఖనిజాలు మెండుగా చేరాయన్న మాట. షుగర్, బీపీ, గుండె జబ్బులు, ఊబకాయం, కేన్సర్ వంటి అసాంక్రమిక వ్యాధులు పెచ్చుమీరిపోవడానికి వరి, గోధుమల్లో పోషకాలు లోపించటంతో పాటు భార ఖనిజాలు కూడా కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు తేల్చి చెప్పారు.

ఫాస్ఫరస్, కాల్షియం, సిలికాన్, వనాడియం వంటి పోషకాలు ఎముకల అభివృద్ధికి దోహదం చేస్తాయి. రోగనిరోధక శక్తి, పునరుత్పాదక శక్తికి, నరాల బలానికి జింక్ కీలకం. రక్తవృద్ధికి ఇనుము చాలా ముఖ్యం. రోజూ ఎక్కువ మొత్తంలో తినే ఆహారంలో ఈ పోషకాలు లోపిస్తే నరాల బలహీనత, సంతానలేమి, కండరాలు, ఎముకల క్షీణతకు దారి తీస్తుందని నేచర్ పత్రికలో ప్రచురితమైన వ్యాసాల్లో నిపుణులు చెబుతున్నారు.

ఆర్సెనిక్, క్రోమియం, బేరియం, స్ట్రాంటియమ్ వంటి విషతుల్య భార ఖనిజాలు ఊపిరితిత్తుల కేన్సర్లు లేదా తీవ్ర శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు, హైపర్‌కెరటోసిస్, కిడ్నీల సమస్యలు, ఎముకల్లో కాల్షియం లోపించటం వంటి జబ్బులు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. పూర్వం మాదిరిగా జొన్న తదితర చిరుధాన్యాలు తినటం తగ్గిపోవటం, వరి, గోధుమల వినియోగం బాగా పెరిగిపోవటం వల్ల ప్రజారోగ్యం ప్రమాదంలో పడిందన్నది శాస్త్రవేత్తల అభిప్రాయం. 1990–2016 మధ్యకాలంలో అసాంక్రమిక వ్యాధులు 25% పెరిగిపోయాయని భారతీయ వైద్య పరిశోధనా మండలి(ఐసిఎంఆర్) నివేదికలు చెబుతున్నాయి.

50 ఏళ్లలో వరి (తెల్ల) బియ్యం, గోధుమల్లో పోషకాల్లో హెచ్చుతగ్గులు (%)

ఖనిజం	వరి బియ్యం (1960-2000)	గోధుమలు (1960-2010)
అత్యవసర పోషకాలు:		
ఫాస్ఫరస్	-20	-13
కాల్షియం	-45	-30
సల్ఫర్	+38	+236
ఇనుము	-28	-19
జింక్	-33	-30
రాగి	-33	-35
మాంగనీసు	+51	+23
ప్రయోజనకరమైనవి:		
సిలికాన్	-42	-45
నికిల్	-68	-34
లిథియమ్	+56	-77
వనడియమ్	+2,600	-74
ప్రమాదకరమైనవి:		
బేరియం	+145	+108
స్ట్రాంటియం	+102	+57
క్రోమియం	+336	-26
లెడ్	-26	-73
ఆర్సెనిక్	+1500	-53
అల్యూమినియం	+78	+37

మూలం: ఐసిఏఆర్, ఐసిఎంఆర్ శాస్త్రవేత్తల తాజా అధ్యయనం

పోషక లోపం ఎలా..?

సాధారణంగా పంట మొక్కలు 14 పోషకాలను నేల నుంచి వేర్ల ద్వారా, మరో 3 పోషకాలను వాతావరణం నుంచి పంట మొక్కలు గ్రహిస్తాయని ఎఫ్.ఎ.ఓ. చెబుతోంది. పంట మొక్కలు అంతకు ముందుకన్నా తక్కువ ఎత్తు పెరిగేలా చేసి, ఆ క్రమంలో మిగిలే పోషకాలను.. అధికంగా ధాన్యం ఉత్పత్తికి ఉపయోగపడేలా శాస్త్రవేత్తలు మేలైన వరి, గోధుమలతోపాటు జొన్న తదితర పంటల మేలైన వంగడాలను అభివృద్ధి చేస్తుంటారు. ఈ విధంగానే మన దేశంలో కేవలం పదేళ్లలో వరి, గోధుమల ఉత్పత్తి 21% పెరిగింది. అయితే, ఈ వంగడాలు రూపొందించే క్రమంలో కొత్త వంగడాల్లో పోషకాల సాంద్రత, పొందిక ఎలా ఉందన్న అంశంపై దృష్టి కేంద్రీకరించ లేదు. 'అధిక దిగుబడినివ్వటంతో పాటు.. అన్ని రకాల పోషకాలను గ్రహించే జన్యు లక్షణాలు ఈ కొత్త వంగడాల్లో ఉంటున్నాయా లేదా అన్నదానిపై పరిశీలన లోపించింది. ఫలితంగా వరి బియ్యం, గోధుమల్లో ఆహార విలువ (ఫుడ్ వాల్యూ) తగ్గిపోయింది. ముఖ్యంగా మొత్తంగా ఖనిజాల వాటా (ఐనోమ్) తగ్గిపోయింది' అని బిధాన్ చంద్ర కృషి విశ్వవిద్యాలయానికి చెందిన సాయిల్ సైంటిస్ట్, ఈ అధ్యయనం సహ రచయిత డాక్టర్ బిస్వపతి మండల్ వివరించారు. 1980వ దశకం వరకు అధిక దిగుబడి ఒక్కటే బ్రీడింగ్ లక్ష్యంగా సాగింది. ఆ దశలో అధిక దిగుబడితో పాటు చీడపీడలను తట్టుకునే వంగడాలను, చౌడును, నీటి ఎద్దడిని తట్టుకునే వంగడాలపై బ్రీడర్లు దృష్టి సారించారు. ధాన్యాల్లో పోషకాలను పెంపొందించే అంశంపై దృష్టి కేంద్రీకరించే వెసులుబాటు అప్పుడు కూడా లేకపోయిందని డా. మండల్ 'డౌన్ టు ఎర్త్'తో చెప్పారు.

బయోఫోర్టిఫైడ్ వంగడాలతో సమస్య తీరేనా?

ధాన్యాల్లో పోషకాల లేమిని అధిగమించేందుకు ఐరన్, జింక్ వంటి పోషకాలు అధికంగా ఉండే బయోఫోర్టిఫైడ్ వంగడాలను రూపొందించటంపై ఐసిఏఆర్ పదేళ్ల క్రితం నుంచే పని ప్రారంభించింది. ఇప్పటికి 142 బయోఫోర్టిఫైడ్ వంగడాలను రూపొందించింది. ఇందులో 124 ధాన్యపు పంటలు. వీటిలో 10 వరి, 43 గోధుమ, 20 మొక్కజొన్న, 13 రకాల కొర్ర వంటి చిన్న చిరుధాన్యాలు, 11 సజ్జ రకాలు ఉన్నాయి. వీటి ద్వారా పోషకాల లోపాన్ని కొంత మేరకు అధిగమించవచ్చన్నది శాస్త్రవేత్తల మాట. దేశవ్యాప్తంగా 6% సాగు భూమిలో ఈ వంగడాలు సాగవుతున్నాయని ప్రభుత్వం చెబుతోంది.



డా. బిస్వపతి మండల్

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



రన్నరప్ అనిరుధ్ జోడీ

ఫ్రాన్స్‌లో జరిగిన క్వింపెర్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన అనిరుధ్ చంద్రశేఖర్ పురుషుల డబుల్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచాడు. ఫైనల్లో అనిరుధ్–విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) జోడీ 6–7 (4/7), 3–6తో గినార్డ్–రిండెరెనెచ్ (ఫ్రాన్స్) ద్వయం చేతిలో ఓడిపోయింది. గతవారం ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో అనిరుధ్–విజయ్ జంట 'వైల్డ్ కార్డు'తో మెయిన్ 'డ్రా'లో పోటీపడి తొలి రౌండ్‌లో నిష్క్రమించింది.



సోనమ్ మస్కర్‌కు రజత పతకం

ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు ఐదో పతకం లభించింది. కైరోలో జరుగుతున్న ఈ టోర్నీలో మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో సోనమ్ మస్కర్ రజత పతకం సాధించింది. మహారాష్ట్రకు చెందిన 21 ఏళ్ల సోనమ్‌కు ఇదే తొలి ప్రపంచకప్ టోర్నీ కావడం విశేషం. ఎనిమిది మంది షూటర్లు పోటీపడ్డ ఫైనల్లో సోనమ్ 252.1 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. అనా జాన్సెన్ (జర్మనీ: 253 పాయింట్లు) స్వర్ణం, అనెటా స్టాన్‌కివిజ్ (పోలాండ్: 230.4 పాయింట్లు) కాంస్యం గెలిచారు.

నంబర్‌వన్ బోపన్న



- ఏటీపీ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో తొలిసారి 'టాప్' ర్యాంక్‌లో భారత టెన్నిస్ స్టార్
- ఈ ఘనత సాధించిన అతిపెద్ద వయస్కుడిగా ప్రపంచ రికార్డు

లండన్: సుదీర్ఘ నిరీక్షణ ముగిసింది. అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) పురుషుల డబుల్స్ ర్యాంకింగ్స్‌లో 21 ఏళ్ల తర్వాత మళ్లీ భారత ప్లేయర్ నంబర్‌వన్ ర్యాంక్‌ను అధిరోహించాడు. సోమవారం విడుదల చేసిన అధికారిక తాజా ర్యాంకింగ్స్‌లో రోహన్ బోపన్న రెండు స్థానాలు ఎగబాకి తన కెరీర్‌లో తొలిసారి టాప్ ర్యాంక్‌లో నిలిచి చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. టెన్నిస్ చరిత్రలోనే నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్న అతిపెద్ద వయస్కుడిగా బోపన్న (43 ఏళ్ల 330 రోజులు) ప్రపంచ రికార్డు సృష్టించాడు. అమెరికా దిగ్గజం మైక్ బ్రయాన్ (41 ఏళ్ల 76 రోజులు; 2019లో) పేరిట ఉన్న రికార్డును అతను బద్దలు కొట్టాడు. గత శనివారం ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీలో బోపన్న ఆస్ట్రేలియాకు చెందిన మాథ్యూ ఎబ్డెన్‌తో కలిసి పురుషుల డబుల్స్ విభాగంలో టైటిల్ నెగ్గి తన కెరీర్‌లో పురుషుల డబుల్స్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ప్రస్తుత ర్యాంకింగ్స్‌లో బోపన్న, ఎబ్డెన్ 8,450 పాయింట్లతో సమంగా ఉన్నప్పటికీ తక్కువ టోర్నీలు ఆడినందుకు బోపన్నకు టాప్ ర్యాంక్ ఖరారు కాగా, ఎబ్డెన్ రెండో ర్యాంక్‌లో నిలిచాడు. చివరిసారి భారత్ నుంచి లియాండర్ పేస్ 2000 మార్చి 13న ... మహేశ్ భూపతి 1999 జూన్ 14న ఏటీపీ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా నిలిచారు. బెంగళూరుకు చెందిన బోపన్న 2003లో ప్రొఫెషనల్‌గా మారాడు. తన 21 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో బోపన్న ఇప్పటిదాకా పురుషుల డబుల్స్‌లో 19 మంది వేర్వేరు భాగస్వాములతో ఆడి 25 టైటిల్స్ సాధించడంతోపాటు 504 మ్యాచ్‌ల్లో గెలుపొందాడు. 2016లో బెంగళూరులో తన పేరిట టెన్నిస్ అకాడమీని స్థాపించి కుర్రాళ్లకు శిక్షణ ఇస్తున్నాడు.


జడేజా
రాహుల్

భారత్‌కు సంకటం!

గాయాలతో రెండో టెస్టుకు దూరమైన కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా

టీమిండియాలోకి సర్ఫరాజ్, సౌరభ్ కుమార్, వాషింగ్టన్ సుందర్


సర్ఫరాజ్
సౌరభ్

హైదరాబాద్: సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో తొలి టెస్టులో ఎదురైన పరాజయం నుంచి కోలుకోకముందే... భారత్‌కు ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. తాజాగా సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, బ్యాటర్ కేఎల్ రాహుల్ గాయాలతో రెండో టెస్టుకు దూరమయ్యారు. ఇప్పటికే తొలి రెండు టెస్టుల నుంచి సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లి విశ్రాంతి తీసుకుంటున్నాడు. తాజాగా కీలకమైన ఇద్దరు ఆటగాళ్లు కూడా రెండో టెస్టుకు దూరమవడం జట్టుకు ప్రతికూలంగా పరిణమించనుంది. అయితే దేశవాళీ క్రికెట్లో నిలకడగా రాణిస్తున్న, ఐపీఎల్‌లో అడపాదడపా మెరిపిస్తున్న ముంబై బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌కు ఎట్టకేలకు టీమిండియాలో చోటు దక్కింది. రెండో టెస్టు కోసం కొత్తగా సర్ఫరాజ్ ఖాన్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన లెఫ్టార్మ్ స్పిన్ ఆల్‌రౌండర్ సౌరభ్ కుమార్‌లను తీసుకోగా... తమిళనాడు ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను కూడా ఈ మ్యాచ్ కోసం ఎంపిక చేశారు. ఆదివారం నాలుగోరోజు ఆటలో పరుగు తీసే ప్రయత్నంలో జడేజా తొడ కండరాలు పట్టేయడంతో తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. ఈ మ్యాచ్‌లో కేవలం పూర్తిస్థాయిలో బ్యాటింగ్ పాత్ర పోషించిన కేఎల్ రాహుల్ కుడి తొడ కండరాల గాయంతో బాధపడుతున్నాడు. గత ఐపీఎల్‌లో కూడా రాహుల్ ఇదే విధమైన గాయంతో నాలుగు నెలలు ఆటకు దూరమయ్యాడు. 'గాయపడిన జడేజా, రాహుల్ ఇద్దరు వచ్చే నెల 2 నుంచి విశాఖపట్నంలో జరిగే రెండో టెస్టులో పాల్గొనడం లేదు. బోర్డు మెడికల్ టీమ్ ఇద్దరి పరిస్థితిని సమీక్షిస్తోంది' అని బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది.

సర్ఫరాజ్ గుర్తున్న క్రికెటరే కానీ..!

ముంబై క్రికెటర్ సర్ఫరాజ్ భారత సీనియర్ జట్టుకు కొత్త ముఖమై ఉండొచ్చు కానీ... క్రికెట్ అభిమానులకు తెలియని పేరేమీ కాదు. ఎందుకంటే ఐపీఎల్‌లో కోహ్లి సారథ్యంలోని రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) తరఫున మెరిపించాడు. అతని మెరుపులకు ఒకానొక సందర్భంలో ఫిదా అయిన కోహ్లి... సర్ఫరాజ్ అవుటై పెవిలియన్‌కు చేరుతుంటే రెండు చేతులు జోడించి మరీ జేజేలు పలికాడు. సర్ఫరాజ్ రెండు ఐసీసీ అండర్–19 ప్రపంచకప్ (2014, 2016)లలో ఆడాడు. భారత్ 'ఎ' జట్టు తరఫున బరిలోకి దిగాడు. రంజీల్లోనూ నిలకడగా పరుగులు సాధిస్తున్నాడు. అయితే ఇదంతా కూడా అతని ఆటతీరుకు నిదర్శనమైతే... నోటిదురుసుతో సెలక్షన్ కమిటీ పరిశీలనకు అతని పేరు అదేపనిగా దూరమైంది. గత పదేళ్లుగా దేశవాళీ క్రికెట్‌లో ఆడుతున్న 30 ఏళ్ల సౌరభ్ ఇప్పటి వరకు 68 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడి 2061 పరుగులు సాధించడంతోపాటు 290 వికెట్లు పడగొట్టాడు.

బుమ్రాకు మందలింపు



దుబాయ్: భారత స్టార్ బౌలర్ బుమ్రాకు ఒక డీ మెరిట్ పాయింట్ శిక్షగా విధించారు. హైదరాబాద్‌లో జరిగిన తొలి టెస్టులో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ ఆడుతుండగా ఒలీ పోప్ పరుగు తీస్తుంటే... పేసర్ బుమ్రా ఉద్దేశపూర్వకంగా అడ్డు తగిలాడు. దీన్ని పరిశీలించిన మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్‌సన్ అతను ఐసీసీ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లు తేల్చారు. అయితే గత 24 నెలల కాలంలో ఇది బుమ్రా చేసిన తొలి తప్పిదం కావడంతో మందలించి ఒక డి మెరిట్ పాయింట్‌ను శిక్షగా విధించారు. బుమ్రా తన తప్పును అంగీకరించడంతో తదుపరి విచారణ అవసరం లేదని రిఫరీ నిర్ణయించారు.

ఆంధ్ర ఘనవిజయం

రాణించిన ప్రశాంత్, నితీశ్ కుమార్


ప్రశాంత్

రాయ్‌పూర్: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. ఛత్తీస్‌గఢ్ జట్టుతో సోమవారం ముగిసిన ఎలైట్ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో రికీ భుయ్ కెప్టెన్సీలోని ఆంధ్ర జట్టు 126 పరుగుల తేడాతో గెలిచింది. ఆట చివరిరోజు ఆంధ్ర తమ రెండో ఇన్నింగ్స్‌ను ఓవర్‌నైట్ స్కోరు 150/2 వద్దే డిక్లేర్ చేసి ఛత్తీస్‌గఢ్‌కు 320 పరుగుల విజయలక్ష్యాన్ని నిర్దేశించింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఛత్తీస్‌గఢ్ జట్టు 59.4 ఓవర్లలో 193 పరుగులవద్ద ఆలౌటై ఓడిపోయింది. ఆంధ్ర జట్టు ఓపెనర్ ప్రశాంత్ కుమార్ (3/21) బంతితోనూ మెరిశాడు. ప్రశాంత్‌కు నితీశ్ కుమార్ రెడ్డి (3/36), పృథ్వీరాజ్ (2/40) సహకరించడంతో ఆంధ్ర జట్టుకు గెలుపు దక్కింది. 36 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన ఛత్తీస్‌గఢ్ జట్టును ఏక్‌నాథ్ కేర్కర్ (76; 8 ఫోర్లు), కెప్టెన్ అమన్‌దీప్ ఖరే (67; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆదుకున్నారు. వీరిద్దరు అర్ధ సెంచరీలు చేసి నాలుగో వికెట్‌కు 94 పరుగులు జోడించారు. క్రీజులో కుదురుకున్న ఈ జోడీని ప్రశాంత్ విడగొట్టాడు. అమన్‌దీప్‌ను ప్రశాంత్ బౌల్డ్ చేయడంతో ఛత్తీస్‌గఢ్ మళ్లీ కష్టాల్లో పడింది. ఏక్‌నాథ్‌ను కూడా ప్రశాంతే అవుట్ చేయడంతో ఆంధ్ర విజయం దిశగా సాగింది. ఎనిమిది జట్లున్న గ్రూప్ 'బి'లో నాలుగు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న ఆంధ్ర 15 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. ఫిబ్రవరి 2 నుంచి జరిగే తమ ఐదో లీగ్ మ్యాచ్‌లో బిహార్‌తో ఆంధ్ర తలపడుతుంది. బెంగాల్‌తో తొలి మ్యాచ్‌ను 'డ్రా' చేసుకున్న ఆంధ్ర... రెండో మ్యాచ్‌లో ముంబై చేతిలో పది వికెట్ల తేడాతో ఓడిపోయి, మూడో మ్యాచ్‌లో అస్సాంపై పది వికెట్ల తేడాతో నెగ్గింది.

క్వార్టర్ ఫైనల్లో భారత్


మణీందర్

మస్కట్: పురుషుల హాకీ 'ఫైవ్–ఎ–సైడ్' ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో భారత జట్టు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. జమైకాతో జరిగిన పూల్ 'బి' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 13–0 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున మణీందర్ సింగ్ (28వ, 29వ ని.లో), మంజీత్ (5వ, 24వ ని.లో), రహీల్ మొహమ్మద్ (16వ, 27వ ని.లో), మన్‌దీప్ మోర్ (23వ, 27వ ని.లో) రెండు గోల్స్ చొప్పున చేశారు. ఉత్తమ్ సింగ్ (5వ ని.లో), రాజ్‌భర్ పవన్ (9వ ని.లో), గుర్జోత్ సింగ్ (14వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. పూల్ 'బి'లో ఆరు పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన భారత జట్టు నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో నెదర్లాండ్స్‌తో తలపడుతుంది.

పట్నా పైరేట్స్‌కు ఎనిమిదో గెలుపు

పట్నా: ప్రో కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో సొంతగడ్డపై పట్నా పైరేట్స్ జట్టు అదరగొట్టింది. గుజరాత్ జెయింట్స్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ జట్టు 32–20 పాయింట్ల తేడాతో నెగ్గింది. ఈ టోర్నీలో పైరేట్స్‌కిది ఎనిమిదో విజయం కావడం విశేషం. పట్నా తరఫున సందీప్ (7 పాయింట్లు), అంకిత్ (6 పాయింట్లు) రాణించారు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 41–36తో బెంగాల్ వారియర్స్‌ను ఓడించింది. హరియాణా తరఫున శివమ్ 12 పాయింట్లు, సిద్ధార్థ్ 11 పాయింట్లు, వినయ్ 6 పాయింట్లు స్కోరు చేశారు.



పాయింట్ల పట్టిక PKL

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
జైపూర్ పింక్ పాంథర్స్	16	11	2	3	66
పుణేరి పల్టన్	15	11	2	2	63
దబంగ్ ఢిల్లీ	16	10	4	2	59
పట్నా పైరేట్స్	17	8	7	2	50
హరియాణా స్టీలర్స్	16	9	6	1	50
గుజరాత్ జెయింట్స్	16	9	7	0	49
తమిళ్ తలైవాస్	16	7	9	0	40
యు ముంబా	16	6	8	2	40
బెంగళూరు బుల్స్	16	6	9	1	40
బెంగాల్ వారియర్స్	16	6	8	2	39
యూపీ యోధాస్	16	3	12	1	23
తెలుగు టైటాన్స్	16	2	14	0	16

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు

సినిమా

సరికొత్త ప్రపంచంలోకి...


చిరంజీవి

చిరంజీవి ప్రస్తుతం ఫుల్ జోష్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఇందుకు కారణం.. కేంద్ర ప్రభుత్వం ఆయనకు ప్రతిష్ఠాత్మక పద్మ విభూషణ్ అవార్డు ప్రకటించడమే. ఇదే జోష్‌లో రెట్టించిన ఉత్సాహంతో తన తాజా చిత్రం 'విశ్వంభర' షూటింగ్‌లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు చిరంజీవి. ఆయన హీరోగా 'బింబిసార' ఫేమ్ డైరెక్టర్ వశిష్ఠ తెరకెక్కిస్తున్న చిత్రం 'విశ్వంభర'. యూవీ క్రియేషన్స్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఓ షెడ్యూల్ పూర్తి చేసుకున్న ఈ సినిమా తర్వాతి షెడ్యూల్ హైదరాబాద్‌లో ఆరంభం కానుంది. ఫ్యాంటసీ అడ్వెంచర్‌గా రూపొందుతోన్న ఈ మూవీ కోసం ప్రత్యేకంగా హైదరాబాద్‌లో భారీ ఖర్చుతో ఓ సెట్ ఏర్పాటు చేస్తున్నారట మేకర్స్. ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఈ సెట్ ఉంటుందని, అందుకోసం నిర్మాతలు కూడా భారీగా వెచ్చిస్తున్నారనీ తెలుస్తోంది. ఫిబ్రవరి తొలి వారం నుంచి ఈ సెట్‌లో జరిగే షూటింగ్‌లో చిరంజీవి పాల్గొంటారని ఫిల్మ్‌నగర్ టాక్. చిరంజీవితో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను ఈ సెట్‌లో చిత్రీకరించనున్నారని భోగట్టా. భీమవరం నేపథ్యంలో సాగే ఈ సినిమాలో భీమవరం దొరబాబు పాత్రలో చిరంజీవి కనిపించనున్నారని సమాచారం. దొరబాబు పాత్ర నవ్వుల్ని పంచుతూనే ప్రేక్షకులను మరో కొత్త ఊహా ప్రపంచానికి తీసుకెళుతుందని తెలుస్తోంది. 2025 సంక్రాంతికి ఈ చిత్రం రిలీజ్ కానుంది.

పుష్ప కౌంట్‌డౌన్ ఆరంభం


అల్లు అర్జున్

పుష్పరాజ్ కౌంట్‌డౌన్ మొదలైంది. 200 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా పుష్ప రూల్ ఆరంభం కానుందని ప్రకటించారు మేకర్స్. అల్లు అర్జున్, రష్మికా మందన్నా జంటగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పుష్ప: ది రైజ్'. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం 2021 డిసెంబరు 17న విడుదలై ప్రపంచవ్యాప్తంగా ఎంతటి సంచలన విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ చిత్రంలో తన నటనకుగానూ ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డును కూడా అందుకున్నారు అల్లు అర్జున్. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'పుష్ప: ద రూల్' తెరకెక్కుతోంది. ఇందులోనూ అల్లు అర్జున్, రష్మికా మందన్నా జంటగా నటిస్తున్నారు. సుకుమార్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు 15న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు చిత్రయూనిట్ ఇటీవల స్పష్టం చేసింది. సోమవారం మరో 200 రోజుల్లో పుష్ప రూల్ బిగిన్ కాబోతోందంటూ, 2024 ఆగస్టు 15న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు విడుదల తేదీని మరోసారి స్పష్టం చేశారు. ఫాహద్ ఫాజిల్, ధనుంజయ్, సునీల్, అనసూయ భరద్వాజ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మిరోస్లా క్యూబా బ్రోజెక్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

శివరాత్రికి భీమా


గోపీచంద్

గోపీచంద్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'భీమా' విడుదల తేదీ ఖరారైంది. మార్చి 8న ఈ సినిమాని విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రం ద్వారా ప్రముఖ కన్నడ దర్శకుడు ఎ. హర్ష తెలుగుకి పరిచయమవుతున్నారు. ఈ మూవీలో ప్రియా భవానీ శంకర్, మాళవికా శర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. శ్రీ సత్య సాయి ఆర్ట్స్ పై కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించి, గోపీచంద్ సరికొత్త పోస్టర్‌ని రిలీజ్ చేసింది యూనిట్. ''యునిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'భీమా'. ఇందులో గోపీచంద్ క్రూరమైన పోలీసు అధికారిగా కనిపిస్తారు'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: స్వామి జె. గౌడ, సంగీతం: రవి బస్రూర్.

ప్రేమిస్తే తర్వాత అలాంటి అనుభూతి కలిగింది

''ప్రేమిస్తే' అనే డబ్బింగ్ మూవీతో నా కెరీర్ ఆరంభమైంది. 'ప్రేమిస్తే' చూసి బాగుందనిపించి రిలీజ్ చేసి, హిట్ సాధించాం. ఇన్నాళ్లకు 'ట్రూ లవర్' చిత్రం చూడగానే మళ్లీ అలాంటి అనుభూతి కలిగింది. ఈ సినిమాను ప్రేమలో ఉన్నవాళ్లు, లేనివాళ్లు, ప్రేమలో పడాలనుకుంటున్న వాళ్లు.. ఇలా అందరూ చూడొచ్చు'' అని డైరెక్టర్ మారుతి అన్నారు. – **మారుతి**

మణికందన్, శ్రీ గౌరీప్రియ, కన్న రవి ప్రధాన పాత్రల్లో ప్రభురామ్ వ్యాస్ దర్శకత్వం వహించిన చిత్రం 'ట్రూ లవర్'. నజేరత్ పసీలియన్, మగేష్ రాజ్ పసీలియన్, యువరాజ్ గణేశన్ నిర్మించిన


మణికందన్, శ్రీ గౌరీప్రియ, మారుతి, ఎస్‌కేఎన్

ఈ చిత్రం ఫిబ్రవరి 9న విడుదలవుతోంది. ఈ చిత్రాన్ని నిర్మాత ఎస్‌కేఎన్ సమర్పణలో దర్శకుడు మారుతి విడుదల చేస్తున్నారు. సోమవారం ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. ప్రభురామ్ వ్యాస్ మాట్లాడుతూ– ''ప్రేమికుల మధ్య ఉంటున్న మోడ్రన్ డే రిలేషన్స్ నేపథ్యంలో 'ట్రూ లవర్' ఉంటుంది'' అన్నారు. ''ఫిబ్రవరి 9న వస్తున్న పెద్ద సినిమాలతో మేము పోటీలో లేము. 'ట్రూ లవర్' చిన్న క్యూట్ సినిమా.. మా సినిమాని విడుదల చేస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదని భావిస్తున్నాం'' అన్నారు ఎస్‌కేఎన్. ''మా సినిమాలోని భావోద్వేగాలు ప్రేక్షకులకు కనెక్ట్ అవుతాయని ఆశిస్తున్నాం'' అన్నారు మణికందన్.

పదకొండేళ్ల క్రితమే పాన్ ఇండియా స్టార్‌ని!


శ్రుతీహాసన్

''నేను కెరీర్ ఆరంభించినప్పుడు (2009లో హిందీ చిత్రం 'లక్'తో హీరోయిన్‌గా పరిచయం అయ్యారు) సోషల్ మీడియా లేదు.. ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ లేవు. ఒకవేళ ఉండి ఉంటే నటిగా నేను చేసినవి ఇంకా ఎక్కువమంది ప్రేక్షకులు చూసి ఉండేవారు. అయినప్పటికీ కెరీర్ విషయంలో, నా అప్పటి దశ పరంగా నేను హ్యాపీగా ఉన్నాను'' అని శ్రుతీహాసన్ అన్నారు. ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పాన్ ఇండియా ఫిల్మ్స్ గురించిన ప్రశ్న శ్రుతీకి ఎదురైంది. ఆ విషయం గురించి శ్రుతీహాసన్ మాట్లాడుతూ – ''పదకొండేళ్ల క్రితమే నేను పాన్ ఇండియా స్టార్‌ని. అప్పట్లో నేను ఇచ్చిన ఇంటర్వ్యూలు చూస్తే పాన్ ఇండియా అనే పదాన్ని నేను అప్పుడే వాడాను. నాకు పాన్ ఇండియా ఫీవర్ లేదు. అయితే అన్ని రకాల భాషల్లో సినిమాలు చేశాను. ఇప్పుడు పాన్ ఇండియా అంటూ పోటీలో ఉన్న మేల్, ఫీమేల్ యాక్టర్లతో నన్ను నేను పోల్చుకోను. ఎందుకంటే కొన్నేళ్ల క్రితమే నేను పాన్ ఇండియా సినిమాలు చేసేశాను. కెరీర్ పరంగా నా విధానాన్ని నేను ఫాలో అయ్యాను. నన్ను ఎవరితోనైనా పోల్చితే నచ్చదు'' అన్నారు. ఇక ప్రస్తుతం శ్రుతీహాసన్ చేస్తున్న సినిమాల విషయానికి వస్తే... అడివి శేష్‌తో 'డెకాయిట్' అనే సినిమాలో నటిస్తున్నారు. ఆమె నటించనున్న ఇంగ్లిష్ మూవీ 'చెన్నై స్టోరీస్' షూటింగ్ ఆరంభం కావాల్సి ఉంది.

చల్ చల్ గుర్రం


సమంత


గుర్రపు స్వారీ చేస్తూ...

చల్ చల్ గుర్రం.. చలాకీ గుర్రం అంటూ గుర్రపు స్వారీ చేస్తున్నారు హీరోయిన్ సమంత. మయోసైటిస్ చికిత్సలో భాగంగా ఏడాది పాటు ఆమె సినిమాలకు విరామం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఎప్పటికప్పుడు తన ఫొటోలు, వీడియోలను షేర్ చేస్తూ అభిమానులకు దగ్గరగా ఉంటారామె. తాజాగా గుర్రపు స్వారీ చేస్తున్న ఓ వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయగా వైరల్‌గా మారింది. తన కెరీర్‌లో భాగంగానే ఆమె గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకుంటున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే క్యాప్షన్‌లో ఆమె హీలింగ్ అనే పదం కూడా వాడటంతో మయోసైటిస్ వ్యాధి నివారణ చికిత్సలో భాగంగా ఈ స్వారీ చేస్తున్నారేమో అంటున్నారు నెటిజన్లు. కాగా సమంత నటించిన 'సిటాడెల్' వెబ్ సిరీస్ విడుదలకి సిద్ధంగా ఉంది.

ప్రేమ.. వినోదం...


వైశాలీ రాజ్, అభినవ్

''ఈ నగరానికి ఏమైంది, మీకు మాత్రమే చెబుతా, సేవ్ టైగర్' వంటి పలు చిత్రాల్లో హాస్యనటుడిగా నటించిన అభినవ్ గోమఠం హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా!'. 'ఈ నగరానికి ఏమైంది' చిత్రంలో అభినవ్ పాపులర్ డైలాగ్ 'మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా' పేరుతోనే ఈ సినిమా రూపొందుతోంది. తిరుపతి రావు ఇండ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో వైశాలీ రాజ్ హీరోయిన్. కాసుల క్రియేటివ్ వర్క్స్‌పై భవానీ కాసుల, ఆరెమ్ రెడ్డి, ప్రశాంత్.వి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 23న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించి, ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. తిరుపతి రావు ఇండ్ల మాట్లాడుతూ– ''లవ్, కామెడీ... ఇలా అన్ని భావోద్వేగాలతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. అభినవ్‌లోని కొత్త కోణాన్ని, తన నటనలోని మరో కోణాన్ని ఈ చిత్రంలో చూస్తారు. కొత్తదనంతో కూడిన ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
1,241	385
71,942	21,738

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	15,525	▲	70
డోజోన్స్	38,117	▲	8
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,633	▽	2
డాక్స్	16,942	▲	20
షాంఘై	2,883	▽	27
నికాయ్	36,027	▲	276

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,515
బంగారం (99.5 స్వచ్ఛత)	62,265
వెండి (కిలో)	71,371

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.74	83.76
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.45	107.00
€	యూరో	ఎస్‌బీఐ	89.10	91.46
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.56	56.81
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.89	55.81
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.19	62.63
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.21	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.74	23.54
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.46	12.53

మూడేళ్లలో 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ

భారత్ పురోగతిపై ఆర్థికశాఖ నివేదిక



న్యూఢిల్లీ: భారత్ వచ్చే మూడేళ్లలో 5 ట్రిలియన్ డాలర్ల స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)తో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని ఆర్థికశాఖ 2024 జనవరి సమీక్షా నివేదిక పేర్కొంది. నిరంతర సంస్కరణల నేపథ్యంలో 2030 నాటికి 7 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. పది సంవత్సరాల క్రితం భారత్ ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం 1.9 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో ప్రపంచంలో 10వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందని వివరించింది. ఈ అంకెలు ప్రస్తుతం 3.7 ట్రిలియన్ డాలర్లకు చేరి (2023–24 ఆర్థిక సంవత్సరం అంచనాల ప్రకారం) దేశం ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని పేర్కొన్నారు. మహమ్మారి సవాళ్లు, తీవ్ర ఒడిదుడుకులు ఉన్నప్పటికీ దేశం ఈ ఘనత సాధించిందని పేర్కొంది. ప్రస్తుత ప్రభుత్వం 2047 నాటికి 'అభివృద్ధి చెందిన దేశ'గా మారాలనే ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుందని వివరించింది. సంస్కరణల ప్రయాణం కొనసాగడంతో ఈ లక్ష్యం నెరవేరుతుందన్న భరోసాను వెలిబుచ్చింది. సమగ్ర సంస్కరణలతో జిల్లా, బ్లాక్, గ్రామ స్థాయిలలో పాలనాపరమైన మార్పులు తీసుకువచ్చినప్పుడు దేశాభివృద్ధిలో రాష్ట్రాల భాగస్వామ్యం సంపూర్ణంగా ఉంటుందని నివేదిక వివరించింది. దేశీయ డిమాండ్ పటిష్టతతో ఎకానమీ గత మూడేళ్లలో 7 శాతం వృద్ధిని సాధించిందని, 2024–25లో కూడా 7 శాతం స్థాయికి వృద్ధి చేరే అవకాశం ఉందని నివేదిక అంచనావేసింది. 25.5 ట్రిలియన్ డాలర్లతో అమెరికా ప్రస్తుతం ప్రపంచంలో అతిపెద్ద ఎకనామగా కొనసాగుతోంది. ప్రపంచం మొత్తం జీడీపీలో పావుశాతం వాటాను కలిగి ఉంది. ఇక 17.9 శాతం ప్రపంచ జీడీపీ వాటాతో 18 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా చైనా రెండవ స్థానంలో ఉంది. తరువాతి స్థానాల్లో జపాన్ (4.2 ట్రిలియన్ డాలర్లు), జర్మనీ (4 ట్రిలియన్ డాలర్లు)లు ఉన్నాయి.

మౌలిక రంగం అద్భుతం



కేంద్ర ప్రభుత్వం మునుపెన్నడూలేనట్లు అపూర్వమైన స్థాయిలో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసింది. 2014–15లో ప్రభుత్వ రంగ మూలధన పెట్టుబడి 5.6 లక్షల కోట్లు ఉంటే 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఈ పరిమాణం 18.6 లక్షల కోట్ల రూపాయలకు పెరిగింది.

– వి. అనంత నాగేశ్వరన్, చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్

ఎకానమీ... లుకింగ్ లైక్ ఏ వావ్



వైరల్ మీమ్.. జస్ట్ లుకింగ్ లైక్ ఏ వావ్... భారత ఆర్థిక వ్యవస్థ శక్తిని, ఎకానమీ ప్రస్తుత చెక్కుచెదరని స్వభావాన్ని ప్రతిధ్వనిస్తుంది. ప్రపంచంలోని అగ్ర దేశాలు నిరాశావాదంలో మునిగిపోయినప్పటికీ, భారతదేశం తిరుగులేని ఆశావాదంతో ముందుకు సాగుతోంది. ఈ విజయానికి కారణం ప్రభుత్వమే.

– కార్పొరేట్ దిగ్గజం కుమార మంగళం బిర్లా

ఐటీసీ లాభం రూ. 5,401 కోట్లు



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం ఐటీసీ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 6 శాతంపైగా వృద్ధితో రూ. 5,401 కోట్లను తాకింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో రూ. 5,070 కోట్లు ఆర్జించింది. సిగరెట్లుసహా ఎఫ్ఎంసీజీ బిజినెస్ లాభాలకు దన్నునిచ్చింది. వాటాదారులకు షేరుకి రూ. 6.25 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఇందుకు ఫిబ్రవరి 8 రికార్డ్ డేట్‌గా ప్రకటించింది. కాగా.. నాన్‌ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అతుల్ సింగ్, స్వతంత్ర డైరెక్టర్‌గా పుష్ప సుబ్రహ్మణ్యంను బోర్డు ఎంపిక చేసినట్లు ఐటీసీ పేర్కొంది. 2024 ఏప్రిల్ 2 నుంచి ఐదేళ్లపాటు బాధ్యతలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది.

ఆదాయం అప్

ప్రస్తుత సమీక్షా కాలంలో ఐటీసీ స్థూల ఆదాయం 2 శాతం పుంజుకుని రూ. 19,338 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 18,902 కోట్ల టర్నోవర్ నమోదైంది. కాగా.. మొత్తం కార్యకలాపాల టర్నోవర్ రూ. 19,484 కోట్లుగా నమోదైంది. ఆదాయంలో సిగరెట్లతోపాటు ఎఫ్ఎంసీజీ బిజినెస్ నుంచి 4.5 శాతం అధికంగా రూ. 13,513 కోట్లు లభించగా.. సిగరెట్ల నుంచి 3 శాతం వృద్ధితో రూ. 8,295 కోట్లు సమకూర్చుకుంది. ఎఫ్ఎంసీజీలో ఇతర విభాగాలు 8 శాతం ఎగసి రూ. 5,218 కోట్ల టర్నోవర్‌ను సాధించాయి. ఐటీసీ హోటళ్ల నుంచి 18 శాతం అధికంగా రూ. 872 కోట్ల ఆదాయం లభించింది.

ఫలితాల నేపథ్యంలో ఐటీసీ షేరు 1.5 శాతం నష్టంతో రూ. 449 వద్ద ముగిసింది.

బీపీసీఎల్ లాభం హైజంప్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఇంధన దిగ్గజం భారత్ పెట్రోలియం కార్పొరేషన్(బీపీసీఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 82 శాతం జంప్‌చేసి రూ. 3,181 కోట్లను దాటింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో రూ. 1,747 కోట్లు ఆర్జించింది. అంచనాలకు మించిన రిఫైనింగ్, మార్కెటింగ్ మార్జిన్లు భారీ లాభాలకు దోహదం చేశాయి. అయితే ఈ ఏడాది క్యూ2(జూలై–సెప్టెంబర్)లో మరింత అధికంగా రూ. 8,244 కోట్ల నికర లాభం ఆర్జించిన సంగతి తెలిసిందే. ముడిచమురు ధరలు తగ్గినప్పటికీ గత 21 నెలలుగా ఇంధన ధరల సవరణను నిలిపివేయడంతో మార్కెటింగ్ మార్జిన్లు మెరుగుపడినట్లు కంపెనీ పేర్కొంది.

ఆదాయం ఫ్లాట్

ప్రస్తుత సమీక్షా కాలంలో బ్యారల్‌కు 13.3 డాలర్ల చొప్పున స్థూల రిఫైనింగ్ మార్జిన్ల(జీఆర్ఎం)ను బీపీసీఎల్ ఆర్జించింది. మొత్తం ఆదాయం ఫ్లాట్‌గా రూ. 1.3 లక్షల కోట్లకు చేరింది. 9.86 మిలియన్ టన్నుల చమురును ప్రాసెస్ చేసింది.

బీపీసీఎల్ షేరు 4 శాతం జంప్‌చేసి రూ. 493 వద్ద ముగిసింది.

భారత్‌లో శామ్‌సంగ్ ల్యాప్‌టాప్స్ తయారీ



గురుగ్రామ్: దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శామ్‌సంగ్ ఈ ఏడాది నుంచి భారత్‌లో ల్యాప్‌టాప్స్ తయారీని చేపట్టాలని నిర్ణయించింది. నోయిడాలోనే ఫ్యాక్టరీలో ల్యాప్‌టాప్‌ల తయారీకి కార్యాచరణ ప్రారంభించినట్లు సంస్థ ప్రెసిడెంట్ టీఎం రోహ్ వెల్లడించారు. 'కంపెనీకి నోయిడా ఒక ముఖ్యమైన తయారీ కేంద్రం. ఇది శామ్‌సంగ్‌కు రెండవ అతిపెద్ద స్థావరం. ప్రపంచ డిమాండ్‌కు అనుగుణంగా ప్లాంట్‌ను తీర్చిదిద్దడానికి కొన్ని మార్పులు ఉండవచ్చు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుండి వివిధ స్థాయిలలో మద్దతు లభించింది. దేశీయంగా తయారీని బలోపేతం చేసేందుకు కంపెనీ ప్రభుత్వంతో సహకరిస్తూనే ఉంటుంది' అని స్పష్టం చేశారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత గెలాక్సీ ఎస్24 స్మార్ట్‌ఫోన్ తయారీ సైతం భారత్‌లో చేపట్టనున్నట్లు శామ్‌సంగ్ ఇటీవల ప్రకటించింది. ఇప్పటికే నోయిడా ప్లాంటులో ఫీచర్ ఫోన్స్, స్మార్ట్‌ఫోన్స్, వేరబుల్స్, ట్యాబ్లెట్ పీసీలను తయారు చేస్తున్నారు.

బడ్జెట్ ముందు బుల్ దూకుడు

- రాణించిన రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ
- ఆసియా, యూరప్ మార్కెట్లలో సానుకూలతలు
- 1,241 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- 21,700 స్థాయిపైకి నిఫ్టీ



ముంబై: బడ్జెట్ వారాన్ని స్టాక్ మార్కెట్ భారీ లాభాలతో ఆరంభించింది. రిలయన్స్(7%), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్(1.53%) షేర్లు రాణించడంతో పాటు ఆసియా, యూరప్ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు కలిసొచ్చాయి. మధ్యంతర బడ్జెట్‌పై ఆశావహ అంచనాలు, ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లను పెంచకపోవచ్చనే ఆశలూ సెంటిమెంట్‌ను బలపరిచాయి. ఇటీవల క్యూ3 ఫలితాల ప్రకటన సందర్భంగా కంపెనీల యాజమాన్యం ఆశావహ అవుట్‌లుక్ వ్యాఖ్యలు ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని పెంచాయి. ఫలితంగా సూచీలు దాదాపు 2% ర్యాలీ చేసి నెల రోజుల్లో(డిసెంబర్ 5, 2023 తర్వాత) అతిపెద్ద ఒక రోజు లాభాన్ని ఆర్జించాయి. సెన్సెక్స్ 1,241 పాయింట్లు పెరిగి 71,942 ముగిసింది. నిఫ్టీ 385 పాయింట్లు బలపడి 21,738 వద్ద నిలిచింది. ఎఫ్ఎంసీజీ, ఐటీ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఇంధన, ఆయిల్‌అండ్‌గ్యాస్, విద్యుత్, సర్వీసెస్, క్యాపిటల్ గూడ్స్, పారిశ్రామిక, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లకు భారీ డిమాండ్ నెలకొంది. బీఎస్ఈలో మిడ్, స్మాల్ ఇండెక్సులు 1.68%, 1.03% చొప్పున లాభపడ్డాయి. ఆసియాలో చైనా, సింగపూర్ మినహా అన్ని దేశాల స్టాక్ సూచీలు ఒకశాతం లాభపడ్డాయి. యూరప్‌లో బ్రిటన్, ఫ్రాన్స్ సూచీలు అరశాతం పెరిగాయి. అమెరికా స్టాక్ మార్కెట్లు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి.

జీవితకాల గరిష్టానికి ఇన్వెస్టర్ల సంపద

సెన్సెక్స్ సుమారు 2% ర్యాలీతో బీఎస్ఈలో రూ.6.08 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ జీవితకాల గరిష్ట స్థాయి రూ.377 లక్షల కోట్లకు చేరింది.

ఇంధన షేర్లకు భారీ డిమాండ్

పశ్చిమాసియా సంక్షోభంతో ఎర్రసముద్రం నెలకొన్న యుద్ధ పరిస్థితుల ప్రభావం కారణంగా నవంబర్ నుంచి అమ్మకాల ఒత్తిడికి లోనవుతున్న ఇంధన రంగ షేర్లకు సోమవారం అనూహ్యంగా కొనుగోళ్ల మద్దతు లభించింది. ఓఎన్‌జీసీ, క్యాస్ట్రోల్ 8%, రిలయన్స్, కోల్ ఇండియా 6%, హిందుస్థాన్ పెట్రోలియం 5%, బీపీసీఎల్, గెయిల్ 4%, ఇంద్రప్రస్థగ్యాస్ 3%, ఆయిల్ ఇండియా, ఐఓసీ 2% షేర్లు రాణించాయి.

రి'లయన్స్' గర్జన

ఇంధన రంగ షేర్ల ర్యాలీలో భాగంగా రిలయన్స్ షేరు 7% ర్యాలీ చేసి రూ.2896 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో ఏడుశాతానికి పైగా లాభపడి రూ. 2905 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. షేరు భారీ ర్యాలీతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజులోనే రూ.1.25 లక్షల కోట్లు పెరిగి తొలిసారి రూ.19.59 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ సూచీలో అత్యధికంగా లాభపడిన షేరు ఇదే. కాగా గత 3 ట్రేడింగ్ సెషన్లలో ఈ షేరు మొత్తం 9% లాభపడింది.

ఒలెక్ట్రా లాభం 77 శాతం అప్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ బస్‌ల తయారీలో ఉన్న ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 77 శాతం ఎగసి రూ.27 కోట్లు సాధించింది. ఎబిటా 52 శాతం దూసుకెళ్లి రూ.56 కోట్లకు చేరింది. ఈపీఎస్ రూ.4.70 నుంచి రూ.7.69లను తాకింది. ఆదాయం 33 శాతం పెరిగి రూ.342 కోట్లు నమోదైంది. అక్టోబర్–డిసెంబర్‌లో 25 శాతం వృద్ధితో 178 ఈ–బస్‌ల డెలివరీ నమోదు చేసినట్టు ఒలెక్ట్రా సీఎండీ కె.వి.ప్రదీప్ తెలిపారు. 'తయారీ, సాంకేతిక సామర్థ్యాలను పెంపొందించడంపై మా దృష్టి కొనసాగుతుంది. బలమైన ఆర్డర్ బుక్ ఉంది. 150 ఎకరాల విస్తీర్ణంలో సీతారాంపూర్ ప్లాంటు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఫిబ్రవరిలో ఈ కేంద్రం నుండి పాక్షికంగా ఉత్పత్తిని ప్రారంభిస్తున్నాం. నూతన ప్లాంటుతో తయారీ సామర్థ్యం మరింత పెరుగుతుంది' అని వివరించారు.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

డీఎంహెచ్‌వో కడపలో 68 పోస్టులు

కడప జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం వైఎస్సాఆర్ జిల్లా ఆరోగ్య సంస్థల్లో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 68

» **పోస్టుల వివరాలు:** జనరల్ డ్యూటీ అటెండెంట్–50,డేటా ఎంట్రీ ఆపరేటర్–04, బార్బర్–02, ధోబీ–02,జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్–04,ఓటీ అసిస్టెంట్–06.

» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, డిగ్రీ, డిప్లొమా, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రిన్సిపాల్, ప్రభుత్వ మెడికల్ కాలేజ్, పుట్లంపల్లి, కడప, వైఎస్సార్ జిల్లా చిరునామకు పంపించాలి.

» **దరఖాస్తులకు చివరితేది:** 30.01.2024.

» **వెబ్‌సైట్:** https://kadapa.ap.gov.in

తెలంగాణ మోడల్ స్కూళ్లలో ఆరు నుంచి పదో తరగతిలో ప్రవేశాలు

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 194 ఆదర్శ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో ఆరు నుంచి పదో తరగతి ప్రవేశాలకు ప్రకటన వెలువడింది. ప్రవేశ పరీక్షలో మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఐఐటీ, జేఈఈ, నీట్, ఎంసెట్, సీఏ, టీపీటీ, సీఎస్ తదితర పోటీపరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తారు.

» **ప్రవేశాల వివరాలు:** తెలంగాణ మోడల్ స్కూల్స్ ఎంట్రన్స్ టెస్ట్–2024.

» **అర్హత:** అడ్మిషన్ పొందాలనుకున్న విద్యార్థి 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధిత తరగతికి కింది స్థాయి తరగతి చదువుతూ ఉండాలి.

» **వయసు:** 31.08.2024 నాటికి ఆరో తరగతికి పదేళ్లు, ఏడో తరగతికి పదకొండేళ్లు, ఎనిమిదో తరగతికి పన్నెండేళ్లు, తొమ్మిదో తరగతికి పదమూడేళ్లు, పదో తరగతికి పద్నాలుగేళ్లు నిండాలి.

» **ఎంపిక విధానం:** ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష ఉంటుంది. మొత్తం 100 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటలు. ఇంగ్లిష్/తెలుగు మాధ్యమాల్లో ప్రశ్నపత్రం ఉంటుంది.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.02.2024.

» **ప్రవేశ పరీక్ష తేది:** 07.04.2024.

» **వెబ్‌సైట్:** www.tgtwgurukulam.telangana.gov.in

తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్ ప్రవేశాలు

తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 14 టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ –సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(ప్రతిభా కళాశాలలు)లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే 'తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఎంపికైన విద్యార్థులకు ఇంటర్ ఉచిత విద్య, వసతి సౌకర్యాలతో పాటు ఐఐటీ, నీట్ తదితర జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సంబంధించి శిక్షణ ఇస్తారు.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 1140(బాలురు–660, బాలికలు–480).

» **గ్రూపులు:** ఎంపీసీ(575 సీట్లు), బైపీసీ(565 సీట్లు).

» **బోధనా మాధ్యమం:** ఇంగ్లిష్.

» **రిజర్వేషన్:** అన్ని సీట్లు ఎస్టీ కేటగిరీ అభ్యర్థులకు కేటాయించారు.

» **అర్హత:** మార్చి–2024లో పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించాలి.

» **వయసు:** విద్యార్థుల వయస్సు 31.08.2024 నాటికి 19 ఏళ్లు మించకూడదు.

» **ఎంపిక విధానం:** లెవల్ 1, 2 స్క్రీనింగ్ టెస్టులు, దరఖాస్తులో విద్యార్థి ఇచ్చిన ప్రాధాన్యం ఆధారంగా సీటు కేటాయిస్తారు.

» **పరీక్ష విధానం:** లెవల్–1 స్క్రీనింగ్ పరీక్ష ఓఎమ్మార్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 160 మార్కులకు పరీక్ష ఉంటుంది. నాలుగు తప్పు సమాధానాలకు ఒక మార్కు చొప్పున కోత విధిస్తారు. ఎంపీసీ–ఇంగ్లిష్(20 మార్కులు), మ్యాథ్స్(60 మార్కులు), ఫిజిక్స్(40 మార్కులు), కెమిస్ట్రీ(40 మార్కులు) సబ్జెక్టుల్లో; బైపీసీ ఇంగ్లిష్ (20 మార్కులు), మ్యాథ్స్(20 మార్కులు), ఫిజిక్స్(40 మార్కులు), కెమిస్ట్రీ(40 మార్కులు), బయాలజీ(40 మార్కులు) సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నపత్రం తెలుగు/ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**05.02.2024

» **లెవల్–1 స్క్రీనింగ్ పరీక్ష తేది:** 18.02.2024.

» **లెవల్–2 స్క్రీనింగ్ పరీక్ష తేది:** 10.03.2024.

» **వెబ్‌సైట్:** http://ttwreiscoe.cgg.gov.in

ఉన్నత విద్యకు 'ఎంట్రెన్స్'!

» ఇంజనీరింగ్ నుంచి లా వరకు పలు ఎంట్రన్స్‌లు

» వీటిలో స్కోర్‌తో సంబంధిత కోర్సుల్లో ప్రవేశం

» ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో చదువుకునే అవకాశం

» ఉజ్వల భవిష్యత్తుకు మార్గంగా ప్రవేశ పరీక్షలు

ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులకు అనేక ఉన్నత విద్య అవకాశాలు. ఇంజనీరింగ్, మెడిసిన్ మొదలు లా, బీఆర్క్, బీఫార్మసీ వరకూ.. వివిధ కోర్సుల్లో చేరే వీలుంది. అందుకోసం ఆయా ఎంట్రెన్స్ టెస్టుల్లో ర్యాంకు సాధించాల్సి ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో మరికొద్ది రోజుల్లో లక్షల మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకోనున్నారు. ఈ నేపథ్యంలో.. ఇంటర్మీడియెట్ తర్వాత అందుబాటులో ఉన్న ముఖ్యమైన ఎంట్రన్స్ టెస్ట్‌లపై ప్రత్యేక కథనం...



జేఈఈ–మెయిన్

జాతీయ స్థాయిలో..ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌లలో బీఈ/బీటెక్,బీఆర్క్,బీప్లానింగ్ తదితర కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష జేఈఈ మెయిన్. ఇంటర్ ఎంపీసీ విద్యార్థులు అర్హులు. మొత్తం మూడు విభాగాల్లో(ఫిజిక్స్,మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ) 300 మార్కులకు ఈ ఆన్‌లైన్ టెస్ట్ పరీక్ష ఉంటుంది. జేఈఈ–మెయిన్ పేపర్ 2లో ర్యాంకు ఆధారంగా ఎన్ఐటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థల్లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సులో ప్రవేశాలు లభిస్తాయి. పేపర్ 2లో మ్యాథమెటిక్స్; ఆప్టిట్యూడ్ టెస్ట్, డ్రాయింగ్ టెస్ట్ విభాగాల్లో నైపుణ్యాలను పరీక్షిస్తారు. పేపర్–2బి పేరుతో బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో మ్యాథమెటిక్స్, ఆప్టిట్యూడ్ టెస్ట్, ప్లానింగ్ బేస్డ్ ప్రశ్నలు అడుగుతారు.

- వెబ్‌సైట్: https://jeemain.nta.nic.in

జేఈఈ–అడ్వాన్స్‌డ్

దేశంలోని ప్రముఖ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్స్ ఐఐటీల్లో బీటెక్, ఇంటిగ్రేటెడ్ బీటెక్+ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష... జేఈఈ అడ్వాన్స్‌డ్. జేఈఈ–మెయిన్ పేపర్–1లో ప్రతిభ ఆధారంగా 2.5 లక్షల మందిని జేఈఈ–అడ్వాన్స్‌డ్‌కు అర్హత కల్పిస్తారు. ఈ పరీక్ష రెండు పేపర్లలో ఉంటుంది. ఒక్కో పేపర్ పరీక్ష సమయం మూడు గంటలు. ప్రతి పేపర్‌లోనూ మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరిగే ఈ పరీక్షలో మంచి స్కోర్ ఆధారంగా ఐఐటీలే కాకుండా.. ఐఐఎస్‌టీ, ఐఐఎస్సీ తదితర ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లలో కూడా ప్రవేశాలు పొందొచ్చు. జేఈఈ –అడ్వాన్స్‌డ్ –2024ను మే 26న నిర్వహించనున్నారు. ఇందుకోసం దరఖాస్తు ప్రక్రియ ఏప్రిల్ 21 నుంచి 30 వరకు అందుబాటులో ఉండనుంది.

- వివరాలకు వెబ్‌సైట్: www.jeeadv.ac.in

ఈఏపీసెట్

రాష్ట్ర స్థాయిలోని కాలేజ్‌ల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులకు అందుబాటులో ఉన్న మార్గం.. టీఎస్ ఈఏపీసెట్ , ఏపీ ఈఏపీసెట్.

- ఆంధ్రప్రదేశ్‌లో ఈఏపీ(ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ)సెట్, తెలంగాణ రాష్ట్రంలో టీఎస్ ఈఏపీసీసెట్ పేరుతో ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు. బీటెక్‌లో చేరేందుకు ఇంజనీరింగ్ స్ట్రీమ్ పేపర్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఇంజనీరింగ్ స్ట్రీమ్ పేపర్‌లో ఉత్తీర్ణత ద్వారా బీటెక్‌తో పాటు బీటెక్(అగ్రికల్చర్ ఇంజనీరింగ్)/బీటెక్(డెయిరీ టెక్నాలజీ)/బీటెక్(ఫుడ్ టెక్నాలజీ)/బీటెక్(బయో టెకాలజీ)/బీఫార్మసీ (ఎంపీసీ)/ఫార్మ్–డీ(ఎంపీసీ) కోర్సుల్లోనూ చేరొచ్చు. మొత్తం 160 మార్కులకు ఈ పరీక్ష నిర్వహిస్తారు. మ్యాథమెటిక్స్‌లో 80 ప్రశ్నలు, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో 40 ప్రశ్నలు చొప్పున అడుగుతారు. అగ్రికల్చర్, ఫార్మసీ, మెడిసిన్ విభాగాల్లో బయాలజీ(బోటనీ, జువాలజీ) నుంచి 80 ప్రశ్నలు, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో 40 ప్రశ్నలు చొప్పున ఉంటాయి.

నాటా

ఎంపీసీ అర్హతతో ప్రవేశం పొందే అవకాశం ఉన్న మరో కోర్సు..బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్. నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్(నాటా) పరీక్షలో స్కోర్ ఆధారంగా.. కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ గుర్తింపు పొందిన కళాశాలల్లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (బీఆర్క్) కోర్సులో అడ్మిషన్ లభిస్తుంది. ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ గ్రూప్ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే నాటాలో 125 ప్రశ్నలు (200 మార్కులు) ఉంటాయి. డయగ్రమాటిక్ రీజనింగ్, న్యూమరికల్ రీజనింగ్, వెర్బల్ రీజనింగ్, ఇండక్టివ్ రీజనింగ్, సిట్యుయేషనల్ జడ్జ్‌మెంట్, లాజికల్ రీజనింగ్, అబ్‌స్ట్రాక్ట్ రీజనింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రస్తుతం నాటా–2024 దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. తొలి విడత పరీక్ష ఏప్రిల్ 6న నిర్వహించనున్నారు.

- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.nata.in

నీట్–యూజీ

ఎంబీబీఎస్, బీడీఎస్.. ఇంటర్మీడియెట్ బైపీసీ విద్యార్థుల కలల కోర్సులు. వీటిలో ప్రవేశానికి జాతీయ స్థాయిలో నీట్–యూజీ పేరుతో ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ ఎంట్రన్స్‌లో స్కోర్ ఆధారంగా.. దేశ వ్యాప్తంగా ఉన్న వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్‌తోపాటు.. ఆయుష్‌గా పేరొందిన హోమియోపతి, ఆయుర్వేద, యునానీ, నేచురోపతి వంటి కోర్సులు పూర్తి చేసుకుని వైద్య వృత్తిలో స్థిరపడొచ్చు. బైపీసీ ఉత్తీర్ణులు ఈ ఎంట్రన్స్‌కు అర్హులు. నీట్–యూజీ పరీక్షను మొత్తం నాలుగు విభాగాల్లో (ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ) 720 మార్కులకు నిర్వహిస్తారు. ఒక్కో విభాగం నుంచి 45 ప్రశ్నలు అడుగుతారు. నీట్–2024ను మే 5న నిర్వహించనున్నారు.

- వివరాలకు వెబ్‌సైట్:https://neet.nta.nic.in

నెస్ట్

ఇంటర్మీడియెట్ ఎంపీసీ విద్యార్థులకు అందుబాటులో ఉన్న మరో ప్రత్యామ్నాయం.. నేషనల్ ఎంట్రన్స్ స్క్రీనింగ్ టెస్ట్(నెస్ట్). ఈ టెస్ట్‌లో స్కోర్ ఆధారంగా.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైసర్)–భువనేశ్వర్, యూనివర్సిటీ ఆఫ్ ముంబై–డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్‌లలో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో ప్రవేశం పొందొచ్చు. మొత్తం నాలుగు సబ్జెక్ట్‌లలో (బయలాజికల్ సైన్సెస్; కెమికల్ సైన్సెస్; మ్యాథమెటిక్స్; ఫిజిక్స్) ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు అందుబాటులో ఉంటాయి. నెస్ట్ ఎంట్రన్స్.. నాలుగు విభాగాల్లో (మ్యాథ్స్, ఫిజిక్స్, బయాలజీ, కెమిస్ట్రీ)లో 200 మార్కులకు ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది.

- వివరాలకు వెబ్‌సైట్: www.nestexam.in

క్లాట్–యూజీ

ఇంటర్మీడియెట్ విద్యార్థులకు అందుబాటులో ఉన్న మరో కోర్సు.. అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ. న్యాయశాస్త్రంలో నైపుణ్యం సొంతం చేసుకుని లా కెరీర్‌లో రాణించాలనుకునే వారికి ఈ కోర్సు ఉపయుక్తంగా ఉంటుంది. దేశ వ్యాప్తంగా ఉన్న నేషనల్ లా యూనివర్సిటీల్లో ప్రవేశానికి క్లాట్–యూజీ పేరుతో ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ (22 నుంచి 26 ప్రశ్నలు); జీకే అండ్ కరెంట్ అఫైర్స్ (28 నుంచి 32 ప్రశ్నలు); లీగల్ రీజనింగ్ (28–32 ప్రశ్నలు); లాజికల్ రీజనింగ్ (22–26 ప్రశ్నలు); క్వాంటిటేటివ్ టెక్నిక్స్ (10 నుంచి 14 ప్రశ్నలు) ఉంటాయి.

- వివరాలకు వెబ్‌సైట్: https://consortiumofnlus.ac.in/clat2024

హోటల్ మేనేజ్‌మెంట్‌కు ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ

ఇంటర్మీడియెట్ విద్యార్థులు.. చక్కటి ఉపాధి అవకాశాలు అందుకునేందుకు వీలున్న మరో కోర్సు.. హోటల్ మేనేజ్‌మెంట్. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి హాస్పిటాలిటీ, టూరిజం, హోటల్ మేనేజ్‌మెంట్ రంగాల్లో కెరీర్ అవకాశాలు లభిస్తాయి. జాతీయ స్థాయిలో టూరిజం శాఖ పరిధిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లు హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు అందిస్తున్నాయి. వీటిలో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్ష.. నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్–జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్. ఈ ఎంట్రన్స్ అయిదు విభాగాల్లో(న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్; రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్; జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్;ఇంగ్లిష్ లాంగ్వేజ్;ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్) 200 ప్రశ్నలకు ఉంటుంది. ఈ ఎంట్రన్స్‌లో స్కోర్ ఆధారంగా.. టూరిజం డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లు, అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని ఇన్‌స్టిట్యూట్‌లు, ఇతర ప్రైవేటు ఇన్‌స్టిట్యూట్‌లలో హాస్పిటాలిటీ, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు.

- వెబ్‌సైట్: https://nchmjee.nta.nic.in

సీయూఈటీ–యూజీ

ఇంటర్మీడియెట్ తర్వాత ప్రముఖ విశ్వ విద్యాలయాల్లో, సెంట్రల్ యూనివర్సిటీల్లో బ్యాచిలర్ డిగ్రీ కోర్సుల్లో చేరాలనుకునే వారికి అందుబాటులో ఉన్న మార్గం.. కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్–యూజీ. ఈ ఎంట్రన్స్‌ను మూడు సెక్షన్లుగా నిర్వహిస్తారు. సెక్షన్–1ఎ(లాంగ్వేజెస్–50 ప్రశ్నలు); సెక్షన్1బి(లాంగ్వేజెస్–50 ప్రశ్నలు); సెక్షన్–2 (డొమైన్ సబ్జెక్ట్స్ 45/50 ప్రశ్నలు); సెక్షన్–3 (జనరల్ టెస్ట్– 60 ప్రశ్నలు) ఉంటాయి. సెక్షన్–1ఎలో అభ్యర్థులు 13 భాషల్లో ఏదో ఒక భాషను ఎంచుకోవచ్చు. సెక్షన్–1బిలో అభ్యర్థులు 20 భాషల్లో ఏదో ఒక భాషను ఎంచుకోవచ్చు. సెక్షన్–2 డొమైన్ సబ్జెక్ట్స్ విభాగంలో మొత్తం 27 డొమైన్ సబ్జెక్ట్స్ అందుబాటులో ఉంటాయి. అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న సబ్జెక్ట్‌ను, బ్యాచిలర్ డిగ్రీలో తాము చదవాలనుకుంటున్న కోర్సుకు సరితూగే సబ్జెక్ట్‌ను డొమైన్ సబ్జెక్ట్స్‌గా ఎంచుకోవచ్చు. డొమైన్ సబ్జెక్ట్స్ విభాగం నుంచి 45 లేదా 50 ప్రశ్నలు అడుగుతారు. వీటిలో చాయిస్ విధానం మేరకు అభ్యర్థులు 35 లేదా 40 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. జనరల్ టెస్ట్ విభాగంలో జీకే, కరెంట్ అఫైర్స్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, లాజికల్ అండ్ అనలిటికల్, రీజనింగ్ అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు. సెక్షన్–1ఎ, సెక్షన్–1బి లాంగ్వేజ్ సబ్జెక్ట్‌లకు సంబంధించి ఎన్‌టీఏ నిర్దేశిత జాబితాలోని లాంగ్వేజ్‌లను ఎంచుకోవాల్సి ఉంటుంది. ప్రతి ప్రశ్నకు 5 మార్కులు కేటాయిస్తారు.

- వెబ్‌సైట్: https://cuet.samarth.ac.in






ప్రభుత్వ పాఠశాలను చూసి ఆశ్చర్యపోయా

ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్

సాక్షి, అమరావతి: నాడు–నేడు పథకం కింద రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దిన సంగతి తెలిసిందే. పాఠశాలల్లో మౌలిక వసతులకు కూడా పెద్దపీట వేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చిన మార్పులు చూస్తే ఎవరినైనా ఇట్టే ఆకట్టుకుంటాయి. రాష్ట్ర పర్యటనకు వచ్చే దేశ విదేశీ ప్రతినిధులు మన స్కూళ్లను చూసి.. తమ రాష్ట్రాలు, దేశాల్లో కూడా ఇలాంటి మార్పులు తీసుకొస్తామని చెబుతున్న ఘటనలు మనం చూస్తున్నాం. అలాగే, రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ప్రముఖ సినీ రచయిత, నిర్మాత కోన వెంకట్ ట్విట్టర్ వేదికగా తన ఆనందాన్ని పంచుకున్నారు. సోమవారం ఆయన స్వగ్రామం బాపట్లకు సమీపంలోని కర్లపాలెం ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, తరగతి గదుల్లో విద్యార్థుల బల్లలపై కూర్చుని, ఫొటోలు దిగి ఎక్స్ లో పోస్టు చేశారు. 'అందంగా, అధునాతనంగా మారిన కర్లపాలెం ప్రభుత్వ పాఠశాలను చూసి నాకు చాలా సంతోషంగాను, ఆశ్చర్యంగా అనిపిస్తోంది' అని పోస్టు చేశారు.

యువత 'భద్రత'లో ఏపీ నంబర్ వన్

నైపుణ్యం, ఉద్యోగ భద్రత లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ చర్యలు

- నైపుణ్యాభివృద్ధి, ఇంటర్న్‌షిప్, ఉద్యోగాల కల్పనలో దేశంలోనే ఏపీ అగ్రగామి
- ఉన్నత విద్యలో సంస్కరణలు– యువతకు సాధికారత సదస్సులో వక్తలు

గుంటూరు ఎడ్యుకేషన్: నైపుణ్యాభివృద్ధి, ఇంటర్న్‌షిప్, ఉద్యోగాల కల్పనలో దేశంలోనే ఏపీ అగ్రగామిగా నిలుస్తున్నదని, ఉన్నత విద్యారంగంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సంస్కరణలే అందుకు కారణమని పలువురు వక్తలు స్పష్టం చేశారు. గుంటూరు ఏసీ కళాశాలలో సోమవారం ఏపీఎస్‌సీహెచ్ఈ ఆధ్వర్యంలో 'ఉన్నత విద్యలో సంస్కరణలు–యువతకు సాధికారత' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొమ్మలపాటి మోజెస్ అధ్యక్షత వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (ఏపీఎస్‌సీహెచ్ఈ) వైస్ చైర్మన్ ప్రొఫెసర్, కె.రామమోహనరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. సాధారణ డిగ్రీ కోర్సులతో యువతకు ప్రయోజనం లేదని గుర్తించిన సీఎం జగన్ ప్రభుత్వం ఉన్నత విద్యలో సమూల మార్పులు తెచ్చిందన్నారు. ఆ.. సంస్కరణలు అద్భుతమైన ఫలితాలిస్తున్నాయని చెప్పారు. ఉన్నత విద్యలో నవరత్నాల వంటి తొమ్మిది కార్యక్రమాలను రూపొందించిన సీఎం వైఎస్ జగన్ ఎంతో నిబద్ధతతో అమలు చేస్తున్నారని తెలిపారు. ఇంజనీరింగ్ తదితర కోర్సుల్లో ప్రవేశపెట్టిన ఇంటర్న్‌షిప్ విధానంలో విద్యార్థులను పరిశ్రమలకు అనుసంధానం చేయడంతో విద్యార్థులు తమలోని సామర్థ్యాన్ని, నైపుణ్యాలను స్వయంగా తెలుసుకుని ముందుకు వెళుతున్నారని చెప్పారు. రూ.32కోట్లు వెచ్చించి రాష్ట్రంలోని 1.25 లక్షల మంది యువతకు పైసా ఖర్చు లేకుండా మైక్రోసాఫ్ట్ సర్టిఫికేషన్ కోర్సు అందించడం గొప్ప విషయమన్నారు. బీహెచ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కౌసల్యాదేవి, ఏసీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ ఎం.కుసుమకుమారి, జీఏ షాలిని, బి.విజయకుమార్, అధ్యాపకులు ఎం.రత్నరాజు, సీహెచ్ అనిత, ఎస్‌జే సాల్మన్‌బాబు మాట్లాడారు. వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉన్నత విద్యలో సంస్కరణలు-యువతకు సాధికారత సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

యువతకు దిశా, దశ నిర్దేశం



ఉన్నత విద్యలో ఏపీ ప్రభుత్వం తెచ్చిన సంస్కరణలు యువతకు దిశా, దశ చూపుతున్నాయి. నైపుణ్యాలు లేనిదే సమాజంలో రాణించలేరనే సదుద్దేశంతో ప్రభుత్వం విప్లవాత్మక చర్యలు చేపడుతున్నది. విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన విజ్ఞానాన్ని అందిస్తూ, ప్రపంచంలో ఎక్కడైనా రాణించగల స్థైర్యాన్ని కల్పించడం అభినందనీయం.

– కేఎఫ్ పరదేశిబాబు, ఏసీ కళాశాల కరస్పాండెంట్

ఎన్ఈపీ అమల్లో ఏపీ అగ్రస్థానం..



జాతీయ నూతన విద్యా విధానం–2020 అమల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలిపారు. విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీపడే విధంగా నైపుణ్యంతో కూడిన విద్యను అందించేందుకు ఆయన సాహసోపేతమైన నిర్ణయాలతో ముందుకు వెళుతున్నారు. విజ్ఞానం, నైపుణ్యం, నూతన ఆవిష్కరణల దిశగా విద్యార్థులు ముందుకు సాగాలి.

– డాక్టర్ కె.మోజెస్, ప్రిన్సిపాల్, ఏసీ కళాశాల

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఏపీ



ఉన్నత విద్యారంగంలో అమలు చేస్తున్న అనేక సంస్కరణలతో మన రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. పరిశ్రమలను విద్యాసంస్థలకు అనుసంధానం చేయడంలో సఫలీకృతమైన ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి అవకాశాలను యువతరానికి అందిస్తోంది.

– పి.మల్లికార్జునప్రసాద్, ప్రిన్సిపాల్, హిందూ కళాశాల

ఊహకందని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్



సాధారణ సెల్‌ఫోన్‌తో మొదలైన ఆధునిక సాంకేతికత.. ఇంటర్నెట్‌తో వేగం పుంజుకుని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వరకు ఎదిగింది. ఈ పరిస్థితుల్లో నైపుణ్యం లేనిదే విద్యార్థులు రాణించలేరు. ఉన్నత విద్య దశలోనే పోటీతత్వంతో ముందుకు వెళ్లాలి.

– డాక్టర్ ఎంఎస్ శ్రీధర్, పీజీ కోర్సుల డీన్, ఏసీ కళాశాల

భళా.. బాల మేధావులు

తక్కువ ఖర్చు.. ఆదాయం హెచ్చు



ఈ చిత్రంలో కనిపిస్తున్న కె.హేమమాధురి, పి.పావని చిత్తూరు జిల్లా పెదపంజానిలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. ఇద్దరూ రైతుకు మేలు చేసే సమగ్ర వ్యవసాయ (ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్) విధానాన్ని రూపొందించారు. తక్కువ ఖర్చుతో పంటలు పండిస్తూనే.. ఎరువుల ఖర్చు లేకుండా అదనపు ఆదాయంతో పాటు ఎక్కువ లాభాలు వచ్చే ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశారు. ఇందుకు సంబంధించిన అన్ని అంశాలను అనర్గళంగా వివరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని, ఇంగ్లిష్ ప్రావీణ్యం ప్రదర్శిస్తూ.. సదరన్ సైన్స్ ఫెయిర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు.

ఆపదలో ఆదుకునే తుపాకీ



సైనికులు, ఫారెస్ట్ సిబ్బంది, అగ్నిమాపకదళ సిబ్బంది విపత్కర పరిస్థితుల్లో పనిచేస్తుంటారు. ఒక్కోసారి దారి తప్పడమో, మంచులో కూరుకుపోవడమో జరుగుతుంది. అలాంటప్పుడు వారున్న చోటును తెలిసేలా అద్భుతమైన తుపాకిని రూపొందించాడు మంగళూరుకు చెందిన విద్యార్థి పి.తేజస్. ఓ వైపు శత్రువులపై బుల్లెట్ల వర్షం కురిపించడంతోపాటు సైనికుడి ఉనికిని తన బృందానికి చేరవేసేలా సెన్సార్‌ను బిగించాడు. ఇది బయటి వారికి సిగ్నల్స్‌ను పంపించి ఆచూకీ చెబుతుంది. తేజస్ తయారు చేసిన తుపాకి ఒక్కసారి వినియోగానికి రూ.30 మాత్రమే ఖర్చవుతుంది. మంటల్లో కాలిపోతున్న ఎత్తయిన భవనాల్లోకి ఈ తుపాకి ద్వారా ఆక్సిజన్ బాల్స్‌ను ఫైర్ చేసి మంటలను సైతం ఆర్పేయవచ్చు.

- సదరన్ సైన్స్ ఫెయిర్‌లో సమస్యల్ని పరిష్కరించే నమూనాలు
- ఆరు రాష్ట్రాల విద్యార్థుల ప్రాతినిధ్యం
- ప్రదర్శనల్ని తిలకించేందుకు భారీగా వస్తున్న విద్యార్థులు

సాక్షి, అమరావతి: విజయవాడలో నిర్వహిస్తున్న 'సదరన్ సైన్స్ ఎగ్జిబిషన్' సందర్శకులను ఆకట్టుకుంటోంది. ప్రభుత్వ విద్యార్థుల్లో దాగివున్న శాస్త్ర, సాంకేతిక సామర్థ్యాలను ఎలుగెత్తి చాటుతోంది. ఏపీ పాఠశాల విద్యాశాఖ, విశ్వేశ్వరయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజికల్ మ్యూజియం, కర్ణాటక సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1వ తేదీ వరకు 6 రోజులపాటు ఎగ్జిబిషన్ కొనసాగనుంది. ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు రూపొందించిన 210 ప్రాజెక్ట్‌లను ఇక్కడ ప్రదర్శనకు ఉంచారు. అత్యుత్తమ ప్రదర్శనలను జాతీయ పోటీలకు ఎంపిక చేయనున్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో 8 నుంచి 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు రూపొందించిన సైన్స్ నమూనాలకు ఇక్కడ అవకాశం కల్పించారు. రాష్ట్రం నుంచి ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు రూపొందించిన 30 నమూనాలు సైతం ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సోమవారం సమీప జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఎగ్జిబిషన్‌కు తరలివచ్చారు. తమ వయసు విద్యార్థులు రూపొందించిన సైన్స్ నమూనాలను తిలకించి, ఆసక్తిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు.


ఘాట్ రోడ్డులో ప్రమాదాలు జరగకుండా సెన్సర్ అమరిక గురించి తెలుపుతున్న విద్యార్థి


ఆటోమేటిక్ డ్రైనేజీ క్లీనర్

విద్యార్థులకు ప్రోత్సాహం అందించేందుకే..

సైన్స్ రంగంలో విద్యార్థులకు ప్రోత్సాహం అందించేందుకు సైన్స్ ఫెయిర్ ఎంతో ఉపయోగపడుతుందని ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. సదరన్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, భూమి/అంతరిక పరిజ్ఞానం, పర్యావరణం, ఇంజినీరింగ్, అగ్రి, బయో సైన్స్, కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే అంశాలకు చోటు కల్పించామన్నారు. న్యాయ నిర్ణేతలు ఉత్తమ ప్రదర్శనలను గుర్తించి జాతీయ పోటీలకు ఎంపిక చేస్తారని వివరించారు.

షార్ కేంద్రానికి చేరుకున్న ఇన్‌శాట్–3డీఎస్



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) సతీష్ ధవన్ స్పేస్ సెంటర్(షార్) నుంచి ఫిబ్రవరి రెండో వారంలో ప్రయోగించనున్న ఇన్‌శాట్–3డీఎస్ ఉపగ్రహం ఆదివారం రాత్రి షార్‌కు చేరుకుంది. జీఎస్ఎల్వీ ఎఫ్14 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. షార్‌లోని రెండో ప్రయోగ వేదికకు అనుసంధానంగా ఉన్న వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో రాకెట్ అనుసంధాన పనులు జరుగుతున్నాయి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.